# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర

రచయిత :

ఉభయభాషా ప్రవీణ

శ్రీ లింగాల సూర్యనారాయణ.

**ప్రచురణ :**

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమ సేవాసంఘము,

మండపేట.

శ్రీరస్తు

శ్రీరామచంద్ర సద్గురు పరబ్రహ్మణేనమః

శ్రీరామచంద్ర గ్రంథమాల, పంచదశ పుష్పము.

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర

రచయిత :

ఉభయభాషా ప్రవీణ

లింగాల సూర్యనారాయణ.

## ప్రచురణ :

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమ సేవాసంఘము,

మండపేట.

వెల రు. 4-50 లు

ప్రధమ ముద్రణ - 1962

ద్వితీయ ముద్రణ - 1920

అన్ని హక్కులు రచయితవి

వలయువారు :

కందర్ప సూర్యనారాయణ, ...

శ్రీసుబ్రహ్మాణ్య మహర్షి రాజయోగాశ్రమము

మండపట- ...

తూర్పుగోదావరి జిల్లా.

ప్రధమ ముద్రణ - అవంతీ ప్రెస్ - రాజమండ్రి

......... ముద్రణ-........., విజయవాడ

# SRI SUBHRAMANYA MAHARSHI CHARITRA

**Sri Lingala Suryanarayana**

© Writer

................

...........

.........

**First Edition : -** 1962

**..... Edition : -** 1920

**Copies :** 100

**DTP & Layout**
Lanke Janardhan

**Printed at:**
R...
Vijayawada

**For copies:**
B.
**price:** Rs. ......

# విజ్ఞప్తి

మా గురు చక్రవర్తి శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి మానవ రూపము దాల్చిన యువనిషత్సారము. సంసార బద్ధులగువారి హృదయసీమలయందు గురువరేణ్యుని యుపదేశములు అమృత వాహినులై ప్రవహించి తాపత్ర యాగ్ని చల్చార్చినవి. ద్వైతము, అద్వైతము, శుద్ధాద్వైతము అనునవి మహర్షి వ్యక్తిత్వమున సమ్మేళనమొందినవి. ఈ గురుమూర్తియే యొక యాధ్మాత్మిక సాగరమగుటచే వీరి మనస్తత్వమిట్టిదని నిర్ణయింపజాలము. ఈ మహాత్ముని కరుణా కటాక్ష మొక్కటి ప్రసరించిన శ్రీ సీతారాముల దివ్యసందర్శన లీలలు గాంచవలసినదే. శ్రీ గురుదేవుని భావరాశి లోకకల్యాణ హేతువు. వేదర్షుల కాలమునుండియు పరంపరాగతమై. యవిచ్ఛిన్నమై యొప్పు బ్రహ్మానుభవ సంప్రదాయమునకు వ్యతిరేకముగా నేమియు మాటలాడలేదు. సమాధి స్థితిలో అఖండ బ్రహ్మసాక్షాత్కారమందియున్నను క్రిందిమెట్టు లోనిదగు పూజా విధానాదికము మానలేదు. గురుదేవుని జీవితరంగములు శ్రీ రామతారక పరబ్రహ్మ తత్త్వమునకు సజీవభాష్యములు.

గురుపత్నియగు శ్రీమతి బాపనాంబగారి యవ్యాజ ప్రేమ చేతనే "స్వేచ్ఛానంద" శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పాదారవింద సేవాభాగ్యము నాకు లభించెను. గృహస్థులకు కల్పతరువులైన శ్రీ గురుదంపతులు విజ్ఞానభిక్ష నొసంగుటయేగాక కన్నతల్లిదండ్రులైనను చూపజాలని యపారప్రేమతో నన్నాదరించి కటాక్షించి యుండిరి. ఆధ్యాత్మిక జననీ జనకులైన శ్రీ బాపనాంబా సుబ్రహ్మణ్య గురుదంపతుల పాదారవిందములకు నా ప్రనామ పుష్పాంజలి.

స్వస్తిశ్రీ చాంద్రమాన విక్రమనామ సం॥ర పుష్యశుద్ధ పంచమీ (20-1-1941 తేదీ) గురువారము ఉదయము 8 గంటలకు గోదావరీ తీరస్థమగు రాజమహేంద్రవరములో శ్రీ కామరాజు గెడ్డ పాపరాజుగారి పవిత్ర గృహమున నేను గురుచక్రవర్తి పాద సేవకుడనైతిని. శ్రీవారి పాదరేణువు సోకిన కొలది దినములకే నాకు కొన్ని యద్భుత లీలలు గోచరింపనారంభించినవి. బాహ్యమునకు కర్మలంపటుడైన గృహస్థునివలె కాన్పించుచు మిగుల గోప్యముగా శ్రీ సీతారాములతో స్వేచ్ఛా విహార మొనర్చుచున్న శ్రీ మహర్షి దివ్య చరిత్ర రచించి నా శరీరమందలి ప్రతి రక్తకణమును పునీతమొనర్పదలచి నాకు లభించినంత వఱకు విషయములు సేకరించి మహర్షి దివ్య స్వరూపమును గ్రంథరూపమున లోకమున కందించు భాగ్యము నేటికి శ్రీ గురు కటాక్షమున నాకు లభించినది.

ఈ గ్రంథము పది సం॥రములకు పూర్వమే ముద్రణకు కావలసి యుండెను. కాని మహర్షి ప్రసాదించిన విజ్ఞాన సాధనలు నాలో కుంటువడియుండుటచే శ్రీ సీతారాముల పరిపూర్ణానుగ్రహము మందగించి ఈ గ్రంధమును ఇంతవరకును పూర్తి చేయజాలకపోతిని. 1960 సం॥రం. మే నెల 28, 29,30 తేదీలలో మహేంద్రవాడలో శ్రీ రామక్షేత్రమున శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి శతవార్షికోత్సవముల వారి యధ్యక్షతను మహావైభవముగా జరిపిరి. ఉత్సవములు ముగిసిన వెంటనే రాయవరం గ్రామ నివాసులును, మహర్షి శిష్యులును అగు శ్రీ కంటిపూడి శ్రీరాములుగారును; వారి ధర్మపత్ని శ్రీమతి వీరమ్మగారును, తమ తమ బంధుమిత్ర వర్గములను ప్రోత్సహించి కావలసిన ద్రవ్యము సేకరించి సర్వాంగసుందరముగా మహర్షి చరిత్ర ముద్రించి ప్రకటింపుడని నాకు ప్రోత్సాహమిచ్చిరి. ఆ పుణ్య దంపతులకు నేనెంతయు కృతజ్ఞుడను . ఇతర భక్తులకు గూడ భూరి విరాళములొసంగి నాకు బలము చేకూర్చిరి. వారికి

నా ప్రత్యేక నమస్కృతులు.

ముద్రణ ప్రతి సిద్ధము చేయుచు కొన్ని కొన్ని ఘట్టములు వ్రాయు సందర్భములలో మహత్తరమైన గురుశక్తి యేదియో విజృంభించి నా గ్రంథమునకు కర్పూరహారతి యిచ్చువరకును ఆవేశము నాకు శాంతించనే లేదు. నన్ను నిమిత్తమాత్రునిగా జేసి పరమేశ్వరానుగ్రహమే ఈ మహత్తర కార్యమును కొనసాగించినదనుటకు ఇది నాకా ప్రబల నిదర్శనము.

ఈ గ్రంథమును సమీక్షించి దయతో తమ యమూల్య సందేశములను వ్రాసి యిచిచన మహాత్ములకు నా నమస్కృతులు.

ప్రూఫులు వగైరాలు చూచి సర్వాంగ సుందరముగా ఈ గ్రంధముద్రణ మొనర్చిన రాజమండ్రీలోగల అవంతీ ప్రెస్సు వారికి నేనెంతయు కృతజ్ఞుడను.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తపోరాశినుండి యావిర్భవించి అనేక ప్రత్యక్ష మహిమలు చూపిన శ్రీ సీతారాములు ద్రవ్య దాతలకును, భక్తులకును, పాఠకులకును, శ్రోతలకును, ఇలవేల్పులై సకల సంపదలనొసంగుచు రక్షించుచుండుగాక.

కార్తీకశుద్ధ తదియా
బుధవారము
శుభకృత్
31-10-1962

ఇట్లు
ఉభయ భాషా ప్రవీణ
**లింగాల సూర్యనారాయణ**
తెలుగు పండితుడు
**శ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్**
జిల్లాపరిషత్తు హైస్కూలు
దువ్వ పోస్టు తణుకు తాలూకా
పశ్చిమగోదావరి జిల్లా

## శ్రీసుబ్రహ్మణ్య మహర్షి చరిత్రకు

# ద్రవ్యదాతలు

| | |
|---|---|
| శ్రీ కందర్ప సూర్యనారాయణగారు - వారి ధర్మపత్ని సుబ్బలక్ష్మిగారు, మండపేట | రు. 101-00 |
| శ్రీ కంటిపూడి వెంకయ్యగారి భార్య వెంకట సుబ్బమ్మగారు, లొల్ల | రు. 100-00 |
| శ్రీ తమిరిశ వెంకటసుబ్బమ్మగారు, మలకపల్లి | రు. 100-00 |
| శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారు - వారి ధర్మపత్ని సూరమ్మగారు, రాయవరం | రు. 100-00 |
| శ్రీ గొర్తి సత్యనారాయణమూర్తిగారు -వారి ధర్మపత్ని లక్ష్మీకాంతమ్మగారు, విజయవాడ | రు. 100-00 |
| శ్రీ కంటిపూడి సర్వారాయుడుగారు - వారి ధర్మపత్ని సత్యవతిగారు, లొల్ల | రు. 100-00 |
| శ్రీ బులుసు పాపయ్యశాస్త్రిగారు - వారి ధర్మపత్ని వీరభద్రమ్మగారు, దానవాయిపేట-రాజమండ్రి | రు. 100-00 |
| శ్రీ కంటిపూడి శ్రీరాములుగారు - వారి ధర్మపత్ని వీరమ్మగారు, రాయవరం | రు. 50-00 |
| శ్రీ కర్రినారయ్యగారు - వారి ధర్మపత్ని మహేంద్రవాడ | రు. 100-00 |
| శ్రీ రెడ్డి వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు (గురుపుత్రులు) వారి దర్మపత్ని సుభద్రమ్మగారు, శ్రీరామక్షేత్రము - మహేంద్రవాడ. | రు. 31-00 |

శ్రీ వేదరాజు గంగాధరంగారు - వారి ధర్మపత్ని
సత్యవతిగారు, అవిడి రు. 30-00
శ్రీ మునుకుట్ల వెంకట్రామ కృష్ణయ్యగారు రిటైర్డు
...మేనేజరు, దువ్వ రు. 100-00
శ్రీ రాగిమిల్లి వీర్రాజుగారు, ఇటికాలపల్లి 25-00
శ్రీ యర్రమిల్లి శ్రీరామశాస్త్రిగారు,..... మండపేట 25-00
శ్రీ దేవరభొట్ల సత్యనారాయణగారు, తుని 25 -00
శ్రీ జ్యోస్యుల బుచ్చిరాజుగారు, విరవాడ 25 -00
శ్రీ దంటు భీమశంకర శాస్త్రిగారు, ...
మండపేట 25 -00
శ్రీ గోదావరి సోమరాజుగారు వారి ధర్మపత్ని
రామలక్ష్మమ్మగారు, చింతల్లంక 25 -00
శ్రీ లింగాల సూర్యనారాయణగారు వారి ధర్మపత్ని
సత్యవతిగారు, దువ్వ 25 -00
శ్రీ ఇందుకూరి వెంకటసుబ్బాయమ్మగారు, దువ్వ 25 -00
శ్రీ మణుగుల వెంకట సత్యనారాయణమూర్తిగారు - వారి
ధర్మపత్ని - ఆదిలక్ష్మిగారు, దుద్దుకూరు 25 -00
శ్రీ కామరాజుగెడ్డ పాపరాజుగారి కుమారులు పేరయా
చార్యగారు, రాజమండ్రి 25 -00
శ్రీ ఇందుకూరి లక్ష్మీపతిరాజుగారు - వారి ధర్మపత్ని
వెంకటనరసమ్మగారు, దువ్వ 25 -00
డాక్టరు గాది వెంకటచలమయ్యగారు .....వారి
ధర్మపత్ని సుభద్రమ్మగారు, రాయవరం 25 -00
శ్రీ సబ్బిళ్ళ సుబ్బప్పగారు, వెదురుపాక 20 -00

శ్రీ సత్యవోలు జానకిరామయ్యగారు, జొన్నాడ 15-00
శ్రీ మునుకుట్ల వెంకటసుబ్రహ్మణ్యంగారు,.....
గాంధీనగరం - విజయవాడ 15 -00
శ్రీ గోవిందరాజుల అబ్బన్నగారు - వారి ధర్మపత్ని సీతా
యమ్మగారు, ఇటికాలపల్లి 10 -00
శ్రీ రెడ్డి పార్వతమ్మగారు, భీమోలు 10 -00
శ్రీ దేవరభొట్ల సుబ్బారావుగారు, బూబలంక 10 -00
శ్రీ మునుకుట్ల సత్యకటేశ్వరరావుగారు - వారి ధర్మపత్ని
సీతారామమ్మగారు, దువ్వ 10 -00
శ్రీ సింగంసెట్టి సత్యానందంగారు, పాతగన్నవరం 10 -00
శ్రీ మండ వెంకటరమణయ్యగారు, బ్రాహ్మణగూడెం 10 -00
శ్రీ యర్రమిల్లి అరవిందఘోష్‌గారు, హెడ్మాస్టరు
.....వేళంగి 10 -00
శ్రీ యడవిల్లి గోపాలకృష్ణమూర్తిగారు, మార్కెటు వీధి,
రాజమండ్రి 10 -00
శ్రీ వుద్దగిరి సుబ్బారావుగారు వారి ధర్మపత్ని రామ
చంద్రంగారు. అనంతపల్లి 10 -00
శ్రీ రెడ్డి నాగభూషణమ్మగారు, దువ్వ 10 -00
శ్రీ హనుమంతవఝుల చిట్టిరాజుగారు వారి ధర్మపత్ని
వెంకట సూర్యరామలక్ష్మిగారు, లక్ష్మీపోలవరం 10 -00
శ్రీ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డిగారు - వారి ధర్మపత్ని
అప్పాయమ్మగారు, అనపర్తి 10 -00
శ్రీ చిన్ని జగన్నాథంగారు -వెండి బంగారు వర్తకులు,
నిడదవోలు 10 -00

శ్రీ తుట్టగుంట రాజేశ్వరమ్మగారు, కోటిపల్లి 10 -00
శ్రీ దేవరభొట్ల సుబ్బారాయుడుగారు, పూబలంక 5-00
శ్రీ తుట్టగుంట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ర్యాలి 5-00
శ్రీ గోదావరి వెంకటసుబ్బారాయుడుగారు, కానూరు 5 -00
శ్రీ గరిమెళ్ళ వెంకటసుబ్బారావుగారు, హైస్కూలు టీచరు
అనంతపల్లి 5-00
శ్రీ లింగాల విశ్వనాధంగారు - వారి ధర్మపత్ని రాజేశ్వరిగారు,
రఘుదేవపురం 5-00
శ్రీ వాడపల్లి ఆంజనేయాచార్యులుగారు, దువ్వ 5-00
శ్రీ పెదసనగంటి సత్యనారాయణమూర్తిగారు - వారి ధర్మపత్ని
సూర్యకాంతారత్నంగారు, దుద్దుకూరు 5-00
శ్రీ ఘడియారం భాస్కరమూర్తిగారు, భీమవరం 5-00
శ్రీ గోదావరి రామారావుగారు - టీచరు మేనేజరు, జీలుగుమిల్లి 5-00
శ్రీ కడిమిళ్ళ వీరరాఘవశాస్త్రిగారు - వారి ధర్మపత్ని
మణెమ్మగారు, దువ్వ 5-00
శ్రీ లింగాల వెంకటరామకృష&షయ్యగారు - వారి ధర్మపత్ని
నాగరత్నంగారు, దువ్వ 5-00
శ్రీ గోదావరి చినసత్యనారాయణమూర్తిగారు - వారి ధర్మపత్ని
జగ్గమ్మగారు, మార్కుండపాడు 5-00
శ్రీ అఖండం వెంకటసుబ్రహ్మణ్యశర్మగారు - వారి ధర్మపత్ని
వెంకటస్వరాజ్యలక్ష్మిగారు, సమిశ్రగూడెం 5-00
శ్రీ గోదావరి వెంకటేశ్వర్లుగారు - వారి ధర్మపత్ని
సత్యవతిగారు. కొయ్యలగూడెం 5-00
శ్రీ వేదాంతం సూర్యనారాయణగారు - వారి ధర్మపత్ని

రత్నమాలగారు, అనంతపల్లి 5-00

శ్రీ మోతుకూరి వెంకటసత్యవతిగారు, చోడవరం 5-00

శ్రీ మునుకుట్ల వెంకటవాసుదేవ దీక్షితులుగారు - వారి ధర్మపత్ని వెంకటసుబ్బలక్ష్మిగారు, దువ్వ 5-00

శ్రీ తుట్టగుంట దక్షిణామూర్తిగారు - వారి ధర్మపత్ని లక్ష్మీదేవిగారు, దువ్వ 5-00

శ్రీ చెరుకుమిల్లి సత్యనారాయణమూర్తిగారు - హైస్కూలు టీచరు, కాకరపర్రు 2-00

# పండితాభిప్రాయములు

## శ్రీ గాయత్రీ పీఠాధిపతులగు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీ స్వాములవారి యాశీఃపూర్వక ప్రశంస.

మానవుని తరింపజేయు భక్తి జ్ఞాన వైరాగ్యములు తగ్గిపోయి ఆర్థిక దృష్టి ప్రధానమైన యీ కలికాలములో గూడ అట్టి జ్ఞానాదులను ప్రబోధించుటకయి అప్పుడప్పుడు భగవదంశతోను, భగవదనుగ్రహము తోను, మహాపురుషులు ఉద్భవించుచుందురు. అట్టి మహా పురుషులలో శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి అనువారు ఒకరు. వీరు తూర్పుగోదావరి మండలములోని పామర్రు గ్రామమున క్రీ.శ. 1860 సంııర ప్రాంతముల మహర్షులలో నెల్ల ఉత్తముల ఉపనిషత్ ఖ్యాతిని గూడ గాంచిన యాజ్ఞ్యవల్క్య మహర్షి శాఖలో పవిత్రమైన వంశములో జన్మించినారు. వీరు శ్రీరామాను గ్రహము వలన జన్మించినవారగుటచేత బాల్యమునుండియు శ్రీ సీతారామభక్తులయి అనవరతము శ్రీరామ ధ్యాన పరాయణులయి యుండుటచేత వీరికి శ్రీ సీతారాముల సాక్షాత్కారము తఱచుగా అగుచుండెడిది. 1880 సంııరము ఆ ప్రాంతముల ఒకసారి వీరు తాడేపల్లి గూడెము వైపుల నుండగా శ్రీ రామచంద్రమూర్తి సాయంకాలము నాల్గు గంటల వేళ ఎనిమిది సంవత్సరముల బాలుడుగా వివిధ భూషణములతోను, శిరమున రత్న కిరీటముతోను వీరికి సాక్షాత్కరించి వీరి యొడిలోని కాకి దొండపండ్లను కొన్ని స్వయముగా దీసికొని భక్షించి వీరిని అనుగ్రహించి అదృశ్యుడయ్యెను. ఇట్టి సన్నివేశములు, మహత్తులు వీరి జీవిత చరిత్రలో అనేకములు కలవు. తాము తరించి ఇతరులను తరింపజేయుట మహా పురుషుల లక్షణము కనుక వీరును తమ యొద్దకు శ్రద్ధాభక్తులతో వచ్చిన

శిష్యులను ఉపదేశముల వలనను, బోధల ద్వారాను అనుగ్రహించి వారికి కూడ అట్టి సాక్షాత్కారములను కలిగించినారు. ఇయ్యది వీరి చరిత్రలోని విశిష్టత.

వీరు శ్రీరామభక్తులగుటయేగాక జగజ్జనని యయిన శ్రీరాజరాజేశ్వరీ మహాదేవియొక్క ఉపాసననుగూడ చేసి ఆ మహామాత యొక్క సాక్షాత్కారమును గూడ పొందినారు.

ఇంకను వీరి నిర్గుణ బ్రహ్మోపాసనను గూడ చేసి ఉపనిషత్సారమును గ్రహించి "స్వేచ్ఛానంద" అను దీక్షానామముతో విరాజిల్లిన మహాపురుషులు. దేవతలు స్త్రీ పురుష రూపమున వీరి యెదుటకు వచ్చి నమస్కరించి వెళ్ళుచుండెడివారు. ఇట్టి యద్భుత సన్నివేశములు వీరి పరిపూర్ణ బ్రహ్మతత్త్వమును వెల్లడి చేయుచున్నవి.

వీరి శిష్యులు, వీరి యుత్సవములను చేయుచు మహేంద్రవాడలో "శ్రీరామక్షేత్రము" అనుదానిని నెలకొల్పి క్రీ॥శ॥1960 సం॥రములో మే నెల 28, 29, 30 తేదీలలో శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి శతవార్షికోత్సవము లను మా అధ్యక్షత క్రింద జరిగించినారు. ఈ విధముగా శ్రీ మహర్షులవారిని గుఱించియు, వీరి శిష్యబృందమును గుఱించియు, మాకు తెలిసికొనుట సంభవించినది. వీరి శిష్యులందఱును నిష్కల్మషమైన శ్రద్ధాభక్తులతో గురుసేవను, గురుపూజలను గావించుచు భక్తి ప్రచారమును చేయు చున్నారు. వీరి శిష్యులలో అగ్రస్థానమును అలంకరించినది చిరంజీవి శ్రీ లింగాల సూర్యనారాయణ. ఈయన ఉభయభాషా ప్రవీణుడయి తనకు తన గురువుగారియందుగల యత్యంతభక్తితోను, తన జీవితమును ధన్యత నొందించుకొనవలెనను సద్వాంఛతోను, తమ గురుపుంగవుల జీవిత చరిత్రను సంపూర్ణముగా రచించినాడు. భావములకు తగిన చక్కని భాషతోను, చక్కని శైలితోను ఈ రచనము విరాజిల్లుచున్నది. ఈ పుస్తకము

చదివినవారికి మానవుని తరింపజేయు భక్తి జ్ఞాన వైరాగ్యములు కలుగుననుటలో సంశయము లేదు. ఇట్టి యమూల్యమైన యాధ్మాత్మిక సేనను గావించిన చిరంజీవి శ్రీ లింగాల సూర్యనారాయణకు సకల శ్రేయస్సులు కలుగుగాకయని మా నారాయణ స్వరణ పూర్వకాశీస్సులు.

మకాం
పట్టాభిపురం,
గుంటూరు,
శుభకృతన వత్సర
చైత్రశుక్ల తృతీయ
ది 7-4-1962

ఇట్లు,
**శ్రీ విద్యాశంకర భారతీస్వామి**
శ్రీగాయత్రీ పీఠము,
శంకరమఠము (గొడుగుపేట)
బందరు (కృష్ణాజిల్లా)

అభినవ వాల్మీకి, భక్తశ్రీశుక, పౌరాణికవర్య, సువర్ణఘంటా కంకణాంకిత. వ్యాకరణ వేదాంత విశారద. చిర్రావూరి అనంత పద్మనాభశాస్త్రిగారు : –

బ్రహ్మవిద్వరిష్ఠ శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జీవితమును, శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి కృపాపాత్రులును, వారి ప్రియ శిష్యులును, ఆంతరంగిక భక్తులునునగు ఉభయభాషా ప్రవీణ – బ్రహ్మశ్రీ లింగాల సూర్యనారాయణ గారు రచించియున్నారు. శ్రీవారి వలన సగుణ నిర్గుణ తారక బ్రహ్మానుభవములను గ్రహించి శ్రీవారి జీవిత చరిత్రను వ్రాసిరి. ఈ పవిత్ర గ్రంథము భక్తులకును, జ్ఞానులకును, యోగులకును, కర్మరులకును, పండితులకును, పామరులకును, సర్వజనులకుపయోగించును.

రామానుజులు వైష్ణవులకు మాత్రము గురువు. మధ్వాచార్యులు మధ్వమతస్థులకు గురువు. శంకరాచార్యులు స్మార్తులకు మాత్రము గురువు. ఛందశ్శాస్త్ర ప్రమాణముచే "సుబ్రహ్మణ్యం" అను శబ్దమున సర్వగురుత్వ ముండుటచేతను, సర్వమతస్థులకును గురువులై విరాజిల్లుచుండుటచేతను, వీరికి సుబ్రహ్మణ్య శబ్దము సార్ధకమైయొప్పుచున్నది.

శ్రీవారు కలికాలములో మేధా దక్షిణామూర్తి స్వరూపులు. ఉత్తర గీతలో.

శ్లో ॥ అనంత శాస్త్రం బహువేదితవ్యం
స్వల్పశ్చకాలో బహువశ్చ విఘ్నాః
యత్సారభూతం తదుపాసితవ్యం
హంసోయధాక్షీర మివాంబు మిశ్రం॥

అని యున్నటుల సారమును గ్రహించిన యనుభవజు&ఞలగు శ్రీమహర్షులవారి చరిత్రను చూచి శ్రీవారివలె నడుచుకొని ధన్యులగుదురుగాక.

నేదునూరు,
అమలాపురం తాలూకా
తూ॥గో॥జిల్లా.
4-3-1962

ఇట్లు.
చిర్రావూరి అనంతపద్మనాభశాస్త్రి

ఉభయభాషా ప్రవీణ శ్రీ లింగాల సూర్యనారాయణగారు రచించిన "శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర" అచ్చుటచ్చుట చూచితిని.

ఈ గురువర్యులు గృహస్థులై యుండియు, వసిష్టాది మహర్షులను బోలి నిరంతర తపస్సంపన్నులై యుండిరి. తమకుగల మహాసిద్ధులను ఎంత మాత్రమును లోకమునకు వెల్లడి కానీయక ఆధ్యాత్మతత్త్వ రహస్యములను గృహస్థ శిష్యులకు బోధించి తరింపజేయుచుండిరి. మా తండ్రిగారైన శ్రీ కేసిరాజు వెంకట సుబ్బారాయుడుగారును, మా సోదరిగారైన శ్రీ తమిరిశ వెంకట సుబ్బమ్మగారును వీరి శిష్యులే.

ఈ గురువర్యులకు "స్వేచ్ఛానంద" అను దీక్షానమము గలదు. మా తండ్రిగారు రచించిన "ఏకాదశీ మహిమా సర్వస్వము" అను గ్రంథములో వీరిని గూర్చి యిట్లు చెప్పి యున్నారు.

కం. ఎందునచల పరిపూర్ణా
నంద మహావిభవుడగుచు నన్నేలు కృపా
బంధురుడగు శ్రీ స్వేచ్ఛా
నంద గురూత్తము భజింతు నా డెందమునన్॥

ఆచరణముకంటె ఆడంబరమే ప్రధానముగాగల నేటి కాలమునకు ఈ దివ్యపురుషుని పవిత్ర చరిత్ర ఎంతేని ప్రయోజనకారి కాగలదని నా సంపూర్ణ విశ్వాసము.

ఇట్లు
కేసిరాజు సత్యనారాయణ.

గుంటూరు శ్రీ రామనామ క్షేత్రమందలి మోక్షసాధని సంపాదకులగు "శ్రీరామశకణ్" శ్రీ కుందుర్తి వెంకటనరసయ్యగారు : –

మన భారతవర్షమున మహర్షులకు కొదువలేదు. సమస్త మానవ కోటి తరించుటకు కావలసిన సాధనలనందించుటకై స్వయముగ భగవంతుడే అవతరించుచుండును. ఒక్కొక్కప్పుడు తనకు బ్రతినిధులుగ ముక్తపురుషులను నా కార్యము నొనర్చుటకు భూమి మీదకు బంపు చుండును. వారు స్వేచ్ఛాప్రారబ్ధమును ముసుగును వైచుకొని భూమి మీదకు వచ్చి అఖండ సాధనలనొనర్చి, అనేక మహిమలను జూపి మానవులకు విశ్వాసమును గలిగించి యోగ్యులగువారిని భగవత్సేవానురక్తుల నొనరించుచుందురు. వారును మనవలె దారాపుత్రాదులతో నుందురు. కాని వారికాబంధములు లేవు. వేయించిన గింజలును, సాధారణపు గింజలును నొకేరీతిగ నుండును. కాని వేయింపబడిన గింజలు అంకురింపవు. సాధారణపు గింజలు మొలకలెత్తును. అట్లే మహాత్ముతకు వారి కర్మలును, బంధములును, జ్ఞానాగ్ని దగ్ధములు. వానికి ఫలము లుండవు. కాని మన బోటి బద్ధుల కర్మములకు గర్మాకురము లుండును. వారు లీలలొనర్చి మరల యధాస్థానమునకు బోవుదురు. అట్టి ముక్తపురుషులొనర్చిన కర్మ ఫలములు వారి నాశ్రయించిన వారికబ్బును.

పాపకర్మఫలములు దూషించి, ద్వేషించిన వారికి లభించుచుండును. అట్టి మహాత్ములున్నప్పుడును, అవతారములును జాలించిన తరువాతను వారి మీద నెంతటి శ్రద్ధయుండునో వారలకంతటి భగవదనుగ్రహము లభింపగలదు. నిజమునకు వారి హృదయములందుండునది. భగవంతుడును, భగవదనుగ్రహమేకదా! వారేభావముతో మనలను జూచిన నట్టి ఫలమున కలుగుచుండును.

శ్లో ॥ సిద్ధిర్భవతివానేతి సంశయోచ్యుతసేవానామ్

నసంశయోత్రతద్భక్త పరిచర్యారతాత్మనామ్॥

అచ్యుత సేవ యొనర్చువారలకు సిద్ధికలుగునో కలుగదో అది అనుమానమే. కాని యాతని భక్తులను సేవించినవారికట్టిఫలము లభించుటలో సంశయమేమాత్రము నుండబోదు.

కల్పవృక్షమునకును గామధేనువునకును ఫలములో నేవిధమగు భేదమును లేదు. రెండును నొకేఫలమునొసంగును. కాని కల్పవృక్షము కడకు మనము వెదకుకొని పోవలయును. కాని కామధేనువో తన వత్సము కడకు ఆదియే పరువిడి వచ్చును. భగవంతుడు కల్ప వృక్షము. సాధుమహాత్ములు కామధేనువులు. వారు వారి దర్శన, సంభాషణ, సేవా స్వీకరణములచే భక్తులకడకే వచ్చి అనుగ్రహించెదరు.

శ్లో ॥ సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనమ్।

సంభాషణం కోటితీర్థం సేవనం ముక్తిదాయకమ్॥

సాధుదర్శనము పుణ్యప్రదమైనది. వారిని స్పర్శించినచో బాపనాశన ముగును. వారితో సంబాషించినచో గోటి తీర్థములను సేవించిన ఫలమబ్బును. వారిని సేవించినచో ముక్తియే లభింపగలదు.

అందువలననే శాస్త్రములు "త్రిజగతి సజ్జన సంగతిరేకా! భవతి భవార్ణవతరణే నౌకా॥ (త్రిలోకములయందు సజ్జన సాంగత్యమొక్కటియే సంసార సముద్రమును దాటుటకు నౌక యగుచున్నదని చెప్పుచున్నది.)

ఇట్టి సిద్ధమహాత్ములలో మన గురువరేణ్యులగు శ్రీసుబ్రహ్మణ్య మహర్షులవారొకరు. వారు ముక్త పురుషులే. వారీలోకమునకు నచ్చి అశేష జీవుల నుజ్జీవింపజేసి అవతారమును జాలించిరి. 1960 సం॥రము మే

నెల 28, 29, 30 తేదీలలో జరిగిన వారి ముఖ్యాశ్రితులును నగు పండిత లింగాల సూర్యనారాయణగారి యాహ్వానమున నేను వారి యాశ్రమమును. మందిరమును, గృహమును, సందర్శించుట సంభవించినది. ఆ ఆ సమయమున శ్రీవారి  పూజ చేయుచుండ గొందఱకు గొన్ని మహిమలు గోచించినట్లును వినియుంటిని. వారి సందర్శన భాగ్యము లభింపకున్నను. వారి యాశ్రమమును, వారి మందిరమును, సందర్శించి సేవించు భాగ్యము మాత్రము లభించిందులకు ధన్యుండనైతిని. అట్టి భాగ్యమును ఈ దీనునకు గలుగజేసిన శ్రీ పండిత లింగాల సూర్యనారాయణగారికి నా ధన్యవాదము లర్పించుచున్నాను. వారు తన గురు ఋణమును దీర్చుకొనుటకై పండితుఁడును, గవియుఁగావున వారి చరిత్రమును వ్రాయఁదొడంగుట ముదావహము, ఈ చరిత్రమును బఠించి వారి మహిమాదులను సమగ్రముగఁ దెలిసికొని మనమందఱమును ధన్యులము కాఁగలమనుటలో నిసుమంతైన సందేహముండఁబోదు. ఇంతే; ధన్యవాదములు.

నామ ప్రయాగ
బుద్ధాం -(పో)
వయా చందోలు
గుంటూరు జిల్లా
10-4-1962

మహామండలేశ్వర్, శ్రీరామచరణ్
కుందుర్తి వెంకటనరసయ్య పాకయాజి
సంపాదకుడు
మోక్షసాధని.

రిటైర్డు సీనియర్ తెలుగు పండితులు అనిపెద్ది జగన్నాధశాస్త్రిగారు :
-

ఉపనిషత్సార భూతులగు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి విశిష్టతను నిస్సారములగు నా మాటలతో నుగ్గడింపఁబూనట సాహసము కాక పోదు.

అయినను వారి శిష్య పరమాణువులలో నొకండనగు నేను నా కర్తవ్యమును నిర్వహించుకొనవలసి యున్నది.

యుగాంతర వర్తులగు మహర్షుల దివ్యాంశములు ఈ కలియుగమును బవిత్రమొనర్చుటకు శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి దివ్య స్వరూపమున నవతరించినవని చెప్పుట యతిశయోక్తి కాజాలదు.

సంసారారణ్యమున నాధ్యాత్మిక మార్గమును గనుపరచి "మార్గదర్శీ మహర్షిః" యను నార్యోక్తిని సార్థకమొనర్చి శ్రీ మహర్షులవారి కరుణారసమయ కటాక్షవీక్షణములకుఁ బాత్రత గడించిన నేను నేడు అక్షర రూపమగు శ్రీవారి చరిత్రమును వీక్షింపగల్గుటచే ధన్యతముండను.

అవకాశమున్నప్పుడెల్ల శ్రీవారి సన్నిధినిజేరి సేవించి సకల విషయములను గ్రహించి సేకరించి సమకూర్చి శ్రమించి యీ పుస్తక రూపమున శ్రీ మహర్షులవారి దివ్య స్వరూపమును బ్రత్యక్షమొనర్పగలిగిన చిరంజీవి శ్రీ లింగాల సూర్యనారాయణ పవిత్ర ప్రయత్నముల కంతరాయముల దొలగించి యంతర్యామి పరమాత్మ సర్వదా తోడ్పడుగాక!

ఇట్లు

జగన్నాధపురం
9-4-1962

అనిపెద్ది జగన్నాథశాస్త్రి
రిటైర్డు సీనియర్ తెలుగు పండితులు

ఉభయభాషా ప్రవీణ – సాహిత్య విద్యా ప్రవీణ. అఖండం సీతారామ శాస్త్రిగారు, పి.ఒ.యల్. ఆంధ్రోపాధ్యాయులు కార్పొరేషను హైస్కూలు మద్రాసు 34.

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి

బాల్యమునుండియు శ్రీవారికి కలిగిన భగవద్గుణానుభవము, పిమ్మట గలిగిన భగవద్దర్శన స్పర్శాదులు, శిష్యాను గ్రహాదులును, గ్రంథకర్తచే ఈ గ్రంథమునందు ససందర్భముగ, యథాతథముగ పొందుపరుపబడినవి.

గ్రంథకర్తలు శ్రీవారి యంతేవాసులలో నొకరయ్యు, గుర్వనుగ్రహ పాత్రులగుటచే పండితంమన్యులుగాక, గ్రంథరచనా పాటవము గలవారై శ్రీవారి బోధామృత ప్రవాహమునకు ఆనకట్టను నిర్మించి ఆ యమృతమును సతీర్థ్యులయు, భక్త శిఖామణులయు హృదయ క్షేత్రములందు ప్రవహింపజేసిరి.

మహర్షులవారికి అణిమాది సిద్ధులు గలవనినచో నాకాశ్చర్యము కలుగదు. తారకమంత్ర జప ప్రభావముచే త్యాగయ్య. రామదాసు మున్నగు వారు తరించినట్లే వీరును తరించిరి. ఆ మంత్ర జపప్రభావమట్టిది. "స్వయం తీర్ణః పరాంస్తారయేత్" ఇది వీరిలోగల వైశిష్ట్యము.

శ్రీవారి చరమదశలో నాకు వారి దర్శనభాగ్యము కలిగినది. అప్పటికే వారు బాహ్య ప్రపంచ సంబంధమును వీడి అంతర్ముఖులై స్థితప్రజ్ఞస్థితిలో నున్నట్లు నాకు తోచినది. "ఈశ్వరానుగ్రహా దేవ పుంసామద్వైత వాసనా" భక్తి యొక్క పరిపాకావస్థయే అద్వైత స్థితి.

"కశ్చిన్మాంవేత్తి తత్త్వతః" కొన్ని కోట్ల జనులలో ఎవడో ఒకడే నిజ

స్వరూపమును తెలిసికొన గలుగును. శ్రీవారి మాహాత్మ్యమును సామాన్యపు మాటలతో తెలుపుట సూర్యుని చూపుటకై దివిటీని సాధనముగా చేసికొనుటవంటిది.

"గురుని ఋణముదీరు గురునంతవాడైన" సచ్ఛాతుడు గురుదేవుల బోధల నాచరించి గురుని ఋణమును దీర్చి తాను తరించును.

శ్రీవారి వాక్కులకు సాఫల్యము గలదన్నచో వింతలేదు. "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థో నుధావతి" వారి సానుగ్రహ వాక్కులు ఆశీస్సులుగాక వరములే. "పరోక్ష ప్రియావైదేవాః" మనకు అగుపడకుండగనే శ్రీవారు శిష్యుల ననుగ్రహింతురు. మహాత్ముల యుపదేశములయందు ప్రమాణ బుద్ధి కలిగి యుండవలెను. "నాయంకోలోస్తినపరోనసుఖం సంశయాత్మనః" "సంశయాత్మా వినశ్యతి" "గురౌదేవే, యాదఋశీ భావనాయత్ర, సిద్దిర&భవతి తాదర్శశీ"

మద్రాసు

20-4-1962

ఇట్లు

అఖండ సీతారామశాస్త్రి

## "ఆర్ష విద్యాభూషణ"

జటావల్లభుల పురుషోత్తము ఎం.ఏ. గారు ప్రిన్సిపల్ సంస్కృత కళాశాల. కొవ్వూరు. పశ్చిమగోదావరి జిల్లా.

నేను శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి మహత్వమును పలువురు వర్ణింపగా విని వారి దర్శనమును గావించుటకు నిశ్చయించుకొని యుండిన సమయమున వారు సిద్ధిపొందిరను దుర్వార్త నన్ను కలవర పఱచినది. నిశ్చయము కల్గిన వెంటనే వారి దర్శనము నెందులకు చేయకుంటినాయని

నన్ను నేనే నిందించుకొంటిని. శుభస్యశీఘ్రమ్మను నార్యోక్తిలోని గంభీరార్థమును గ్రహించితిని. అంతగా నా హృదయమును చూఱగొన్న దివ్య పురుషుల చరిత్రను రచించిన శ్రీ లింగాల సూర్యనారాయణగారిని నేనెంతగా నభినందింప వలయునో వేరుగ వర్ణింప నక్కఱలేదు. పాండిత్యము, రచనాపాటవము, చిత్తశుద్ధిగల్గి మహర్షులకు సన్నిహితులై వారి పాద సేవచే పవిత్రులైన శ్రీ లింగాల సూర్యనారాయణగారు రచించిన యీ దివ్య చరితము లోక పావనమనుట నిస్సందేహము.

కొవ్వూరు
29-3-1962

ఇట్లు
జటావల్లభుల పురుషోత్తము

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జీవితరంగములను హరికథా రూపమున చిత్రించిన "యక్షగాన ప్రబంధకవి" శ్రీ రావి పద్మనాభదాసుగారొసంగిన పద్యకుసుమములు.

సీ. భువి బ్రాహ్మణులయందుఁ-బొల్పొందుచున్నట్టి
యాదిశాఖనుబుట్టి - యలరినాడు।
ప్రథితుఁడౌ శ్రీయాజ్ఞ్య-వల్క్య మౌనీంద్రుతోఁ
బురుడొంది సత్కీర్తి - బొందినాడు।
అల జానకీ సహితుఁడౌ రామచంద్రునిన్
సేవించి పుణ్యమా - ర్జించి నాడు।
ఘనమైన రాజయోగంబు శ స్తమటంచు
సంసారమంతయున్ - సాకినాడు।

గీ. కనcగ వేదాంత వార్ధి వి- జ్ఞానయుతుcడు।
భళిర। శ్రీరెడ్డి కులజుండు - పాపనుండు ।
వజ్రములయందు కోహినూ -ర్వజ్రమట్టు ।
వరలె సుబ్రహ్మణ్య మహర్షి - వసుధయందు ॥

గీ. పాపహరమైన యితని దీ - వ్యచ్చరితము ।
హరికథారూపమున వ్రాయు - టబ్బెనాకు!
దీన ధన్యుండనైతి నెం - తేని నితని ।
దయనటంచుc దలంతు సం-తతము గొలుతు॥

వేలివెన్ను (పో)
ప.గో.జిల్లా
26-6-1962

ఇట్లు
యక్షగాన ప్రబంధకవి
రావి పద్మనాభదాసు

"ఉపన్యాసక చక్రవర్తి" "హిందూమత ప్రచారక" శ్రీ ప్రభాకర ఉమా మహేశ్వర పండితులవారు :-

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరితమును గ్రంధరూపమున నొకింత పఠించుభాగ్యము లభించినందున - నిజముగ జన్మ సాఫల్యము కల్గెనని యానందించుచున్నాను, ఆ మహాత్ముడు రెండవ దైవమేయనుట సాహసముకాదు. దేవుని దివ్య లీలలను ప్రత్యక్షముగ శిష్యకోటికి దర్శింపజేసిన మహాత్ముడు మన యాంధ్రదేశమున జన్మించెనని

గర్వింపవలసియున్నాము.

అందుకు హేతువు శ్రీలింగాల సూర్యనారాయణగారి యద్వితీయమగు కృషియనక తప్పదు. ఈ సమయమున శ్రీరామకృష్ణ పరమహంసయు, శ్రీరమణ మహర్షియు జ్ఞప్తికి వచ్చుచున్నారు.

ఇంతకును వారి శిష్యులు తాము పొందిన దివ్యానుభూతులను గ్రంథరూపమున వెల్లడించుటకు వెనుదీయకుందురేని శ్రీ స్వామివారి దిగ్విజయ వార్త డిండిమధ్వనులతో మ్రోగి దేశ దేశములయందంతటను వ్యాపింప గలదు. ఆంధ్రజనులయందా భాగ్యోదయమును గాంచుటెపుడా యనుచు నిరంతరము దేవుని ధ్యానించుటే నాకు ముఖ్య కర్తవ్యమై యున్నది. అతి త్వరితముగ నీ గ్రంథము ముద్రితంబై ఆంధ్రజనుల హస్తముల యందలంకరింపవలెనని యాశించుచున్నాను. మఱియు నీ గ్రంథములను వేలకు వేలుగా ముద్రింపజేయుచు నసంఖ్యాకులగు జనులకందించుటకు గాను ఈ గ్రంథకర్త విశేషముగ యత్నించెదరుగాక. దైవము యొక్క అనుగ్రహము సంపూర్ణముగ లభించుగాక.

| | |
|---|---|
| మకాం | ఇట్లు |
| అనంతపల్లి - పో | హిందూమత ప్రచారక |
| ప.గో.జిల్లా | **ప్రభాకర ఉమామహేశ్వర పండిట్** |
| 7-3-1962 | సత్యనారాయణపురం విజయవాడ-2 కృష్ణా జిల్లా |

# శ్రీ సద్గురు పరంపరాస్తుతిః

శ్లో. 1. అవ్యక్త బ్రహ్మరూపాయ నిర్గుణాయనమోనమః
2. సదాశివ స్వరూపాయ 3. శ్రీ మహా విష్ణు రూపిణే ॥
శ్లో. 4. చతుర్ముఖ స్వరూపాయ గురుదేవాయతేనమః
5. మరీచి బ్రహ్మరూపాయ 6. కశ్యపబ్రహ్మ రూపిణే ॥
శ్లో. 7. సూర్యదేవ స్వరూపాయ గురుదేవాయతేనమః
8. యాజ్ఞ్యవల్క్య స్వరూపాయ 9. జనకాయనమోనమః
శ్లో.10. శుకయోగీంద్రరూపాయ గురుదేవాయతేనమః
11. సాందీప గురు రూపాయ 12. శ్రీ కృష్ణస్వామి రూపిణే॥
శ్లో.13. శ్రీధరస్మామి రూపాయ గురుదేవాయతేనమః
14. శ్రీ వేమన స్వరూపాయ 15. తిరువేంగళ రూపిణే ॥
శ్లో. 16. శ్రీ చెన్న గురు రూపాయ గురుదేవాయతేనమః
17. శ్రీ భీమగురు దేవాయ 18. అప్పయదీక్షిత రూపిణే॥
శ్లో. 19. శ్రీమత్పరశురామాఖ్య నృసింహ స్మామినేనమః
20. శ్రీమత్సుందరరామాఖ్య సద్గురుస్వామినేనమః॥
శ్లో. 21. సీతారామస్వామిరూప గురుదేవాయతేనమః
22. శ్రీమతే శివరామాఖ్య దీక్షితాయచ 23. పావయ
విశ్వనాధావధూతాయ గురుదేవాయతేనమః॥
శ్లో. 24. స్వేచ్ఛానందాయ పూజ్యాయ శంకరస్వామిరూపిణే
శుబ్రహ్మణ్యాభిధానాయ గురుదేవాయతేనమ॥
శ్లో. అవ్యక్త దేశికారంభాం శ్రీ కృష్ణగురుమధ్యమామ్
అస్మదాచార్యపర్యంతాం వందేగురుపరంపరామ్॥
ఓం నమో భగవతే సుబ్రహ్మణ్య మహాదేవాయ.

# సద్గురుస్తుతిః

శ్లో. పాపయార్య । నమస్తుభ్యం । పాపారణ్యదవానల

విశ్వనాథ । నమస్తుభ్యం । విశ్వరూపాయతేనమః॥ 1

శ్లో. లోచనాంతరవాసాయ । లోకజ్ఞప్తి కళాతమక

జ్ఞప్తిసాక్షి స్వరూపాయ । నేత్రవాసాయతేనమః॥ 2

శ్లో. దృగంతర నివాసాయ । దృశ్య ప్రతిఫలాత్మక

దృగ్ద్రృశ్యాతీత రూపాయ నేత్రవాసాయతేనమః॥ 3

శ్లో. సూక్ష్మ మార్గ నివాసాయ । శుద్ధబ్రహ్మ స్వరూపక

సుప్రకాశ స్వరూపాయ । నేత్రవాసాయతేనమః॥ 4

శ్లో. మంగళం దృగ్రూపాయ । మంగళం దృశ్యరూపక

దృగ్ద్రృశ్యాతీత రూపాయ । శుద్ధ రూపాయతేనమః॥ 5

# తొలి వెలుగు

శ్రీరామచంద్ర సద్గురు వాసుదేవ పరబ్రహ్మణేనమః
ఓం నమో భగవతే సుబ్రహ్మణ్య మహాదేవాయ॥

శ్లో॥ చిత్రం వటతరోర్మూలే
వృద్ధాశ్శిష్యా గురుర్యువా
గురోస్తు మౌనవ్యాఖ్యానం
శిష్యాస్తు ఛిన్న సంశయాః॥

శ్లో॥ బ్రహ్మానందం పరమ సుఖదం కేవలం జ్ఞానమూర్తిం।
ద్వంద్వాతీతం గగన సదృశం తత్త్వమస్యాది లక్ష్యం ।
ఏకం నిత్యం విమల మచలం సర్వదా సాక్షిభూతం।
భావాతీతం త్రిగుణ రహితం సద్గురుం తం నమామి ॥

ఆత్మ సోదరులారా !

శ్రీమంతంబయిన భరతఖండము అనాదినుండియు ఆధ్యాత్మ విద్యకు నిలయమై విరాజిల్లుచున్నది. బ్రహ్మ విద్యా మహా సామ్రాజ్య పట్టాభిషిక్తులైన మహర్షిపుంగవులు అవసరము కల్గినపుడు మన దేశమున అవతరించుచునే యుండిరి.

"ఈ విజ్ఞానమును జగత్కల్యాణమునకై మానవలోకమున కందించిన యార్యులు ఆదినుండియు భరతఖండవాసులేయనియు. వారు మఱియొక చోటనుండి యిక్కడికి వచ్చినవారు కారనియు, ఇక్కడ నుండియే పలు తావులకు వెళ్లి విజ్ఞాన భిక్ష పెట్టిరనియు చారిత్రకముగా చెప్పవచ్చును"

(వివేకానంద ప్రవచనము – చూడుడు)

క్రీస్తునకు పూర్వము నుండియు, బుద్ధునికి పూర్వమునుండియు, మన భారతదేశవాసుల శేముషి అత్యున్నత శిఖరము నధిరోహించినది. మన వాఙ్మయము పరిశోధించిన ప్రాక్పాశ్చాత్య పండితులు మన మహర్షులు ప్రసాదించిన విజ్ఞాన కల్పతరువులకు జోహారులర్పించియుండిరి. ఆ విజ్ఞానమే వేదశాస్త్ర పురాణేతిహాసవాఙ్మయ రూపములతో లోకమున కందజేయబడినది.

వేదవాఙ్మయము అతనిగూఢమై దురవగాహమై యుండుటచే వేదవ్యాసులవారవతరించి వేదములు విభజించిరి. సూత్రములను రచించిరి. పురాణములను ప్రవరించిరి. అర్జునుని నిమిత్తమాత్రునిగా చేసి కొని జగత్తునకు శ్రీకృష్ణపరమాత్మ చేసిన సదుపదేశములను నిబంధించిరి. తరువాత శంకరభగవత్పాలవతరించి తమ మహాభాష్యముల చేతను అనేక ప్రకరణ గ్రంథములచేతను, సమస్త వేదాంత సారమును లోకమునకందించి మేలొనగూర్చిరి. నాటినుండి నేటి వఱకును లోక కల్యాణ హేతుభూతులైన మహాత్ములు దివ్యానుభూతులను తమ నిత్య జీవితరంగములతో మేళవించి భారతీయ సంస్కృతిని జాగృతమొనర్చుచు తరింపజేయుచునే యున్నారు. వారి సదుపదేశములను చదువవలెను. మనన చేసికొనవలెను. అనుభవించ వలెను. ఆచరణలో పెట్టుచుండవలెను.

నేటి కాలమున ఆర్య విజ్ఞానము యెడల భక్తి సన్నగిల్లినది. విశ్వాసము నశించినది. కావుననే శ్రీరామకృష్ణ పరమహంస, స్వామీ వివేకానంద, శ్రీ రమణ భగవానులు, ఆధ్యాత్మ విజ్ఞానమే మానవునికి శ్రేయోదాయకమని ఉపదేశించియుండిరి. ఒకవంక పాశ్చాత్య శాస్త్ర విజ్ఞాన విజృంభణము వలన మానవుని భౌతిక సంపద, భౌతికానందమును వేయి విధముల నినుమడించు చున్నవి. మన ధర్మములయందు గల మర్మములను సదాచార్యుల సేవించి సరిగా గ్రహించని కొందఱు మన మతము

పరలోకమునకే ప్రాముఖ్యమిచ్చునుగాని ఇహలోకమును గుఱించి యిసుమంతయైనన బోధించదని చెప్పుదురు. చిత్తశుద్ధితో మన గ్రంథములను పరిశీలించినచో యధార్థము బోధపడి ఇది సత్యదూరమని తెలియును. చరిత్ర చదివిన బాగుగా బోధపడును.

మన మహర్షులు ఆధ్యాత్మ విజ్ఞానమను గనిని ఆధారముగా గొని సర్వ శాస్త్రములను, సర్వ ధర్మములను, సమన్వయముచేసి మానవుని విజ్ఞానమును పురుషార్థములను, జీవితమును పున్నమచందురుని చందమున పరిపూర్ణమొనరించిరి. అజరామరమైన యార్య విజ్ఞానము నాధారముగా జేసికొని తదితర సకల శాస్త్ర జ్ఞానమును సమన్వయ పరచుకొనుచు పురోగమించవలెను. అట్లు కాని యెడల నేల విడిచిన సాము అగును. ప్రకృతి శాస్త్ర పరిశోధనల వలన గొప్పగొప్ప శక్తులను వశపరచుకొనిన మానవుడు అట్టి శక్తులతో తమకుగాని, సంఘమునకుగాని సంతోష సౌఖ్యములను కల్యాణమును ప్రసాదించవలెననిన ఆర్య విజ్ఞానముతో అట్టి శక్తిని మేళవించవలెను. లేకున్నచో సర్పశిరమున గల మణివలె అది నిరర్థకమే యగును. మీదు మిక్కిలి అనర్థదాయకముగ గూడ పరిణమించును.

శ్రీశ్రీశ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య సద్గురు పుంగవులు పత్రికా ముఖమున ప్రకటితముగాని యనర్ఘ రత్నము. వారి జీవితము పరమ పవిత్రము. చిన్ననాటి నుండియు శ్రీ రామభక్తి తత్పరత్వమున పెన్నిధుల వంటి పెద్దలను సేవించి కష్టతరమైన యనేక సాధనల నొనరించిరి. శ్రీరామచంద్రునితో స్వేచ్ఛా విహార మొనర్చిన సిద్ధపురుషులు. అయిదవయేట నుండియే శ్రీ రామచంద్ర ప్రభువు వీరికి మిత్రుడై విహరింపదొడగెను.

పామఱ్ఱు గ్రామములోను, మహేంద్రవాడయందును, శ్రీ చల్చక్ర సీతారామ తారక బ్రహ్మానంద మహోత్సవములు అఖండ వైభవోపేతముగా

జరిపించి భక్తి వర్షముచే జనుల హృదయములను సుక్షేత్రములుగా దిద్ది తీర్చిన మహాభక్తులు. వారి నిత్య జీవిత విశేషములను జాగ్రత్తగా గమనించి నచో ముముక్షువులకు కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వములను బోధించుటకు నాటి వసిష్ఠ మహర్షియో లేక యాజ్ఞ్యవల్క్య మహర్షియో దిగివచ్చిరనుటలో అతిశయోక్తి లేదు. బ్రాహ్మీ ముహూర్తమున మేల్కాంచినది మొదలు వర్ణాశ్రమాచార ధర్మపథమున నిత్య కర్మానుష్ఠాన నిరతులై భక్తి సలిపి తదుపరి యోగ మార్గమునంటి పరిపూర్ణ పరబ్రహ్మమందు లీనమై మై మరచి సమాధినిష్ఠలో నుందురు. మఱియు వచ్చిన భక్తులకు ఆదరాభి మానములతో ఆతిధ్యమిచ్చి అఖండ బోధలొనరించి భక్తి జ్ఞానానందముల నోలలాడించి తరింపజేయుచుందురు.

ఒకపరి వసిష్ఠ మహర్షివలె కర్మలంపటులుగా కానవచ్చుచుందురు. ఒకపరి భక్తి పారవశ్యమున ఆనందభాష్పముల రాల్చుచు గద్గదకంఠముతో శ్రీ సీతారాములను కన్నులార గాంచుచు పట్టిన శిష్యులకు చూపించుచు ప్రహ్లాద నారదులభంగి చూపట్టు చుందురు. వేరొక పరి రాజయోగపు ఠీవి నెరపుచు, సాంఖ్య తారకా మనస్క యోగ రహస్యములను వ్యాఖ్యానించుచు జనక చక్రవర్తి విధమున విజాలిల్లుచుందురు. మఱియొకసారి ఉపనిషత్తులను ప్రవచించి నిగూఢమైన రహస్యార్ధములను బోధించి నిత్య నిరవధిక పరిపూర్ణ పరబ్రహ్మతత్త్వమును కరతలామలకమొనరించుచు యాజ్ఞ్యవల్క్య ముని చంద్రునిల పోలిక ప్రబోధచంద్రికా కాంతుల వెదజల్లి శిష్య హృత్తాపోపశమనము జేసి వారి జీవితములను శ్రీరామతారక పరబ్రహ్మమునకు అంకితమొనరించుచుందురు. వేరొకపరి హస్తాబ్జమున చిన్ముద్రదాల్చి శ్రీ దక్షిణామూర్తియై సాక్షాత్కరించుచుందురు.

ఇట్టి లోకోత్తర మహిమాన్వితులగు శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి దివ్య చరిత్రమును శ్రీ గురుచక్రవర్తి ప్రధమశ్రేణి శిష్య వర్గమునకు చెందిన

ఉభయభాషా ప్రవీణ – లింగాల సూర్యనారాయణగారు బహుశ్రమలుపడి విపులముగా రచించియున్నారు. వీరి శైలి ద్రాక్షాపాకము సులభగ్రాహ్యాము. విషయములు సత్య ప్రతిపాదకములు. ఈ గ్రంథరాజము సర్వ విధముల దివ్య ప్రబంధమై అలరారుచున్నది. ముముక్షువులు రామాయణ భారత భాగవతములవలె ఈ గ్రంథమును భక్తి శ్రద్ధలతో పఠించి తరించి జీవితములను ధన్య మొనరించుకొనునట్లు వారికి పవిత్ర విజ్ఞానమును ప్రసాదించుగాక యని శ్రీ రామచంద్ర పరమాత్మను ప్రార్థించుచున్నాను. వెలుగుల గనియగు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి దివ్య చరణ సంసేవనమే నా జీవితరంగములకు తొలి వెలుగు.

సర్వేజనాస్సుఖినోభవంతు.

శ్రీరామకృష్ణా హెూమియోపతి
వైద్య నిలయము
మండపేట

ఇట్లు
శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరనారవింద
సేవకుడు
డా॥ కందర్ప సూర్యనారాయణ (బి.ఎ)

# కృతి సమర్పణము

శ్రీరామ తారక బ్రహ్మానంద మహాసామ్రాజ్యాభిషిక్తులై, గృహస్థులకు కల్పతరువులై, నిరంతర జపయజ్ఞ దీక్షితులై, మోక్షార్థులకు విజ్ఞానభిక్ష నొసంగు శ్రీశ్రీశ్రీ బాపనాంబా సుబ్రహ్మణ్య మహర్షి గురుదంపతులకు నా వాక్ప్రసూన మాలిక సమర్పితము.

ఇష్టదేవతాస్తుతి
చరిత్ర రచనకు కారణములు
వంశ చరిత్ర
మహర్షి జననఘట్టము
జాతక ప్రకరణము
బాల్యదశ
దివ్యగురుపాద సంసేవనము
వివాహము
బాపనాంబగారి చరిత్ర
యోగగురు సంసేవనము
దేశాటనము
దివ్యాంబదర్శనము
గురుకులవాసము
పామర్రు నివసము
పొట్టి స్వాములవారితో మైత్రి
గోవిందరాజుల రామప్పగారు దెల్పిన విషయములు
యోగశక్తి ప్రభావము
శ్రీపాద రామశాస్త్రిగారి శిష్యత్వము
మహేంద్రవాడ వచ్చుటకు కారణము
మహేంద్రవాడ అగ్రహారచరిత్ర
మహేంద్రవాడ నివాసము

దినచర్య
శిష్య శిక్షణము - భక్తరక్షణము
కేసిరాజు సుబ్బరాయకవి శిష్యత్వము
తాడి అచ్చయ్యమ్మగారి విశేషములు
చిట్టూరి శేషగిరిరావుగారు కృతార్థులైన విధము
దేవరకొండ సూరయ్యగారు తరించిన విధము
కమండలోదకముచే సిరిపెల్ల వెంకట్రామన్నగారికి
ప్రాణదానము చేయుట
రెడ్డి పెదనారాయణమూర్తిగారు వరహావతార సాక్షాత్కారము
నొందుట - విచిత్ర నిర్యాణము
పరదా సత్తిరాజును రక్షించిన విధము
గాది సుభద్రమ్మగారిని రక్షించిన విధము
కందర్ప సూర్యనారాయణగారి శిష్యత్వము : అద్భుత విశేష
ములు - విశ్వరూప సందర్శనము
మణుగుల ఆదిలక్ష్మికి ప్రాణదానము చేసినవిధము
భద్రకాళి గురుపీఠము నలకంరించిన విధము
దివ్యశక్తి
ప్రమాదకరమైన జబ్బుస్థితిలో సమాధినిష&ఠ

దివ్యలీలా తరంగిణి
మహర్షి యొడిలోని కాకి దొండపండ్లు శ్రీరాముడు భుజించుట
శ్రీరాముడు శునకరూపమున సాక్షాత్కరించుట
ప్రథమ సప్తాహయజ్ఞము (పామర్రులో)
ఆంజనేయ సాక్షాత్కారము

జగజ్జనని మహిమా విశేషములు
శంకరదర్శనము
మహర్షి మహావిష్ణువై సాక్షాత్కరించుట
గురుదంపతుల లక్షబిల్వార్చనము
శ్రీరామలీల
శివైకాహమహోత్సవము
ద్వితీయ సప్తాహయజ్ఞము (మహేంద్రవాడలో)
గురుదేవుని దివ్యదృష్టి
ముగ్గురు రాములు ఒకేసారి ధనుర్ధనులై మహర్షికి
సాక్షాత్కరించుట
గురుదేవుని లీలలు
సత్యనారాయణస్వామి ప్రత్యక్షమగుట
మహర్షి నరసింహావతారము దాల్చుట
దేవి దివ్యసందర&శనము
లింగాల సూర్యనారాయణకు దేవి సందర్శనము
త్రేతాయుగమందు జరిగిన విచిత్రము గురుదేవునికి
గోచరించుట
లింగాల లక్ష్మీదేవిని కాపాడిన విధము
శ్రీరాముడు బాలకృష్ణుడై దర్శనమిచ్చుట
సాధనానంతర విశేషములు
గురుశక్తి సర్వవ్యాపకమనుటకు నిదర్శనము
అంత్యదశ - మహాసమాధి
రాజయోగాశ్రమ సేవాసంఘోదయము
ఆశ్రమ నిర్మాణము

శ్రీసుబ్రహ్మణ్య మహర్షి ప్రతిష్ఠ

ఆశ్రమమునకు స్థిరాస్తి సంక్రమణము

మహర్షి శతవార్షికోత్సవములు

మహర్షి దివ్య సందర్శనము

ఓం నమో భగవతే సుబ్రహ్మణ్య మహాదేవాయ

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర

శ్లో ॥ శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం
ఆజానుబాహు మరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి ॥

శ్లో ॥ యాజ్ఞ్యవల్క్య సమారంభాం । శ్రీకృష్ణ గురుమధ్యమాం
అస్మదాచార్య పర్యంతాం । వందే గురు పరంపరాం ॥

శ్లో ॥ భస్మోద్భాసిత దేహకాంతిమమలం సేస్మేర వక్త్రాంబుజం
చిన్ముద్రా భయహస్త దీప్తమనిశం కైవల్య దీక్షాపరం
బాపాంబాసహితం ప్రభావకలితం శ్రీ శంకర స్వామినం
సుబ్రహ్మణ్య గురూత్తమం హృది ముదాసేవే సదాపావనమ్॥

శ్లో ॥ నగురోరధికం తత్త్వం । నగురోరధికం తపః
తత్త్వజ్ఞానాత్పరం నాస్తి । తస్మై శ్రీ గురవేనమః॥

సీ॥ ఐదేండ్ల లేఁబ్రాయ–మాదిగా శ్రీరామ
భక్తి నానంద భా – ష్పములు నించి
చిత్ర విగ్రహములఁ – జేసి రామాయణం
బంత నాటకభంగి – నాటలాడి

భూనభోంతరమెల్లఁ - బూనిన శ్రీరామ
　　　శతకోటి మానసా - ర్చన మొనర్చి
యుదయాస్త మయముల - నూహ నెఱుంగక
　　　గుఱు పదాంబుజముల - గుఱుతుఁబూని

గీ॥ పండ్లుదిని కొండ గుహలందు - నేండ్ల కొలఁది
　సచ్చిదానంద పరిపూర్ణ - సత్వుఁడగుచుఁ
　జొక్కి చరియించునట్టి శ్రీ - సుబ్బరాయ
　సద్గురుస్వామి చరణాంబు - జముల గొల్పు
　భాగ్యమబ్బుట బహు తపః - ఫలముగాదె ॥

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర రచనకు కారణములు.

శ్రీ పరమేశ్వరుని లీలలు బహు చిత్రములైనవి. 1931 సం॥రము మార్చి నెలతో నా విద్యార్థిదశ పూర్తి యైనది. 1 జూలై 1932 సం॥రం తేదీనుండి తూ॥ గో॥ జిల్లా రామచంద్రపురం తాలూకా వేగాయమ్మ పేటలో శ్రీ రాజా వాడ్రేవు విశ్వ సుందరరావు బహద్దరు జమీందారువారి .....స్కూలులో తెలుగు పండితుడనుగా పనిచేయుచుంటిని. (24-1-1934 తేదీ) శ్రీముఖనామ సం॥ర మాఘ శుద్ధ నవమీ బుధవారము రోజున వేగాయమ్మ పేటలో శ్రీ రాజావారి దివాణమునందు శ్రీరామ సప్తాహము భక్తులచే ప్రారంభింపబడెను. ఏడు రోజులకును సరిపోవునని అంచనా వేసిన భోజన పదార్ధములన్నియు మూడు రోజులకే సమాప్తమయ్యెను. ఈ మహాయజ్ఞము ఎట్లు కొనసాగునాయని కార్య నిర్వాహక వర్గమువారు త్రొక్కులాడజొచ్చిరి. కాని శ్రీరామ చంద్రుని మహిమా విశేషముచే నాల్గవరోజు ప్రాతఃకాలము నుండియే వివిధ గ్రామముల నుండి భక్తులు బండ్లమీదను, కావిళ్లతోను భోజనాది పదార్ధములను సమృద్ధిగా బంపసాగిరి. అచటికరుదెంచు భక్తుల సంఖ్య లెక్కింపనలవిగాకుండెను. భక్తులు తలచినదానికంటె వేయిరెట్లు సప్తాహ మహాయజ్ఞము పూర్తి యయ్యెను. అప్పటినుండియే నాకు శ్రీరామచంద్రునియందు భక్తి యంకురించెను.

అంతనొక శుభదినమున సుందరకాండ పారాయణము ప్రారంభించితిని. పారాయణమునకు వలయు నియమములెవ్వియో నాకు తెలియవు. నేను ఎవ్వరితోను సలహా చేసి యుండలేదు. కాని, ఆరు సం॥లు

సుందరకాండ పారాయణ చేయుచునేయుంటిని. ఒకనాడు అగస్త్య మహర్షి ప్రోక్తమైన సుందరకాండ పారాయణ ఫలశ్రుతి అర్ధవిచారణతో పఠించితిని. "గురుభక్తి విహీనేతు నిష్ఫలం నాత్రసంశయః" "నింద్యోభవేత్ కలత్రాణాం నాశమేతి నసంశయః".

అని స్పష్టముగా దెల్పబడియుండెను. అందుచే నాటినుండి సుందరకాండ పారాయణ మానివేసితిని. ఇట్లు కొన్ని రోజులు అయిన తర్వాత రాత్రివేల స్వప్నావస్థయందు వందలకొలది పండుకోతులు కాన్పించుటయు, అదృశ్యమగుటయు జరుగనారంభించెను. ఒక్కొక్కపుడు నామములతో గూడిన వానరములు గానిపంచెడివి. మఱియొకప్పుడు అరటిపండ్ల గెలలు తినుచున్న వానరముల దర్శనమయ్యెడిది. ఈ విషయమును కొంత మందితో చెప్పగా స్వప్నమున వానర దర&శనము మంచిది కాదని చెప్పిరి. కాని, హనుమద్విజయమే ప్రధానముగా గల సుందరకాండ పారాయణము మానుటవలన ఇట్టి వింతలు గాన్పించు చున్నట్లు నా ఘనంబునకే తోచెను. ఎవరినైనను గురువుగా సేవించెదనన్న నాకు సంతృప్తి కల్గించువారు కాన్పింపరౌరి. అందుచే నొకనాడు మహేంద్రవాడలోగల సుబ్రహ్మణ్య గురువులను ఆశ్రయింపుమని నాయంతరాత్మ నన్ను ప్రబోధించెను. కాని వారి సేవ మిగుల కష్టసాధ్యమని కొందరి వలన దెలిసికొంటిని.

స్వస్తిశ్రీ చాంద్రమాన విక్రమనామ సం॥ర పుష్య శుద్ధ తదియా సోమవారము (30-12-40) రోజున ఉదయము గం.11 లకు శ్రీ గురుదర్శనమునకై వేగాయమ్మ వేటనుండి బయలుదేరి మహేంద్రవాడ చేరితిని. రాయవరమునకును మహేంద్రవాడకును మధ్య శ్రీ కర్రి సుబ్బారాయుడు గారిచే నెలకొల్పబడిన యగ్రహారమందు శ్రీ మహర్షి యాశ్రయము గలదు. శ్రీవారి తపో మహిమచే ఆ యాశ్రమము నందెచ్చట

జూచినను శాంతమే తాండవించుచుండెను. నేను శ్రీ గురువర్యుల యాశ్రమమున అడుగిడినతోడనే గురుపుత్రులైన శ్రీ వెంకటసూర్యనారాయణ పరబ్రహ్మముగారును వారి ధర్మపత్నియగు సత్యవతిగారును నన్ను అపార ప్రేమతో ఆదరించిరి. శ్రీ సత్యవతిగారు నా యెడల చూపిన అతిథి మర్యాదలు నే నెన్నడును మరువజాలను. మేడ పై భాగమునకేగి శ్రీరామ పీఠమును, శ్రీ గురువర్యుల తపః ప్రదేశమును తిలకించి పులకించి యానందపరవశుడనైతిని. కాని, ఆ సమయమున శ్రీ గురుదంపతులు రాజమండ్రీ వెళ్ళి తమ ప్రియశిష్యులైన శ్రీ కామరాజుగెడ్డ పాపరాజుగారి గృహమున మకాము చేసియున్నట్లు శ్రీ పరబ్రహ్మంగారి వలన తెలిసికొంటిని. అందుచే 1-1-1941 తేదీ విక్రమ సం॥ర పుష్య శుద్ధ చవితి బుధవారము మధ్యాహ్నము 3 గంటలకు రాజమండ్రీ చేరి శ్రీ మహర్షి గురుదంపతులను దర్శించితిని. ఆ సమయమున శ్రీ గురువర్యులు కృష్ణాజిన చిత్రాసనములతో నలంకరింపబడిన పీఠముపై తూర్పు ముఖముగా కూర్చుండియుండిరి. గురుదర్శన క్షుధార్తుడనైయున్న నాకు షడ్రసోపేతమైన మృష్టాన్నము లభించినట్లయ్యెను.

ఆ సమయమున శ్రీవారి దివ్య దేహమంతయును భస్మాంగ రాగముతో విరాజిల్లుచుండెను. మెఱపుతీగలవంటి శిరోజములు త్రినేత్రముయొక్క జ్వాలలా యనునట్లుండెను. నుదుట త్రిరేఖలుగా దిద్ది తీర్చబడిన గంధపు రేఖలు త్రిపుటిని తలంపునకు తెచ్చుచుండెను. గంధపు రేఖలపై నలంకరింపబడిన కుంకుమాంకిత తిలకము దివ్య చక్షువును తలంపునకు తెచ్చుచుంచెను. కంఠభాగమందలి తులసిమాలలు నాభూషణములను తలపించుచుండెను. మోమున బ్రహ్మతేజము తాండవించుచుండెను. పుండరీకములవంటి నేత్రములు కృపారసమును భక్తులపై ప్రవహింపజేయుచుండెను. హృదయస్థానము వఱకును వ్యాపించియున్న

గడ్డము కామక్రోధాది శత్రువర్గమును దిగనాడుచున్నట్లుండెను. పీఠముపై నున్న చిత్రాసనము శార్దూల చర్మమును దలంపునకు తెచ్చుచుండెను. శ్రీవారు ధరించిన శుద్ధ స్ఫటిక సంకాశమైన పట్టువస్త్రము శుద్ధసత్వమే నిజమైన సౌఖ్యము నిచ్చునను పాఠమును బోధించుచుండెను. ఆ మూర్తిని ఆవరించుకొనియున్న యొక దివ్య తేజఃపుంజము నాయంతరాత్మ నాకర్షించుచుండెను.

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అను గీతాశాస్త్ర ప్రమాణము ననుసరించి లోకము నుద్ధరించుటకును, తత్త్వరహస్యములను బోధించుటకును జగద్గురుడగు శ్రీ దక్షిణామూర్తియే యిట్టి రూపమున సాక్షాత్కరించెనని తన్మయత్వమునందితిని.

శ్రీ మహర్షులవారి ప్రక్కనే గురుపత్నియగు బాపనాంబగారొక యాసనముపై నాసీనులై యుండిరి. ఆ దేవి ముఖము పసిమిచాయతో మోక్షలక్ష్మిని మరపించుచుండెను. నుదుట విశాలమైన కుంకుమబొట్టు నేటి నవనాగరికతా స్త్రీలోకమునకు చక్కని నీతి పాఠమును బోధించు చుండెను. ఆమె ధరించిన స్వర్ణాభరణములు పతివ్రతా ధర్మములను ఏకరువు పెట్టుచుండెను. ఆమె వీక్షణములు కరుణారసమును మూర్తీభ వింపజేయుచుండెను. ఆ పతివ్రతా శిరోమణి లక్షణములన్నియు పతిసేవయే పరమ ధర్మమని బోధించుచుండెను. జగజ్జననియగు శ్రీ రాజరాజేశ్వరి నా యెదుట సాక్షాత్కరించినట్లు ఆనందించితిని. నేనే చిత్రకారుడనై యుండి నచో ఆ గురుదంపతుల మనోహర దృశ్యములను నా యిచ్చవచ్చినట్లు చిత్రించుకొని యుండెడివాడను. గురుకుల వాస సంప్రదాయముల నించుకైనను ఎఱుగని నాకు శ్రీవారికి నమస్కరించుట యెట్లో తెలిసినది కాదు. ఆనంద సారావారమున మునిగియున్న నే నెట్లో శ్రీవారికి నమస్కరించితిని.

అదియే మహర్షులవారి ప్రథమ సందర్శనము. అపుడు వారు నన్నొక చాపపై కూర్చుండ నియమించి 'నీవు మంచి పండితుడవు' అని ఏవేవో తూకమైన మాటలు నాపై విసరజొచ్చిరి. ఇది యంతకును నాయందుగల గొప్పతనమేమోయనినాలో నేను ఉప్పొంగసాగితిని. గౌరవ వాక్యములతో నన్ను ఆవలికి సాగనంపుటకు గురువర్యులు తలచుచుండినట్లు పిమ్మట గ్రహించితిని. ఒక్కసారి నా హృదయాంతరాళమునుండి దుఃఖసముద్రము పొంగెను. అందుచే నా హృదయములోనున్న సంకల్పము నెఱింగితిని. నన్ను పొగడి సాగనంపుట భావ్యము కాదని గద్గదిక స్వరముతో మనవి చేసితిని. అంత నా గురు చంద్రులు నా పై నొక్క కటాక్ష వీక్షణము ప్రసరింపజేసిరి. వెంటనే శ్రీవారి జ్యోతిర్మయములగు నేత్రముల నుండి దివ్యశక్తి నాయందు ప్రవేశించినట్లయ్యెను. పరితప్తగాత్రుడవైయున్న నేను అకస్మాత్తుగా సుధాసాగరంబున మునింగినట్లయ్యెను. అంత గురువర్యులు దయార్ద్ర హృదయులై ఒక బత్తాయిపండును, సగ్గుబియ్యపు పాయసమును, శ్రీ సీతారాములకు నైవేద్యము చేసి నాకు ప్రసాదముగా నిచ్చిరి. "సాధూనాం దర్శనం పుణ్యం" అనునటుల సకల తీర్థావగాహన ఫలమచటనే నాకు లభించెను. నా సందేహములన్నియు గురు వర్యులకు మనవి చేసికొంటిని. అంత శ్రీవారు "నాయనా! నీవింకను కొంతకాలము శ్రీరామభక్తిని వృద్ధి చేయుమనియు, దాశరథీ శతకమును నిత్యమును పఠింపుచుండుమనియు హితోపదేశమొనరించిరి. చిన్నపిల్లలు చదువుకొను దాశరథీశతకము చదువుటయన నాకు గౌరవహీనముగా తోచెను. గురుదేవుని చెంత అహంభావముతో కొన్ని యసందర్భ ప్రసంగములు గూడ కావించితిని. అందులకు వారేమియు ఆగ్రహింపక ఆ మరునాడు ఉదయముననే భక్త పోతన చిదానంద గురువును సేవించి శ్రీరామ సాక్షాత్కారమునొందిన కథ తెల్పిరి. ఆ రోజుననే అనగా విక్రమ సం॥ర పుష్య శుద్ధ పంచమీ

గురువారము (20-12-1941 తేదీ) రోజున సూర్యోదయాది ఘడియలు ....అప్పుడు శ్రీ గురుచక్రవర్తి నాకీ క్రింది విధముగా నుపదేశము చేసిరి.

శ్లో ॥ గురుర్బ్రహ్మా గురిర్విష్ణుర్గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరంబ్రహ్మా తస్మై శ్రీ గురవేనమః ॥

శ్లో ॥ కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం ।
ఆరుహ్యా కవితాశాఖాం వందేవాల్మీకి కోకిలం ॥

ఇట్లుపదేశించి "నీవు యధా ప్రకారముగా సుందరకాండ పారాయణము చేసికొనుచుండు" మని చెప్పిరి. వారివద్ద సెలవు పుచ్చుకొని నా మకాము గ్రామమైన వేగాయమ్మపేట చేరుకొంటిని. పూర్వము వలెనే వానరసందర్శనము ప్రారంభమయ్యెను. ఆ వానరములు పూర్వముకంటె మిగుల సంతోష పరవశములుగా గాన్పించసాగెను. గురువర్యుల యాజ్ఞాను సారముగా దాశరథీ శతకము సంపాదించితిని. అందలి పద్యములు నాకుమంచి ప్రబోధముగావించెను. అంత్యాను ప్రసాలంకారములతోను, యమకాలంకారములతోను, భక్తి రస ప్రవాహముతోను, అనుభవార్థము లతోను గర్భీకృతమైన యా పద్య రత్నములు నాకు నూతన చైతన్యమును కల్గించెను.

ఉ ॥ శ్రీరఘురామ చారుతులసీదళదామ శమక్షమాది శృం
గార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్య రమాలలామదు
ర్వార కబంధ రాక్షసవిరామ జగజ్జన కల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరి దాశరథీకరుణాపయోనిధీ॥

ఇత్యాది పద్యగత్యములు తరచు చదువుచుండుటచే గురుదేవుని యాదేశమందు అనిర్వచనీయమగును రహస్యమేదియో యున్నట్లు దృఢమయ్యెను. మఱియు నా ప్రతి రక్త కణమందును ఒక దివ్యశక్తి

ప్రవేశించుచున్నట్లు గోచరించెను. గురువర్యుల యుపదేశానుసారముగా సుందరకాండ పారాయణము చేసికొనుచుంటిని. శ్రీ గురువర్యులను దర్శించినప్పటినుండియు నా మనస్సు సకల సంశయచ్ఛేదనమునకై తహతహలాడుచుండెను. ఇట్లుండగా విక్రమ సం॥ర మాఘ శుద్ధ త్రయోదశీ సోమవారము (10-2-1941) తేదీ) రోజున మధ్యాహ్నము గం 1-30 లకు నేను వేగాయమ్మ పేటలో చేబ్రోలు మహాలక్ష్మమ్మగారి యింటిలో ఒంటరిగా నుంటిని. నా మనస్సు గురుపాదములయందు లగ్నమై యుండెను.

నేను నిమీఈలిత నేత్రుడనై యుంటిని. ఆ సమయమున శ్రీరామచంద్రుడు నా వెనుక నుండి వచ్చి నా వీపుపై తట్టుచు నిట్లు సాక్షాత్కరించెను. నీలమేఘచ్ఛాయ దేహముపై స్వర్ణ పీతాంబరములు మెఱయుచుండెను. వజ్ర వైడూర్య మాణిక్య గోమేధిక పుష్య రాగాది మణిగణస్థగితమైన దివ్య కిరీటము శిరోభాగమున ప్రకాశించుచుండెను. రత్నహారములును, ముత్యాల హారములును, వివిధ పుష్పమాలలును కంఠసీమ నలంకరించియుండెను. భుజకీర్తుల కాంతులు మిగుల ప్రకాశించుచుండెను. గోపీచందనముతో కూడిన నామములు నుదుటిపై ప్రకాశించుచుండెను. చిఱునవ్వు మోముపై తాండవించుచుండెను. అట్టి శ్రీరామ చంద్రప్రభువు నన్నుద్దేశించి “ఓరీ, నాకు భోజనము పెట్టకుండగ ఎంత కాలము ఇట్లు గడపెదవు” అని హెచ్చరించి అదృశ్యుడయ్యెను. అప్పటికి గురువర్యులు నాకు సుందరకాండ పారాయణముపదేశించి నలుబది దినములయ్యెను. ఆహా, ఏమి గురుమహిమ! ఎట్టి శ్రీరామ దివ్య సందర్శన భాగ్యము! ఎన్ని జన్మలెత్తినను లభించని శ్రీరామచంద్ర సందర్శనమునకు శ్రీ గురు చక్రవర్తి యనుగ్రహ విశేషమే కదా! అని నాలో నేను ఉప్పొంగితిని. నామనంబు అమందానందకందళితమయ్యెను.

నా జీవితములో నూతనాధ్యాయము ప్రారంభమయ్యెను. ఈ శ్రీరామ దర్శనముచే నిరంతరరరమును నా మనస్సు గురుపాదములయందే లగ్నమైపోయెను. ఈ విషయమును శ్రీ గురువర్యులకు విన్నవించుకొనగా శ్రీ వృష సం॥ర చైత్ర శుద్ధ విదియా స్థిరవారము (29-3-1941 తేదీ) రోజున తమ జన్మస్థలమగు పామర్రులో వారి గృహమున ఉదయము గం॥11 లకు నన్ను ఒంటరిగా చేరబిల్చి శ్రీరామ తారక మంత్ర దీక్ష నొసంగిరి. మఱియు తమ యపార కరుణా సుధారసమును నాయాపాదమస్తకము ప్రసరింపజేసిరి. అంత శ్రీ సుబ్రహ్మణ్య గురు చక్రవర్తి నుండి అనిర్వాచ్యమగు విద్యుత్ప్రవాహము నాయందు ప్రవేశించినట్లయ్యెను. నేనడుగ దలచుకొనిన సంశయములన్నియు నొక్కసారి పటాపంచయ్యెను. సద్గురు దర్శనభాగ్యమిప్పటికి గదా ఫలించెనని గాఢమగు నిట్టూర్పు పుచ్చి యానందామృత సాగరమున సంతృప్తిగా పవిత్రస్నాన మొనరించితిని. నా యనుభవ విశేషములను ఎప్పటికప్పుడు మహేంద్రవాడ వెళ్లి నివేదించుకొనుచుంటిని.

"అహోభాగ్య మహోభాగ్య! మహోగురు రహో గురుః" అను పుణ్య విశేషము నా జీవితములో ఇప్పటికి లభించెను.

మఱియు వృష సం॥ర ఆషాఢ శుద్ధ చతుర్దశీ సోమవారము (7-7-1941 తేదీ) రోజున రాత్రి నేను తూ. గో. జిల్లా, వేగాయమ్మ పేటలో చేబ్రోలు మహాలక్ష్మమ్మగారి యింటి వీధియరుగుపై నొంటరిగా నిద్రించుచుంటిని. ఆ రాత్రి గం॥ 12ల వేళ శ్రీ గురువర్యులు నా వద్దకు వచ్చి నా వీపుపై తట్టి నన్ను లేపిరి. నేను లేచి కూర్చుండువఱకును నా వీపుపై తట్టి నన్ను లేపిరి. నేను లేచి కూర్చుండువఱకును నా వీపుపై తట్టుచునే యుండిరి. అంత నేను ఆశ్చర్యపడుచు మడతమంచముపై "కూర్చుండి ఇది స్వప్నమా! లేక జాగ్రదవస్థయా!" అని బాగుగా

పరకాయించుచుంటిని. ఆకాశము నిర్మలముగా నుండుటచే వెన్నెల స్వచ్ఛముగా ప్రకాశించుచుండెను. శ్రీ మహర్షులవారు పట్టుపంచె మాత్రము ధరించియుండిరి. పైన ఉపవస్త్రము లేదు. ముఖమున విభూతి దట్టముగాను స్వచ్ఛముగాను ప్రకాశించుచుండెను. మెడలో ఒక తులసి మాల మాత్రము గలదు. అపుడు శ్రీ గురువర్యులు తమ కుడి హస్తముతో నా మడతమంచముపట్టె పట్టుకొని ఏవేవో మంత్రములు పఠించుచు నా మడతమంచము చుట్టును మూడు సార్లు ప్రదక్షిణము చేయుచుండిరి. నేను మంచముపై గూర్చుండి చూచుచునే యుంటిని. ఇట్లు అయిదు నిమిషములసేపు ఆ యద్భుత దృశ్యమును బాగుగా తిలకించితిని. నేను చూచుచుండగనే శ్రీ మహర్షులవారు అదృశ్యులైరి. అప్పటినుండియే శ్రీమహర్షులవారికి ఆకాశగమనాది సిద్ధులు గలవని గుర్తింపగల్గితిని. నాకు దర్శనమిచ్చిన సమయముననే మహేంద్రవాడలో నొక శిష్యునికి తత్త్వబోధ చేయుచుండిరి. ఒకే సమయములో రెండుచోట్ల దర్శనమిచ్చుట మహత్తర విశేషమేగదా! దేవతలతో గూడ శ్రీ గురుచక్రవర్తికి నిత్యసంబంధములు గలవు. ఆ విషయములు ముందు ప్రకరణములో వివరింతును.

బ్రహ్మవిద్యావాహినీ జన్మశైలమగు శ్రీ మహర్షి చంద్రుల చరిత్ర దాగియుండుట లోక శ్రేయస్సునకే భంగముగా తోచెను. "పుణ్యశ్లోకస్య చరిత ముదాహరణ మర్హతి" అను నార్యోక్తి శ్రీ గురువర్యుల యెడలనే సార్థకమయ్యెను. ఉత్తమ పురుష గుణవర్ణనములేని గ్రంథములెందును లోకమున శాశ్వతముగా నిలువజాలవు.

నాకు బోధించుటకై శ్రీ గురువర్యులు మిగుల శ్రమపడియుండిరి. దురవగాహమైన బ్రహ్మవిద్యను శిష్యులకు కరతలా మలకమగునట్లు నూతన బోధన పద్ధతులతో బోధించి వప్పించి మెప్పించు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి పవిత్ర చరిత్ర రచనకంటె నా హస్తమునకు కావలసిన

పుణ్యకార్యమేదిగలదు? నా జన్మ సార్థకమునకై ఈ పవిత్ర చరిత్ర వ్రాయుటకు పూనుకొంటిని. అనేక జన్మార్జిత సుకర్మ పుంజ పరిపాక విశేషముచే నాకీభాగ్యము లభించినది. ఇప్పటికి నా జన్మ సార్థకమైనది.

"అహెూ పుణ్య మహెూ పుణ్యం ఫలితం ఫలితం దృఢం ।
అస్యపుణ్యస్య సంపత్తే రహెూ వయమహెూవయమ్ ।
ఆహెూ జ్ఞాన మహెూ జ్ఞాన మహెూ సుఖ మహెూ సుఖం ।
అహెూ శాస్త్ర మహెూశాస్త్ర మహెూ గురు రహెూ గురుః ॥
అవధూతోపనిషత్.

నా జీవితరంగమున ఇట్టి పవిత్రావకాశము లభించినందున నేనీ చరిత్ర వ్రాయబూనితిని.

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి వంశ చరిత్ర

శ్రీమదనంతకోటి బ్రహ్మాండనాయకుండైన పరమేశ్వరునిచే సృష్టించ బడిని పదునాల్గు భువనములలోను భూలోకము సర్వాంగ సుందరమై విరాజిల్లుచుండును. అందు సకల ముని గణసేవితంబై పవిత్ర తీర్థ రాజ విరాజితంబై భూలోకంబునకు మండనాయమానంబై యొప్పు భరత ఖండము ఆర్యావర్తము. పుణ్యభూమి యను సార్థక నామములతో నలరారు చుండును. ఇట్టి భరతఖండమందలి మహారాష్ట్ర దేశములో నాసికయను పుణ్యక్షేత్ర మొందుగలదు. అచటనే గోదావరీ మహానది జన్మించినది.

శ్లో ॥ నాసికంచ ప్రయాగంచ పుష్కరం నైమిశంతథా ।
పంచమంచ గయాక్షేత్రం షష్టంకుత్ర నవిద్యతే ॥

బ్రహ్మాండపురాణము.

నాశిక, ప్రయాగ, పుష్కరము, నైమిశము, గల అను క్షేత్రములు అగ్రగణ్యములు.

శ్లో॥ కాశీపురీచకేదారో మహాకాలో ధనాసికం ।
త్రంబకంచ మహాక్షేత్రం పంచదీపా ఇమే భువి ॥

దేవీ భాగవతము. 21 అ 32 శ్లో॥

కాశీపురము, కేదారము, మహాకాలము, నాశిక, త్ర్యంబకము అను క్షేత్రములైదును భూలోకమునకు అయిదు దీపములవంటివి.

సమర్థ రామదాసస్వామి గాయత్రీదేవి నారాధించి యీ క్షేత్రముననే సిద్ధినొందెను. శృంగేరీ పీఠాధిపతులైన సచ్చిదానందస్వాములును, బ్రహ్మా నందస్వాములును ఇచటనే సమాధినొందిరి. ఈ రెండు పుణ్యక్షేత్రము

లకును గోదావరినది మూలముననే యిట్టి మహత్వము కల్గినది.

శ్రీ శుక్ల యజుర్వేదాంతర్గత కాణ్వశాఖీయులును, కాశ్యపసగోత్రో ద్భవులును, సుప్రసిద్ధ పండితోత్తములును నైన శ్రీ రెడ్డి కాళప్పశర్మ, రెడ్డి అమ్నాయశర్మ అను నిరువురు బ్రాహ్మణ సోదరులు కొంతకాలము నాశిక క్షేత్రమందును, కొంతకాలము త్ర్యంబక క్షేత్రమందును సకుటుంబ సపరివారముగా నివసించుచుండిరి. వీరిది సుప్రసిద్ధ పండిత కుటుంబము. వేదవేదాంగముల యందును, చతుష్షష్ఠి కళల యందును అసమాన శేముషీ ధురంధరులు.

ఒకప్పుడు నాశికాత్ర్యంబక ప్రాంతములలో గొప్ప కఱవు సంభ వించెను. జీవయాత్ర మిగుల కష్టముగా నుండెను. అట్లుండగా అమ్నాయశర్మగారికి బ్రహ్మాండపురాణము చదువు నవకాశము కల్గెను. అందు కోటిఫలిక్షేత్ర మహాత్మ్యము వర్ణింపబడియుండెను.

శ్లో. కోటితీర్థమితి ఖ్యాతం త్రిషులోకేషు విశ్రుతం
వింధ్యస్య దక్షిణే పార్శ్వే గోదావర్యాస్తటేశుభే
ఛాయా సోమేశ్వరో దేవ స్తత్ర సన్నిహితశ్శివః
తత్ర స్నానేన దానేన సద్యోముచ్యంతి మానవాః॥

బ్రహ్మాండపురాణము 39 అ.

వింధ్యకు దక్షిణభాగమందలి గోదావరీ తీరమున కోటి తీర్థమను ప్రసిద్ధ పుణ్యక్షేత్రము గలదు. అచల ఛాయా సోమేశ్వర నామముతో శంకరుడు నివశించియున్నాడు. అచట గోదావరిలో స్నానము చేసినచో సద్యోముక్తి కల్గును.

పంటలు లేక యితర ప్రాంతములకు పోవ సంసిద్ధులైయున్న అమ్నాయశర్మగారికి ఈ కోటిపలిక్షేత్ర మహాత్మ్యము ఆంధ్రదేశ

ప్రయాణమునకు ముఖ్య హేతువయ్యెను. ఆమ్నాయశర్మగారు మాత్రమే బండెడు తాళపత్ర గ్రంథములతో సకుటుంబ సపరివారముగా ఆంధ్రదేశమునకు వలసవచ్చి తూ.గో. జిల్లా, రామచంద్రపురం తాలూకాలో జేరిన కోటిఫలిలో స్థిరనివాస మేర్పఱచుకొనిరి. కాళప్పశర్మగారు మాత్రము తమ జన్మస్థానమందే నిలిచిపోయిరి.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి వంశవృక్షమునకు ఆమ్నాయశర్మగారే మూలకందము.

వీరికి పెదపుట్టయ్యశర్మ చినపుట్టయ్యశర్మ అను నిద్దరు పుత్రులు గల్గిరి. పెదపుట్టయ్యశర్మగారు గృహస్థాశ్రమము స్వీకరింపక ఆజన్మాంతము బ్రహ్మచర్య దీక్షతోనే జీవయాత్ర సాగించిరి. ఈ సోదరులిద్దఱును తపోనిష్ఠాగరిష్ఠులై కోటిఫలిలో కాలము గడుపుచుండిరి.

ఒకప్పుడాంధ్రదేశమున ద్వాదశ వర్షక్షామము సంభవించెను. ఆ కాలమున వర్షాధారమువలననే పంటలు పండించవలసియుండెను. అందుచే జనులు తిండిలేక మలమల మాడుచుండిరి. దినమొక యుగముగా గడుచుచుండెను. అట్టి కఱవు రోజులలో మండు వేసవి కాలమందొకనాడు మధ్యాహ్నము రెండు జాముల వేళ పెదపుట్టయ్య శర్మగారు కాలినడకను బయలుదేరి కోటిఫలికి రెండుమైళ్ళ దూరములోనున్న గంగవరము వెళ్ళిరి. రోహిణికార్తె యగుటచేతను, చాలకాలము నుండి వర్షములు లేకపోవుటచేతను పశుపక్ష్యాది ప్రాణికోటి నోరెండి ప్రాణములు వదలుచుండెను. త్రాగుటకు మంచినీరు దొరకుటయే పుణ్యముగా నెంచబడుచుండెను. అట్టి మండుటెండల పాదరక్షలుగాని, గొడుగుగాని లేక నిరాండంబరముగ వచ్చియున్న పెదపుట్టయ్య శర్మగారిని చూచి గంగవరం గ్రామస్థులు అద్భుతాయత్త చిత్తులై “అయ్యా ! ఇట్టి మండు వేసవికాలములో మిట్టమధ్యాహ్నము పాదరక్షలు లేక కాలి నడకను తామిట్లు

వచ్చుటకు కారణమేమ"ని ప్రశ్నించిరి. ఆ మాటలు విని పెదపుట్టయ్యశర్మ గారు "మహాజనులారా! నేడు గొప్ప సుదినము. మనకు కఱవు నశించుకాలము సమీపించినది. ఈ రోజున పగలు 1 గంటకు అఖండ వర్షయోగము గలదు. నేను తిరిగి కోటిఫలికెళ్ళునపుడు బురదలో ప్రయాణము చేయవలసివచ్చును. అందుకే పాదరక్షలు మానితి" నని చెప్పిరి. పేదకు పెన్నిధి దొరికినట్లు ఆ బ్రాహ్మణ పుంగవుని వాక్కులు గంగవరంవారికి అమృతభోజనమువలె నుండెను. అప్పటికి మధ్యాహ్నము 12 గంటలయ్యెను. పెదపుట్టయ్య శర్మగారు భోజనము చేయకయే వచ్చి యుండిరి. అందుకే వారికి అడ్డెడు బియ్యమును అందులకు కావలసిన భోజన సామగ్రియు నెట్లో అతి కష్టముమీద సంపాదించి "అయ్యా! మీరీ పదార్థములను స్వీకరించి వంట చేసికొని తృప్తిగా భుజింపుడ"ని పుట్టయ్య శర్మగారిని కోరిరి. ఆ గ్రామస్థుల భక్తిశ్రద్ధలకు మిగుల సంతోషించి పుట్టయ్య శర్మగారు స్వహస్తపాకము గావించుకొని, దేవతార్చనము యధావిధిగా చేసికొని శ్రీ సీతారాములకు నివేదనము చేసి భోజనము నకుపక్రమించిరి. గ్రామస్థులందఱును గుమిగూడి గుసగుసలాడుచు వర్షమునకై ఎదురు చూచుచుండిరి. వెంటనే ఆకాశమందు ఈశాన్య దిక్కున చిన్న మేఘదర్శన మయ్యెను. చూచుచుండగనే ఆకాశమంతయును నీలమేఘావృతమై చల్లని వాయువులతో బాటు అఖండ వర్షము కురిసెను. పుట్టయ్యశర్మగారు భోజనము చేయుచునే యుండిరి. ఉఱుములతోను, మెఱపులతోను దశ దిశలును అంధకార బంధురమై ఆకాశమునుండి సర్పములు వ్రేలాడ గట్టినట్లు అపరిమిత వర్షము కురిసెను.

"ఆహా! తపస్సంపన్నుడగకు నీ బ్రాహ్మణుని వాక్యమందెంత సత్యము గలదు? మనమెన్నడు నెఱుగని యీ బ్రాహ్మణుడేల మన చెంతకు రావలయును? వర్షయోగ విషయమెందులకు చెప్పవలయును? ఇది

యంతయును భగవన్మాయగాని అన్యముగాదు, నేటికి మన పుణ్యము పండి భగవంతుడే ఈ బ్రాహ్మణ రూపమున మనకు దర్శనమిచ్చెను. వర్షమునకై మనమందఱము చేసిన సహస్ర ఘటాభిషేకములును, భగవద్భజనలును, పురాణ శ్రవణాదులును నేటికి ఫలించినవి" అని తమలో తాము సంతోషపరవశులై పుట్టయ్యగారి దర్శనమునకై వేచియుండిరి. అడ్డెడు బియ్యపన్నమును ఆయనకు సంతుష్టిగా సరిపోయెను. భోజనముచేసి ఈవలికి వచ్చుసరికి జనులు కిటకిటలాడుచుండిరి. ఎచ్చట చూచినను జలమయమై కాన్పించెను. పుట్టయ్యగారు ఈవలికి వచ్చుసరికి జనులందఱును సాష్టాంగ ప్రణామములర్పించి సంతోషపరవశులై పది యకరముల భూమిని గంగవరం గ్రామస్థులు పెదపుట్టయ్య శర్మగారికి దాన విక్రయ సత్త్వాద్యధికారములతో శాశ్వత దానపట్టా వ్రాసి యిచ్చిరి. క్రమక్రమముగా పరిసర గ్రామస్థులందరికిని పెదపుట్టయ్యశర్మ చిన్న పుట్టయ్యశర్మల ఖ్యాతి తెలియవచ్చెను. గంగవరమువారికి పెదపుట్టయ్య గారు చెప్పిన వర్షయోగ కథనము విని అముజూరు గ్రామస్థులు పది యకరముల భూమిని శాశ్వతముగా దానవిక్రయ సత్త్వాద్యధికారములతో దానపట్టా వ్రాసి యిచ్చిరి. రెడ్డివారు ఆంధ్రదేశమునకు వచ్చిన తరువాత స్థిరాస్తి సంపాదనమున కివియే ముఖ్య హేతువులు.

పెదపుట్టయ్య చినపుట్టయ్యశర్మగార్లు కోటిఫలిలో కొంతకాలము నివసించిన పిమ్మట తమ మకామును సుందరపల్లికి మార్చుకొనిరి. పిమ్మట రెడ్డివారి వంశవృక్షము దొరకలేదు. ఆమ్నాయశర్మగారు ఆంధ్రదేశమునకు వలస వచ్చిన కాలము నిర్ధారణగా తెలియలేదు.

## బ్రహ్మన్నగారి చరిత్ర.

రెడ్డి వెంకప్పశర్మగారు తపోనిష్ఠాగరిష్ఠులై శ్రౌతస్మార్తాది కర్మాధికారులై

యుండిరి. ఆయన సావిత్రియను కాంతారత్నమును పరిణయమాడిరి. ఆమె పతియెడల వినయవిధేయతలు చూపుచు, పతిమాట జవదాటక సౌశీల్యమున మిన్నయై మిగుల ఖ్యాతి గడించెను. ఆ పుణ్యదంపతులు నిరంతరము శ్రీ రామభక్తులై ఆధ్యాత్మిక రంగమున నోలలాడుచుండిరి. ఆ దంపతుల తపఃఫలముగా నొక పుత్రుడు జన్మించెను. దైవజ్ఞులా బాలునికి బ్రహ్మన్నశర్మ యని నామకరణము చేసిరి.

అయిదవయేటనే వెంకటప్పశర్మగారాబాలునికి అక్షరాభ్యాసము చేయించిరి. స్వల్పకాలములోనే యా బాలుడు విద్యలయందారితేరి యుక్తాయుక్త పరిజ్ఞానము కలవాడయ్యెను. బ్రహ్మన్నగారెన్నడును తన తలిదండ్రులమాట తృణీకరింపలేదు. ఆయన జ్యోతిశ్శాస్త్రమందలి స్కంధత్రయమునందును (జాతక భాగమందును, ముహూర్తభాగమందును, సిద్ధాంతభాగమందును) కూలంకష ప్రజ్ఞాధురీణులై యుండిరి. శ్రౌతస్మార్తాది కర్మల నాచరించుటయందును, నాయాకర్మల చేయించుటయందును, కడుంగడు సమర్థులు, అష్టాదశపురాణాది గ్రంథములన్నియు వీరికి కరతలామలకమయ్యెను. ఇట్టి లక్షణయుక్తుడైన తన పుత్రుని జూచి వెంకప్పశర్మగారు అమందానంద కందళితహృదయారవిందులై లోన నుప్పొంగుచుండిరి. శ్రీ బ్రహ్మన్న శర్మగారి శ్రీ రామభక్తిచే వీరీ కుటుంబము కలకలలాడుచుండెను. జ్యోతిశ్శాస్త్రమందును, పురాణ కథా కథనమందును వీరి కీర్తికాంత దశదిశలయందును నాట్యమాడదొడంగెను.

కొంత కాలమునకు అముజూరు గ్రామస్థులైన నేమాని పెద్దయ్య చౌదరిగారు బ్రహ్మన్నగారి పురాణకథన విషయమును, వారి ప్రఖ్యాతియును విని సుందరపల్లి నుండి పామఱ్ఱు తీసికొని వెళ్ళి అచట నివసింపజేసిరి. బ్రహ్మన్నగారి కాలము నుండియే రెడ్డివారు పామఱ్ఱులో నివశించుటకు

ప్రారంభము. తూ.గో.జిల్లా రాజోలు తాలూకాలో చేరిన ఈతకోట నివాసులగు శ్రీ కోడూరి వెంకన్నగారి సప్తమ పుత్రికయగు శ్రీశేషాంబను బ్రహ్మన్నగారు పరిణయమాడిరి. ఈ పుణ్య దంపతులు నిష్కళంకమగు శ్రీరామభక్తితోను, వైరాగ్య విజ్ఞానములతోడను గృహస్థాశ్రమమును సాగించుచుండిరి. బ్రహ్మన్నగారు శ్రీ సీతారామాది విగ్రహములకును, షట్చక్ర సీతారామసాలగ్రామమునకును, అధాత్మ రామాయణ గ్రంథమునకును పూజచేసి పిమ్మట అధ్యాత్మ రామాయణ గ్రంధమునకును పూజచేసి పిమ్మట అధ్యాత్మ రామాయణములో మూడు సగ్గలకు తక్కువ కాకుండగ పారాయణము చేయుచు పిమ్మట భుజించుచుండెడివారు. మధ్యాహ్న సమయమున అధ్యాత్మ రామాయణము పురాణము చెప్పుచుండెడివారు. పామర్రునకు రెండు ఫర్లాంగుల దూరములో తూర్పున అముజూరుగలదు. ఆ గ్రామ నివాసులును, కమ్మవారును, దేవబ్రాహ్మణ భక్తాగ్రేసరులును, అగు శ్రీ నేమాని పెద్దయ్య, శ్రీ నేమాని చిన్నయ్య, శ్రీ నేమాని కృష&ణయ్య అను సోదరులు బ్రహ్మన్నగారిని సగౌరవముగా రావించి ఆ గ్రామమందలి చింతలతోటలో  మధ్యాహ్న సమయమున అష్టాదశ మహా పురాణములును పురాణము చెప్పించుకొనిరి.

పెదపుట్టయ్యగారికి అముజూరు గ్రామస్థులు పది యకరములు భూమి ఇచ్చియుండిరని ఇదివరలోనే చెప్పియుంటిని. అందులో మూడు యకరముల భూమి ఏ కారణముచేతనో పెదపుట్టయ్యగారి యనంతరము రెడ్డివారి హక్కు భుక్తిములలో లేక అన్యాక్రాంతమైపోయెను. ఆ మూడు యకరముల భూమియును రివిన్యూ డిపార్టుమెంటులో పెదపుట్టయ్యగారి పేరనే నమోజు కాబడియుండెను. నమోజు ఒకరి పేరను భుక్తము మఱియొకరి పేరను ఉండుట ధర్మవిరుద్ధమని తలంచి శ్రీ నేమాని పెద్దయ్య చౌదరిగారు రివెన్యూ డిపార్టుమెంటువారికి ఆ విషయము రిపోర్టు చేసి

అందు జరిగిన యన్యాయమును వెల్లడి చేసిరి. రివిన్యూ డిపార్టుమెంటువారు ఆ విషయమును విమరిఁశంచి తిరిగి బ్రహ్మన్నగారి పేర పట్టా వ్రాసి యిప్పించిరి. నేమాని పెద్దయ్యగారు ఆ రైతును తొలగించి బ్రహ్మన్నగారికా భూమిని స్వాధీన పరచిరి. ఆ భూమిపై వచ్చు ఫలసాయమునుగూడ సకాలమునకు బ్రహ్మన్నగారికి చెందునట్లు శ్రీ నేమాని పెద్దయ్యగారే తగిన కట్టుదిట్టములు చేసిరి. అప్పటినుండియు ఆ భూమి రెడ్డివారికి శాశ్వతముగా భుక్తమయ్యెను. ఇదియంతయును బ్రహ్మన్నగారి ప్రజా&ఈవిశేషముతప్ప మఱొకటి కాదని సకల జనులును గాఢముగా విశ్వసించి వారి కుటుంబమును మిగుల గౌరవించిరి.

ఒకప్పుడు కోటిఫలి గ్రామమందలి ఛాయా సోమేశ్వర స్వామివారి యాలయమునకు క్రాప జమీందారువారైన శ్రీ ఆనందుగారు ధర్మకర్తలై యుండిరి. వీరు ఒకనాడు పండిత సభ కోటిఫలిలో చేయించి శ్రీ స్వామివారికి రథ నిర్మాణ ముహూర్తము నిర్ణయింపుడనిరి. శ్రీ బ్రహ్మన్నశర్మ గారు కూడ ఆ సభకాహ్వానింపబడిరి. శ్రీ బ్రహ్మన్నశర్మగారు కూడ ఆ సభకాహ్వానింపబడిరి. ముహూర్త నిర్ణయములో పండితులు వాదోప వాదములాడుచుండిరి. అంత బ్రహ్మన్నగారు సభలో నిలబడి రేపుదయమే మంచి ముహూర్తము కావున సిద్ధముకండని చెప్పిరి. నాగలింగమను వడ్రంగి శ్రీ జమీందారువారిచేఏ నాహ్వానింపబడెను. ముహూర్త సమయమునకు టేకు పలక దేవాలయము దగ్గరకు తీసికొని రాబడెను. ముహూర్త సమయమునకై సభలోని వారందఱును నిరీక్షించుచుండిరి. శ్రీ బ్రహ్మన్నశర్మగారు నిమీలిత నేత్రులై శ్రీ రామతారక పరబ్రహ్మమందు లీనమై ముహూర్త సమయము అయినదని సంజ్ఞ చేసిరి. తక్షణమే నాగలింగమను వడ్రంగి టేకు పలకపై బిడితతో రెండు పేళ్లు తీసెను. జనులు కరతాళ ధ్వనులొనర్చిరి. ముహూర్త సమయము వఱకును శ్రీ బ్రహ్మన్నగారు నిమీలిత

నేత్రులై ఎవ్వరితోను మాట్లాడక తదేక నిష్ఠాగరిష్ఠులై యుండుటగాంచి సభ్యులు నివ్వెఱపాటుతో చూచుచుండిరి. ముహూర్తమైన పిమ్మట శ్రీ ఆనందుగారు బ్రహ్మన్నశర్మగారికి సత్కరించి “అయ్యా! ఎప్పటికి ఈ రధనిర్మాణము పూర్తి యగును” అని ప్రశ్నించిరి. అది విని బ్రహ్మన్నగారు “రధనిర్మాణము దానంతటదే శీఘ్రముగా పూర్తియగును” అని జవాబు చెప్పిరి. ముహూర్తమైన మరునాటి మధ్యాహ్నము మూడు గంటలకు తాళ&ళ రేవు నుండి ఒక కైవర్తకుడు (అగ్నికులక్షత్రియుడు) ఆనందుగారి చెతకు వచ్చి ఇట్లు చెప్పెను. “అయ్యా ! నాకు కీళ్ళవ్యాధి సంభవించి కదలుటకు వీలులేని స్థితిలో నుంటిని. సంపూర్ణారోగ్యము కల్గిన యెడల కోటిఫలిక్షేత్రములోని శ్రీ ఛాయా సోమేశ్వరస్వామికి రధము నిర్మాణము చేయించి యిచ్చెదనని మ్రొక్కుకొంటిని. నాకు సంపూర్ణారోగ్యము కల్గినది. తమ సెలవు అయినయెడల యెల్లుండి సాయంకాలమునకు రధమును ఇక్కడ సిద్ధము చేయుదును” అని విన్నవించెను. శ్రీ బ్రహ్మన్నశర్మగారు ముహూర్తముచేసి త్వరలోనే రధము సిద్ధము కాగలదని చెప్పి యుండుటచేతను, అప్పుడు శ్రీ ఛాయా సోమేశ్వరస్వామికి రధము అవసరమై యుండుటచేతను శ్రీ ఆనందుగారు సంతోషముతో తమ యంగీకారమును దెల్పిరి. ఆ కైవర్తకుడు రంగూను వర్తకము చేసి విశేషధన మార్జించి లక్షాధికారియై యుండెను. అందుచే రధ భాగములను అన్నిటిని తాళ్ళ రేవులో విడివిడిగా చేయించి పడవలపై గోదావరిలో వేయించి తెచ్చి మూడవనాటికే రధమును కోటిఫలిలో సిద్ధముచేసెను. అప్పటి నుండియు రెడ్డివారి ఖ్యాతి బహుముఖములుగా వ్యాపింపజొచ్చెను. శ్రీ బ్రహ్మన్నగారి ప్రతిభా విశేషములు కొన్ని ముందు ప్రకరణములో వివరింతును.

## బ్రహ్మన్న శర్మగారి సంతతి.

శ్రీ బ్రహ్మన్నశర్మగారు ఆధారాది సప్త చక్రములయందును శ్రీరామార్చన నిత్యమును చేయుచుండిరి. ముక్తి కాంత గూడ వీరి వెనువెంట విహరింప దొడగెను. సప్త చక్రముల యందును వీరు శ్రీ రామార్చన చేసిన ఫలితముగా వీరికి ఏడుగురు పుత్రులును, ముక్తికాంత చిహ్నముగా నొక పుత్రికయు కల్గిరి.

వీరి జ్యేష్ఠపుత్రులు వెంకటరామశాస్త్రిగారు. ఈయన గొప్ప పౌరాణికులును, జ్యోతిశ్శాస్త్రజ్ఞులును, అధ్యాత్మరామాయణ పారాయణ దీక్షాపరులునై ప్రసిద్ధిగాంచిరి. ఈయన వడిసిలేరు గ్రామనివాసులగు శ్రీ రాగిడిమిల్లి వెంకయ్యగారి కుమార్తె వెంకటలక్ష్మిని పరిణయమాడిరి. ఈ దంపతులకు సంతతిలేదు.

## వీరి పాండిత్య ప్రకర్ష.

ఒకప్పుడు పామర్రు గ్రామ నివాసులైన దేవరపల్లి బాపయ్యగారి కుమారుడు శ్రీరాములుగారికి దంగేరు గ్రామ నివాసులగు రావిపాటి శరభయ్యగారి కుమార్తె శ్రీమతి సుబ్బలక్ష్మిని ఇచ్చి వివాహము చేయ నిశ్చయించిరి. ఆ ముహూర్తము వెంటకరామశాస్త్రిగారే నిశ్చయించిరి. వీరి పాండిత్య ప్రకర్ష సహించలేని కొందఱు దంగేరు పండితులు ఈ ముహూర్తము సరిగాలేదని ఒక వాదము లేవదీసిరి.

అందుచే దేవరపల్లి చినవీరన్నగారు దంగేరులో నొక పండిత సభ నేర్పాటు చేసిరి. బ్రహ్మశ్రీ బులుసు పాపయ్యశాస్త్రిగారును, శ్రీ నేమాని సీతారామయ్య సిద్ధాంతిగారును సభలనలంకరించిరి. ఇతర పండితులు గూడ పెక్కురు విచ్చేసిరి. వాదోపవాదములైన తర్వాత శ్రీ వెంకట రామశాస్త్రిగారి ముహూర్తమే నిష్కళంకమని స్థిరీకరింపబడెను. అంతమంది పండితులలో విజయము గాంచుటచే వెంకటరామశాస్త్రిగారి కీర్తికాంత

దశదిశల నాట్యమాడజొచ్చెను.

అప్పుడు దేవరపల్లి చినవీరన్నగారు వెంకటరామశాస్త్రిగారిని ఒక మేనాలో కూర్చుండబెట్టి పెండ్లి కుమారుని పాలకీతో బాటు ఊరేగించుచు పామర్రునుండి దంగేరు గ్రామమునకా పండిత ప్రవరుని మహావైభవముగా తీసికొని వెళ్ళిరి. వివాహమైన పిమ్మట మరునాడు ప్రత్యేకముగా పండిత సభ నేర్పాటు చేసిరి. ఆ సభామధ్యమున నూతన వస్త్రములతోను, పండిత చిహ్నమైన యంగులీయకముతోను, చందన తాంబూలాది సత్కారముల తోను ప్రప్రధమమున వెంకట రామశాస్త్రిగారు సత్కరింపబడిరి. వీరి వలన బ్రహ్మన్నగారి వంశ ప్రఖ్యాతులు బహుముఖములుగా వ్యాపింపజొచ్చెను.

## శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జనన ఘట్టము.

శ్లో॥ నిత్యశుద్ధం నిరాభాసం । నిరాకారం నిరంజనం ।
నిత్యబోధం చిదానందం । గురుం బ్రహ్మ నమామ్యహం ॥

శ్లో॥ వందామహే మహేశాన । చండకోదండ ఖండనం
జానకీ హృదయానంద । చందనం రఘునందనం ॥

పరమేశ్వరుడు సృష్టి స్థితి సంహారముల నొనర్చి కాల చక్రము త్రిప్పుటకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను మూడు మూర్తులయ్యెను. త్రిమూర్తులయందును భేదబుద్ధి కూడదు.

ఆ॥ వె॥ మూడు మూర్తులకును – మూడు లోకములకు ।
మూడు కాలములకు – మూలమగుచు ।
భేదమగుచుఁదు దిన – భేదమై యొప్పారు ।
బ్రహ్మ మనగ నీవ – ఫాలనయన ॥

(భాగ 8 స్కంధ 228 ప.)

కII నీ యంద సంభవించుచు
నీయంద వసించి యుండు నిఖిల జగంబులన
నీ యంద విలయ మొందును
నీ యుదరము సర్వభూత – నిలయము రుద్రా ॥

(భాగ 8 స్కం. 224 ప.)

ఇట్టి ప్రమాణములచే నొక్క పరమాత్మయే రూప భేదముల నొందినట్లు స్పష్టమగుచున్నది. అట్టి పరమేశ్వరుడు భూమియందు మానవునివలె జన్మించి అప్పటికి కావలసిన రీతిగా సంచరించి ధర్మ సంస్థాపనము చేయుచుండును. శంకరుడు భూమియందవతరించి శ్రౌతస్మార్తాది కర్మలకు భంగము కలుగని రీతిగా శిష్యులకు బ్రహ్మబోధచేయుటకై కలియుగమున అవతరించుచుండునని కూర్మపురాణము 27వ అధ్యాయమునను 50 వ అధ్యాయమునను స్పష్టముగా దెల్పబడినది.

శ్లో ॥ కరిష్యత్యవతారాణి । శంకరోనీల లోహిత ః
శ్రౌతస్మార్త ప్రతిష్ఠార్థం । భక్తానాం హితకామ్యయా ॥

శ్లో ॥ ఉపదేక్ష్యతి తచ్చాయం । శిష్యాణాం బ్రహ్మసంజ్ఞితం
సర్వవేదాంతసారంహి । సర్వస్మాచ్చుతు దర్శనాత్ ॥

(కూర్మ పురాణము 27 అధ్యా 32, 33 శ్లో॥)

శ్లో॥ వైవస్వతేంతరే శంభో । రవతారాస్త్రిశూలినః
అష్టావింశతి రాఖ్యాతా । హ్యంతే కలియుగే ప్రభోః॥

(కూర్మ పురాణము 50 అ. 10 శ్లో॥)

(శ్రౌతస్మార్తాది కర్మలు నశించుచున్నప్పుడు శంకరుడు వైవస్వత మన్వంతరమందలి కలియుగమున ఇరువది యెనిమిది సార్లు

భూమియందు అవతరించి సర్వ వేదాంత సారమైన బ్రహ్మబోధచేయుచు భక్తులను తరింపజేయుచుండును) వైవస్వత మన్వంతర మందలి కలియుగమున శంకరుడు ఇరువది యెనిమిది సార్లు అవతరించును.

శంకరుడు జన్మించుటకు గూడ భూలోకమున తగినన్ని కారణములు సంభవించవలెను. భగవంతుడు అవతరించుటకు తగిన ప్రదేశము కావలెను. తగిన పవిత్రవంశము కావలెను. శంకరుడు కుమారుడు కాదగిన పుణ్యదంపతులుండవలెను. ఇన్ని లక్షణములు సమకూరినగాని శంకుడు భూమియందవతరించడు. అట్టి శుభసమయమునకై పరమేశ్వరుడు నిరీక్షించు చుండును.

క॥ ఎప్పుడు ధర్మక్షయమగు
నెప్పుడు పాపంబు లొడము – నీ లోకములో
నప్పుడు విశ్వేశుఁడు హరి
తప్పక విభుఁడయ్యెఁదన్నుఁ –దాసబుజియించున్॥

భాగ. 9 స్కం. 726 ప.

నిర్గుణ పరబ్రహ్మము అవసరము వచ్చినపుడు తన ప్రకృతితో గూడి యొక రూపము కల్పించుకొనును.

ప్రస్తుతము కలి ప్రభావముచే వర్ణాశ్రమ ధర్మములడుగంటినవి. అధర్మము, అనాచారము, అసత్యము ప్రబలచుండెను. పాపభీతి యంతరించుచుండెను. బ్రాహ్మణులు తమ తమ విధులను మరచుచుండిరి. వేదశాస్త్ర పురాణములయందు జనులకు నమ్మకము తగ్గుచుండెను. స్నానము, దానము, జపము భగవత్సేవ మొదలగు ధర్మములన్నియు నంతరించుచుండెను. మతకలహములు చెలరేగుచుండెను. కులాచారములయందు విశ్వాసమంతరించుచుండెను. నాస్తికత ప్రబలు

చుండెను. వివిధమత వేషధారులనుజూచి లోకము త్రొక్కులాడుచుండెను. విదేశీయ ధర్మముల నవలంభించుటయే పరమధర్మముగా నెంచబడు చుండెను. సత్యజీవనమునకు లోకమున తావులేకుండెను. ఇట్టి లోకోపద్రవములనణచి ప్రాచీన హైందవ మహర్షి సంప్రదాయ సిద్ధమైన భక్తి ప్రబోధము చేయవలసిన సమయమాసన్నమాయెను. శంకరుడు భూమియందవతరించవలసిన శుభ సమయమేతెంచెను. శ్రీ పాపయ విశ్వనాధావధూతస్వామి లోక సంరక్షనార్థమై చేసిన యఖండ తపస్సుగూడ మూర్తీభవించి బ్రహ్మబోధ చేయవలసిన యత్యవసర మేర్పడెను.

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకాలో చేరిన పామర్రు గ్రామము మహర్షుల కాలమునుండియు ప్రసిద్ధికెక్కిన పవిత్ర పుణ్య ప్రదేశము. ఆ గ్రామమునకు ఉత్తరదిశయందు నాల్గుఫర్లాంగుల దూరములో కణ్వనది గలదు. పామర్రు గ్రామమునకు నాల్గుమైళ్ళ దూరములో కణ్వమహాక్షేత్రము గలదు. పూర్వము కణ్వముణి ఆశ్రమమేర్పరచుకొని మునిసంఘములతో గూడ తపోయజ్ఞములు చేయుటకొకపురము నిర్మించుకొనెననియు, ఆ పురమే ఖండిక యని వ్యవహరింప బడుచుండె ననియు స్థలపురాణజ్ఞులు కొందరు దెల్పుచున్నారు. ఆ గ్రామమున కణ్వముణిచే ప్రతిష్ఠింపబడిన శివాలయము గలదు. కణ్వమహర్షిచే ప్రతిష్ఠింపబడిన కారణముచే ఆ దేవుడు కణ్వేశ్వరుడను ప్రసిద్ధినొందెను. ఆ గ్రామమునకొక మైలుదూరములో గౌతమీనది కలదు.

ఆ మహానదినుండి కణ్వముణి ఒక పాయను తన యాశ్రమమునకు తీసికొనివచ్చి స్నానపానాదులకుపయగించెడివాడు. ఆ యాశ్రమమందు జేరిన మునులందరును ఆ నదిలోనే స్నానాది కృత్యములొనరించి తపస్సు చేసుకొనెడివారు. ఆకణ్వక్షేత్రము (ఖండిక) నందు కొన్ని దేవతా విగ్రహములు ఇప్పటికి గూడ కాన్పించుచున్నవి. దేవతలు రాత్రిభాగమందా ప్రదేశము

చేసి నృత్య గీత వాద్య విశేషములతో వినోదముగా కాలము గడిపి వెళ్ళుచుందునని ప్రతీతి. ఆ నిదర్శనములు ఇప్పటికిని భక్తులకు గోచరించుచుండునట. ఆ కణ్వనది పామర్రుగ్రామమునకు ఉత్తరముగా నాల్గు ఫర్లాంగుల దూరములో పశ్చిమదిశ నుండి తూర్పుగా గంగవరము దంగేరు మొదలగు గ్రామముల ప్రక్కనుండి ప్రవహించి కోరంగియను గ్రామమునొద్ద సముద్ర గర్భముజొచ్చెను. కణ్వనది యిప్పటికిని జీవనదిగానే ప్రవహించుచున్నది. త్రేతాయుగమున శ్రీరామచంద్రుడు లేడి రూపముతో వచ్చిన మారీచుని వరంగల్లు జిల్లా జీడిగల్లు అనుచోట బాణముతో కొట్టెను. పరుగెత్తి ఆ లేడి చొల్లంగి అనుచోట చొల్లు కార్చి కోరంగి దగ్గరపడి శివలింగమయ్యెను. కణ్వనది పరమ పవిత్రమైనదని భీమేశ్వరపురాణము చెప్పుచున్నది.

శ్లో ॥ గౌతమీసింధు కొంతేయ ।
కణ్వన ద్యోజగన్నుతాః ।
(భీమేశ్వర పురాణము 8 అ 25 పుట)

ముని కణ్వనదీ ప్రాంతముననే తపస్సు చేసికొనెననియు, ఆ ముని దత్తాత్రేయుడను మునిగూడ కణ్వనదీ ప్రాంతముననే యొక యాశ్రమము నిర్మించుకొనెననియు, ఆయాశ్రమమే దత్తాత్రేయ పురమనియు, కాలక్రమమున అదియే పాణంగిపల్లెగా వ్యవహరింపబడుచుండినట్లును శ్రీ వడ్లమాని పేరయ్యశాస్త్రిగారును, వారి పుత్రులైన కామేశ్వర సిద్ధాంతిగారును వారివారి పంచాంగపు పీఠికలలో స్పష్టముగా దెల్పియున్నారు. దత్తాత్రేయపురము (ప్రాణంగిపల్లె) పామర్రు గ్రామమునకు తూర్పు దిశయందు సుమారొక మైలు దూరమందున్నది. పై కారణములనుబట్టి పామర్రు ఋషుల కాలమునుండియు పరమ పవిత్ర క్షేత్రమై యుండెననుటకు సందేహము లేదు. కావున శంకరుడు

అవతరించుటకు పామర్రు గ్రామము సర్వవిధముల తగియుండెను.

కొంతకాలమునకు బ్రహ్మన్నశర్మగారి భార్య శేషాంబ గర&భవతి యయ్యెను. నవమాసములు నిండిన వెనుక "స్వస్తిశ్రీ చాంద్రమాన రౌద్రినామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ (చవితి) 26 మే 1860 తేదీ గురువారము రోజున సూర్యాస్తమయాది ఘడియలు ..... (గం3-45లు). అప్పుడు పుష్యమీ నక్షత్ర యుక్త మేషలగ్న మందు శేషాంబ గర&భమున ద్వితీయ పుత్రరత్నము జన్మించెను. జననకాలమున శుభలక్షణము లెన్నియో గోచరించెను. పదునొకండవ రోజున బ్రహ్మన్నశర్మగారా బాలునికి నామకరణ మహోత్సవము జరిపిరి. బ్రహ్మవేత్త యగునని తలచి దైవజ్ఞులా బాలునికి "వెంకట సుబ్రహ్మణ్యశర్మ" అని నామకరణముచేసిరి. బ్రహ్మణ్యుడనగా బ్రహ్మవేత్త. సు+బ్రహ్మణ్యుడనగా బ్రహ్మవేత్తలలో శిఖామణి. తిరుపతి వెంకటేశ్వరస్వామి వీరి కుటుంబమునకు ఇలువేల్పు అగుటచే వెంటక అను పదము చేర్చి వెంకట సుబ్రహ్మణ్య శర్మ అని నామకరణము గావించిరి. వేంకట అనగా పాపములు పోగొట్టువాడు. వేంకట సుబ్రహ్మణ్య శర్మ అనగా పాపములను పోగొట్టి బ్రహ్మజ్ఞాన బోధ చేయు మహాత్ముడని యర్థము.

ఈ సందర్భముననే వీరు శంకారంశ సంభూతులను విషయము చెప్పవలసియున్నది. 1926 సం॥ములో చిట్టూరి వెంకట మహీపతి భువనైక రావుగారు కూళ్ల గ్రామములో గురుధ్యాన నిష్ఠలో నుండగా నీలమేఘచ్ఛాయగల దేహముతోను, నవరత్న స్థగితమైన సువర్ణ కిరీటముతోను, భుజకీర్తులతో, సుశంఖ చక్రగదా ఖడ్గ శార&జములతోను, వనమాలతోను తళతళలాడు జరీకండువాతోను శ్రీ మహావిష్ణువు సాక్షాత్కరించి "నాయనా! నీ భక్తికి మెచ్చితిని శ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య గురుపుంగవులు శంకరావతారులు. నాకును వారికిని

భేదమెంతమాత్రమును లేదు. నీవు కృతార్థుడవగుము" అని చెప్పి యదృశ్యుడయ్యెను.

మఱియు స్వభాను సం॥ర పుష్యశుద్ధ ....మీ(10-1-1944 తేదీ) సోమవారంనాడు నేను మహేంద్రవాడలో గురుసన్నిధానమున నుండు భాగ్యము లభించెను. ఆ రోజున మధ్యాహ్నము గం 12-00 లకు నివేదనమైన పిమ్మట శ్రీరామమందిరమునుండి యీవలికి వచ్చి "నాయనా! బ్రహ్మబోధ నిమిత్తము నేను భూలోకమునకు రావలసివచ్చినది సుమా" అని గురుపుంగవులు నాతో బల్కిరి.

నేను మహర్షులవారి జన్మ ప్రకరణము వ్రాయు సందర్భమున పార్థివ సం॥ర ఆషాఢ బహుళ.....శీ సోమవారము (6-8-1945 తేదీ) రోజున సాయంకాలము గురుధ్యాన నిష్ఠా పరవశుడనై యున్న తఱి బహు విచిత్ర విషయము గోచరమయ్యెను.

నక్షత్ర మండల ప్రాంతమున నొక విచిత్రమగు విమానము గోచరించెను. ఆ విమానము పై కప్పు సునీల వర్ణముగల పలుచని పట్టు వస్త్రముతో గప్పబడి నిగనిలలాడుచు పెద్ద గొడగు వలె నుండెను. ఆ కప్పు చుట్టును నక్షత్రములు మాలలుగా కట్టబడి యుండెను. విమానము లోపలిభాగమున సూర్యచంద్రులు పెద్ద గ్యాసులైట్లవలె దేదీప్యమానముగా ప్రకాశించుచుండిరి. సూర్యచంద్రుల ప్రక్కల రెండు సింహాసనములు అమర్చబడి ఉయ్యాలలవలె నూగుచుండెను. ఒక సింహాసనమున నొక పురుషవ్యక్తియు, నొక సింహాసనమున అయిదారు నెలల వయస్సుగల శిశువును చంకబెట్టుకొని యుండిన దేవతా కాంతయు గూర్చుండి యుండిరి. ఆ విమానము నడిపించు వ్యక్తి లేకయే నక్షత్రమండలమున సంచరించుచు భూమిపైకి దిగి వచ్చెను.

వెంటనే ఆ విమానము మాయమయ్యెను. తక్షణమే గురుదేవులు

పద్మాసనముపై గూర్చుండి సాక్షాత్కరించిరి. పిమ్మట నా గురుదేవులు మాయమై పార్వతీ పరమేశ్వరులు సాక్షాత్కరించిరి. ఆ యాది దంపతులు మిగుల యెత్తైన సింహాసనములపై నుత్తరాభిముఖముగా గూర్చుండి యుండిరి.

శంకరుడు ధవళవర్ణము గల్గి నల్లని జడలు ధరించి యుండెను. మఱియు నల్లని వర్ణముగల పెద్ద మీసములును గడ్డమును గలవు. శంకరుని యెడను పార్శ్వమున నీలదేహము గల పార్వతి సర్వాలంకార శోభితయై ప్రకాశించు చుండెను. పార్వతీ పరమేశ్వరులు సుమారు యిరువది యడుగుల పొడవు గల దేహ ధారులుగా నుండిరి. ఆ దంపతుల యెదుట కొందఱు దూతలు ఉండిరి. వారిలో కొందఱు మారేడు దళముల మాలలు ముఖమునకు తప్ప శరీరమంతకును చుట్టుకొనియుండిరి. కొందఱు ఎలుగుబంటి శరీరమువంటి నల్లని రోమములతో నిండిన శరీరములు గలవారుగా నుండిరి. ఆ దూతలు సుమారు ఇరువది యడుగుల పొడవుగా నుండిరి. శివుగా దూతలతో "ప్రజలను జాగ్రత్తగా కాపాడుడు" అని యాజ్ఞాపించెను. శంకరుని యాజ్ఞానుసారముగా ఆ దూతలు బయలుదేరిరి. పార్వతీపరమేశ్వరులను దర్శించుభక్తులు అనేకులు తన్మయులై యుండిరి. పిమ్మట నా వైభవమంతయును ఒక్కసారిగా అదృశ్యమయ్యెను.

మహర్షులవారు పామర్రులో నివసించు కాలమున ఒకనాడు తపోనిష్ఠా గరిష్ఠులై యుండగా నొక భయంకరమైన నల్లత్రాచు వారి శరీరముపైకెక్కి నాట్యమాడుచు మెల్లగా ప్రాకుచు క్రిందికి దిగెను. అప్పుడు మహర్షులవారు కొంచెమైనను చలించక శ్రీరామ సందర్శనానంద వారధిలో మునిగియుండిరి. శంకరుడు సర్పభూషణ ప్రియుడను విషయము దీనివలన స్పష్టమగుచున్నది.

మఱియు మహర్షులవారు దేవీ నవరాత్రములు చేయు

పుణ్యకాలమున భృంగీశ్వరుడు భక్తులకావేశించి నాట్యమాడుచుండుట సుప్రసిద్ధ విషయమే.

మఱియు 26-2-1949 తేదీ రోజున శ్రీ కందర్ప సూర్యనారాయణగారు మండపేట నుండి మహేంద్రవాడ వచ్చిరి. అప్పుడు గురువర్యులు "అబ్బాయీ! ఈ రోజునకు సరిగా 24 వ రోజునకు నీవు ఇక్కడికి తప్పక రావలసినది అని అజ్ఞాపించిరి.

అట్లే శ్రీ సూర్యనారాయణగారు 22 - 3- 1949 తేదీ సర్వధారి నామ సం॥ ఫాల్గుణ బహుళ అష్టమీ మంగళవారము రోజునకు మహేంద్రవాడ వచ్చి ఈ యుదయముననే లేచి అచటికి సమీపమునగల తుల్యభాగనదికి స్నానమునకు వెళ్లి నదిలో స్నానము చేసి జపము చేసికొనుచుండగా శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పుంగవులు ఒకగున్న మామిడి క్రింద దక్షిణముఖముగా వీరాసనమున నాసీనులై కరుగబోసిన బంగారు దేహముతోను. కోటి బాల సూర్యుల తేజముతోను, చిఱునగవు మొగమున తాండవమాడుచుండగా చిన్ముద్రాలంకార హస్తాబ్జముతో సాక్షాత్కరించి "అబ్బాయీ! నేను శాశ్వతుడను. నాకు జనన మరణములు లేవురా" అని పల్కి అదృశ్యులైరి.

పై కారణములన్నియు మహర్షులవారి యవతార లక్షణములను ఋజువు చేయుచున్నవి. ఇక ప్రకృతికథ ననుసరింతును.

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జాతక ప్రకరణము

సృష్ట్యాది సౌరగతాబ్దాః 195 58 850 61

వర్తమాన కలియుగే గతసౌరాబ్దాః 5061

శాలివాహనశకే గత సౌరాబ్దాః 1782

హూణశక గతాబ్దాః 1860

శ్రీ చాంద్రమాన రౌద్రినామ సం॥ రే ఉత్తరాయణస్త్ర గ్రీష్మఋతౌ జ్యేష్టమాసే శుక్లపక్షే చతుర్థ్యాం గురువాసర ప్రయుక్త ఘటికాః 57–47 పునర్వసు 52–51 గండనామ యోగం 44–7 గరజికరణం 9–52 ది 22–5 దిన ప్రమాణం 32–3 సంక్రమణభుక్తి 1–50.

పుష్యమీ నక్షత్ర ఋక్ష్యాద్యంత ఘటికాః 57–4

పాదప్రమాణ ఘటికాః విఘటికాః 14–16

జనన సమయే ప్రధమపాద భుక్తి ఘటికాః 3–10

సూర్యాస్తమయాది జననకాల ఘటికాః 23–29

అథమేషలగ్నే కుజక్షేత్రే రవిహెూరాయాం రవిద్రేక్కాణే సింహ రవి నవాంశే గురుత్రింశాంశే ఏకాంశాధి శుభ షడ్వర్గ వేళాయాం శ్రీశ్రీశ్రీ రెడ్డి వెంకట సుబ్రహ్మణ్య మహర్షీణాం జననమభవత్

జనన కాలము ఇంగ్లీషు తేదీ 26–5–1860

...........

జననకాల శని మహా దశాశేషం 17–11–24

1. ఈ జాతకమునకు జన్మలగ్నము నుండి భాగ్య రాజ్యలగ్న చతురా&ధధిపతులు చతుర్ధ రాజ్య కేంద్రములలోనున్నారు.

2. చంద్రలగ్నమునకు భాగ్య రాజ్యలగ్న సప్తమాధిపతులు లగ్న సప్తమ కేంద్రములలో నున్నారు.

3. భాగ్య రాజ్యాధిపతులైన గురుశనులు బలవంతులై కలసి యున్నారు.

4. రాజ్యస్థానము నుండి భాగ్య రాజ్యాధిపతులగు బుధశుక్రులకు పరివర్తన కల్గినది.

5. కాకరరాశికిని, కారకాంశరాశికిని, భాగ్యరాజ్యాధిపతులు గురుకుజులు ఉచ్ఛయందు బలవంతులైయున్నారు.

మఱియు గ్రహములకు బలములు కట్టగా –

| | | | |
|---|---|---|---|
| సూర్యునకు | – | మార్కులు | 66 |
| చంద్రునకు | – | ,, | 84 |
| కుజునకు | – | ,, | 46 |
| గురునకు | – | ,, | 140 |
| శనికి | – | ,, | 11 |
| బుధునకు | – | ,, | 39 |
| శుక్రునకు | – | ,, | 49 |
| | | మొత్తము | 435 |

పై కారణములను బట్టి యీ జాతకము అవతార మూర్తుల జాతకమును పోలియున్నది. శ్రీ రామచంద్రమూర్తి జాతకమునకు మార్కులు 595.

శ్రీరామావతారమునకు గూడ జన్మలగ్న, చంద్రలగ్న ఆరూఢ లగ్నములు కేంద్రములలో చరరాసులయందు అయిదు గ్రహములు ఉండుటచేతను, శ్రీశ్రీశ్రీ రెడ్డి సుబ్రహ్మణ్య మహర్షులవారి జాతకమున గూడ జన్మలగ్న, చంద్రలగ్న, ఆ రూఢలగ్నములు, చరరాసులై కేంద్రస్థానములో రాహుకేతువులతో ఆరు గ్రహములుండుటవలనను, స్థూల సూక్ష్మ కారణ శరీరముల లగ్నములకు కేంద్రకోణాధిపతులు కలసి కేంద్రములో బలవంతులై యుండుటవలనను, సృష్టి స్థితి లయ కారణభూతములను పూర్ణముగా గ్రహించినవారై కర్మశరీర జీవులకు తమ స్పర్శచేతను, దర్శనము చేతను, వీక్షణముల చేతను విముక్తి కల్గించు మహత్తరశక్తి సంపన్నులై యుందురు. కావుననే ఆత్మవేత్తలకు సార్వభౌములై కీర్తిగాంచెదరు. ఆ వాఙ్మానసమగు పరబ్రహ్మతత్వమును తెలిసికొనుట యెంత కష్ట సాధ్యమో ఈ యవధూత స్వామివారి తత్వమును దెలిసికొనుట అంత కష్టము.

శ్లో॥ తురంగ సారంగ రధాధి సంకులం ।
మృదంగ భేరీ రవముక్త యానం ।
భవాదిష్టై ః పరికల్పనీయం ।
దిగంత విశ్రాంతము పైతిబాలః ।

(గౌతమసంహిత – 14వ పేజీ)

ఒకే గ్రహమునకు ఆరుపదములకును అధికారము పట్టినను, ఆరుపదముల యధిపతులు కలిసియున్నను, గజతురగ ఛత్రచామరాదులు గల మహారాజగును. ఈ జాతకములో ఆరుపదముల యధిపతులును కలిసియున్నారు.

శ్లో ॥ కర్మస్థానేతు చత్వారో । గ్రహాస్తిష్ఠంతి చేత్తదా ।
పశ్యంతి యదివా జాతః । ప్రవ్రజ్యాయోగమాదిశేత్ ॥

(జాతకామృతసారం)

శ్లో ॥ విలగ్న దశమాధీశౌ । గ్రహత్రయ సమన్వితౌ ।
యత్ర కుత్రస్థితో మర్త్యః । సన్యాసం లభతేనరః॥

(జాతకామృతసారం)

దశమమున నాల్గు గ్రహములున్నను చూచినను జాతకుడు సన్యాసియగును. ఈ జాతకమున పదవరాశిలో రెండు గ్రహములుండి నాల్గు గ్రహములచే చూడబడుచున్నారు.

లగ్న దశమాధిపతులు మూడు గ్రహములతో కలిసి యెచటనున్నను జాతకుడు సన్యాసియగును. ఇందు దశమాధిపతి మూడు గ్రహములతో కలిసియున్నాడు.

శ్లో ॥ లగ్న భాగ్య పరాజ్యేశాః కేంద్రస్థాయది కోణగాః।
తద్దశాంతర్దశా కాలే । ముద్రికా యోగమాప్నుయాత్ ॥

(జాతకామృతసారం)

తా ॥ లగ్న భాగ్య రాజ్యాధిపతులు కేంద్రములయందు గాని కోణములయందుగాని యుండిరేని జాతకుడు ముద్రికా యోగమును పొంది సింహాసనారూఢుడై కార్యాకార్యములకు సమర్ధతతో నిర్వహించును.

ఈ జాతకునకు లగ్న భాగ్య రాజ్యాధిపతులగు కుజ గురు శనులు ముగ్గురును చతుర్థ రాజ్య కేంద్రములలో బలవంతులయి యున్నారు.

ఈ జాతకములో పెక్కు రాజయోగములు పట్టియున్నవి. మఱియు జన్మలగ్నమునకు ఆ రూఢలగ్నము కేంద్రస్థానమై యుండి ఆయారూఢ లగ్నమునకు కోశపథ, వాహనపద. మంత్రపద, దారపద, భాగ్యపద, రాజ్యపదములు కేంద్రకోణములలో నుండి పరస్పర వీక్షణము కలవి యగుటచేతను, సింహాసన స్థానమందు ఉచ్ఛస్థుడైన భాగ్యాధిపతియగు

గురునితో ఛత్ర కారకుడైన స్వక్షేత్రవర్తియగు చంద్రునితో కలిసి తపశీ&శల కాకకుడగు లగ్నాధిపతియైన యుచ్చకుజేనిచే చూడబడుచు దిగంబర సన్యాసి కారకుడును కర్మస్థానాధిపతియునగు శనితో కలిసియుండుటవలన సింహాసనమెక్కి ధర్మ పాలనము చేయుటకు మారుగా పండితులపై సార్వభౌమునివలె ప్రకాశించుచు లోకవాసనలను, ఘోరశత్రువులగు కామక్రోధాదులను జయించి సర్వాంతర్యామియైయున్న పరబ్రహ్మ తత్త్వమును తెలిసికొనుటకు అనేక కష్టములు కల్గినను లెక్కచేయక గుర్వాజ్ఞానుసారముగా సాక్షిభూతుడై సృష్టి చిత్రములను జూచి, ఆనందించు మహరి&షయై భూలోకమున శాశ్వత కీర్తిగాంచును.

## మహర్షి బాల్యదశ.

భగవంతుడు మానవరూపముతో భూమియందు సంచరించినపుడు సామాన్య మానవునివలె నాటకమాడక తప్పదు. అయిదవయేట అక్షరాభ్యాసము జరిగినది మొదలు తోడి బాలురతో గూడి బడికిపోవుచు గురువులు చెప్పిన పాఠములు శ్రద్ధగా చదువుచుండెడివారు. బడిలో చదువుచున్నప్పుడు భక్తి రసముగల పద్యములుగాని, పాఠములుగాని వచ్చినప్పుడు వీరు ఆనందభాష్ప పులకాంకితులగుచుండిరి. తలిదండ్రుల యందు వినయవిధేయతలు చూపుచు భయభక్తులతో మెలగుచుండిరి. భూతదయ, పాపభీతి, సత్య ప్రవర్తనము, భగవద్భక్తి, పెద్దల యెడ విధేయత అను లక్షణములు వీరికి ఉగ్గుపాలతో వచ్చిన సద్గుణములు. ప్రతిదినమును తండ్రిగారు శ్రీరామచంద్రునికి పూజచేయు సమయము కనిపెట్టి ఆ పూజావిధానమంతయును చూచి పరవశులగుచుండిరి. అందుచే తమ తండ్రిగారు చేయు పూజకు కావలసిన పుష్పములు, పత్రములు, పరమభక్తితో తెచ్చి యిచ్చుచుండుట ప్రారంభమయ్యెను. అందటి బాలురతోను ఆటలాడుటకు వెళ్ళక శ్రీరామాది విగ్రహములు చేసి

రామాయణమంతయు నాటకమురీతిగ నాటలాడించెడివారు. ఎనిమిదేండ్ల వయస్సు వచ్చుసరికి శ్రీరామభక్తి బలమై బాహ్య ప్రపంచమందు విరక్తి మెండయ్యెను. భక్తితో బాటు ఏకాంత వాసముగూడ మిక్కుటమయ్యెను.

ఇంటిలోని వారికి దెలిసినచో తమ భక్తికి భంగము కల్గునని యెంచి ఎవరికిని తెలియకుండగ బియ్యము పట్టుకొని బజారునకు వెళ్ళి పటికిబెల్లము, హారతి కర్పూరము, సాంబ్రాణియును తెచ్చి రామపటమో కృష్ణపటమో తీసికొనివచ్చి యా పటమును వివిధములగు పుష్పములతో పూజించి ఆ పటికి బెల్లపు ముక్కను దేవునికి నైవేద్యముపెట్టి ఆ ప్రసాదముతోడి బాటురకు పంచిపెట్టుచుండిరి. వీరు చేయు శ్రీరామ పూజ యెవ్వరికిని తెలియకుండగ రహస్యముగనే సాగుచుండెను.

కొన్ని రోజులకు బ్రహ్మన్నగారు తమ కుమారభక్తి లక్షణముల కాశ్చర్యపడి తమ దేవతార్చనపు పెట్టలోనున్న చిన్న సీతారామ విగ్రహములు తీసి "నాయనా ! నీవీ సీతారామ విగ్రహములను విడువక ప్రతిదినమును పూజించితివేని సకల భయములు పోవును," అని చెప్పి ఆ విగ్రహములను తమ కుమారునికిచ్చిరి. పేదవానికి పెన్నిధి దొరికినట్లు ఆ సీతారామ విగ్రహములను కన్నులకద్దుకొని శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి మిగుల సంతోషపడిరి. తండ్రిగారి యాజ్ఞగూడ లభించుటచే శ్రీరామపూజ చేసుకొనుటకు స్వేచ్ఛ కలిగెగదా యని భక్తి పరవశులై సంచరింపసాగిరి. తండ్రిగారి యాజ్ఞ ప్రకారముగా ప్రతిదినమును శ్రీ సీతారామ విగ్రహములను పూజించు చుండిరి. ఆ పూజ ఎవరికిని తెలియకుండునటుల నొకగోడ గూటిలో సీతారామ విగ్రహములుంచి ఒక బట్ట తెర నడ్డముగా కట్టిరి. తన తల్లి పెట్టిన తినుబంగారములు రామునికి నైవేద్యము చేసి ఆ ప్రసాదము కండ్లకద్దుకొని తినుచుండెడివారు. తమ తండ్రిగారు హారతి కర్పూరము, అగరువత్తులు, సాంబ్రాణి, పటికబెల్లము మొదలగు పూజా

ద్రవ్యములు తెమ్మని యాజ్ఞాపించిన వెంటనే ఈ బాలయోగి బజారునకు వెళ్ళి నాళం సోమయ్య యను వర్తకునివద్ద హారతి కర్పూరము మొదలగు పూజా ద్రవ్యములు పుచ్చుకొని యింటికి వచ్చిన తర్వాత తండ్రిగారికి తెలియకుండగ కొన్ని యగరువత్తులు, కొంత హారతి కర్పూరము, కొంత సాంబ్రాణి, కొంచెము పటిక బెల్లముదాచి తక్కినవి తండ్రిగారికిచ్చుచుండెడి వారు. పామర్రు గ్రామమున పట్టాభిరామస్వామి యాలయముగలదు. ఆ యాలయమందలి విగ్రహములు మిగుల బెద్దవి. ఆ పెద్ద విగ్రహములకు పెద్ద నైవేద్యము కావలెను. నా చిన్న విగ్రహములకు చిన్న బెల్లం ముక్కయే సరిపోవును – అని తమలో తాము ఉప్పొంగుచు తమ స్థితిని ఎవ్వరికిని తెలియకుండగ రహస్యముగానే శ్రీ రాముని పూజలతోను, నేలపై రామ విగ్రమములను రంగు రంగులతో చిత్రించి యానందించుటతోడను, రామవిగ్రహములతో గూడిన యాటలతోడను ప్రొద్దు వెళ్లబుచ్చుచుండిరి. ఎనిమిదవయేట నొకప్పుడు వీరు ఒక గదిలో ప్రవేశించి నేలపై రంగులతో శ్రీరామవిగ్రహమును చిత్రవిచిత్రముగా చిత్రించుటకు ఎనిమిది రోజులు పట్టెను. నిమిత్తమాత్ర కారణజన్ములగు వీరికి అయిదవయేటనుండియే శ్రీరాముడు సహచరుడై విమరింపదొడగెను. తులసికోట చెంతచేరి శ్రీరాముని ధ్యానించినంతనే తులసికోట యందుగల ప్రతిదళమందును ఒక్కొక్క బాల రాముడు దర్శనమీయసాగెను. రాత్రిభాగమందు నక్షత్రముల యందును, చంద్రునియందును, సీతారాముల జంటలు కాన్పింపసాగెను. ఇది యంతయును సహజసిద్ధమైన భావనా బలము.

తండ్రిగారు లోపల పూజించుచున్నప్పుడు వీరుగూడ నెవరికిని తెలియకుండగ పత్రములు, పుష్పములు, ఫలములు తెచ్చి రాముని పూజించి అగరువత్తులు పటికబెల్లపు ముక్కను ఆ విగ్రహముల చెంతనుంచి “రామా! నా పూజలకు సంతోషించి యీ పదార&థములను ఆరగింపు” మని

ప్రార్థించి మరల బట్ట తెర అడ్డము వేయుచుండిరి. కొంత సేపటికి సాంబ్రాణి, అగరు వత్తులు, బెల్లపు ముక్క, పుష్పములును ఏవియును లేకుండగ మాయమగుచుండెను. అదిగాంచి "ఆహా! నా చిన్న రాముడు నేనిచ్చిన పూజా ద్రవ్యములన్నియు స్వీకరించుచున్నాడు" అని యానందభాష్ప పులకాంకితులై బాహ్య ప్రపంచమును మఱచు చుండిరి. "అడుగడ్గునకు మాధవానుచింతవసుధా మాధుర్యమున మేనుమఱచువాని" అను ప్రహ్లాద లక్షణములన్నియు నీ బాలయోగియందు తాండవమాడజొచ్చెను.

భక్తుని హృదయమెంత పవిత్రముగానున్న శ్రీరాముడంత సన్నిహితుడై దర్శనమిచ్చి రక్షించుచుండును.

క॥ దళమైనఁ బుష్పమైనను
ఫలమైనను సలిలమైనఁబాయని భక్తిన్
గొలిచిన జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె యేనుభుజింతున్.

(భాగ 10 స్కం 1010 ప.)

అచ్చపుభక్తితో భక్తుడు సమర్పించు పదార్థములను శ్రీరామచంద్రుడేల స్వీకరించడు. నిద్రవేళతప్ప తక్కిన కాలమంతయును శ్రీరామపాదారవింద సేవతోనే కాలము సరిపోయెడిది. కొన్ని రోజులలైన తర్వాత ఏకాంతమున శ్రీరాముడు బాలుడై యీ బాలయోగితో నాటలాటసాగెను. అందుచే వీరికి నితర స్నేహితుల సంపర్కమే యవసరము లేకుండెను. శ్రీరామునితో బాల్యక్రీడలు జరుపువేళల నెవరైనను పిల్చిన యెడల వారి మాటలేవియు వీరి చెవిని బడకుండెను. చరాచర వస్తుజాలములయందు శ్రీరామ దరఁశనభాగ్యముచే నింద్రపదవి లభించినను లెక్కచేయని స్థితిగా నీ బాలయోగి జీవితరంగము మారిపోయెను.

వీరి బాల్యదశ చూచి తల్లియగు శేషాంబగారు తమ కుమారునికి పిచ్చిపట్టినదని తలచి, భూతవైద్యములు గూడ చేయింప మొదలుపెట్టిరి. బాల్యముననే త్రిగుణాత్మకమైన మాయను గెల్చి శ్రీరామచంద్రునితో వినోదముగా క్రీడించు నీ బాలయోగికి తన తల్లిగారు చేయించు భూత వైద్య ప్రక్రియలు మిగుల వినోదముగా నుండెను.

ఒకనాడు పామర్రుగ్రామమునకు నొక భూతవైద్యుడు వచ్చెను. అతడు ఉదరపోషణార్ధమై బహు మాయోపాయములతోను, డాంబిక వేషముతోను కాలము గడుపుచు వీరియింటికి వచ్చెను. అపుడు శేషాంబగారు అతనిని లోనికిపిల్చి “మా అబ్బాయికి దయ్యము పట్టినది. నివారణచేయుము” అని చెప్పిరి. అంత నా భూత వైద్యుడు ఇంటిలో ప్రవేశించి ఒక గదిలో నేలపై బొగ్గు మసితో మానవాకారముగా బొమ్మవేసి ఆ బొమ్మకు శిరస్సుదగ్గర అల్లపుముక్క నుంచి అల్లపు ముక్కకు గుఱ్ఱపు వెండ్రుకలుకట్టి ఆ వెండ్రుకలపై నల్లని బొగ్గు చూర్ణము వేసి, ఆ వెండ్రుకల కొనలు తన కాలిబొటన వ్రేలికి కట్టుకొని ఆ బొమ్మకు ఎదురుగా పటాటోపము చూపుచు పద్మాసనస్థుడై కూర్చుండి సుబ్రహ్మణ్య బాలయోగిని ఆ బొమ్మ తల దగ్గర కూర్చుండబెట్టెను. కొంతసేపు “హ్రాం హ్రీం హుం ఫట్ స్వాహా” అని మంత్రములు చదివి తాను ఉలికిపడి వెనుకకు తొలగెను. ఆ బొమ్మ నుదుటిపైగల అల్లపుముక్క గంతులు వేయసాగెను. అది చూచి శేషాంబగారు ఇది యంతయును దయ్యము యొక్క గుణములేయని ఆశ్చర్యపడిరి. అంత నా బాలయోగి ఆ కపటమును గుర్తించి ఆ బొమ్మకు నిలువునను మసిబొగ్గు చూర్ణములో కప్పబడియున్న గుఱ్ఱపు వెండ్రుకలను పైకిలాగి చూసి అతని మోసమును వెల్లడిచేసిరి. జీవితాధారము పడిపోవునని దీనుడై ప్రార్థింపగా మన బాలయోగి ఆ కపట యోగిని క్షమించి విడిచిపెట్టిరి.

ఇట్లు శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి నిరంతర శ్రీరామ సేవతో కాలము వెళ్ళబుచ్చుచుండెను.

పదవ సం॥రముననే వీరిని కవితా కన్య వరించెను. క్రీ॥శ॥ 1870 సం॥రము ప్రమోదూత సం॥ర వైశాఖశుద్ధ పూర్ణిమా సోమవారము రోజున తూ.గో.జిల్లా, రామచంద్రపురం తాలూకాలో చేరిన తామపల్లె గ్రామములో వైట్ల నరసయ్యగారు వన ప్రతిష్ఠ చేయ సంకల్పించి కాశీనుండి "మునిప్రబోధిని" అను సంస్కృత గ్రంథమును తెప్పించిరి. అందు వృక్షముల కును పాదు తీగెలకును అంటుకట్టి విచిత్రములగు ఫలములు కాపించుటయును, విజాతీయములగు పుష్పజాతులను రెంటిని జేర్చి యంటుకట్టినచో చిత్రవిచిత్ర పుష్పములు పుష్పింపజేయుటయును, మామిడి పనస కొబ్బరి మొ॥ వృక్షములకు దోహదక్రియలచే అతి శీఘ్రకాలములో ఫలములు గాపించుటయు మొదలగు నద్భుత ప్రక్రియలు అందు తెల్పబడినవి.

గొడ్డువోయిన మామిడిచెట్టు మొదట తొరపణముతో కన్నముచేసి ఒక తులము పాదరసము ఆ కన్నములో పోసి తొరపణము కోతవలస రాలినపొట్టును ఆ కన్నముపై కూరి గాలి తగులకుండ పైన మట్టి పూసినచో ఆ మామిడిచెట్టు నవనవలాడుచు సకాలమందు పల్లవ పుష్ప ఫల సంభరితమై చూపరులకు వింతగొల్పును. మల్లెతీగను తీసికొనివచ్చి తొగరచెట్టు కొమ్మకు అంటు కట్టినయెడల తొగరపువ్వు మల్లెపువ్వు వాసన కలిగి పరిమళించుచుండును. గుమ్మడిపాదు తీగెకును వంగ చెట్టు కొమ్మకును అంటు కట్టినయెడల వంగచెట్టు గుమ్మడి పూవులు పూసి క్రొత్తరకపు వింతకాయలు కాయును. వాయువిళింగముల రసమును గోమయముతో కలిపి మామిడి టెంకను ఆ గోమయములో కొంతకాలముండనిచ్చి ఆ టెంకను భూమిలో పాతినయెడల అయిదు

సం॥రములకే ఆ చెట్టు కాపు ప్రారంభించును. పండ్లు అమృతమువలె నుండును. ఇట్టి యపూర్వ విషయములు ఎన్నియో ఆ ముని ప్రబోధిని యందు చెప్పబడియుండెను. నరసయ్యగారు ఈ యద్భుత విషయములను ప్రత్యక్షముగా చూచి ఆనందించవలెనను కుతూహలముతో మూడు యకరముల తోటను వేయించి పెంచుచుండిరి. అందు పనస, దానిమ్మ, బత్తాయి, నారింజ, అనాస, సపోటా, జామ, కొబ్బరి, మొదలగు వివిధ ఫలవృక్షములు నూతన పద్ధతులతో పెంచబడుచుండెను. నాటిన అయిదు సం॥రములకే తోటకాపు ప్రారంభించెను. వనప్రతిష్ఠ చేసి బ్రాహ్మణ సమారాధనము చేసిన పిమ్మటగాని యా ఫలములు తినగూడదని నిశ్చయించి ఈ చరిత్ర కథానాయకుని తండ్రిగారకు శ్రీ బ్రహ్మణ్య శర్మగారిని రప్పించి క్రీ॥శ॥1870 సం॥రమునకు సరియగు ప్రమోదూత సం॥ర వైశాఖశుద్ధ పూర్ణిమా సోమవారము రోజున శ్రీ వైట్ల నరసయ్యగారు వన ప్రతిష్ఠ ముహూర్తము నిశ్చయించిరి. బులుసు పాపయ్యశాస్త్రిగారును, ఉప్పులూరి భీమన్నశాస్త్రిగారును, భాగవతుల హరిశాస్త్రిగారును ఆ వనప్రతిష్ఠ కాహ్వానింపబడిరి. ఆ మహాసభలో బ్రహ్మన్న శర్మగారు బ్రహ్మాసన మలంకరించిరి. సంకల్పము ప్రారంభమయ్యెను. ఋత్విక్కులకు వరుణ లిచ్చు సందర్భమున అందఱి కంటె ముందుగా "బ్రహ్మాణంత్వా మహంవృణే" అనునొక వరుణను "కృతాకృత ప్రత్యవేక్షణార్థం బ్రహ్మాణం త్వామహంవృణే" అను రెండవ వరుణనుగూడ బ్రహ్మన్నగారే స్వీకరించిరి.

షట్పాత్రప్రయోగ విషయమున "ప్రజాపతిర్వాయురింద్రం నిరురి త్యాగ్నయే సోమోషట్" "ప్రజాపతయే ఇదం నమః" ఇత్యాద్యపూర్వ మంత్రములతో వన ప్రతిష్ఠ అయిదు రోజులు మహావైభవముగా జరిగెను. షడ్రషోపేతముగా అన్ని వర్ణముల వారికిని అయిదురోజులలోను సంతర్పణములు జరిగెను. దీక్ష ముగిసినపిమ్మట బ్రాహ్మణాశీస్సులనంది

సువర్ణకుండలములు ఒక పళ్లెములో నుంచి ఈ కుండలములు సమర్పించుటకు మా విసిష్ఠగారైన బ్రహ్మన్నగారు తగుదురాయని నరసయ్యగారు పండితుల నుద్దేశించి పల్కిరి. పండితులు ఎవరిమట్టుకు వారు దిగ్భ్రమచెంది యూరకుండిరి. అప్పుడు జగత్ప్రసిద్ధ పండితులైన శ్రీ బులుసు పాపయ్యశాస్త్రి గారు లేచి బ్రహ్మన్నశర్మగారి ప్రతిభా విశేషములు నుగ్గడించుచు సభ్యుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టుచుండగా వారి చెవులకు కుండలములు అలంకరించిరి. మన సుబ్రహ్మణ్య బాలయోగి గూడ తండ్రిగారితో ఆ వన ప్రతిష్ఠకు వెళ్ళియుండిరి. శ్రీ వైట్ల నరసయ్యగారి దానాది సత్కారములజూచి సుబ్రహ్మణ్య బాలయోగి పరవశులై శ్రీ నరసయ్యగారి కుమారునుద్దేశించి ఆశువుగా నొక సీసపద్యమును చెప్పిరి.

సీ॥ మీ తండ్రి నరస్య – భూతలంబున మంచి
ఘనకీర్తి కాముఁడై – ఖ్యాతికెక్కె !
ఖ్యాతియేరీతి దా – కారణంబనిననే
బోధింతుఁజెపులపం –డువుగ వినుము ।
కాశీప్రయాగాది – ఘనమైన యాత్రలు
తిరిగి సేవించి సం – దీప్తివడసె ।
మఱిచూతరాజికి – మఱి పూజలొనరించి
కుండలమ్ముల నొసగె –గురువులకును,
గీ॥ వృషభరాజును బూజించి – విడిచి పెట్టె
సత్కవీంద్రుల రావించి – సత్కరించె
అమితమైనట్టి సంతర్ప – ణములు చేసె ।
ఇంతకంటెను పుణ్యమీ – యిలను గలరె ॥

శ్రీరామచంద్ర కరుణాకటాక్ష లబ్ధమైన కవితా వాహిని ఈ బాలయోగి ముఖారవిందమునుండి అనేక విధములుగా వలువడుచుండెను.

....

# దివ్య గురుపాద సంసేవనము

క్రీ॥శ॥ 1872 సం॥రమున పంద్రెండవయేట నీ బాలయోగికి ఉపనయనము జరిగెను. ఇంతవఱకును ఈ బాలయోగికి శ్రీరామునితో సంచరించుచుండుట మాత్రమే జరుగుచుండెను. బాహ్యమునకు ఎవ్వరికిని ఈ విషయము గుర్తింపశక్యముగాకుండెను. బ్రహ్మన్నగారు తమ కుమారుని భక్తి పారవశ్యము జూచి మిగుల ఆశ్చర్యపడి ఒకనాడు తమ పుత్రుని జేరబిల్చిరి. అప్పుడు వారిద్దఱికిని ఈ విధముగా సంభాషణ జరిగెను.

బ్రహ్మన్న :- కుమారా ! నీ భక్తికి మెచ్చితిని ; కాని,

గీ ॥ తల్లిదండ్రిలేని తనయుని పోలిక
సతికిఁబతియులేని చందమునను
గురువులేని విద్యకూడ దెందులకైన
నజునికైన నిజము - నరసిచూడ.

అని పెద్దలు చెప్పుదురు. నీకు ఎవ్వరును గురువులు లేరు. సాంప్రదాయము తెలియనిభక్తి కూడదు.

కుమా :- అయితే నన్ను ఏమి చేయమందురు?

తండ్రి :- ఒక సద్గురువు నాశ్రయించుట ముఖ్యము.

కుమా :- అట్టి మహాత్ములెవరైనా గలరా?

తండ్రి :- లేకేమి? మనకు సమీపముననే పాణంగి పల్లెలో గలరు. వారి పేరు అయ్యల సోమయాజుల పాపయ శాస్త్రిగారువేదాధ్యయన సంపన్నులు. నిరంతర తపో నిష్ఠాగరిష్ఠులు. శమదమాది సద్గుణ

గరిష్ఠులు. శ్రీరామ భక్తులు. వారు నిన్ను ఉద్ధరింపగలరు.

కుమా :- జనకా! నేను వారివద్దకు పోవుటకు సందేహము లేదు.
శ్రీరామునితో మాట్లాడించు శక్తివారికి కలదా?

తండ్రి :- ఆహా! ఏమి పుణ్యవిశేషము! శ్రీరాముడు ఇదివఱలోనే దర్శనమిచ్చుచున్నాడట. ఇపుడు రామునితో మాట్లాడించవలెనట. అని తనలో తాము ఉప్పొంగుచు నాయనా !

"తల్లి దండ్రి గలరు తగ జన్మజన్మాల ।
నరయ బంధుమిత్రులట్ల కలరు ।
తన్ను దెల్పు గరుఁడు - తగ దొరకడు భువి ।
దొరకుటెల్ల ముక్తి దొరకుటధిప"॥

అని ఆర్యులు పల్కుదురు. కావున, నా మాటపై విశ్వాసముంచి వారిని దర్శింపుము.

మన బాలయోగి అందుల కంగీకరించెను. బ్రహ్మన్న శర్మగారు ఒక శుభముహూర్తమున పాణంగిపల్లెనుండి శ్రీ అయ్యల సోమయాజుల పాపయశాస్త్రిగారిని పామర్రు తమ గృహమునకు తీసికొనివచ్చి వారి విషయము అంతయును కుమారునికి నచ్చజెప్పిరి. అంత నీ బాలయోగి, "బాబయ్యగారూ! వీరు నన్ను శ్రీరామునితో మాట్లాడించగలరా" యని మరల ప్రశ్నించిరి. ఆ మాటవిని పాపయశాస్త్రిగారు ఆశ్చర్యపడి "ఈ బాలుడు సామాన్యుడు కాడు. రాముడితనికి ఇదివరలోనే కాన్పించుచుండెనట. రామునితో మాట్లాడుట కితడు గోరుచున్నాడు. ఆహా! ఎన్ని జన్మలనుండి చేసిన పుణ్యమోగదా! ఇంత చిన్న వయస్సులోనే యీ బాలునికి శ్రీరామ సాక్షాత్కారమా?" అనిపాపయ్యశాస్త్రిగారు బ్రహ్మన్నగారితో పల్కిరి. పిమ్మట తండ్రిగారి యాజ్ఞపై ఈ బాలయోగి ఒక శుభదినమున స్నానముచేసి

పాణంగిపల్లి వెళ్ళి పాపయశాస్త్రిగారిని దర్శించిరి. ఆ సమయమున మన బాలయోగికి సద్గురు ప్రధమ సందర్శన మీ రీతిగా కల్గెను.

సీ॥ దేహంబు లెల్ల నీ – స్థితిఁజెందుననిదెల్ప
మైనిండ ధవళ భ – స్మంబు వెలయ ।
సకలంబుగాంచులో – చన మిదేయని చెప్ప
భ్రూమధ్యమున నూర్ధ్వ – పుండ్రమలర
పంచ భూతములింత – పాటివేయని తెల్పఁ
గనుదోయి ముకుళ సం–గతి వహింప ।
బాత్రుల కమృతంపు – వరదయంచు వచింప
దాపునఁ దీర్ఘ – పాత్రంబు మెఱయ
గీ॥ రసనకునురామనామ మం – త్రంబు ఘటించి
హస్తమున నక్షమాలిక – యనువు పఱచి
యున్న పాపయశాస్త్రి స – ర్వోత్తముండు
సద్గురుండొక్క చోట సా–క్షాత్కరించె.

(సద్గురు స్తవరాజము 59 ప.)

ఆ గురుశిష్యుల ప్రధమసందర్శన సమయమెంత పవిత్రమైనదో కదా! శిష్యుని హృదయము పరిపక్వమై యుండుటగాంచి శ్రీపాపయశాస్త్రిగారు 1872 సం॥లో శ్రీరామతారక మంత్రదీక్ష నొసంగిరి. అంతకుముందే భక్తి ప్రవాహములో నోలలాడుచున్న యీ బాలయోగికి శ్రీరామభక్తి ప్రబలమై అనంతమై పరిపరివిధములుగా రామసాక్షాత్కరములు కలుగజొచ్చెను. శ్రీ పాపయశాస్త్రిగారు శిష్యుని జేరబిల్చి హస్తమస్తక సంయోగముగావించి "వత్సా! శ్రీ సీతారాములను దర్శించి భాషించు నుపాయమగు మానశికార్చన దెల్పెద విను" మని ధారణ చేయు విధముపదేశించిరి.

"హృదయాకాశమున వజ్ర వైడూర్య మాణిక్యాదుల తోడను సువర్ణముతోను వేయి స్తంభముల మేడను నిర్మించవలెను. అందు సువర్ణ సింహాసనముపై సీతారాములను కూర్చుండబెట్టవలెను. రాముడు నీలమేఘశ్యామదేహుడై పద్మదళములబోలు నేత్రములు గలవాడై సర్వాలంకార శోభితుడై రత్న స్థగిత కిరీటముగలవాడై యున్నట్లు భావించవలెను. శ్రీరాముని యెడమ ప్రక్క చిఱునవ్వు నవ్వుచు దేదీప్యమానముగా ప్రకాశించు సీత సర్వాంగ సుందరియై యున్నట్లు భావించవలెను. సీతా పరమేశ్వరి కుడిచేతిలో పద్మమున్నట్లు భావించవలెను. సీతారాములకు అర్ఘ్యపాద్యములిచ్చి స్నానము చేయించి శుభ్రవస్త్రములతో తుడిచి రామునికి పీతాంబరము సీతకుపట్టుచీర కట్టవలెను. రామునికి పట్టె వర్ధనములుంచి అత్తరు పన్నీరు అగరు కర్పూరములతో గూడిన మంచిగంధమలది దేదీప్యమానముగా ప్రకాశించు మకరకుండలములు తెచ్చి ముత్యాలహారములును రత్నాలహారములును మెడలో వేయవలెను. బంగారు మొలత్రాడు కంకణములు భుజకీర్తులను భక్తితో అలంకరింప వలెను. సీతాపరమేశ్వరిని గూడ సర్వాలంకార భూషితురాలినిగా జేసి బంగారు పల్లెరములతో పద్మములును మల్లెపువ్వులును మందార పువ్వులును సంపెంగలును, వివిధ పుష్పమాలలును దెచ్చి సీతారాములను సహస్ర నామములతో ఏకాగ్రతతో పూజించవలెను. పిమ్మట దమనము తులసిదళములు మఱికొన్ని చల్లి సాంబ్రాణి అగరు చందన చూర్ణాదులు అర్పించి కర్పూర ఖండములు బంగారు పళ్ళెరములలో వెలిగించి పాయసాన్నాదులును, భక్ష్యభోజ్యాదులును దధిమధుఘృతములును కనకపాత్రలతో చేతికందిచ్చి పుచ్చుకొన్నట్లు చూచి హస్తములను పాదములను భక్తితో కడిగి ఆచమనమైన పిమ్మట వక్కలు జాజి లవంగములు ఏలకులు జాపత్రి మొదలగునవి చేర్చి తాంబూల చర్వణము చేయించి

పసిడి పళ్ళెములతో హారతులందిచ్చి తరువాత వరహాలు కాసులు వజ్రాలు మొహరీలు మంత్రపుష్పముగా పాదము మీదనుంచి, మంత్ర తంత్రక్రియలు మఱచినను కరుణతో రక్షింపుమని ప్రార్థించుచు ప్రదక్షిణము చేసి మనస్సును మంత్రమును సీతారాములను ఏకముగా చేసి జపించుకొనుము. ఇట్లు గావించిన నీకు శ్రీ సీతారాముల సాక్షాత్కారములు నిరంతరము కల్గుచుండును".

గురూపదేశానుసారముగా శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి తారకమంత్రానుష్ఠాన దీక్షాదక్షులై పరమ గోప్యముగా కాలము గడుపుచుండిరి. శ్రీ పాపయ్య శాస్త్రి గురువర్యుల యుపదేశామృతమును గ్రోలి నమస్కరించుచు నిట్లు గురువులను సు&తతించిరి.

శ్లో ॥ పాపయార్య నమస్తుభ్యం । పాపారణ్య దవానల ।

విశ్వనాథ। నమస్తుభ్యం । విశ్వనాథాయతే నమః॥

శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి శ్రీరామ తారకమంత్రము జపించు చున్నపుడు శ్రీరాముడు దగ్గరచేరి స్నేహితునివలె తాను జపించుచుండెను. భుజించుచున్నప్పుడు శ్రీరాముడు చెంతచేరి భుజించుచుండెను. జలములు గ్రోలినచో రాముడు గూడ జలములు త్రాగుచుండెను. భక్తుడు నిద్రించిన పుడు రాముడు ప్రక్కను చేరి నిద్రించుచుండెను. భక్తుడు మేల్కొనినతోడనే శ్రీరాముడు మేల్కాంచును. అర్జునుడు శ్రీకృష్ణపరమాత్మతో మైత్రి సలిపినట్లు సుబ్రహ్మణ్య బాలయోగి శ్రీరామచంద్రునితో స్నేహితుడై విహరింపదొడగెను. ఈ లక్షణములన్నియు నేకాంత వాసముననే జరుగుచుండుటచే బాహ్యమునకు కొంచెమైనను గుర్తింప నలవి గాకుండెను.

మఱియు స్నేహితులెవరైన బిల్చినచో వారి చెంతకు జేరక శ్రీరామునితోడనే భక్తుడు ఆటలాడుచుండెను. స్నేహితులెవరైనను

పలుకరించినచో వారికి ప్రత్యుత్తరము చెప్పక రామునితో నే సంభాషణము జరుపుచుండెను. తల్లి భోజనమునకు పిల్చినపుడు ఆకలి మాటయే యెఱుగక శ్రీరామ నామామృతము తోడనే ఆకలి తీర్చుకొనెడివారు. రాత్రివేళలందు ఆకాశమున నక్షత్రములయందును చంద్రునియందును సీతారాముల జంటలే సాక్షాత్కరించుచుండెను. పగటివేళ సూర్యుని యందును చరాచర ప్రపంచమందలి ప్రతి వస్తువునందును సీతారాములే కాన్పింపసాగిరి. ఇది యంతయును గురుకటాక్ష లబ్ధమైన భావనాశక్తి. విజన ప్రదేశములలో విహరించునపుడు శ్రీరాముడు ధనుర్ధరుడై శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి పాదములు త్రొక్కుచు వెంబడించుచుండెను. ఇట్టి శ్రీరామ సందర్శనము  వలన ఆకలి దప్పికలు, రాత్రింబగళ్ళు అను భేదమే యెఱుగని స్థితిలో భక్తుడుండెను.

మఱియు విజన ప్రదేశమున గూర్చుండి మానసికార్చనము చేయు వేళలయందు ధ్యానించినంతనే శ్రీ సీతారాములు ఎదుట నిలబడుచుండిరి. సింహాసనమిచ్చిన వెంటనే నవరత్న స్థగిత సువర్ణ మంటప మధ్యమందలి పీఠములపై గూర్చుండు చుండిరి. పాద్యమీయ సంకల్పించినంతనే సీతారాములు బంగారు పళ్ళెరములో పాదములుంచుచుండిరి. స్నానము చేయించునపుడు సీతారాములు చలింపక కూర్చుండి యుందురు. కనకాంబరములు సమర్పించు వేళల నా వస్త్రములతి ప్రీతితో ధరించుచుందురు. యజ్ఞోపవీత మర్పించువేళ శ్రీరాముడు మెడవంచి జందెము సవరించుకొనుచుండును. చందన మర్పించునపుడు వక్షము చూపుచుండును. వివిధ జాతుల పుష్పమాలలు ధరించువేళల మెడలువంచి ధరించుచుందురు. అగరుధూపమర్పించు వేళల సంతోషముతో నా యాది దంపతులు ఆఘ్రాణించుచుందురు. వివిధ భక్ష్యములు సమర్పించునపుడు ఆనందముతో నారగించి త్రేన్చుచుందురు. తాంబూల మర్పించినచో పకపక

నవ్వుచు తాంబూల చర్వణము చేయుచుందురు. మంగళహారతి యిచ్చున పుడు భక్తుని సపర్యలకు సీతారాములిట్లు సగుణ బ్రహ్మమై సాక్షాత్కరించు చుండిరి. ఇది యన్నియును పరమ రహస్యముగా జరుగుచుండెను.

శ్రీసీతారాముల సాక్షాత్కార భాగ్య విశేషములచే ఈ బాలయోగి ముఖారవిందమునుండి రామాయణమంతయును ద్విపద రూపముగా బయలు వెడలెను. అందుచే శ్రీరామాది విగ్రహములు తయారు చేసి రాత్రి సమయములందు రామాయణ మంతయును నాటకము రీతిగా ఆటలాడించెడివారు. శ్రీరాముడెదుట సాక్షాత్కరించి ఆనంద తాండవమాడుచున్నప్పుడు ఈ బాలయోగి శ్రీరామునుద్దేశించి “ఓ రామచంద్రా! నేనొక చీమనై పుట్టి యుండినయెడల పూజా పుష్పములలో చేరి పూజా సమయమున నీ శరీరముపై ప్రవేశించి నా జన్మమును సార్థకము చేసికొని యుండెడివాడను” అని తలచుచు నుప్పొంగు చుండిరి. ఆరు సంIIరములు శ్రీ పాపయ్య శాస్త్రిగారి చెంత మంత్రయోగ రహస్యములు సాధన చేసిరి. జప సమయమున సీతారాములెదుట సాక్షాత్కరించి యున్నపుడు ఈ బాలయోగి ముఖపద్మము నుండి యప్రయత్నముగా వైరాగ్య పద్యములు వెలువడు చుండెను.

ఉ. ఎప్పుడొ యేక్షణంబొ మటి యే గడియో మృతి దప్పదంచు నే
నెప్పుడు వేదవేద్యు గుఱినెంతయు వేత్తలవే గ్రహించి లో
గప్పుడు నుండు కామముల ఖండన చేసి మురారి విష్ణు ని
న్నెప్పుడు నాత్మఁగొల్తు నను నేను ముకుందహరీ । జనార్దనా।”

ఉ. వాస జాలమీ ధరనివాసము నిల్కడగాదు గానవా
వాసనఁ జెందఁబొక గుణ–వాగురలందున జిక్కబోకయే
మోసపువృత్తి లేకయును–మోక్షపథంబును గొంచుచుండుమా ।
బాసల జోలి యేల కను–పాపను జేరి సుఖింపు చిత్తమా.

సుగుణ బ్రహ్మ స్వరూపులైన సీతారాముల సాక్షాత్కారము వలన నిర్గుణ బ్రహ్మతత్త్వమును తెలిసికొనవలెనను నావేశము కల్గినపుడు పుణ్యపాపకర్మలు ప్రతిబంధకమని తోచుటచే నీరీతిగా నొక పద్యము చెప్పిరి.

చం॥ మూలములేని కర్మయుగ-ముం గొనుకంటె సదాత్మ దృక్కుచేఁ
గీలకముం గ్రహించుచును-గీడును మేలును లేని వస్తువున్
జాలనచేసి నిత్యమును-భద్రగుణాన్వితలై చరింపువే
యేలనె। యింతకంటెఁ బరమెక్కడఁ జూతువె వెఱ్ఱి చిత్తమా".

మఱియు పుత్రమిత్రకళత్ర బాంధవులతో గూడిన సంసారము నిత్యముగాదనియు పరబ్రహ్మమునుజేరి సుఖించుటయే జన్మమెత్తినందులకు ఫలమనియు దోచినపుడీ రీతిగా జెప్పిరి.

చ॥ కలగని మేలు కొన్నగతి-కాయము పుత్రకళత్రబాంధవులఎ
నిలుకడగాదటంచు మది-నిశ్చల తత్త్వవివేక శీలతన్
బలుకుల కందరానిదగు-బైలును జూచుచు సంతసించియే
కలతను జెందబోక కడ-గాంచుటిదేసుమ వెఱ్ఱి చిత్తమా.

ఇట్టి వైరాగ్య పద్యరత్నములు వీరి జిహ్వాపై నుండి దొర్లుచునే యుండెను. కుమారుని భక్తి జ్ఞాన వైరాగ్యములు చూచి జననీ జనకులు ఆశ్చర్యమందుచుండిరి. ఈ బాలయోగికి పదునెనిమిది సంవత్సరముల యీడు వచ్చెను. ఒకనాడు పాణంగిపల్లెవెళ్ళి "గురుదేవా! నేను ఎవ్వరినైనను మహాత్ములను దర్శింపవచ్చునా!" యని వేడుకొనిరి. శిష్యుని భావములు కనిపెట్టి "నాయనా ! నీవు ఎవ్వరిని దర్శించినను నా యందే లక్ష్యముంచి ఆయా విశేషములను నాతో చెప్పుచుండుము. నా యాజ్ఞ ప్రకారము చేసితివేని నీకు అఖండ బ్రహ్మజ్ఞాన సామ్రాజ్యము లభించును. నేను నీ కొసంగు శుభాశీస్సులివియే" అని పల్కిరి. శ్రీ సుబ్రహ్మణ్య బాలయోగి

గుర్వాజ్ఞ శిరసావహించి పాణంగిపల్లెనుండి పామర్రు వచ్చిరి. అంతకు పూర్వమే తమ తండ్రిగారును తమ జ్యేష్ఠ సోదరులైన వెంకట రామశాస్త్రిగారును పురాణ కాలక్షేపము చేయు సమయమందు భక్తి జ్ఞాన వైరాగ్య లక్షణములతో గూడిన గాథలనేకములు వినియుండుట చేతను అప్పటికే వైరాగ్యము ముదిరియుండుటచేతను దృశ్య ప్రపంచమంతయును తృణప్రాయముగా తోచుచుండెను. ఇట్లుండగా నొకనాడు వేమన రచించిన పద్యములు చదువుట తటస్థించెను.

"సతులఁ బడయరాదు సుతులఁ బడయరాదు
వెతలఁ జిక్కువాడు – వెట్టి వాడు
నేలనున్న ఊయి నెత్తి కెక్కినయట్లు
విశ్వదాభిరామ – వినురవేమ ॥

అను పద్యము చూచినప్పటి నుండియు, గృహసా&థశ్రమము భగవత్సేవకు ప్రతిబంధకముగా తోచెను. కావున బ్రహ్మచర్యమే శ్రీరాముని సేవించుటకు మంచి యాశ్రమము. గృహస్థాశ్రమములోనికి దిగినచో నిరంతర రామసేవ సాధ్యముగాదు. కావున పెండ్లియాడుట మంచిదిగాదని స్థిరపరచుకొనియుండిరి.

మంత్రోపద్రేష్టలైన శ్రీ పాపయశాస్త్రిగారిపై గల భక్తి విశ్వాసములచే గురువులనిట్లు పొగడుకొనుచుండిరి.

ఆ॥ శ్రీపతీశు గురునిఁ – జింతనసేయక
పాపమణచలేరు – పాపజనులు
పాపయావధూత – బ్రహ్మంబు గాదొకో
భక్త పద్మసూర్య – పాపయార్య ॥

ఆ ॥ శిలను బొమ్మఁ జేసి - శివభావమూనుచు
బూజసల్పువాఁడు - పుణ్యతముడు
సగుణభక్తికిఁ దొలి - సాధనంబిది గదా
భక్త పద్మసూర్య - పాపయార్య ॥

తే॥ కాలమెద్దానిచేతను - గల్గుచుండు
నెల్లకాలంబు నొకరీతి - నెద్దివెల్గు
నట్టిజ్యోతినిఁ జూడరే - యవని జనులు
భక్త హృదయాబ్జ సూర్యశ్రీ - పాపయార్య ॥

మ॥ధరలో నయ్యల సోమయాజికుల స-ద్ధర్మండ వార్యజ్వలుం
డరయనఎ బాపయశాస్త్రి నాబరగు శుద్ధాత్మజ్ఞాని సన్మద్గురున్
సరసోత్సాహ హృదబ్జసీమ నిడిసే - సద్భక్తి వైరాగ్య సు
స్థిరసుజ్ఞాన సుకర్మ యోగములచే - సేవింతు నెల్లప్పుడున్॥

ఇట్టి గురుభక్తిచే వైరాగ్యము ముదిరి నిరంతర శ్రీ రామపాదారవింద సేవాతత్పరులై వివాహము రామభక్తికి భంగము కల్గించునని స్థిరబుద్ధితో నుండిరి.

..

# మహర్షి వివాహము

బ్రహ్మన్నగారి ప్రఖ్యాతియు వారి కుటుంబ మర్యాదయు విని నెదిరేశ్వరమునుండి కొందఱు బంధువులు వచ్చి బ్రహ్మన్నగారితో "అయ్యా! మీ కుమారునికి మా కన్య నీయదలచి వచ్చితిమి" అని చెప్పిరి. ఆ సంగతి తెలిసి యీ భక్త శిఖామణి "ఆహా ! నాకీ పెండ్లి ప్రయత్నము ఎట్లు తప్పును? నేను ఇప్పుడు ఇచ్చటనేయున్నచో తప్పక నన్నీ పెండ్లివలలో పడగొట్టెదరు. ఇచట నుండుట తగదు!" అని యెంచి తమ బాల్య స్నేహితుడైన కోడూరి వెంకయ్యగారితో బయలుదేరి ఒక పొలములో చెట్టుక్రింద గూర్చుండిరి. ఆ సంగతి తెలిసి పెండ్లివారు తమ దారి తాము చూచుకొనవలసి వచ్చెను. ఆ బంధువులు వెళ్లిన తర్వాత బ్రహ్మన్నగారు తమ పుత్రుని జేరబిల్చి "నాయనా! నీకు పెండ్లియీడు వచ్చినది. కనుక నీవు పెండ్లియాడుము!" అని చెప్పిరి. అది విని "బాబయ్యగారూ! ఎంత మాత్రమును పెండ్లియాడ వలెనని నాకు లేదు" అని ఖండితముగా చెప్పిరి.

అపుడు తండ్రి కుమారులకు ఈ విధముగా సంభాషణము జరిగెను.

కుమా :– జనకా! నాకు వివాహముపై ఆసక్తి ఎంతమాత్రమును లేదు. నాకీ వివాహబంధమేల తగిల్చెదరు?

తండ్రి :– కుమారా! బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అను నాల్గు ఆశ్రమములలోను గృహస్థాశ్రమమే గొప్పది. తక్కిన యాశ్రమముల వారందఱును గృహస్థులనాశ్రయించియే బ్రతుక వలసి యున్నది. కావున నీవు గృహస్థుడవు కమ్ము.

కుమా :– జనకా ! శరీరములు క్షణభంగురములు. సంసార సుఖము స్థిరమైనది కాదు. భగవంతుడొక్కడే స్థిరుడు. కనుక మనస్సును లేనిపోని చిక్కులలో బెట్టక భగవత్సేవకై నా జీవితమంకితము

గావింపదలచియున్నాను. కనుక నాకీ పెండ్లి వలదు.

తండ్రి :–నాయనా నీవు భయపడనక్కరలేదు. గృహస్థాశ్రమమందుండియే భగవత్సేవ చేసికొనవచ్చును. భార్యా పుత్రులు అనువారలు గృహస్థులకు వినోదహేతువులు. భగవంతునియందు భక్తిని ప్రధాన లక్ష్యములుగా జేసి గృహస్థ ధర్మములను నడుపుకొనుటలో పరమార్థమునకు భంగములేదు. కనుక వివాహమంగీకరింపుము.

కుమా :– బాబయ్యగారూ! ముక్కుకు త్రాడుపోయబడిన యెద్దువలె భార్యాపుత్రాది బంధములలో చిక్కుకొని పోవలసివచ్చును. కావున, పెండ్లిబంధము నాకు తగిలింపకుడు.

తండ్రి :– కుమారా! నీ ప్రశ్న బాగుగానే యున్నది. కాని నా మాట వినుము. మేఘము వర్షించి భూమిని పండించుచున్నట్లు గృహస్థుడు అతిథులను, అభాగ్యతులను, బీదసాదలను పోషింప గల్గుచున్నాడు. అంతకంటె కావలసిన పుణ్యమేమి? దీనివలన నీ భక్తిమార్గమునకు భంగము కలుగదు.

కుమా :– బాబయ్యగారూ ! అల్ప సుఖముల నపేక్షించి శాశ్వత సుఖమునిచ్చు శక్తి మార్గమునకు భంగము కల్గించెదరా! నాకీ పెండ్లి ప్రసంగ మంతయును మిక్కిలి భయమును కల్గించుచున్నది.

తండ్రి :– నాయనా ! నీ వట్లు భయపడి మనసును కలతపెట్టుకొననక్కరలేదు. యాజ్ఞవల్క్యుడు, అత్రి, వసిష్ఠుడు మొదలగు మహర్షులే గృహస్థులై తపోనిష్ఠలుసలుపుకొనుచున్నప్పుడు మనమెంతటివారము. అదియునుగాక నీవు పెండ్లియాడినగాని నీ తమ్ములకు పెండ్లి చేయుటకు వీలులేదు. కులాచారములను దప్ప కూడదు. నీవు పెండ్లియాడనిచో మీ తల్లి బెంగపెట్టుకొని కృషించును. ఆమెను జూచి నీ సోదరులు బెంగపెట్టుకొందురు. నీ వలన మన

కుటుంబమునకు సంఘమరణము సంభవించును. ఇందఱిని జంపి నీవు సంపాదించు పరమార్థమేమి ! బాగుగా నాలోచించుకొని గృహస్థుడవగుటకు సిద్ధముగా నుండుమని గట్టిగా మందలించి చెప్పిరి.

ఈ విషయము జననియగు శేషాంబగారు గూడ దెలిసికొని "నాయనా! మా యందఱిని దుఃఖపెట్టి నీవు సంపాదించు పుణ్యమేమి? మారుమాట చెప్పక పెండ్లికంగీకరింపుమని దీనురాలై హెచ్చరించిరి. ఏమి చేయుటకునుతోచక ఈ భక్త శిఖామణి డోలాయమాన మనస్కులై చింతాక్రాంతులై యుండిరి. వివాహము తప్పనిసరి యయ్యెను.

"అచ్చపుఁజీకటింబడి గృహవ్రతులై విషయ ప్రమత్తులై
చచ్చుచుఁ బుట్టుచునుఽ మఱలఁ జర్వితచర్వణులైనవారికిం
జెచ్చెరఁబుట్టునే పరులు సెప్పిననైన నిజేచ్ఛనైన నే
మిచ్చిసనైనఁగానలకునేగిననైన హరిప్రబోధముల్ ॥

భాగవతాది గ్రంధములీరీతిగా దెల్పుచుండగా నే నీ గృహస&థధర్మము నెట్లు నిర్వహింపగలను. నాకీ వివాహబంధమునుండి తప్పించుకొను మార్గములేదా? శ్రీరామచంద్రా ! నా హృదయము పరీక్షించుటకీ వివాహ బంధము తగిలింపనెంచితివా? నీ మాయ దాట బ్రహ్మాదులకు గూడ శక్యముగాదే! నేనెంతటివాడను. అల్పజ్ఞుడను. మందబుద్ధిని. నీ పాద పద్మములనునమ్మి సేవించుచున్నందులకు నాకీ వివాహబంధము తగిలింప నెంచితివా! దేవదేవా ! పరాత్పరా! ఆపద్బాంధవా! జానకీపతీ ! నన్నీ సమయమున గాపాడు భారము నీదే తలిదండ్రుల యాజ్ఞ మీరినచో సంఘమరణము కల్గును. పెండ్లియాడినచో నీ పాదారవిందసేవకు భంగము కల్గును. ఇట్టి సందిగ్ధ సమయమున రక్షించువాడవు నీవు తప్ప నాకు

శరణ్యము లేదు. ఏ దారి త్రొక్కవలెనో నాకు గోచరించుట లేదు. నన్నీ పరీక్షలో నుండి తప్పించి మంచిమార్గమేదియో నీవే చూపుము. ఎన్ని విధముల పరీక్షించినను నీ పాదారవిందములను మాత్రము నేను విడువను. అని దుఃఖపూరితమైన భక్తితో ప్రార్థించుచుండిరి. ఇట్లు కొంతకాలము జరిగెను. వీరి భక్తిజ్ఞాన వైరాగ్యములు చూచి వీరి యన్నగారైన వెంకట్రామశాస్త్రిగారు గూడ నాశ్చర్యపడుచుండిరి. ఈ భక్తవరుడు తమ బాల్యస్నేహితుడైన కోడూరి వెంకయ్యగారిని వెంటబెట్టుకొని యే పొలములోనికో వెళ్ళి భక్తిజ్ఞాన వైరాగ్యములతో గూడిన ప్రసంగములతో కాలము గడుపుచుండిరి. బ్రహ్మన్నగారు కుమారుని వైరాగ్య లక్షణములు చూచి నేనెంత చెప్పినను వీడు విననట్లు లేదు. మా బావగారైన రేగడమిల్లి సూర్యనారాయణగారిని రప్పించి చెప్పించి చూచెదనని తలచి కుమారునికి దెలియకుండగ వడిసిలేరు వర్తమానముచేసి రప్పించిరి. ఒకనాడు రేగడిమిల్లి సూర్యనారాయణ సిద్ధాంతిగారు ఏమియు నెఱుగని వానివలె నటించుచు తమ మేనల్లుడైన శ్రీ సుబ్రహ్మణ్య భక్తవర్యుని తీసికొని షికారుగా నూరి వెలుపల నొక విజన ప్రదేశమునకు గొనిపోయిరి. అచట గూర్చుండబెట్టి "నాయనా! నీవు భాగవతాది గ్రంథములు చదువుచున్నావు. అందలి ధర్మములన్నియు గ్రహించుచున్నావు. ఆశ్రమములన్నిటిలోను శ్రేష&ఠమైన యాశ్రమమేదియో బాగుగా నాలోచించి నాకిప్పుడు చెప్పవలెను" అని సూర్యనారాయణగారడిగిరి. దీర్ఘాలోచనము గావించి "మామగారూ ! ఆశ్రమములన్నిటిలోను గృహస్థాశ్రమమవే మిగుల శ్రేష్ఠమైనదిగా తోచుచున్నది". అని స్బుహ్మణ్య భక్తుడు చెప్పెను.

"నాయనా! నీ వింత ప్రాజ్ఞుడవైయుండి వివాహము నిరాకరించు చున్నావా? అతి తగదు. ఆశ్రమములలోనికెల్ల గృహస్థాశ్రమమే గొప్పదని పురాణగ్రంథములు చెప్పుచున్నవి. నీవు వివాహము మానినచో తక్కినవారికి

పెండ్లికాదు. మా మాటలయందు గౌరవముంచి వివాహము చేసికొనుము. నీకు సకల శుభములు కల్గు" నని సూర్యనారాయణ సిద్ధాంతిగారు చక్కగా బోధించిరి. అందుచే శ్రీ సుబ్రహ్మణ్యముగారు వివాహము నిరాకరించుటకే వీలులేకపోయెను.

ఇది జరిగిన కొన్ని రోజులకు ముగ్గుళ్లనుండి పెసదనగంటి అన్నపూర్ణమ్మగారు అంతర్వేది తీర్థమునకు వెళ్ళి యుండిరి. దైవవశమున శ్రీ సుబ్రహ్మణ్యముగారు గూడ అంతర్వేది తీర్థమునకు వెళ్ళి ఒకచట గూర్చుండి తామదివఱలో రచించిన దశావతార పద్యములు భక్తి పారవశ్యమున తన్మయులై రాగయుక్తముగా నిట్లు పాడుచుండిరి.

## శ్రీరామావతారము

ధాత మొదలగు శుక్రాదిసమస్త దేవతల్ । దైత్య బాధ కోర్వజాలక పయఃపారవారాశి కడకుజేరి । కాచి రక్షింపుమా గరుడగమన । ముర హరియని మొఱలిడినచూచి కరుణతోడుత కౌసల్య గర్భావాసమున వెలసి। గాధేయమఖ రక్షణంబుచేసి కాలకంఠుని కార్ముకంబవలీల దునిమి। కన్యనుగూడి కార్త వీర్యార్జునాది క్షత్రియుల గర్వమణచి । దశరధుడు తొల్లి కైక కసగిన వరములు మీరక యధార్థమే జయమని దలచి । విసినముల కేగి రక్కసి ముక్కు చెవులు చెక్కి। ఖరదూషదాది రాక్షసుల దునుమ । నా వార్త దెలిసి మాయలమారీదు మిషను పంక్తిముఖుడు పృధివిజగొనిపోగ । వెదకి వేసారి వేసారి విహగ పుంగవునిచే ధరణిజ వృత్తాంతమరసి । దెలిసి యతనికి మోక్షమిచ్చి రక్షించి పవనసుతుని గూడి । వాలిని దునిమి వనధి బంధించి కడువడి లంకగేగి! ఘోరరావణ కుంభకర్ణేంద్రజిత్ప్ర ముఖులను సంహరించి । రావణానుజునకు రాజ్యమొసగి । పృధివిజగూడి అయోధ్య పురము జేరి । ఆంజనేయున కాత్మబోధ చేసి । అమిత శుభములు బోధించుచున్నంతలోన । నీరాక నూహనూహించి దెలిసి । వరుసతోడుత

వైకుంఠ నగరి కేగినట్టియనాది దేవుడవనుచునే నాత్మదలతు । భవ్యగుణసీమ పామర్తి ధామ బాహుబలోద్ధామ । శ్రీ రమాకామ పట్టాభి రామనామ॥

ఈ పద్యము విన్నంతనే అన్నపూర్ణమ్మగారు "నాయనా ! నీది యే గ్రామము! నీ తలిదండ్రులెవరు? ఎక్కడనుండి ఇక్కడకు వచ్చితివి?" అని ప్రశ్నించిరి. ఆమె ప్రశ్నల కన్నింటికిని తగురీతిగా సుబ్రహ్మణ్యయోగి సమాధానము చెప్పిరి. అంతకు పూర్వము నుండియు రెడ్డి బ్రహ్మన్నగారి వంశమర్యాదలు పూర్తిగా వినియుండుటచేత అన్నపూర్ణమ్మగారు తమ మేన కోడలైన చి॥ సౌ॥ బాపనమ్మనిచ్చి యితనికి పెండ్లి చేసిన బాగుగా నుండునను కుతూహలము కల్గెను. అందుచే అన్నపూర్ణమ్మగారు ఇష్టాగోష్ఠిగా ప్రసంగముచేసి అచటనుండి తిరిగి ముగ్గుళ్ల వెళ్లిపోయిరి.

క్రీ॥శ॥ 1878 సంవత్సర మందలి బహుధాన్యనామ సంవత్స రమందు గోవింద ద్వాదశికి మహోదయ పర్మమువచ్చెను. అందుచే శ్రీ సుబ్రహ్మణ్య భక్తుడు పామర్రు నుండి బయలుదేరి చొల్లంగి సముద్ర స్నానమునకు వెళ్ళిరి. అచటికి వీరి పెదతల్లి కుమారులైన గోవిందరాజుల రామచంద్రుడు. గోవిందరాజుల సుబ్బయ్యగార్లు, చింతా గవరయ్య మొదలగు బంధువులతో సముద్రస్నానమునకు వెళ్ళిరి. ముగ్గుళ్లనుండి పెదసనగంటి అన్నపూర్ణమ్మగారు కూడ ఆ తీర్థమునకు వెళ్ళియుండిరి. దైవవశమున వీరందఱును నొక సత్రమున సమావేశమైరి. అంతకు పూర్వము అంతర్వేదిల అన్నపూర్ణమ్మగారు శ్రీ సుబ్రహ్మణ్యశర్మను చూచినప్పటినుండియు తన మేనకోడలినిప్పించి వివాహము చేయించ వలెనను సంతోషములోనే మునిగియుండిరి. శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారు కూడ ఆ బంధువర్గమున్న చోటనే చేరవలసివచ్చెను. అపుడు గోవిందరాజుల రామచంద్రుడుగారు అన్నపూర్ణమ్మగారితో "అమ్మా! మీ మేనకోడలైన బావనమ్మను ఈ బాలునికిచ్చి పెండ్లిచేసిన బాగుండు"నని చెప్పిరి.

అన్నపూర్ణమ్మగారికి పురాణగోష్ఠియనిన మిగులప్రీతి. అందుచే నామె శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారిచే కొన్ని పద్యములు చదివించెను. కంఠమాధుర్యమును, భక్తి రసముట్టిపడు పద్యములును, రూపరేఖావిలాసములును జూచి అన్నపూర్ణమ్మగారు తన మేనకోడలినిచ్చి వివాహము చేయించుటకు స్థిరపరచుకొనిరి. అపుడామె ఈ భక్త శిఖామణిని జూచి "నాయనా! నా మేనకోడలను నీకిచ్చి పెండ్లి చేసెదము. నీకిష్టమేనా" అని అడిగెను. "అమ్మా! నాకు పెండ్లి యెందులకు? నా పైన మా తండ్రిగారు గలరు. నాకీ విషయమై యేమియు తెలియదు"? అని గౌరవముగా ఈ బాలయోగి జవాబు చెప్పిరి. ఆ తీర్థయాత్ర ముగించుకొని వారందఱును ఎచటివారచటకేగిరి. అన్నపూర్ణమ్మగారు ముగ్గుళ్ల వెళ్ళినతోడనే తమ సోదరులైన లింగాల వీరభద్రయ్యగారితో ఈ బాలుని విషయమంతయును పూసగ్రుచ్చినట్లు చెప్పి నీ కుమార్తెను ఆ యబ్బాయి కిచ్చినయెడల నన్నివిధముల బాగుగా నుండునని నచ్చచెప్పిరి.

ఇది జరిగిన కొన్ని రోజులకు గోవిందరాజుల రామచంద్రుడుగారు పామర్రువెళ్లి బ్రహ్మన్నగారి యనుమతిపై ఈ బాలయోగిని ముగ్గుళ్ల తీసుకొని వెళ్లిరి. అక్కడ పెండ్లికొడుకు చూపులైన తర్వాత వీరభద్రయ్యగారు పామర్రు వెళ్లి బ్రహ్మన్న గారితో "అయ్యా! నా కుమార్తెను మీ కుమారునికివ్వదలచి వచ్చితిని. నా మాటకు మారుమాట చెప్పక యంగీకరింపుడు" అని కోరిరి. అది విని బ్రహ్మన్నగారు తమ సంపూర్ణాంగీకారమును దెలిపి వివాహ ముహూర్తము స్థిరపరచిరి. అప్పటికి పెండ్లి కుమారునికి పదునెనిమిదేండ్ల వయస్సు.

క్రీ॥శ॥ 1878 సం॥ రమునకు సరియైన బహుధాన్య నామ సం॥రములో వివాహము నిశ్చయింపబడెను.

# గురుపత్ని బాపనాంబగారి చరిత్ర

తూర్పుగోదావరిజిల్లా ముగ్గుళ్ల గ్రామములో లింగాల అచ్యుతరామయ్య బాపనమ్మ అను పుణ్యదంపతులుండిరి. ఆ దంపతులకు 1. ఉమ్మన్నశర్మ 2. వీరభద్రయ్య 3. వెంకయ్య 4. గవరయ్య 5. నరసింహం అను పుత్రులును 1. అన్నపూర్ణమ్మ 2. శేషమ్మ అను పుత్రికలును జన్మించిరి.

ఉమ్మన్నగారి భార్య రాజమ్మగారు, ఉమన్నగారు ఉదయముననే లేచి స్నానసంధ్యాద్యనుష్ఠానములతో బాటు నిత్యమును సూర్యనమస్కారములు చేయుచుండెడివారు. వీరు అతిధి అభ్యాగతులకు విధివిధానముగా సపర్య లొనర్చుచుండెడివారు. వీరు జ్యోతిశ్శాస్త్రజ్ఞులును గొప్ప పౌరాణికులునై యుండిరి. వీరి కుటుంబమునకు నాల్గుపుట్ల భూమికలదు. దానిపైవచ్చు నాదాయముతోనే వీరు జీవయాత్ర గడుపుచుండిరి.

2. వీరభద్రయ్యగారికి రాజమ్మ అను భార్యగలదు. ఈ దంపతులకు 1. కామేశ్వరమ్మ 2. నరసమ్మ 3. బాపనమ్మ 4. శేషమ్మ 5. పార్వతి 6. వీర వెంకటలక్ష్మి అను కుమార్తెలు గలరు. ఈ దంపతులు వైదిక ధర్మ మార్గము ననుసరించి కాలము గడుపుచుండిరి. రాజమ్మగారు మహా భక్తురాలగుటచే తమ పుత్రికలచే వివిధములగు నోములు పట్టించి నిరంతరము గౌరీపూజ చేయించు చుండెడివారు. ఈ పుత్రికలందఱిలోను శ్రీ బాపనమ్మగారు క్రీ॥శ॥ 1873 వ సం॥రములో జన్మించిరి. ఈమె అయి దేండ్ల వయస్సులోనే నల్గురు పిల్లలను వెంటబెట్టుకొని బొమ్మల పెళ్లిళ్లు చేసికొనుచు మట్టితో గౌరీదేవిని చేసి చంద్రకాంత పూవులతో పూజించు చుండెడివారు. ఈ సమయముననే శ్రీ బాపనాంబకు వివాహము నిశ్చయింప బడెను. అప్పటికి పెండ్లికుమారునికి పదునెనిమిదేండ్ల వయస్సు.

ఆ కాలమున ఇప్పటివలె ప్రయాణ సౌకర్యములు లేకపోవుటచే పెండ్లి వారందఱును కోరుమల్లి లాకువద్ద పడవనెక్కి ధవిళేశ్వరము చేరిరి. అచట భోజనముచేసి బండ్లపై గోదావరి గట్టుపై నుండి ముగ్గుళ్ల ప్రయాణము సాగించుచుండిరి. పెండ్లికొడుకు పల్లకీ మాత్రము బండ్లకంటె ముందుగా బయలుదేరెను. కోటిలింగక్షేత్రము దగ్గరకు చేరునప్పటికి బోయీలకు శ్రమకల్గి పందిరి మహాదేవుడుగారి సత్రం దగ్గర పాలకీదింపి తమ దాహము తీర్చుకొనుటకై వెళ్లిరి. అప్పుడు ఈ పెండ్లి కుమారుడు "ఆహా! ఎంత మాత్రమును ఇష్టములేని నాకీ వివాహబంధమేల కల్గెను? రామచంద్రా! ఇంతకాలమునుండియు దర్శనభాగ్యాదులు కల్గించుచున్న నీవు ఇప్పుడు నన్ను కాపాడలేవా? సంసారార్ణవమునుండి తరింపజేయు సద్గురుడు నాకు దొరకకపోవునా? అని తమలో తాము వితర్కించుకొనుచు వెక్కివెక్కి ఏడ్చుచు ఇటునటు తిరుగుచుండిరి. కోటిలింగ క్షేత్రమందలి సత్రముయొక్క వీధి గదిలో నొక యోగిపుంగవుడుండెను. అప్పటికి సాయంకాలము అయిదుగంటలయ్యెను. ఆ సమయమున ఆ యోగిపుంగవుడు హెూమ దీక్షలో మునిగియుండెను. సాంసారార్ణవము నుండి తరింపజేయు పుణ్యకాలమాసన్న మగుటచేతను, గాఢమగు వైరాగ్యము ముదిరి యుండుటచేతను, శ్రీరామ పాదారవింద సేవ ఫలించి పుణ్యములెల్లను పండినరాశియై యుండుటచేతను, పరమేశ్వరుడే ఆ యోగి రూపమున దర్శనమిచ్చి రక్షింపదలచెను. ఆ యవధూతస్వామి ఆ సమయమున పంపరపనసతొన ముత్యములు హెూమముచేసి ఆ హెూమ శేష పదార్థ మును దక్షిణావృత్త శంఖములో నుంచుచుండిరి. ఆ శుభసమయమున ఈ పెండ్లి కుమారుని యేడ్పు ఆ యవధూతస్వామికి వినిపించెను. వెంటనే ఆ యోగి తన గదిలో నుండి యీవలికి వచ్చి చూచుసరికి దుఃఖ సముద్ర ములో మునిగి యున్న పెండ్లి కుమారుడు కాన్పించెను.

"సాధుసంగంబు సకలార్థ సాధనంబు" అనునటుల వివాహ బంధములో చిక్కియున్న ఈ బాలయోగిని తరింపజేయుటకు శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాథావధూత స్వామి దర్శనమిచ్చిరి.

సీ॥ ఏ మహాత్మునకు నూ – హింప భ్రూమధ్య వా
రణాశీ క్షేత్రంబు – రాజధాని –
ఏ భాగ్యశాలికి – నిరవొందు వణిమాదు
లష్టసిద్ధులు చేతి – యాటచెండ్లు
ఏ యోగి వరుసక – మేయములఁ లయమంత్ర
హఠ రాజయోగంబు – లాటపట్లు
ఏ పరాత్పరాత్పరునకు – రూపింప నూర్ధ్వకుం
డలి ఫణాపటలిర –త్నంబు గొడుగు

గీ॥ ఎవని ఫాలాగ్ని త్రిపురములఁ – రవులుకొల్పి
కనలి కామాదివైరి వ – ర్గంబు గాల్చె
నట్టి మదగజహరుడు పం –చాస్యు డపర
దక్షిణామూర్తి విశ్వనా – థ గురుమూర్తి.

క॥ సాక్షాత్కరింప సమ్ముని
సాక్షాచ్ఛిపుడనుచు సకల – సంయములు సుబ్ర
త్యక్షముగఁదెల్పువిని య
య్యక్షరుని పాదాబ్జములకు – నవనతుడగుచున్

(శ్రీ సద్గురు స్తవరాజము)

శంకరుడే ఆ యోగి రూపమున దర్శనమిచ్చెను. దుఃఖించుచున్న పెండ్లికుమారుని జూచినంతనే ఆ యవదూత స్వామి హృదయము ద్రవించెను. వారిద్దరికిని ఇట్లు సంభాషణము జరిగెను.

యోగి :– నాయనా ! నీవెవడవు ? పెండ్లి వేషముతో నీ విట్లు దుఃఖించుటకు కారణమేమి ?

పెండ్లికు :– దేవదేవా ! శ్రీరామభక్తుడనైయున్న నాకు బలవంతముగా పెండ్లి చేయుచున్నారు. నా భక్తి మార్గమున కిది పెద్ద పెనుభూతమువలె దాపురించినది. నా గతియేమి?

యోగి :– నాయనా! నీ హృదయము గ్రహించితిని. ఇందు నిమిత్తము నీ వెంత మాత్రమును విచారించవలసిన పనిలేదు. జనకుడు, వసిష్ఠుడు, మొదలగువారు గృహస్థులై తరించలేదా?

పెండ్లికు :– అయినచో నాకిపుడు శరణ్యమేమి? అని గోలుగోలున నేడ్చుచుండిరి.

యోగి :– నాయనా! విచారించకుము. నేను గూడ గృహస్థ ధర్మములన్నియు ననుభవించినపిమ్మటనే ఈ యాశ్రమములో ప్రవేశించితిని. గృహస్థులు మాత్రము తరించు మార్గములు లేవా? నిన్ను తప్పక తరింపజేసి రక్షించుభారమునాది. నీ వెంతమాత్రమును సందేహిపక ముందు ప్రయత్నములో నుండుము. అని పల్కి దుంఖించుచు సాష్టాంగపడియున్న పెండ్లికుమారుని లేవదీసి నీకు భయములేదు. నిన్ను రక్షించుభారము నాదని అభయహస్తమిచ్చి హెూమశేషపదార్థమైనట్టియు. శంఖపాత్రలోనున్నట్టియు పంపన పనసతొాన ముత్యములు ప్రసాదమిచ్చి నాయనా! వివాహమైన తరువాత నన్ను తప్పక కలిసికొనుము. ఇప్పుడు ఆలసించినచో మన సమావేశరహస్యములు వెల్లడియగును. అని ధైర్యము చెప్పి పెండ్లికుమారుని సాగనంపిరి. ఆ దివ్య పురుషుని హస్త స్పర్శచేతను, ఆ ప్రసాదభక్షణముచేతను శ్రీ బాలయోగి జీవితాధ్యాయము

పూర్తిగా మారిపోయెను. ఈ దివ్య సంఘటనము జరిగి
పెండ్లికుమారుడు పాలకీ చెంతకు వచ్చు సరికి బోయీలు గూడ
హాజరై సిద్ధముగా నుండిరి. "ప్రథమావసధేయస్య సౌఖ్యం
తస్యాఖిలే...ధ్వని"

(ప్రయాణము చేయునపుడు మొదటి మకాములో శుభము కల్గినయెడల ఆ ప్రయాణమంతియును శుభాంతముగా నుండును).

అచటినుండి పెండ్లివారు ముగ్గుళ్ల చేరిరి. వివాహము వైభవముగా జరుగుచుండెను. మన బాలయోగి మనస్సు శ్రీరామచంద్రుని యందును, ఆ యోగిపుంగవుని యందును, లీనమైయుండుటచేతను, పెండ్లిదీక్షలో జరుగుముచ్చటలయందు విముఖుడై యుండుటచేతను ఆ పెండ్లి కుమారునిజూచి బంధువులందఱును "ఆహా! యీ విలక్షణ పురుషుడెవ్వడు? ఇంత వైభవముగా జరుగుచుండగా ముఖమున కొంంమెమైనను ఆనందము కాన్పింపదే. ఇతడు పిచ్చివాడా? లేక మహాజ్ఞానియా?" అని తమలో తాము గుసగుసలాడుకొన సాగిరి. బాల్యముననే మాయనుగెల్చి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీ రామచంద్రునితో స్వేచ్ఛా విహార మొనర్చు నీ భక్త శిఖామణికి బంధువుల యీసడింపు మాటలు చెవిని సోకలేదు. "ఎపుడు పెండ్లి దీక్ష ముగియును; ఎపుడా యోగీశ్వరుని దర్శించెదను" అని పెండ్లి కుమారుడు నిమిషములు లెక్క పెట్టుచుండెను. ఈ భక్తునికి ఆ యయిదు రోజులును అయిదు యుగములుగా గడచెను. వివాహదీక్ష ముగిసిన పిమ్మట పెండ్లివారు ఎచటివారచటి కేగిరి.

# యోగగురు సంసేవనము- దేశాటనము

శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాధావధూత స్వామివారి చరిత్ర

## అవధూత లక్షణము

శ్లో॥ అక్షరత్వాద్వరేణ్యత్వా । ద్ధూత సంసారబంధనాత్ ।
తత్త్వమస్యాది లక్ష్యత్వా । దవధూత ఇతీర్యతే ॥
యో విలం ఘ్యాశ్రమాన్ వర్ణా । వాత్మన్యేవస్థితస్సదా ।
అతివర్ణాశ్రమీ యోగీ । అవధూతస్సకధ్యతే॥

అవధూతోపనిషత్

అవధూత అను పదమునకు గంభీరమైన యాధ్యాత్మికార్థము కలదు.

అ– అనగా అక్షర స్వరూపుడు (నాశములేనివాడు)

వ– అనగా వరేణ్యుడు. బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడు.

ధూ– అనగా సంసార బంధములనుండి విడివడియుండువాడు.

త– అనగా "తత్త్వమసిబ్రహ్మ" అను మహావాక్య లక్ష్యభూతుడు. పరబ్రహ్మమై యుండువాడు.

అక్షర స్వరూపుడై, వరేణ్యుడై, సంసార బంధముల నుండి విడివడి యుండినవాడై, తత్త్వమస్యాది వాక్యలక్ష్యభూతుడై యుండేవాడే అవధూత.

వర్ణాశ్రమ ధర్మములను అతిక్రమించి నిరంతర పరబ్రహ్మ నిష్ఠాగరిష్ఠుడై యుండువాడే అవధూత.

బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్యాసము అను నాల్గు ఆశ్రమధర్మములను, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాల్గువర్ణ

ధర్మములను అతిక్రమించి సంసార బంధమెంత మాత్రమును లేక నిరంతర పరబ్రహ్మ సమాధినిష్ఠాగరిష్ఠుడై యుండు మోగిపుంగవుడే అవధూత. అయిదవ యేట నుండియే శ్రీరామచంద్రునితో విహరింపదొడగిన శ్రీ సుబ్రహ్మణ్య భక్త శిఖామణి సందేహములను నివారించి బ్రహ్మబోధ చేయతగిన సద్గురువు కావలసియుండుటచేత శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాధావధూత స్వామివారియొక్క దర్శనమే లభించెను. మహాత్ములు తాము నడచి చూపినగాని వారి మార్గములు లోకులు అనుసరించరు. అందుచేతనే శ్రీరామచంద్రుడు తానేమియు నెఱుగని యజ్ఞానివలె నటించి వసిష్ఠమహర్షి వలన బ్రహ్మబోధనొందెను. శ్రీకృష్ణుడు పరమాత్ముడై యుండియు సాందీపమహర్షి చెంత గురుకుల వాసముచేసి బ్రహ్మబోధ నొందెను. అద్వైతమతస్థాపకులైన శంకరాచార్యులవారు గౌడపాదా చార్యులవారి శిష్యులైన గోవిందయోగి చెంతజేరి గురుకులవాస లక్షణములు నేర్చుకొని బ్రహ్మబోధనొందిరి. గురు సేవాధర్మముల గుర్తెఱిగినగాని బ్రహ్మవిద్య పట్టుబడదు. గురు శిక్షణముతో గూడిన బ్రహ్మవిద్యను లోకమున వ్యాపింపజేసి మానవులను తరింపజేయుటకే మహాత్ములు గురువుల నాశ్రయించెదరు శిష్యుడు కోరినంత మాత్రమున గురువు తొందరపడి తత్త్వబోధ చేయగూడదు.

ముగ్గుళ్లలో పెండ్లివేడుకలు పూర్తి చేసికొని శ్రీ సుబ్రహ్మణ్యశర్మగారు శ్రీ విశ్వనాధావధూతవారి పాదముల నాశ్రయించుచు రాజమండ్రిలో నివసించుచుండిరి. సుబ్రహ్మణ్యముగారు అవధూత స్వామి చెంతజేరి కాలము గడుపుచుండిరి. అవధూతగారు శిష్యుని చేరబిల్చి "నాయనగారూ! కూర్చుండుడు. ఈ మంచి తీర్థము పుచ్చుకొనుడు. ఈ ఫలములు భుజింపుడు." అని మిగుల చనువుగాను, వాత్సల్యముతోను మాటలాడ జొచ్చిరి. చనువు దొరికినది గదాయని సంతోషముతో సుబ్రహ్మణ్యముగారు

తమకు నచ్చినపద్యములు శ్లోకములు హెచ్చరికతో చదువుచుండిరి. అదివిని అవధూతస్వామి “నాయనగారూ! మీ కంఠము మిగుల శ్రావ్యముగానున్నది. మీ పద్యములు శ్రావ్యముగా నున్నవి. ఇంకను రెండు పద్యములు చదువుడని ప్రోత్సహించెడివారు. అది యంతయును తన యందుగల గొప్పతనమేయని సుబ్రహ్మణ్యముగారు తమలో తాము ఉప్పొంగసాగిరి. అవధూతస్వామి తపస్సులో ప్రవేశించునప్పుడు విష్యుడు గూడ తపస్సులో ప్రవేశించు చుండెను. తపస్సు చాలించిన తర్వాత అవధూతగారితో బాటు ఈయనగూడ ఫలములు భక్షించు చుండెడివారు. అప్పటికి పెండ్లి జరిగి రెండు మాసములయ్యెను.

పామర్రులో బ్రహ్మన్నగారును శేషాంబగారును తమ పుత్రుడెచ్చట కేగినాడో, ఏ యోగులలో గలసిపోయినాడో అని తొట్రుపాటుపడుచు బెంగపెట్టుకొనియుండిరి. కుమారుని జాడ తెలిసికొనుటకు బ్రహ్మన్నగారు పామర్రు నుండి బయలుదేరి గ్రామముల వెంబడి తిరుగుచు కొన్ని రోజులకు రాజమండ్రి చేరిరి. అప్పటికి సుబ్రహ్మణ్యముగారికి మీసములును, గడ్డమును పెరిగియుండుటచే స్వరూపము కొంచెము మారెను. బ్రహ్మన్న గారు రాజమండ్రిలో వీధులు వెదుకుచుండగా కుమారుడెదురయ్యెను. కాని, బ్రహ్మన్నగారు మాత్రము కుమారుని గుర్తింపజాలకపోయిరి. ఇపుడు మాట్లాడిన తన గురుసేవకు భంగము కల్గునని యెంచి సుబ్రహ్మణ్యముగారు తండ్రి బారినుండి యెట్లో తప్పించుకుని వెళ్ళి కోటిలింగ క్షేత్రమునగల సత్రములో ప్రవేశించిరి. ఇట్లు కొన్ని రోజులు గడచిన తర్వాత సుబ్రహ్మణ్య ముగారు అవధూత స్వామివద్ద సెలవు పుచ్చుకొని పామర్రు చేరిరి. పెండ్లికొడుకు వేషముతో మనుగుడుపు నిమిత్తము తన సోదరులైన వెంకప్పగారితో బయలుదేరి ముగ్గుళ్ల వెళ్ళి రాజమండ్రి చేరిన తర్వాత వెంకప్పగారి నుండి విడిపోయి అజ్ఞాత వాసముగా సంచరించుచు రెండు

మాసములకు తిరిగి యింటికి వచ్చిన కుమారుని జూచి తల్లిదండ్రులు పట్టరాని యానందముతో "నాయనా! నీవింతకాల మెచ్చట నుంటివి ? ఏ రీతిగా కాలము గడపితి"వని నొక్కినొక్కి యడిగిరి. సంస్కృత పాఠశాలలలో చదువుకొనుటకు తిరుగుచుంటినని ఎవరికిని నొప్పి కలుగని రీతిగా శ్రీరామ భక్త శిఖామణి జవాబు చెప్పిరి. జాతక భాగమందు కూలంకష ప్రజ్ఞాధురీణులైన శ్రీ బ్రహ్మన్నగారు కుమారుని జాతకము అప్పుడు వ్రాసి భవిష్యత్తులో వీడనుభవించు గౌరవప్రతిష్ఠలు నేను చూడగలనా? అని తమలో తాము సంతోషపడసాగిరి. ఈ బాలయోగి మనస్సు మాత్రము ఆ యవధూతస్వామి పాదపద్మములయందే నిరంతరము లగ్నమైయుండెను. అవకాశము దొరికినపుడు ఇంటిలోని వారికి దెలియకుండగ సుబ్రహ్మణ్య యోగి అవధూతస్వామి వారి చెంతకేగి అచట కొన్ని రోజులుండి తిరిగి పామర్రు వచ్చుచుండెడివారు. ఇట్లు ఒక సంవత్సర పర్యంతము అవధూతస్వామిని దర్శించుటయు పామర్రు వెళు&ళచుండుటయు జరుగుచుండెను. అవధూతస్వామిచెంత మిక్కిలి చనుమానము దొరుకుటచే సుబ్రహ్మణ్యయోగి స్నేహితునివలెనే వారితో సంచరింపదొడగిరి. అవధూతగారు ఏ విషయమైనను బోధించుచున్నపుడు సుబ్రహ్మణ్యముగారు అహంకార పూరితులై ఆవేశముతో శ్లోకములు పద్యములు చదివి తమ ప్రభావమును వెల్లడించుటకు ప్రయత్నించుచుండెడివారు. అవధూతగారా ధోరణిని కనిపెట్టి "నాయనగారూ! మీరు చక్కగా చదువగలరు. ఏదీ ఇంకొక పద్యము సెలవిండు". అని యడిగినంతనే కంఠమెత్తి బిగ్గరగా చదువు చుండెడివారు. కాని అప్పటికి అవధూత చెంత ఎట్లు మెలగవలెనో కొంచెమైనను ఈ బాలయోగికి తెలియనే తెలియదు. ఒక రోజున అవధూతస్వామి గురుదేవునితో "నాయనగారూ! నేటిరాత్రి నేను జపదీక్షలో ప్రవేశించవలసియున్నది. మీరీ గదిలో నుండగూడదు. ఆవలికి వెళ్లుడు"

అని కఠినముగా చెప్పిరి. అంత నీ బాలయోగి “అయ్యా! నేనును రామోపాసన చేయుదును. శ్రీరాముడు నా చెంతనే యుండును. నాకు భయములేదు. కావున నేనుగూడ తమ సన్నిధిలోనే జపము చేసికొందు”నని చెప్పిరి. అంత నాయవధూతగారు “నాయనగారూ ! మీరు మిక్కిలి భయపడుదురు. ఆవలికి వెళ్లుడు. నా మాట వినుడు” అని చెప్పిరి. కాని నిర్లక్ష్య భావముతో ఈ బాలయోగి అచటనే గూర్చుండి తపస్సు ప్రారంభించిరి. రాత్రి పది గంటలయ్యెను. అవధూతగారు గొప్ప హఠయోగి. అందుచే కొంతరాత్రి యగుసరికి అవధూతగారు యోగముపట్టి పీటపై నుండి లేచి గదిలోపల నొకచూరులో నొకమూల నమిడియుండిరి. అప్పుడాయన కండ్లు గుడ్లగూబ కన్నులవలె పెద్దవిగా నుండెను. శరీరము మిగుల చిన్నదయ్యెను. అవధూతగారు యోగముపట్టి నిరాలంబములోనికి లేచుసరికి సుబ్రహ్మణ్య యోగి నిమీలితనేత్రులై శ్రీరామపాదారవింద మకరంద రసాస్వాదలోలురై యుండిరి. కొంతసేపటికి నేత్రములు తెరచి చూచుసరికి నిరాలంబములో యోగమార్గమందేయున్న యవధూతస్వామి కాన్పించిరి. ఆ స్వరూపము గాంచినంతనే ఈ బాలయోగి ప్రాణములెగిరిపోయెను. శరీరము భయముతో కంపిచిపోవుచుండెను. గుండెలు దడదడ కొట్టుకొనుచుండెను. ఏమి చేయుటకును తోచకుండెను. తలుపుదీసి ఆవలికిపోదునాయన్న తలుపు చప్పుడు విని ఆయన కోపించి యేమని శపింతురో కదా! అనిగూడ తొట్రుపాటు పడుచుండిరి. ఆవలికి వెళ్ళుమని చెప్పినను వినకపోతినే! నాకిచట దిక్కెవ్వరు? ప్రాణములతో నేను బయటపడుటయెట్లు? అని సుబ్రహ్మణ్యయోగి విచారించుచు రెప్పవాల్పక ఆ యవధూత స్వామినే చూచుచుండిరి. తెల్లవారగట్ల జాము రాత్రివేళకు ఆ స్వామి నిరాలంబములో నుండి యోగ మార్గమున నెమ్మదిగా క్రిందికి దిగివచ్చి తమ పీటపై వ్రాలిరి. ఆ పీట శ్రీ బాలయోగి చేతిపై బడుటచే చేయి నలిగిపోవుచుండెను. కేకలు

వేసిన శపింతురని భయము. ఎట్లో అతికష్టము మీద తన చేతిని ఈవలికి లాగుకొనిరి. అవధూతగారు కొంతసేపు పీటపై గూర్చుండి కోటిలింగముల దగ్గరకు గోదావరికి స్నానమునకు వెళ్ళిరి. ఆ రోజు మొదలు అవధూతగారు జపించునపుడు సమీపమందుండుటకు ఈ బాలయోగి భయపడసాగిరి. అవధూతగారు ప్రతిదినమును స్నానముచేసి తమ మకాముచేరిన తర్వాత అవధూతలకు సంబంధించిన హెూమములు చేసికొనుచుందురు. ఆ హెూమకుండము నెవరును ముట్టుకొనగూడదు. అట్టి సందర్భమున నొకనాడు సుబ్రహ్మణ్యయోగి స్నానము చేసివచ్చి హెూమగుండమునగల భస్మముతీసి ముఖమునధరించుకొనిరి. అదిచూచి అవథూతగారు కోపావేశముతో కాలాగ్నిరుద్రుడై మండిపడుచు బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థాశ్రమము, సన్యాసాశ్రమము, అవధూతాశ్రమము అని ఆశ్రమ బేధములు కలవుగదా! ఒక యాశ్రమము వారికిని మఱియొక యాశ్రమము వారికిని సంబంధము లేదే! నీవు గృహస్థుడవు. నేను అవధూతను నేను వర్ణాశ్రమ ధర్మములతో నిమిత్తము లేనివాడను. నా హెూమకుండము ముట్టిన పాపమునకై బ్రహ్మరాక్షసివై పుట్టుదువుగాక! అని శపించి హెూమము చేయు సృక్స్రువములతో వీపుపై బాది మెడపట్టుకొని ఆవలికి గెంటివేసి తలుపులు బిగించుకొని లోపలికేగిరి. ఆ దెబ్బలతోను శాపవచనములతోడను భయపడి కన్నీటిధారలతో కట్టుబట్టలు తడసినను అచటినుండి ఈ బాలయోగి కదలనేలేదు. మంచినీరు మాత్రము త్రాగుచు అయిదురోజులు అట్లే గురు దర్శనమునకు గుమ్మము దగ్గర నిలబడి యుండిరి. ఆరవనాడు తలుపు తీసి అవధూతగారు చురచురలాడుచు గోదావరికి స్నానమునకు వెళ్ళిపోయిరి. స్నానముచేసి వచ్చులోపల సమీపమున కేగి రు. 1-2-0 విలువగల పెద్ద యరటి పండ్ల గెల తెచ్చి భయపడుచు హెూమకుండము చెంతనుంచిరి. ఇంకను పరీక్షింపనెంచి

అవధూతగారు ఆయరటిపండ్ల గెలతో ఈ బాలయోగి నుదుటిపై విసరికొట్టిరి. పండ్లన్నియు పేశమై చెదరిపోయెను. బాలయోగి నుదుటిపై బలమైన దెబ్బతగిలెను. వెంటనే అవధూతగారు హోమకర్మలో ప్రవేశించిరి. ఈ బాలయోగి యేడ్చుచు నచటనే యుండిపోయిరి. హోమములు పూర్తి అయిన తర్వాత శిష్యునిబిల్చి "నాయనా! నీ హృదయము పరీక్షించుటకు ఇట్లు గావించితిని. నీకు అవధూతల దగ్గరనెట్లు మెలగవలెనో తెలియదు. కొంతకాలముఅవధూతల దర్శనముచేసి ఎట్లు మెలగవలెనో తెలిసికొనిరమ్ము. అపుడు నీకు బ్రహ్మవిద్యనిచ్చెద"నని ధైర్యముచెప్పి హృదయమును శాంతింపజేసిరి.

# మహర్షి దేశాటనము

అవధూతస్వామివారి యాజ్ఞానుసారముగా శ్రీ సుబ్రహ్మణ్యయోగి మహాత్ములను యోగులను పర్వత గుహలలోని మహర్షులను సందర్శించు టకు బయలుదేరిరి. రాజమండ్రీలోగల చందా సత్రములోనికి చాలమంది బైరాగులును, సాధువులును వచ్చుచుందురు. అందుచే సుబ్రహ్మణ్య యోగి తఱచు ఆ సత్రములోనికేగి అచటగల సాధువులతో గోష్ఠి సల్పుచు వారి సాధనక్రమములను తెలిసికొననారంభించిరి. పండితులు గ్రంథములు చదివి చెప్పు చిలుకపలుకులు వీరికెంత మాత్రమును రుచించెడివి కావు. అందుచే అడవుల వెంబడి తిరుగుచు ప్రాణములపై నాశవదలి పర్వత గుహలు వెదుకనారంభించిరి. ఒకనాడు పాపికొండల సమీపమును వెళ్ళిరి. అచట నొక గుహలో అశ్వత్థామ మహర్షి పద్మాసనముపై గూర్చుండి నిమీలిత నేత్రులై సమాధినిష్ఠలో నుండిరి. ఆయన పాదములు రెండడుగుల పొడవుండెను. ఆ మహాయోగి కూర్చుండియున్నపుడు ఏడడుగుల

యెత్తుండిరి. ఆ దివ్య స్వరూపమును జూచినంతనే సుబ్రహ్మణ్య యోగికి ఆశ్చర్యము కల్గెను. ఈ బాలయోగి వెళ్లుచున్నపుడు మార్గమధ్యమున కొందఱు పండితులు సహచరులైరి. ఆ పండితులు తమ తమ భార్యలను గూడ వెంటబెట్టుకొని బయలుదేరిరి. మఱియు గొన్ని యుపనిషత్తులును, భాష్యత్రయాది గ్రంథములును చంకబెట్టుకొని యా మునీశ్వరుని దర్శించిరి. స్వరూపమునుబట్టి ఆ మహర్షి యుగయుగాంతరములనుండియు సమాధి నిష్ఠలో నున్నట్లుగా సుబ్రహ్మణ్యయోగికి తోచెను. కాని, ఈ బాలయోగితో వచ్చిన పండితులు అహంభావ పూరితులై ఉపనిషత్తులు తీసి దీని యర్థమేమి? దీని భావమేమి? అని గందరగోళము చేయసాగిరి. సుబ్రహ్మణ్యా యోగి మాత్రము అశ్వత్థామ మహర్షులవారి వంకనే తదేక నిష్ఠాగరిష్ఠులై చూచుచుండిరి. అశ్వత్థామ మహర్షిగారు నేత్రములు తెఱచి "గచ్ఛగచ్ఛ" పొమ్ము పొమ్ము అని వారిని మందలించిరి. మునీశ్వరుని సమాధినిష్ఠకు భంగము కల్గించిన కారణముచేత ఆ పండితులకు మాటలేక నోరెండి పోవుచుండెను. చుట్టుప్రక్కల నెచ్చటజూచినను మంచినీరు కాన్పించ కుండెను. ప్రాణములు తల్లడిల్లుచుండెను. అప్పుడు వారి భార్యలు దీనులై మా యపరాధమును మన్నించి రక్షింపుడని ప్రార్థించిరి. ఆ మహాత్ముని దయచే నా పండితులకు దప్పిక తగ్గి దేహస్మృతి గలిగి కొంతసేపటికి మాట వచ్చెను. అపుడాపండితులు తాముచేసిన మహాపరాధమునకు బుద్ధి తెచ్చుకొని యా మునీశ్వరునికి నమస్కరించి యెవరిదారిని వారేగిరి. సుబ్రహ్మణ్య బాలయోగి మాత్రము కదలక అట్లే ఆహార పానీయములు మాని ఆ మహర్షిని చూచుచు దూరముగా కూర్చుండియుండిరి. పదునైదు రోజులకామునీశ్వరుడు కన్నులు తెరచి "నాయనా! నీవు బాగుపడుదువు. ఇంటికి వెళ్ళు" మని దీవించుచు తమ కృపారసవీక్షణములను ఈ బాలయోగిపై ప్రసరింపజేసిరి. ఆ యశ్వత్థామ మహర్షి ప్రతిదినమును

అర్ధరాత్రివేళ బయలుదేరి కోటిలింగక్షేత్రమునందును, గోష్పదీక్షేత్రము నందును స్నానముచేసి రాత్రి మూడవజామువనే యోగమార్గమున తమ గుహలో ప్రవేశించుచుందురు. భారతకాలమునాటి యశ్వత్థామ రూప లక్షణములన్నియు ఈ మహర్షియందు గోచరించుటచే నీయోగి యుగ పురుషుడని సుబ్రహ్మణ్యముగారు తెలిసికొనిరి. అచట నుండి బయలుదేరి సాధువులను యోగులను దర్శించుచు పర్వత గుహలు వెదకుచుండిరి.

ఒకప్పుడు సుబ్రహ్మణ్య యోగివర్యులు పశ్చిమగోదావరి జిల్లా అన్నదేవరపేటలో నుండవలసివచ్చెను. విజనప్రదేశములలో తపస్సుకు అలవడిన శ్రీ సుబ్రహ్మణ్య యోగిగారు పొలములలోనికి వెళ్లి అర్ధరాత్రివేళ నొక మామిడి చెట్టు క్రింద కూర్చుండి తపస్సు చేసుకొనుచుండిరి. జన్నచేను కావలినిమిత్తమై ఎత్తైన అరవమీద ఒక రైతు పండుకొనియుండెను. ఆ సమయమున అశ్వత్థామ మహర్షిగారు సుబ్రహ్మణ్య యోగివర్యులున్న చోటికి వచ్చుచుండిరి. అపుడు అశ్వత్థామగారి భుజములు ఒక పెద్ద మామడిచెట్టు కొమ్మకు తగిలి ఆ కొమ్మ విరిగి క్రిందపడెను. ఆ యశ్వత్థామ మహర్షిగారి స్వరూపము చూచి జొన్నచేలో అరవపై పండుకొనియున్న వ్యక్తి క్రిందపడి మూర్ఛపోయెను. ఆ మరునాటి యుదయము పొలములో రెండు మూరలు పొడవుగల యడుగుజాడలు కొందరికి కాన్పించెనట.

# దివ్యాంబ దర్శనము

శ్రీ సుబ్రహ్మణ్య యోగివర్యులు ఒకప్పుడు కాలినడకను బయలుదేరి పెద్ద తిరుపతి క్షేత్రమునకు వెళ్లుచుండిరి. మార్గమధ్యమున అయిదుగు రవధూతలు తపస్సు చేసుకొనుచు దర్శనమిచ్చిరి. ఆ యవధూతలు సుబ్రహ్మణ్యయోగిని చూచి గౌరవించి అయిదురోజులు తమచెంత నుంచుకొని కొన్ని యోగ రహస్యములు దెల్పిరి. శ్రీ మహర్షి ఆ యవధూలతో బయలుదేరి పెద్ద తిరుపతికొండ నెక్కుచుండిరి. మార్గమధ్యమున పెక్కు విశేషములు కాన్పించెను. అచట పాపనాశని అను పుణ్యస్థలము గలదు. పై కొండలలో నుండి యొక జలధార ప్రవహించుచుండెను. ఆ జలధారలో పాపాత్ములు స్నానముచేసిన యెడల నురుగు బయలుదేరును. ఆ విషయమిప్పటికిని ప్రత్యక్ష నిదర్శనము. ఆ క్షేత్రము సేవించుకొని వారందరును కొండపైకి వెళ్ళిరి. ఒకచోట నొక పర్వతగుహ గలదు. ఆ గుహలో నొక యోగిని సమాధిలో గూర్చుండి యుండెను. వారందఱును ఆ యంబను దర్శించిరి. ఆ పర్వత గుహ ఆ యంబ కూర్చుండుటకు మాత్రమే చోటులేదు. అపుడా యోగిని తన వెనుకనుండి ఒక్కొక్క పెద్ద పనసపండును తీసి ఒక్కొక్కరికే ఇచ్చుచుండెను. ఇట్లు ఆరు పనసపండ్లు తీసి ఆ యారుగురికి నిచ్చెను. ఒక్కొక్క పండు మోయుటకు గూడ మిగుల కష్టముగా నుండెను. ఆ యంబ వారి నారుగురిని ఆ రాత్రి తనవద్ద నాపెను. ఆ యోగులందఱును అచట విశ్రమించిరి. వారందఱును చూచుచుండగనే ఆ యంబ అర్థరాత్రివేళ అదృశ్యురాలయ్యెను. ఆమె యోగ మార్గముచేత నెచటికో వెళ్ళినట్లు వారూహించి మిగుల నాశ్చర్యపడుచుండిరి. కొంతసేపటికామె పర్వతగుహలో నుండెను. ఆమె ఈవలికి వచ్చినట్లుగాని ఆహారము పుచ్చుకొనినట్లుగాని వారికి కొంచెమైనను గోచరించలేదు. ఆ

యవధూతలు ఆ యంబతో ఇష్టాగోష్ఠిగా నా రాత్రి తత్త్వవిచారణ చేసిరి. ఆ ప్రసంగ సమయమున ఆ యంబ వారినుద్దేశించి "నేను శ్రీ కృష్ణుని జన్మము ఎఱుగుదునుసుమా" అని చెప్పెను. ఆ విషయము విన్నంతనే ఆ యోగిని ద్వాపరయుగము పూర్వమునుండియు నచటనే సమాధిలో గూర్చుండి యుండినట్లు వారు నిర్ధారణ చేసికొనిరి. అపుడా యంబ సుబ్రహ్మణ్య యోగితో "నాయనా! నీవు రామస్మరణ, కృష&ణ స్మరణ చేసికొనుచు తత్త్వవిచారణలో నుండుము. నీకు శుభములు కల్గును'' అని ఆశీర్వదించి వారందఱిని సాగనంపెను.

అచటనుండి సుబ్రహ్మణ్యయోగి శ్రీరంగము వెళ్ళిరి. అచట రెండు రామచిలుకలుండెను.

ఉ॥ రంగదరాతిభంగ. ఖగరాజతురంగ. విపత్పరంప రో
త్తుంగ తమః పతంగ. పరితోషితరంగ, దయాంతరంగ స
త్సంగ, ధరాత్మజా హృదయ సారసభృంగ, నిశాచరాబ్జ మా
తంగ, శుభాంగ, భద్రగిరి దాశరథీ కరుణా పయోనిధీ ॥

ఈ పద్యములో నొకపాదమొక చిలుకయును మఱియొకపాదము రెండవ చిలుకయును చదువుచుండుట శ్రీ సుబ్రహ్మణ్యయోగి వినిరి.

"యా దృశీభావనాయస్య సిద్ధిర్భవతి తాదృశీ ॥"

ఎవనిభావ మెట్లుండునో అతనికి అట్టి కార్యసిద్ధియే కల్గును. చరాచర ప్రపంచమంతయును రామమయముగా చూచు నీ బాలయోగికి చిలుకల రూపమున రామదర్శనమగుటలో వింతలేదు.

అచటనుండి యీ బాలయోగి మఱియొక చోటికి వెళ్ళిరి. అచటనొక మహర్షి కాన్పించెను. ఆ ముని రెప్ప వేయక రాత్రింబవళ్ళట్లే పరబ్రహ్మ సమాధి నిష్ఠాగరిష్ఠులై చలించక పద్మాసనస్థులై యుండిరి. ఆ మహర్షికి

రెండువేల సం॥రములు ఉండునని అచటివారు దెల్పిరి. ఆ మహరి&ష ఎవ్వరితోను మాటలాడడు. అచటనుండి యీ బాలయోగి ముందునకు ప్రయాణము సాగించిరి బరంపురములో నొక మహాజ్ఞాని కాన్పించెను. కొవ్వూరు తాలూకాలో చేరిన ఆరిక రేవలలోనొక క్రైస్తవయోగిని దర్శించి కొన్ని యోగ రహస్యముల దెలిసికొనిరి, ఒకచోట తత్త్వవేత్తయగు నొక యెఱుకలజాతికి చెందిన యోగినిదర్శించిరి. మఱియు శైవ సాంప్రదాయ యోగులను వైష్ణవ సాంప్రదాయ జ్ఞానులను దర్శించి వారి యాశీస్సులబడసిరి. ఇట్లు డెబ్బది యిద్దఱు మహాత్ముల దర్శించి రాజమండ్రి చేరి శ్రీశ్రీశ్రీ విశ్వనాధావధూత స్వాములవారిని దర్శించిరి.

# శ్రీవిశ్వనాధావధూత స్వామివద్ద సుబ్రహ్మణ్య మహర్షి గురుకులవాసము

దేశాటనములో శ్రీ మహర్షులవారు చాలమంది మహర్షులను, యోగులను, అవధూతలను దర్శించియుండిరి. వారి దర్శనమైనప్పటి నుండియు ఈ బాలయోగి మనస్సు పూర్తిగా మారిపోయెను. అందుచే నవధూతగారిని సమీపించుటకే మిగుల భయపడుచుండిరి. అవధూతగారు కాలాగ్ని రుద్రునివలె మన బాలయోగికి కాన్పించుచుండిరి. అపుడా యవధూత స్వామి శిష్యుని హృదయము గనిపెట్టి బ్రహ్మవిద్యను బోధించు టకు దగిన యర్హత గల్గినదని యెంచి యొక శుభ ముహూర్తమున గురు సేవాధర్మములు బోధించిరి. "నాయనా! నీవు చిన్న వయస్సువాడవు. గురుసేవాధర్మములు నీకు సరిగా దెలియకుండుటచేతను, గిరికందరాదులు సంచారము చేసివచ్చిన యెడల గొన్ని మెలకువలు నీకు దెలియగలవనియు నీపై కోపము నటించితిని. నీపై నాకు నిజముగా కోపముండవలసిన పనిలేదు. మనకు జన్మాంతర సంబంధము గలదు. ఇప్పటి నుండి నీవు భయభక్తులతో నాచెంత సంచరించుచుండుము. గురువుల చెంత సంచరించుట మిగుల కష్టము. పూర్వమొకప్పుడు యాజ్ఞ్యవల్క్యముని గురు సేవా ధర్మములు తెలిసికొనుటకై మహావిష్ణువును ప్రార్థించెను. మహావిష్ణువు గురుకులవాస ధర్మములను యాజ్ఞ్యవల్క్యముని కుపదేశించెను. ఆ ధర్మములనే శంకరుడు పార్వతికి బోధించెను. వానిలో ముఖ్యమైన ధర్మములను నీకు బోధించుచున్నాను. విను" మని అవధూత స్వామి యిట్లు బోధింపదొడగిరి.

"గురుడు వచ్చినప్పుడు శిష్యుడు గూర్చుండ రాదు. గురుని యాజ్ఞ పొంది గూర్చుండవలెను. గురువును మానవమాత్రునిగా దలంచ గూడదు.

గురుని శయ్యపై శిష్యుడు పరుండరాదు. గురువుకంటె స్నాన సంధ్యాదులు ముందుగా చేయరాదు. గురునికిష్టములేని యాచారములును, మతములును అవలంభించగూడదు, సద్గురుడుండుచోటనే సకల పుణ్య నదుల పుణ్యమును నివసించియుండును. గురుక్షేత్రమే సకల తీర్థములకును ప్రధాన కేంద్రము. గునుని పాదతీర్థమును పాపముచేసి శేషమును శిరస్సుపై జల్లుకనవలెను. గురుమూర్తినే సర్వదా ధ్యానించు చుండవలెను. గురు మంత్రమునే యెల్లప్పుడును స్మరించు చుండవలెను. ఒక్క గురుని నమ్మి సేవించినచో సకల దేవతా స్వరూపము, గురుడు బోధించునపుడు సంశయ, అసంభావన, విపరీతభావనలు పుట్టకూడదు. గురువనగా గుణరూపహీన మైన పరబ్రహ్మము, అట్టి పరబ్రహ్మము శిష్యపరంపరను నిల్పుటకు ప్రకృతితో కూడిన సగుణబ్రహ్మమగును. కావున గురునియెడల నిర్లక్ష్యభావము పుట్టగూడదు. గురూపదేశానుసారముగా మనశ్శుద్ధి గావించు కొనవలెను.

శ్లో॥ ధ్యానమూలం గురోర్మూర్తిః పూజామూలం గురుః పద ।
మంత్రమూలం గురోర్వాక్యం ముక్తిమూలం గురోఃకృపా ॥
(స్కాందపురాణము)

అని గురుసేవా ధర్మములు బోధించిరి. అంత సుబ్రహ్మణ్యయోగి స్థానశుశ్రూష, అంగశుశ్రూష, భావశుశ్రూష, ఆత్మశుశ్రూష అను చతుర్విధ శుశ్రూషలను జేయుచు అవధూత స్వామిని మెప్పించిరి.

1. నిత్యానిత్య వస్తువివేకము, 2. ఇహాముత్రార్థ ఫలభోగ విరామము, 3 శమాది షట్క సంపత్తి, 4. మోక్షేచ్ఛ అను సాధన చతుష్టయ సంపత్తి నవలఅచుకొని అవధూత స్వామి చెంత శిష్యపుంగవుడు మెలంగుచుండెను.

అవధూతస్వామి లక్షణములు చతుర్ముఖునికైనను వర్ణింపనలవి గాకుండెను.

నేలయే పెద్దపాన్పు, హస్తమే పెద్ద తలగడ, వివిధ నక్షత్రములతో గూడిన యాకాశమే పెద్దపందిరి, అనుకూలమగు పిల్లవాయువులే విసనకఱ్ఱ వేయు నౌకర్లు; చంద్రుడే పెద్ద దీపము, సహస్రస్తంభ మంటపమందు జేరి ముక్తికాంతతో బ్రహ్మానంద సామ్రాజ్యమునేలుచు ప్రపంచవాసనలు లేక యుండు మహాయోగి సుబ్రహ్మణ్యమహర్షికి గురువయ్యెను. ఆ యవధూత స్వామివారు శిష్యునికి మంత్రయోగము, హఠయోగము, లయయోగము, రాజయోగము అను నాల్గుయోగముల సాధనలు చెప్పిరి.

# 1. మంత్రయోగము

నిత్యము, శుద్ధము, నిర్వికారము, నిరంజనము, అప్రతర్క్యము, అవిజ్ఞేయము, వినాశోత్పత్తి వర్జితము అను లక్షణములు గల నిరావరణ పరిపూర్ణశివ బ్రహ్మతత్వమును జేరుటకు మహర్షులు కొన్ని మార్గము లేర్పఱచిరి. పరబ్రహ్మము నుండి సృష్టి నామరూపాత్మకమై ప్రారంభ మయ్యెను. అందుచే నామముతోను రూపముతోను గూడిన సగుణబ్రహ్మము నాధారముగా జేసికొనియే నామరూపాత్మకమైన ప్రకృతిని గెలువవలెను. శబ్దస్వరూపమైన నామమును, భావనాగమ్యమైన రూపమును ఆధారముగా జేసికొని చేయు యెాగసాధనమునకే మంత్రయోగమనిపేరు. విగ్రహారాధనము మంత్ర యోగమునకు ముఖ్యాంగము.

# 2. హఠయోగము

నామమును రూపమును ఆధారముగా జేసికొని మంత్రయోగము సాధించినట్లే కేవలము సూ&థలశరీరము నాధారముగా జేసి చిత్తవృత్తి నిరోధము గావించుకొనుట హఠయోగము. ఇందు 1 యమము, 2 నియమము, 3 ఆసనము, 4 ప్రాణాయామము, 5 ప్రత్యాహారము, 6 ధారణ, 7 ధ్యానము, 8 సమాధి అను నెనిమిది అంగములు గలవు. ఒక మేడపై కెక్కుటకు మెట్లు యేరీతిగాఆ సాధనములో అట్లే బ్రహ్మమును

జేరుటకు యమనియమాదులు ఎనిమిది మెట్లవంటివి. ఒక మెట్టునుండి మఱియొక మెట్టునకు క్రమసాధనచే నెక్కవలయును. అందు మొదటివి నాల్గును బాహ్యములు. తక్కిన నాల్గును ఆంతరంగికములు. మంత్రయోగములు నామరూపాత్మకమైన సగుణమూర్తిని ధ్యానించినట్లు హఠయోగమున జ్యోతిస్వరూపుడగు పరమాత్మను ధ్యానించవలెను. మంత్ర యోగ సమాధియందు నామరూపాత్మకమైన సగుణమూర్తి ధ్యేయమైనట్లు హఠయోగ సమాధియందు వాయు నిరోధముతో కూడిన పరంజ్యోతి ధ్యేయము, హఠయోగము మిగుల కష్టసాధ్యమైనది. హఠయోగ సాధనములలో వారు మత్స్య, కూర్మ, గరుడ, మయూర, ప్రేత, పద్మ, వృశ్చిక, ముక్త, కపాల, వజ్ర, గోముఖ, సుఖ, సిద్ధ, కుక్కుట, ధనుస్సు, వీర, ఉత్తాన, అను పదునేడు ఆసనములు అభ్యసించిరి.

## 3. లయయోగము

అండ పిండ బ్రహ్మాండములు ప్రకృతి పురుషులయొక్క సమ్మేళనము వలన పుట్టుచున్నవి. అండాండములును పిండాండములును వ్యష్టి, బ్రహ్మాండము సమష్టి. వ్యష్టి సమష్టి సంబందముచే అండ పిండ బ్రహ్మాండములు ఒక్క బ్రహ్మ సముద్రమందే ఇమిడియున్నవి. ప్రకృతియనగా మహాశక్తి ఆధారచక్రమందు నిద్రించుచుండును. ప్రకృతి రూపమైన కుండలినీ శక్తికి ఆధారచక్రమందు నిద్రించుచుండును. ప్రకృతి రూపమైన కుండలినీ శక్తికి ఆధారచక్రము స్థానము. పరమపురుషునియొక్క స్థానము సహస్రారము. గురూపదేశానుసారముగా కుండలినీశక్తిని సహస్రారమందలి పురుషునిలో ఏకీభవింప జేయుటకే లయయోగమని పేరు. లయయోగి సకల బ్రహ్మాండమును తన శరీరమందే చూడగల్గును.

## 4. రాజయోగము.

సృష్టి స్థితిలయములకు కారణము ఆత్మ. అవస్థాభేదములనుబట్టి

ఆత్మకే మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, ద్రష్ట, సాక్షి, కూటస్తుడు, ఎఱుక, స్ఫురణ అను పేర్లు గలవు.

పద్మాసనముపై గూర్చుండి కుంభకయోగ మభ్యసించి శరీరము నిగిడించి భ్రూలతామధ్యమున దృష్టులునిల్పి ఆత్మను ఆధారముగా జేసికొని చేయు పరబ్రహ్మ ధ్యానమునకు రాజయోగమని పేరు. అంతఃకరణమునకు సంకల్ప వికల్పములు లేకుండగ జేసికొనుటయే రాజయోగము. యోగములన్నిటిలోను రాజువంటిదిఁ గనుక దీనికి రాజయోగమను పేరు గల్గెను. రాజయోగి బ్రహ్మమునే ధ్యానించుచు నిరంతరమును నిర్వికల్ప సమాధిలో నుండును.

ఇట్లు కఠిన పరీక్షలతో గూడిన గురుకులవాసముచేసి యోగ గురువు నిట్లు స్తుతించిరి.

సీ॥ బాలప్రాయమునాడు - పరమాత్మఁగనులందు
చూపించిబ్రోచిన - సూరి వీవె
సంసారబంధంబు- సడలించి భ్రాంతులు
విడుదల గావించు - విభుడవీవె
నాల్గు యోగంబులు - నమ్మికగా దెల్ప
కేవలాత్మను జూపి - తీనెగావె
లక్ష్యత్రయంబును - లక్షణంబుగ దెల్పి
తత్సాక్షి దెలిపిన -దాతవీవె
గీ॥ అహహ మిమ్ముల నుతియింప-నజునికైన
తరముగాదయ్య నిర్గుణ-తత్వమూర్తి
విశ్వనాథావధూత స -ద్విమల చరిత
పతిత పావన సద్భక్త - పారిజాత॥

సీ॥ ముద్రపంచకమును - ముక్త పఱచియు యోగ

నిద్ర దెల్పిన కృపా – నిధివి నీవె
ఈరేడు లోకంబు–లీ మేనజూపి సు
జ్ఞానంబు గలిగించు – ఘనుడవీవె
హఠమను యోగ మ–భ్యాసంబు చేయించి
దుర్వృత్తులను ద్రుంచు – దృక్కు వీవె
గీ॥ ప్రాకప్రాకంగ జగములు – రాకపోక
దెల్పి యెఱుగంగ నేర్పిన – దేవుడీవె
విశ్వనాధావధూత స – ద్విమల చరిత
పతిత పావన సద్భక్త – పారిజాత ॥
సీ॥ సప్త భూమికలలో – సారాంశమరయగా
షోడశాక్షరిలోన – సూటియయ్యె
సప్త చక్రములలో – సారాంశమరయగా
షోడశాక్షరిలోన – సూటియయ్యె
సర్వసమాధుల – సారాంశమరయగా
షోడవాక్షరిలోన – సూటియయ్యె
సచ్చిత్సుఖాభాష – సాక్షినైనను జూడ
షోడశాక్షరిలోన – సూటియయ్యె
గీ॥ పంచదశివలె షోడశి నెంచశేష
సంజ్ఞనొందితి ద్వాదశాక్షరుడవగుచు
విశ్వనాధావధూత సద్విమలచరిత
పతితపావన సద్భక్త పారిజాత॥

శ్రీశ్రీశ్రీ జగద్గురు విశ్వనాధావధూత స్వామివారు క్రీ॥శ॥ 1878 సం॥రం ప్రాంతమున రాజమండ్రిలో నివసించుచు తమజాడ నెవరికి దెలియనీయక అర్హతగలవారికి బ్రహ్మవిద్యా యోగ సాధనల నేర్పుచు విజ్ఞానభిక్ష నొసగుచుండిరి.

క్రీ॥శ॥ 1905 సం॥ రమున పట్టిసపు వెంకటేశ్వర్లుగారిచే మద్రాసులో ముద్రించి ప్రకటింపబడిన "అద్వైత సుధానిధి" అను గ్రంథములో గల విషయములనుబట్టి శ్రీ విశ్వనాధావధూతగారు శ్రీ శంకరానందులవారి శిశ్యులని తెలియుచున్నది. వీరు కొంతకాలము అంతర్వేదిలో అఖండ జపంబొనర్చినట్లు తెలియుచున్నది. రాజమండ్రిలో నున్న కాలములో 1. శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యముగారును 2. తణికెళ్ల లచ్చయ్యగారి కుమారుడు శేషయ్యగారును 3. మంతిన వెంకటరత్నముగారును. 4. తిప్పావఝుల నరసింహశాస్త్రి రాజయోగిగారును 5. శ్రీ కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారును ఇంకను ఇతరులును శిష్యులైయున్నట్లు తెలియుచున్నది. అవధూత స్వామివారు రాజమండ్రిలో ఎంత కాలముండినదియు సరిగా తెలియలేదు, మఱియు నీ యవధూతగారు అరువదినాల్గు విద్యలలో పరిపూర్ణులైనట్లును నిరంతర దేవీ సాక్షాత్కార మహిమా సంపన్నులనియు తెలియుచున్నది. మద్రాసులో పరాశక్తిని తన తొడపై చూసి లోకులకు దివ్యజా&ఞనము ప్రసాదించిన యవతారమూర్తి. మఱియు నచటనే మూడవ నేత్రమును చూపి శంకరావతార లక్షణములను ఋజువు చేసిన లోకోత్తర మహర్షి.

ఇప్పుడు శ్రీశైలమందు ఉత్తర దిక్కునగల నారసింహ గుహలో యుగాంతరముల నుండి తపోనిష్ఠాగరిష్ఠులై యున్న యోగీశ్వరులతో శ్రీ విశ్వనాధావధూతగారు వున్నట్లు తెలియుచున్నది.

శ్రీ విశ్వనాధావధూతగారు యోగవిద్యను పూర్తి గావించిన పిమ్మట శ్రీ సుబ్రహ్మణ్య శిష్యునికి "స్వేచ్ఛానంద" అని దీక్షానామ మొసగి ఆశీర్వదించుచు "నాయనా! నీకు బోధనశక్తి చాలగలదు. నీకు భో! ధనశక్తి చాలగలదు" అని పల్కుచు "బాగుగా పరీక్షించి యోగ్యులగు వారికి బ్రహ్మ విద్యనిమ్ము. ఇకనింటికి వెళ్ళి గృహస్థాశ్రమము రీవిగా పాలింపు" మని శిష్యుని పంపిరి.

# శ్రీ మహర్షులవారి పామర్రు నివాసము

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారు క్రీ॥శ॥ 1878 సం॥రమునకు సరియగు బహుధాన్యనామ సం॥రములో శ్రీమతి బాపనాంబగారిని వివాహమాడిరి. క్రీ॥శ॥ 1886 సం॥రములో (పదమూడవయేట) బాపనాంబగారు కాపురమునకు వచ్చిరి. అప్పటికే బ్రహ్మన్నగారు పరమపదించియుండిరి. బాపనాంబగారు కాపురమునకు వెళ్ళినకొలది కాలమునకే మహర్షులవారి జ్యేష్ఠ సోదరులైన శ్రీ వెంకటరామశాస్త్రిగారును వారి ధర్మపత్నియగు వెంకటలక్ష్మిగారును పరమపదించిరి.

అందుచే తండ్రిగారు చేయు శ్రీరామ పీఠార్చకములు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షియే చేయవలసి వచ్చెను. కుటుంబ సంరక్షణాభారము శ్రీమతి బాపనాంబగారిపై బడెను. మఱదులందఱును అన్యోన్యమైత్రితో మెలగుచుండుటగాంచి రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు ఇట్టివారే కాబోలునని బావనాంబగారు తలంచుచుండిరి. ఈమె మహర్షి పత్ని వలె భర్త పాదములు సేవించుచు పతివ్రతా ధర్మముల నెఱపుచుండెను. మహర్షి సోదరు లందఱును బాపనాంబగారని మాతృభావముతో గౌరవించుచుండిరి. బాపనాంబగారు తమ మఱదుల నందఱిని పుత్ర వాత్సల్యముతో ఆదరించుచుండిరి.

కుటుంబము పెద్దదగుటచేతను ఇల్లు చిన్నదైయుండుట చేతను మహర్షులవారు యోగసాధనలు గావించుకొనుటకును, తపస్సు చేసికొనుటకును ఏకాంత ప్రదేశములేక అటుకపై గూర్చుండి హఠయోగ సాధనలును, తపస్సును చేసికొనుచుండిరి.

మహారణ్యములలోను కొండ గుహలలోను స్వేచ్ఛా విహాఆర మొనర్చి దైవవశమున గృహస్థాశ్రమము స్వీకరించిన శ్రీమహర్షులవారు సామాన్య

గృహస్థులు తిను నాహార పదార్థములు మాత్రమేకాక ఉస్తికాయలకూరలు, అవిసెయాకు కూరలు, అవిసెపువ్వు కూరలు, అవిసెకాయల కూరలు, బలుసు ఆకు పచ్చడి, వేపాకు, ముషిణికాయలు, కాకిదొండపండ్లు, మారేడు చిగుళ్ళు, మారేడుకాయలు, మారేడుపండ్లు తినుచు నిరంతర రామ సాక్షాత్కారములను పొందుచు కాలము గడుపుచుండిరి. వీరు తపస్సు పూర్తి చేసి భుజించు సమయమునకు ఏకాదశిరోజున ఒక కుక్కవచ్చి నిరీక్షించుచుండెడిది. శ్రీరాముడు కుక్క రూపమున వచ్చియున్నట్లు గ్రహించి తాము చేయు భోజన పదార్థమంతయును కుక్కకు పెట్టుచు భోజనము చేసినట్లు నటించుచు ఇంటిలోనివారి కెవ్వరికిని ఈ రహస్యమును వెల్లడి చేయకుండిరి. తల్లిగారు జీవించియున్నపుడు కూడ ఏకాదశీ వ్రతోపవాసములు చేయుచు భోజనము చేయుచున్నట్లు నటించి కుక్కకు ఆ భోజన పదార్థముల బెట్టుచునే పండ్రెండు సం॥రములు తపోదీక్షను సాగించిరి.

పామర్రులో కోడూరి వెంకయ్య అనునొక బాల్యమిత్రుడుండెను. బడిలో వేసినది మొదలు వీరిద్దఱును కృష్ణార్జునులవలె పరమమైత్రితో మెలగుచుండిరి. కొంతకాలమునకు కోడూరి వెంకయ్యగారు మహర్షులవారికి శిష్యులైరి. వీరిద్దఱును నిత్యమును రాత్రివేళ జాము తెల్లవారగట్లనే లేచి పామర్రునకు మూడుమైళ్ళ దూరములోగల కోరుమిల్లి దగ్గఱకు వెళ్ళి గోదావరిలో స్నానముచేసి సూర్యోదయము కాకుండగానే పామర్రు చేరుచుండిరి. వీరిద్దఱును పగటివేళల నూరి వెలుపలికి వెళ్ళి తత్త్వ విచారణ చేసికొందురు. వీరి నగవడి ఎవరికిని దెలియకుండగ రహస్యముగానే జరుగుచుండెను. శ్రీమహర్షులవారు విజనప్రదేశములలో సంచరించునపుడు శ్రీరాముడు ధనుర్ధరుడై మహర్షి పాదములు త్రొక్కుచు వెంబడించుచుండుట నిత్యమును పరిపాటి. వీరు గోదావరికి స్నానమునకు

వెళ్లునపుడు జనసంచారము లేక తలక్రిందు పక్షులు నివశించు మఱ్ఱి చెట్లుగల చోట్లకు వెళ్ళి గోదావరి రెల్లుదుబ్బుల మధ్య కూర్చుండి జపము చేసికొనుచుందురు. వీరు నిత్యమును స్నానము చేయుచోట గోదావరిలో భయంకరమగు మొసళ్లుగలవు. ఒకనాడు తెల్లవారగట్ల స్నానముచేసి నీటియొడ్డున గూర్చుండి తపస్సు ప్రారంభించిరి. శ్రీరామచంద్రుడు చిఱునవ్వుతో ఎదుటనే కూర్చుండియుండెను. కొంతసేపు జపము అయిన తర్వాత మహర్షులవారి ప్రక్కనే రెల్లు దుబ్బులలో పండుకొనియున్న భయంకరమగు పెద్ద మొసలి గుభాలున నీటిలో దుమికి ఈదులాడుచుండెను. కనులు తెఱచి చూచుసరికి ఎదుట శ్రీరామచంద్రుడు కూర్చుండి యుండెను. మొసలి యీదులాడుచు కొంతదూరమేగి అదృశ్యమయ్యెను.

శివగురుభట్టు కుమారుడుగా నవతరించిన శ్రీ శంకరాచార్యస్వామి ఒకనాడు పూరా&ణనదిలో స్నానము చేయుచుండగా నొక మొసలి కాలుపట్టుకొని లోనికి లాగుచుండెను. అంతకు పూర్వమాస్వామి సన్యసించుటకు అనుజ్ఞ నీయవలసినదిగా తన జననియగు ఆర్యాంబను కోరియుండెను. పుత్ర ప్రేమచే ఆమె అంగీకరింపదయ్యెను. అపుడు మొసలిబాధ పడలేక శంకరాచార్య స్వామి తన చెంతకు రప్పించి "జననీ! ఇప్పుడైనను సన్యసించుట కంగీకరింపుము. లేనిచో నా ప్రాణములు నిలువవు" అని ప్రార్థించెను. కుమారుని వైరాగ్య స్థితిని జూచి తల్లి అందులకంగీకరించెను. వెంటనే ఆ మొసలి ఆచార్య స్వామిని వదలి పోయెను. దేహాభిమానమున్నదా? పోయినదా? అని పరీక్షించుటకే మొసలి పట్టుకొనెను. సుబ్రహ్మణ్యమహర్షి గూడ శంకరావతారులు గనుకనే దేహాభిమానమున్నదా? పోయినదా? అని పరీక్షించుటకే మొసలి ప్రక్కన పరుండెను. సహజ విజా&ఞనియై శ్రీరాముని యెదుట కూర్చుండబెట్టుకొని

తపస్సు చేయుచున్న మహరి&ష జోలికి పోగూడదని ఆ మొసలి నీటిలో దుమికి తనదారిని తాను పోయెను.

కొంత కాలమైన తర్వాత కరుటూరి మునెయ్యగారు గురుస్వామికి శిష్యులైరి. మహర్షులవారు తపస్సమాధిలోనున్నపుడు పద్యములు, కీర్తనలు, తత్త్వములు, అప్రయత్నముగా వారి ముఖారవిందమునుండి వెలువడుచుండెను. అట్టి పవిత్ర సమయమును నిరీక్షించు మునెయ్యగారు కాగితములపై వ్రాసి భద్రపఱచుచుండిరి. ఇప్పుడు లభ్యమైన మహర్షి రచనలన్నియును శ్రీ కరుటూరి మునెయ్యగారి శ్రద్ధాభక్తుల వలన లభించినవే.

శ్రీ కోడూరి వెంకయ్యగారికిని శ్రీ కరుటూరి మునెయ్యగారికిని మహర్షి బోధించు తత్త్వబోధ అపూర్వముగా నుండెను. ఆ విషయము క్రమక్రమముగా పామర్రు గ్రామస్థులలో ప్రాకెను. అందుచే కొంతకాలమునకు దేవరపల్లి వీరన్నగారి కుమారుడు కృష్ణయ్యగారును, ఆయన తమ్ముడు బాపయ్య (తాత) గారును, పిమ్మట బాపయ్యగారి కుమారుడు శ్రీరాములుగారును, దేవరపల్లి పట్టాభిరామయ్యగారును, దేవరపల్లి పెదబాపయ్యగారును, దేవరపల్లి వెంకప్పగారును, దేవరపల్లి వెంకటరత్నంగారును, చిట్టూరి వెంకటరాఘవులు గారును, పెద్దింటి జగన్నాధాచార్యులుగారును, సిరిపెల్ల వెంకటరామన్నగారును, నాళం కామయ్యగారును మహర్షికి శిష్యులైరి. వారందఱును మధ్యాహ్నము మూడుగంట లగుసరికి మహర్షి గృహమునకు వచ్చి తత్త్వబోధ వినుచుందురు. మహర్షి బోధలే కోడూరి వెంకయ్యగారు ఆమరణాంతమును బ్రహ్మచారిగా జీవయాత్ర సాగించునట్లు చేసినవి.

పామర్రునకు సమీపమునగల కూళ గ్రామవాసులు కొందఱు మహర్షికి

శిష్యులైరి. చిట్టూరి రంగయ్య (తాత) గారును. చిట్టూరి సుబ్బారాయుడుగారును, చిట్టూరి వెంకట మహీపతి భువనైక రావుగారును, దేవరకొండ సూరయ్యగారును. వారి పుత్రులును, గుడిమెట్ల సూరయ్యగారును, ముష్టి బాపన్నగారును శిష్యులైరి. కూచి బ్రహ్మయ్యగారును, శొంఠి వెంకటరమణశాస్త్రి గారును సాయంకాలము దంగేరులో భోజనముచేసి పామర్రు వెళ్ళి రాత్రవేళ ప్రశాంతముగా గురుదేవుని బోధామృతము గ్రోలి తెల్లవారు సరికి దంగేరు వెళ్ళుచుండువారు.

# శ్రీ పొట్టి స్వాములవారితో మహర్షి మైత్రి

"బాబఁ కోకిల" అను పేరుగల యొక మహారాష్ట్ర బ్రాహ్మణ బ్రహ్మచారి క్రీ॥వ॥ 1645 సం॥రము పూనాలో జన్మించియుండెను. ఆయన మహావిద్వాంసుడై పూనాలోని శ్రీమంతువద్ద దివానుగా నుండిరి. క్రీ॥శ॥ 1705 సం॥రములో పూనాకోట తురకల స్వాధీనమయ్యెను. ఆ సమయమున కోటలోగల దేవతా విగ్రహము వెనుకకు తిరిగి యుండెను. శ్రీకృష్ణమూర్తి ఎల్లపుడును తనకు అభిముఖముగా సాక్షాత్కరించి దర్శనమిచ్చుచుండువాడు. కాని ఆ రోజున శత్రుపక్షములో జేరి తనకు ఎదురుగా వచ్చుచున్నట్లు సాక్షాత్కరించి దర్శనమిచ్చెను. అపుడు శ్రీమంతుగారు కోటలు తెరువుడనియు, అంతఃపుర స్త్రీలను అగ్ని కుండమున ప్రవేశపెట్టుడనియు ఆజ్ఞాపించిరి. కోట శత్రువుల స్వాధీనమయ్యెను. అప్పుడు "శ్రీ బాబ్‌కోకిల" గారుసన్యసించి పొట్టి స్వాముల వారని ప్రసిద్ధిగాంచిరి. ఆయన గాయత్రీ మంత్రోపాసకులును, గొప్ప

హఠయోగియునై యుండిరి. సన్యసించునాటికి శ్రీ పొట్టి స్వాములవారు అరువది సం॥రముల వయస్సులో నుండిరి. ఆయన దేశ సంచారము చేయుచు తెలుగుభాష గూడ నేర్చుకొని ఒకప్పుడు పామర్రు వచ్చిరి. అప్పటికే సుబ్రహ్మణ్య మహర్షి ప్రభావము లోకములో వ్యాపించి యుండెను. అందుచే శ్రీ స్వాములవారు పామర్రులో శ్రీ సుబ్రహ్మణ్య మహరి&ష గృహమునకే వచ్చిరి. ఆ రోజున ఒక మణుగు లేత బెండకాయలు తెప్పించి నేతితో వేయించి శ్రీ స్వాములవారికి భిక్ష చేసిరి. శ్రీ స్వాములవారు చూపఋలకు కాలాగ్ని రుద్రునివలె కాన్పించు చుందురు. సామాన్య గృహసు&థలు దగ్గఱచేరి తపస్సమాధులకు భంగము కావించెదరని అట్లు సంచరించుచుండుట స్వాములవారికి అలవాటు. ఈ రహస్యము సుబ్రహ్మణ్య మహర్షుల వారు గ్రహించి శ్రీ స్వాములవారి దయకు పాత్రులై యోగ సాధన రహస్యములను అభ్యసించుచుండిరి. ఒక సం॥ర కాలము శ్రీ స్వాములవారి సేవచేసి సుబ్రహ్మణ్య మహర్షి యోగవిద్యా రహస్యముల నభ్యసించిరి. ఒకప్పుడు పొట్టి స్వాములవారు దేశ సంచారము చేయుచు పాలకొల్లు వెళ్ళిరి.

సుబ్రహ్మణ్య యోగికూడ వారి వెంటనే యుండిరి. ఆ సమయముననే ఒక తహసీలుదారు పాలకొల్లులో మకాము చేసియుండెను. ఆ తహసీలుదారు బ్రాహ్మణుడై యుండుటచే శ్రీ స్వాములవారిని భిక్షకు పిలిచెను. స్వాములవారంగీకరించిరి. కాని మధ్యాహ్న సమయమున భిక్షకు పిలుచుటకై తహస్సీలుదారు తాను రాక తన నౌకరును పంపెను. అందుచే స్వాములవారాగ్రహించి తన మహిమను చూపనెంచి పాలకొల్లులో గల పదకొండు అంతస్థుల గోపురము చిట్టచివరకెక్కి హఠయోగ మహిమచే గోపురము మీద నుండి ఇవతలకు ఇరువది గజముల దూరము ఆకాశములోనికి వచ్చుచు మరల గోపురము మీద వ్రాలుచుండిరి. జనులు

తండోపతండములుగా గుమిగూడి చూచుచుండిరి. గోపురము పైనుండి హుంకరింపుచు "ఆ యధికారి గర్వమదమడంచెదను;" అని గోపుర పై భాగమునుండి నిరాలంబములోనికి వచ్చుచు కేకలు వేయుచు గోపుర శిఖరముపై వ్రాలుచుండిరి. ఆ సంగతి తెలిసికొని తహస్సీలఎదారఎ భయపడి ఒక మేనా యెక్కి ఊరి బయటికి పోవుచుండెను. శ్రీ స్వాములవారు నిరాలంబములో గేగవలె పోవుచు మేనాను వెంబడించిరి. అంత తహస్సీలఎదారఎ భయపడి దుఃఖ సముద్రములో మునిగియుండుట కనిపెట్టి శ్రీ స్వాములవారు గోపురముపై వ్రాలి శాంతించి మకాము చేరుకొనిరి. ఈయన దేశ సంచారము చేయుచు పలుచోట్ల అనేకాద్భుత లీలలు లోకులకు చూపి యుండిరి. శ్రీ స్వాములవారు 255 సం॥రములు జీవించి క్రీ॥శ॥ 1900 సం॥రమునకు సరియగు ఖర సం॥ర మార్గశిర మాసమందు తూ॥గో॥ జిల్లా రాజోలు తాలూకాలో చేరిన విశ్వేశ్వరాయపురమున సిద్ధిపొందిరి. స్వాములవారి శిష్యులు మొన్న మొన్నటివఱకును అచట వారి యారాధనోత్సవములు చేయుచున్నారు. స్వాములవారు చరమదశలో వాడిన పాదుకలు ప్రస్తుతము రాజమండ్రీ నివాసులగు శ్రీ వాజపేయం సుబ్రహ్మణ్య శాస్త్రిగారి వద్ద గలవు. శ్రీ స్వాములవారు కోటి గాయత్రీ పురశ్చరణము చేసినట్లు ప్రతీతి. ఇట్టి మహత్తర యోగ సామ్రాజ్యాభిషిక్తుల చెంత సుబ్రహ్మణ్య మహరి&ష యోగ సాధనలు గావించుట మహాభాగ్యముగదా!

# గోవిందరాజుల రామప్పగారు శ్రీ మహర్షికి దెల్పిన విషయములు

గుంటూరు గ్రామమున గోవిందరాజుల రామప్పగారు నివసించు చుండిరి. ఆయన గొప్ప భూస్వామియై యుండి యెనుబది నాల్గువేల రూపాయల రొక్కము గూడ గడించియుండిరి. ఆయన సంస్కృతము, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో కూలంకష ప్రజ్ఞగల గొప్ప పండితులు, దేవబ్రాహ్మణభక్తి పరోపకార దీక్ష, ధర్మకార్యాచరణము. పేదలయందు కనికరము ఆయనకు పుట్టుకతో వచ్చిన సహజ సద్గుణములు, మఱియు సూత్రభాష్యము, గీతా భాష్యము,ఉపనిషద్భాష్యముల యందు మిగల పాండిత్యము గడించియుండిరి. ఆయన నిత్యమును సూర్యోదయమునకు పూర్వమేలేచి స్నాన సంధ్యాద్యనుష్ఠానములు నెరవేర్చుకొని నిరంతర పరబ్రహ్మ సమాధినిష్ఠా గరిష్ఠులై కాలము గడుపుచుండిరి. తీరికవేళలయందు శిష్యులకు ప్రస్థానత్రయము పాఠములు చెప్పుచుందురు.

వీరి ప్రఖ్యాతి ఖండాంతరవాసులకు గూడ దెలిసెను. అందచే కొందఱు యూరోపియనులు వేదాంతవిషయములలో గల్గిన సందేహ నివృత్తికి వీరి వద్దకు వచ్చి సందేహములు తీర్చుకొనుచుండిరి. కొంతమంది యూరోపియనులకు గూడ వీరు ప్రస్థానత్రయము పాఠము చెప్పియుండిరి. వీరి వద్ద ప్రస్థానత్రయము చదివిన యొక దొరయు, ఒక దొరసానియు, పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు తాలూకాలో చేరిన ప్రక్కిలంకలో ఆశ్రమములు ఏర్పఱచుకొని తత్త్వ విచారణ చేసికొనుచుండిరి. వారిద్దఱును భార్యాభర్తలుగారు. కేవలము తత్త్వము తెలిసికొనుటకు మాత్రమే హిందూదేశము వచ్చిన జ్ఞానులు.

కొంత కాలమునకు రామప్పగారికి భార్యా వియోగము కల్గెను.

అప్పటికి వీరికి పుత్రపుత్రికా సంతాపము లేకుండెను. ఒకనాడు దొరలకు ప్రస్థానత్రయము పాఠము చెప్పి యింటికి వచ్చు సరికి గొప్ప వర్షము కురిసెను. వంటచెఱకు తడసిపోయెను. వండి పెట్టుటకు ఎవరును సహాయులు లేకుండిరి. అందుచే రామప్పగారే పొయిమీద వంటగిన్నె పెట్టి మంట చేయసాగిరి. తడిపుల్లలగుటచేత ఆ రోజున అన్నము పచనము కానేలేదు. ఆ సమయమున రామప్పగారి మనస్సునందు గొప్ప విరక్తి కల్గెను.

"ఆహా! ఏమిది! నాకు సంపదకు లోటులేదే! వండి పెట్టు దిక్కు లేకపోయెనే! ఎంత కాలము బ్రతికినను చివరకు తేలు సంగతి యేమి? ఈ జన్మమెందుకు వచ్చినది? తిరిగి యేమి జన్మమెత్త వలయునో కదా! ఓ పరమేశ్వరా! నన్ను పరీక్షించుటకీ సంఘటనము కల్పించితివా? నీ మాయ తెలియనెవరి తరము? సర్వలోక రక్షకుడకు నిన్నాశ్రయించినగాని ముక్తి లేదు. నాకీ భోగభాగ్యములు నేటితో సరి. అవి విరక్తి చెంది తమ చరస్థిర రూపమైన యావదాస్తిని దేవ బ్రాహ్మణులకును, బీదసాదలకును ధర్మము చేసిరి. పదునెనిమిది వేల రూపాయలు మాత్రము తమ వద్దనుంచుకొని మహర్షులను, యోగులను,అవధూతలగారితో ఏబది ముగ్గురు సహచరులు గూడ బయలుదేరిరి. వారు పుణ్యక్షేత్రములు సేవించుచు పంచకాశీలు దర్శించిరి.

1. మునికాశి, 2. యోగకాశి, 3. గుప్తకాశి, 4, ఆధ్యాత్మకాశి 5. వ్యాసకాశి, అనునవి పంచాకాశీలు.

1. మునికాశి :- మునికాశీలో వేలకొలది మునులు తపస్సు చేయుచుందురు. వారు మౌనమవలంభించియుందురు. కొద్దిమంది మాత్రము మాట్లాడు స్వభావము గల మునులుండిరి. రామప్పగారు ఆ మునులతో వేదాంత విషయములను గూర్చి ప్రసంగించిరి. వారందఱును

బాహ్య ప్రపంచ మెఱుగని తన్మయత్వ స్థితిలో నుందురు. అచటనుండి యోగకాశి బయలుదేరిరి.

2. యోగకాశి :- ఇచట హఠయోగులును, లంబికా యోగులును, ఊర్ధ్వబాహులునైన మునులు, నిరాలంబమందు నిలిచి ప్రపంచ మెఱుగక తపస్సు చేయుచుందురు. అచటి నుండి గుప్తకాశీ బయలుదేరిరి.

3. గుప్తకాశి :- ఇచట చాలమంది మహర్షులు గలరు. వారెవరితోను మాట్లాడరు. వారిలో నొక మహాముని వీరాసనముపై గూర్చుండి రెప్పవాల్చక తదేకధ్యానములో నుండెను. ఆ మునిని పరీక్షించుటకు రామప్పగారు మూడు మాసములచ్చటనే నిరీక్షించియుండిరి. ఆ మూడు మాసములలోను ఆ ముని స్నానపానాదులకు లేచినట్లుగాని, ఆహారము తీసికొనునట్లుగాని కొంచెమైనను జాడ తెలియలేదు. తుదకొక నాడు సందేహము తీరక రామప్పగారు ఆ ముని చుట్టును సుద్ధతో గీతలుగీచిరి. అప్పుడైనను ఆ మహర్షి కదలినజాడ తెలియలేదు. ఆ లక్షణములు చూచి తన్మయత్వసిద్ధిలో ఆ మహర్షి యుండినట్లు రామప్పగారు తలచిరి. అచటనుండి ఆధ్యాత్మిక కాశీ బయలుదేరిరి.

4. ఆధ్యాత్మికకాశి :- ఇచట చాలమంది మునులు గలరు. ఇచట మంచుగడ్డలతో గప్పబడిన ఒక దేవాలయము గలదు. ఆ దేవునికి ప్రతిదినమును పూజలు మొదలగునవి జరుగవు. మహాశివరాత్రినాడు మాత్రమే యటచ పూజలు జరుగును. ఆ రోజున ఆ దేవుని దర్శించుటకు గునపములతో మంచుగడ్డలు పెల్లగించి తీసివేసి దేవుని పూజింతురు. అచ్చకులు గూడ ఆ ప్రాంతమందెచ్చటను నివసించలేదు. శిరారాత్రినాడు మాత్రమే అచ్చటికి వచ్చి దేవుని పూజించి వెళ్ళుచుందురు. అట్టి శివరాత్రి పర్వదినమునకే రామప్పగారు ఆధ్యాత్మికాశి చేరిరి. ఆయన వెళ్ళుసరికి గుణపములతో మంచుగడ్డలు పెల్లగించి దేవాలయము తలుపులు

తీయుచుండిరి. తలుపులు తెరచుసరికి గర్భాలయములో నందీద్వీపము అఖండముగా వెల్గుచుండెను. ఓషధి విశేషములతో తయారు కాబడిన తైలముతో అచటి మునులు దీపముపెట్టి యుందురని రామప్పగారు తలచిరి. సంవత్సరమున కొక్కసారి శివరాత్రి రోజున మాత్రమే అర్చకులు తలుపులు తీసి పూజించుటయు, గాలిచొరని గర్భాలయమున సంవత్సరము పొడుగుననే నందాదీపము వెల్గుచుండుటయు, చూచిన తోడనే రామప్ప గారు మిక్కిలి యాశ్చర్యపడిరి. అచటనున్న మునులు చిరకాలమునుండి తపస్సు చేసికొనుచు సమాధిలో నున్నట్లు అచటివారు రామప్పగారితో చెప్పిరి. ఆ మునులెవ్వరితోను మాట్లాడరు. అచటి విశేషములన్నియు జూచి రామప్పగారు వ్యాసకాశీ వెళ్ళిరి.

5. వ్యాసకాశి :- పూర్వమొకప్పుడు వ్యాసుడు పదివేలమంది శిష్యగణముతో కాశీపట్టణమున నివశించుచు భిక్షాటనము చేసి జీవయాత్ర సాగించుచు తపస్సు చేసుకొనుచుండెను. వ్యాసుని శమదమాది సద్గుణములు పరీక్షించుటకొక రోజున శ్రీ విశ్వనాధుడు భిక్షాన్నము దొరక కుండునట్లు చేసెను. అపుడు వ్యాసుడు కోపించి కాశీపురము దగ్ధమగునట్లు శపించుటకు హస్తమునందు ఉదకము పట్టియుండెను. అది గనిపెట్టి విశ్వనాధుడు ప్రత్యక్షమై వ్యాసుని చేయిపట్టుకొని “ఓ వ్యాసా! మునులకుండ వలసిన శమదమాది సద్గుణములు నీకింకను పట్టుబడలేదు. నీ విచ్చట నుండుటకు తగవు. నేడే యీ పురము వదలి పొ”మ్మని చెప్పెను. వెంటనే వ్యాసుడు పదివేలమది శిష్యులతోను బయలుదేరి గంగానది యావలిఒడ్డున నొక పట్టణము కట్టుకొనెను. అదియే వ్యాసకాశి. రామప్పగారా వ్యాసకాశి గూడ వెళ్లిరి. అచటనొక నావపై నొక యోగీశ్వరుడుండెను. ఎండవానలు, దివారాత్రములు ఎఱుగక సర్వకాల సర్వావస్థలయందును ఆ యోగి ఆ నావలోనే గూర్చుండి తన్మయత్వ స్థితిలో నుండును. ఆహార పానీయము

లెవరైనను తీసికొని వచ్చినను ఆ యోగి స్వీకరించడు. ఒకప్పుడొక భక్తుడు వచ్చి "మహానుభావా! నోరు తెరువుడు. ఆహారము స్వీకరింపుడు" అని మిక్కిలి ప్రార్థింపగా కొంచెము నోరు తెరచి యీ పదార్థము స్వీకరించెను.

ఆ కాశీ లైదును ఉత్తర హిందూదేశమున గలవు. అట్టి పుణ్యక్షేత్రములన్నియు సంచారము చేసి అచటనున్న మహర్షుల యొక్కయు, యోగుల యొక్కయు, అనుభవములు తెలిసికొని రామప్పగారు తిరిగి తమ జన్మ స్థలమైన గుంటూరు చేరిరి. రామప్పగారితో బయలుదేరిన యేబదిముగ్గురిలోను పండ్రెండుగురు మాత్రమే సజీవులై తిరిగి వచ్చిరి.

రాజమండ్రిలో క్షేత్రముక్కుల వెంకయ్య అను పేరుగల యొక బ్రాహ్మణుడుండెను. ఆయన గోవిందరాజుల రామప్పగారికి ముఖ్య స్నేహితుడును. మహర్షి సోదరులైన వెంకన్నగారికి ముఖ్య స్నేహితుడును, మహర్షి సోదరులైన వెంకన్నగారికి శిష్యుడునై యుండెను. అప్పుడప్పుడు పామర్రు నుండి వెంకన్నగారు రాజమండ్రీ వెళ్లి క్షేత్రముక్కుల వెంకయ్యగారికి వేదాంత విషయములు బోధించుచుండెడివారు. ఒకప్పుడు వెంకన్నగారు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి విరచితమైన "అద్వైత రహస్యము" ను పట్టుకొని రాజమండ్రిలో క్షేత్ర ముక్కుల వెంకయ్యగారింటికి వెళ్ళిరి. ఆ సమయమునకే గుంటూరు నుండి గోవిందరాజుల రామప్పగారు తమ స్నేహితులైన క్షేత్రముక్కుల వెంకయ్యగారిని చూచుటకు రాజమండ్రీ వచ్చి యుండిరి. అందుచే శ్రీ మహర్షి సోదరులైన వెంకన్నగారి వద్దనున్న అద్వైత రహస్యమును శ్రీ గోవిందరాజుల రామప్పగారు సొంతముగ చదివిరి. అందున్న విషయములన్నియు మహార్షులయొక్కయు, యోగీశ్వరులయొక్కయు అనుభవములుగా నుండెను. అందుచే శ్రీరామప్పగారు సంతోష పరవశులై క్షేత్రముక్కుల వెంకయ్యగారితో రాజమండ్రీ నుండి బయలుదేరి గురుదేవుని దర్శించుటకు పామర్రు వెళ్ళిరి.

అప్పటికి శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తమ శిష్యుడైన కోడూరి వెంకయ్యతో కోరుమిల్లి దగ్గరకు గోదావరీ స్నానమునకు వెళ్ళి యుండిరి. అందుచే రామప్పగారు గురుస్వామి దర్శనమునకై వీధియరుగుపై గూర్చుండి నిరీక్షించుచుండిరి. మధ్యాహ్నము 12 గంటలగునప్పటికి శ్రీ గురువర్యులు ఇంటికి వచ్చి తమ తపో గృహములోనికి వెళ్లుచుండిరి. గురుదేవుని వెంబడించి లోనికేగి గురుదేవుని పీఠము ప్రక్క గూర్చుండిరి. కాని యెన్నడును పరిచయము లేని పురుషుడు స్వతంత్రించి లోనికి వచ్చుటయు, తమ సాన్నిధ్యమున గూర్చుండుటయు, గురుస్వామికి మానసికమైన బాధ కల్గించెను. కొంతసేపైన తర్వాత రామప్పగారు ప్రస్థాన త్రయమందలి వాక్యములు పలుకనారంభించిరి. గురుపుంగవులా వాక్యములు విని చిత్రాసనమిచ్చి కూర్చుండుడని సగౌరవముగ ఆదరించిరి.

పిమ్మట రామప్పగారు గురుదేవుని జూచి ‘‘అయ్యా! నేను పుణ్యక్షేత్రములు సేవించి పంచకాశీలు చూచితిని. అచటనున్న మునులును యోగులను దర్శించితిని. అ మునులు తమ యద్వైత రహస్యమందు చెప్పబడిన పద్ధతులనే అవలంబించి సమాధినిష్ఠలో నుండిరి. వారి హృదయములను బాగుగా గ్రహించితిని. గృహస్థులైన మీరు ఇంటివద్ద నేమి యాచరించుచుంటిరో వారుగూడ ఆ లక్ష్యమునే సాధించుచున్నారు. వారు సర్వకాల సర్వావ్యవస్థలయందును తన్మయత్వస్థితిలో నిల్చియున్నారు; మీరు ఒకటి రెండు జాములు సమాధి నిష్ఠాపరులై సాధించుచున్నారు. వారికిని మీకును భేదమిదియేగాని వేరొకటిగాదు. భ్రమపడి మీ రెక్కడికిని పోనక్కరలేదు. విషయగ్రహణమునందు మీరా మహామునుల కెంతమాత్రమును తీసిపోలేదు. అన్ని భ్రాంతులు విడిచి యిట్లే యింటివద్ద తత్త్వ విచారణ చేసికొనుచుండుడు. నేను నెల రోజులలో సన్యస్తమార్గము స్వీకరింపదలచి యున్నాను. ఆశ్రమ స్వీకారమైన పిమ్మట మరల

మిమ్ములను కలిసికొందును. కనుక మీరింటివద్దనే యుండి తపస్సు చేసికొనుచుండుడు". అని చెప్పి రెండు రోజులుండి శ్రీ రామప్పగారు పామర్రు నుండి గుంటూరు వెళ్లిపోయిరి.

పామర్రు నుండి వెళ్ళిన నెల రోజులకే రామప్పగారు సన్యసించి "బ్రహ్మానందస్వామి" అను దీక్షానామముతో వ్యవహరింపబడుచుండిరి. రాజమండ్రిలోను, హరిద్వారమునందును దక్షిణామూర్తి యొక్క ఆలయములు గట్టించిరి. మఱియు ఇతర పుణ్యక్షేత్రములయందు గూడ కొన్ని మఠములు గట్టించిరి. కొంత కాలమునకు బ్రహ్మానందస్వామి పామర్రువచ్చి శ్రీ సుబ్రహ్మణ్య మహర్షికి కొన్ని తత్త్వ రహస్యములు బోధించి వెళ్లిపోయిరి.

# మహర్షి యోగశక్తి ప్రభావము.

శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి మహిమా విశేషములు శిష్యులకు దప్ప ఇంటిలోనున్న సోదరులకు గూడ తెలియకుండగ మిగుల గూఢముగా నుండెను. వీరు నిరంతరము తపస్సులో నిమగ్నులై యుండుట గాంచి వారి సోదరులలో కొందఱికి కష్టము తోచెను. “మనమందఱము ఇట్లు రాత్రింబగళ్లు కుటుంబ పోషణమునకై పాట్లుపడుచుండగా మన సోదరుడు ఒక మూల ముక్కు మూసికొని తపస్సులో మునిగి కాన్పించుచున్నాడు. అతనికి మాత్రము కుటుంబమును పోషించవలసిన బాధ్యత లేదా!” అని తమలో తాము విదాదపడసాగిరి. అప్పటికి మహర్షి సోదరులలో వెంకన్నగారు మాత్రమే శ్రీవారికి శిష్యులై యుండిరి. వెంకన్నగారు నిరంతరము గురుసేవలో మునిగి తమ జీవితమును సార్ధకము చేసికొనుచుండిరి. ఒక రోజున గురుదేవుని వైరాగ్య లక్షణములను, కుటుంబ భారము వహించకుండుటయును జూచి మహర్షి సోదరులు మిగుల వివాదపడుచు గడబిడ చేయసాగిరి. అప్పటికి రాత్రి 12 గంటలయ్యెను. గురుపుంగవులా సమయమందు యోగ మార్గమున నిరాలంబమందు నిలిచి నిర్వికల్ప సమాధిలో నుండిరి. మహర్షి సోదరులైన వెంకన్నగారు మాత్రము గురుస్వామి తపస్సు చేసికొనుచుండు గది ప్రక్కనే కూర్చుండి యుండిరి. గురుపుంగవులు నిరాలంబమందుండుట కనిపెట్టి వెంకన్నగారు తమ తల్లిగారగు శేషాంబగారికి జూపిరి. ఎన్నడును కుమారుని ప్రభావము చూచియుండకపోవుటచే ఆమె ఆశ్చర్యపడి నిశ్చేష్టురాలయ్యెను. సోదరుల వలన గల్గిన వాదోపవాదములు గురుదేవుని చెవిని బడెను. ఇచ్చట నున్నచో సమాధికి భంగము కల్గునని గురువర్యులు తలచిరి. తలుపులు బంధింపబడియుండెను. సోదరులందఱును మెలకువగానే యుండిరి. ఆ

గ్రామములో పట్టాభిరామస్వామి యాలయము గలదు. ఆ యాలయపు తాళములు బిగింపబడియుండెను. ఆ యర్థరాత్రివేళ శ్రీ గురువర్యులు యోగమార్గమున సూక్ష్మరూపము ధరించి పామర్రు గ్రామములోగల పట్టాభిరామస్వామివారి యలయమందు చేరి తపస్సు చేసికొనుచుండిరి. ఆలయమునకు అర్చకులైన శ్రీ పెద్దింటి జగన్నాథాచార్యులుగారు సూర్యోదయము కాకమునుపే వచ్చి దేవాలయము తలుపులు తాళము తీసిరి. అప్పటికి గురువర్యులు పట్టాభిరామస్వామి ప్రక్క గూర్చుండి తపస్సు చేసికొనుచుండిరి. ఆ యద్భుతము చూచి శ్రీ జగన్నాథాచార్యులుగారు గ్రామములోనివారికి చెప్పగా జనులు తండోపతండములుగా వచ్చి చూడసాగిరి. అపుడు గురువర్యులు స్నానమునకు వెళు&ళ మిషతో నచట నుండి బయలుదేరి కోరుమిల్లి లాకులదగ్గరకు గోదావరికి స్నానమునకు వెళ్ళిపోయిరి. అప్పటినుండియే సోదరులందఱును గురువర్యులను మహత్తర శక్తి సంపన్నులుగా గ్రహించి గౌరవింపసాగిరి.

## శ్రీ మహర్షి పామర్రు దేవాలయములో నుండి అదృశ్య రూపమున బయటికి వచ్చుట

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి మహిమా విషేషములు ఒకరినోట నుండి మఱియొకరికి మెల్లమెల్లగా పామర్రు గ్రామములోని వారిలో వ్యాపించెను. అందుచే శిష్యులు కొందఱు గురు మహిమను చూడగోరి గురువర్యుల చెంతకు వెళ్ళి ‘‘స్వామీ! తాము ఈ రోజున పట్టభిరామస్వామి దేవాలయములో గూర్చుండి తపస్సు చేసికొనుడని ప్రార్థించిరి. శిష్యుల వినయ విధేయతలు చూసి గురుస్వామి దరార్ద్రహృదయులై తపస్సు చేసికొనుటకు దేవాలయములో ప్రవేశించిరి. లోపలనున్న గడియబడిగించి గురువర్యులు తపస్సు ప్రారంభించిరి. ఆలయ ద్వారమువద్ద గుమ్మమున కడ్డముగా శిష్యులు గుమిగూడియే యుండిరి. ఉదయము ఎనిమిది గంటల

ప్రొద్దెక్కెను. ఆలయమునకు చేరి ఉత్తర దిశయందు ఒక పెద్ద చెఱువు గలదు. కొంతసేపైన తర్వాత గురువర్యులా చెరువులో నొకమూల స్నానము చేయుచు సూర్యభగవానునికి అర్ఘ్యప్రదానము చేయుచుండిరి. తలుపులు బంధింపబడియుండగనే ఎవరికిని తెలియకుండగ దేవాలయము నుండి యీవలికి వచ్చి చెరువులో స్నానము చేయుట ఎట్టివింత! ఆ యద్భుత లీల చూచి జనులు మహాతపస్విగా భావించి గౌరవింప సాగిరి.

ఒకప్పుడు మహర్షి పశ్చిమ గోదావరిజిల్లా తణుకు తాలూకాలో చేరిన దువ్వ గ్రామము వెళ్ళి తమ శిష్యులైన మునుకుట్ల వీరయ్యగారి యింటిలో నొక గదిలో కూర్చుండి జపము చేసికొనుచుండిరి. మహర్షి తపస్సు చేసికొనునప్పుడెవ్వరును లోనికి వెళ్ళగూడదు. ఒకనాడు మహర్షి తాము తపస్సు చేసికొను గదికి లోపల తలుపు గడియవేసికొనుట మరచి యోగ సమాధిలో ప్రవేశించిరి. ఆ గ్రామములోనే మహర్షి పెదతల్లి కుమారులైన గోవిందరాజుల సుబ్బారాయుడుగారు గలరు. గురుస్వామిని భోజనమునకు పిలుచుటకై సుబ్బారాయుడుగారు మునుకుట్ల వీరయ్యగారి యింటికి వెళ్ళి తలుపు గెంటిరి. అపుడు గురుస్వామి నిరాలంబమందు నిలిచి సమాధినిష్ఠలో నుండిరి. ఆ స్థితిలోనున్న మహర్షిని జూచినంతనే సుబ్బారాయుడుగారు భయపడి వెఱ్ఱికేకలు ప్రారంభించిరి. హఠయోగము స్వాధీనములో నుండుటచే నిరాలబంమునుండి క్రిందికి దిగివచ్చి నేలపైవ్రాలిరి. కాని ఒక ప్రక్క యెముక జారిపోయెను. పదునాల్గు సంవత్సరములు ఆ యెముక బాధననుభవించి  యోగసాధనచేతనే ఆ యెముకను సర్దుకొనగల్గిరి.

మఱి యొకప్పుడు మహర్షి పుంగవులు రాజమండ్రిలో నుండవలసి వచ్చెను. ఒక రోజున అర్ధరాత్రివేళ గురుస్వామి గోదావరి యొడ్డున గూర్చుండి యోగ సమాధిలో ప్రవేశించిరి. అపుడు జరిగిన విశేషమేమనగా గురువర్యులు యోగబలముచే ఆకాశములోనికి వెళ్లిరి. అప్పుడు దక్షిణ

దిశనుండి గాలి గట్టిగా వీచుచుండెను. ఆ గాలికి గురువర్యులు గోదావరి వంతెన దాటి ఆకాశమార్గమున కొవ్వూరు దగ్గరకు వెళ్లుసరికి దేహస్మృతి కల్గెను. మరల యోగ మార్గము ననుసరించి రాజమండ్రి చేరిరి. ఆ దృశ్యము మహర్షి శిష్యులైన శ్రీ గుండు చలపతిగారు చూచిరి.

మఱియొకప్పుడు మహర్షి పుంగవులు కొవ్వూరునకు నాల్గుమైళ్ల దూరములోనున్న “ఆరిక రేపల” అను గ్రామము వెళ్లిరి. అప్పుడు వర్షకాలమగుటచే గోదావరినది పొంది ప్రవహించుచుండెను. ఆ సమయమున గురుస్వామి గోదావరినదిలో నీటిపై నారాయణాసనము వేసి యోగ సమాధిలో ప్రవేశించిరి. అందుచే దేహస్మృతి లేక నీటిపై హంసవలె మహాప్రవాహములో వచ్చుచుండగా జనులందఱును తండోపతండములుగా గురుదేవుని చూచి యాశ్చర్యపరడసాగిరి. అట్లు నీటిపై నాల్గు మైళ్ళ దూరము క్రిందికి వచ్చిరి. అప్పటికి దేహస్మృతి కల్గుటచే మరల అరికరేవల వెళ్ళి తమ కమండలము తెచ్చుకొనిరి.

ఒకప్పుడు మలకపల్లె వెళ్ళి సమీపమున గల గోదావరిలో పద్మాసనము వేసికొని నీటికెదురుగా వెళ్లుచుండిరి. అప్పుడుగూడ వందల కొలది జనులు గుమిగూడి చూచిరి.

మఱియొక్కప్పుడు కోటిపల్లి దగ్గర గోదావరిలో నీటిపై నడచి యావలికి వెళ్ళిరి.

ఒకప్పుడు శ్రీ గురుదంపతులు ద్రాక్షారామ శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించుటకు వెళ్ళిరి. అపుడు శ్రీ గురువర్యులు సప్త గోదావరములో స్నానముచేసి పిమ్మట నీటిపై పద్మాసనము వేసి సత్త గోదావరములో గట్టు నాల్గువైపులకును హంసవలె తేలియాడిరి.

శ్రీ మహర్షి శిష్యులైన కూచి బ్రహ్మయ్యగారితో చెప్పిరి. అందుచే

బ్రహ్మయ్యగారు గుర్వాజ్ఞానుసారముగా దంగేరు వెళ్ళి తమ స్వగృహము చేరిరి. అంతకు పూర్వమే శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులు కూచి బ్రహ్మయ్యగారి యింటిలో తపోనిష్ఠాగరిష్ఠులై యుండిరి. మార్గమధ్యమున వెనుక ఆగియున్న గురువర్యులు తమకంటె ముందుగా దంగేరులోగల తమ స్వగృహమున నుండుటగాంచి గురువర్యులకు నమస్కరించి "అయ్యా! తాము నాకంటె ముందుగా నిచటికెట్లు వచ్చితి" రని ప్రశ్నించిరి. "నాయనా! యోగమార్గమున అదృశ్య రూపుడనై నీకంటె ముందుగా మీ యింట ప్రవేశించితిని" అని గురువర్యులు చెప్పిరి. ఆ గురులీలకు శ్రీ కూచి బ్రహ్మయ్యగారు అద్భుతాయత్తచిత్తులై పరమానందమునందిరి.

# శ్రీపాద రామశాస్త్రిగారి శిష్యత్వము.

తూర్పు గోదావరిజిల్లా అమలాపురం తాలూకాలో చేరిన గుమ్ములూరులో శ్రీపాద రామశాస్త్రి యనునొక గొప్ప తర్కపండితుడుండెను. ఆయన తర్కశాస్త్రమందు కూలంకష ప్రజ్ఞావిశేష ధురంధరులై సకల సంస్థానములలోను, పండిత సభలలోను విజయమంది "తర్కమదగజ కంఠీరవము" అను బిరుదాంకితులై దేశమున గొప్ప ఖ్యాతిగాంచిరి. ఆయన ఒకప్పుడు కాశీపట్టణమున జరుగు పండిత సభకు ఆహ్వానింపబడిరి. అందుచే ఆయన కాశీపట్టణమున జరుగు పండిత సభకు వెళ్ళిరి. అచట పండితులు గావించు వాగ్వాదములో శ్రీ రామశాస్త్రిగారు పాల్గొనిరి. అచటగల పండితులు శాస్త్రార్థములో శ్రీరామశాస్త్రిగారిని ఓడించిరి. అందుచే రామశాస్త్రిగారు తమకు గల్గిన యవజయముచే నీర్ష్యచెంది అభిమాన ప్రేరితులై నవద్వీపము వెళ్ళి తర్క శాస్త్రమును మరల కూలంకషముగా చదివి అఖండ పాండిత్యము గడించి, కాశీవచ్చి, మరల

పండితసభ చేయించిరి. ఆ సభలో రామశాస్త్రిగారు శాస్త్రార్థములో అచటగల పండితులనందఱిని ఓడించిరి.

ఆ కాశీపండితులు తమకు గల్గిన యపజయమునకు ఈర్ష్య చెంది రామశాస్త్రిగారిని పరాభవింపదలచిరి. కాని, బహిరంగముగా ఏమి చేయుటకును వీలు లేకపోయెను. అపుడా పండితులు బంగారు పాలకీలో కూర్చుండబెట్టి రామశాస్త్రిగారిని ఊరేగించుచు బ్రహ్మరధము పట్టిరి. కాని రామశాస్త్రిగారా పాలకిలో గూర్చుండి మిగుల దుఃఖించుచు "ఆహా! నాకెందులకీ గౌరవము సంభవించినది? పరాభవేర్ష్యతో చేయుచున్న ఈ గౌరవము సంభవించినది. పరాభవేర్ష్యతో చేయుచున్న ఈ గౌరవము సంభవించినది. పరాభవేర్ష్యతో చేయుచున్న ఈ గౌరవము నాకే ప్రమాదము కల్గించునోకదా" అని మిగుల దుఃఖించిరి. నాటి నుండియే వారికి శాస్త్ర చర్చలపై నుత్సాహము నశించెను. "ఆహా! నా జీవితమంతయును నిరుపయోగమైన చర్యలతోనే గడచిపోయినది. తత్త్వజ్ఞాన మావంతయు నాకు కలుగలేదే" అని యొక్కసారి యెలుగెత్తి విలపింపసాగిరి. ఆర్తితో గూడిన భక్తిగల్గినపుడు భగవంతునికి దయపుట్టకమానునా!

కాశీలో వీరొకనాడు తత్త్వజిజ్ఞాసతో గూడిన యార్తితో తిరుగుచుండగా గంగానదియొడ్డున యొక దిగంబర సన్యాసి కాన్పించి "శివపంచాక్షరీమంత్రము" ఉపదేశించెను. అది జరిగిన కొన్ని రోజులకు రామశాస్త్రిగారు కాశీనుండి తమ స్వగ్రామమైన గుమ్మలేరు వచ్చిరి. అప్పుడు శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి ప్రభావమెట్లో రామశాస్త్రిగారికి తెలియవచ్చెను. అందుచే శ్రీపాద రామశాస్త్రిగారు ఒకనాడు శిష్యగణముతో బయలుదేరి పామఱ్ఱు వచ్చిరి. అప్పుడు శ్రీగురువర్యులు తమ శిష్యులకు జ్ఞానోపదేశము చేయుచుండిరి. ఆ శుభసమయముననకే రామశాస్త్రిగారుగూడ గురుసన్నిధిని చేరిరి.

ఆ సమయమున శ్రీగురుస్వామి తమచే రచింపబడిన “అద్వైత రహస్యము”లోని

ఆ.వె. తర్క శాస్త్రశరధిఁ – దరచివోధించినఁ।
బరమపదము దనకుఁ – బట్టుపడునె ।
అప్రతర్క్యమనుచు – నా శ్రుతి దెలియరు
రఘుకులాబ్ధిశోమ – రామనామ ॥

అని చదువుచుండిరి. ఆ పద్యములు విని రామశాస్త్రిగారి శిష్యులు ఆ తత్త్వము గ్రహింపలేక నవ్వసాగిరి. అపుడు రామశాస్త్రిగారు తమ శిష్యులను ఆవలికి పంపి “స్వామీ! వీరు మూర్ఖులు. మహాత్ములను సందర్శించి యెఱుగరు. క్షమింపుడు.” అని ప్రార్థించిరి. రామశాస్త్రిగారు తమ తత్త్వజిజ్ఞాసను గురుదేవుని కెఱిగించిరి. గురువర్యులు దివ్యదృష్టిచే రామశాస్త్రిగారి విషయమాలోచించి వారిని తమ శిష్యులుగా నంగీకరించిరి. నాటినుండియే శ్రీపాద రామశాస్త్రిగారు శ్రీ మహర్షికి చతుర్విధ శుశ్రూషలు చేసి శ్రీరామ తారక బ్రహ్మతత్వమును గురుముఖమున బోధనందిరి. శాస్త్రాభిమానమును వీడి రామశాస్త్రిగారు గురువర్యులకు శిష్యులైరి.

“శాస్త్రజ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలనకారణం”

శాస్త్ర జ్ఞానము మిగుల కష్టతరమై బుద్ధి చలించుటకు కారణమైయున్నది (స్కాందపురాణము)

# శ్రీసుబ్రహ్మణ్య మహర్షి మహేంద్రవాడ వచ్చుటకు కారణము

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తాము సాధించిన యాధ్మాత్మిక సాధన విశేషములను జేర్చి "అద్వైత రహస్యము" అను పేరుతో నొక గ్రంథమును రచించియున్నారు. ఉపనిషత్యుల సారమంతయును పద్యరూపముగ రచింపబడెను.

కోటిఫలి గ్రామములో శ్రీ భాగవతుల హరిశాస్త్రిగారు నివశించు చుండిరి. ఆయన "వ్యాకరణశాస్త్ర శిరోమణి" బిరుదాంకితులు. పరమ భాగవతోత్తములు, విజయనగరం మహారాజావారి యాస్థాన విద్వాంసులునై యుండిరి. శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులు తమచే రచింపబడిన "అద్వైత రహస్యములు" ను శ్రీ హరిశాస్త్రికి చూపుటకై ఒకనాడు కోటిఫలి వెళ్ళి యుండిరి. అప్పుడు హరిశాస్త్రిగారు బులుసు ప్రకాశశాస్త్రి మొదలగువారికి శాస్త్రపాఠములు చెప్పుచుండిరి.

ఆ గ్రామమున రెడ్డి సుబ్బారాయుడు అను పేరుగల యొక బ్రాహ్మణుడుండెను. ఆయన బరోడా, పూనా మొదలగు పుణ్యక్షేత్రములకు యాత్రికులను తీసికొనివెళ్ళి ధనము సంపాదించుచుండెను. అందుచే ఆ బ్రాహ్మణుని బరోడా సుబ్బారాయుడని జనులు పిలుచుచుండిరి. ఆయన కోటిఫలిలోనే స్థిరనివాస మేర్పఱచుకొని జీవయాత్ర సాగించుచుండెను. కుటుంబము పెద్దదగుటచేతను, అంతకు పూర్వము సంపాదించిన ధన మంతయు ఖర్చయిపోయి బీదతనము సంభవించుట చేతను, బరోడా సుబ్బారాయుడుగారు బ్రాహ్మణుల యింఢ్లలో పంటలు చేసియు, నీళ్ళుకావిళ్ళు మోసియు మిగుల కష్టముగా సంసారము పోషించు

కొనుచుండిరి. ఒకప్పుడు కోటిఫలిలో వైశ్యులు నూతన గృహప్రవేశము చేసికొనుచు ఆ బ్రాహ్మణునిచే వంట చేయించుకొనిరి. ఆ సంగతి తెలిసి కోటిఫలిలోని బ్రాహ్మణులందఱును ఏకమై ఆ బ్రాహ్మణుని బహిష్కరించుటకు ప్రయత్నించుచుండిరి. అది జరిగిన నాలుగు ఓజులకే బరోడా సుబ్బారాయుడుగారి తండ్రి తద్దినము వచ్చెను. కోటిఫలిలోని బ్రాహ్మణు లెవ్వరును భోక్తలుగా నుండకపోవుటయేగాక కోరుమిల్లి మొదలగు గ్రామములనుండి గూడ ఏ బ్రాహ్మణులను భోక్తలుగా రాకుండ చేసిరి. తద్దినపురోజు వచ్చెను. బోక్తలెవరును దొరకలేదు. సుబ్బారాయుడుగారు విచారగ్రస్తులై హరిశాస్త్రిగారి వద్దకు వచ్చి జరిగిన సంగతి యంతయును చెప్పి "నా గతి ఏమి కావలె" నని మిగులదీనులై ప్రార్థించిరి. ఆ సమయమునకే శ్రీ ఉప్పులూరి భీమన్నశాస్త్రిగారును ఆ బ్రాహ్మణుని దీనాలాపములు విని "అయ్యా! మేమిద్దఱమును భోక్తలుగ వచ్చెదము. మీరు అధైర్యపడక ఆబ్దికము పెట్టుకొనుటకు తగిన ప్రయత్నములో నుండుడు" అని చెప్పిరి. సుప్రసిద్ధులైన వారినిద్దఱిని భోక్తలుగ నియమించి ఆబ్దికము పూర్తి చేయుచుండుట తెలిసికొని ఆ గ్రామములోని బ్రాహ్మణులే భోక్తలుగ నుండి ఆబ్దికము పూర్తి చేసిరి.

అది జరిగిన తరువా ఇట్టి కర్మలకు దోష పరిహారము లేకపోవునా యని "సాలగ్రామ పరీక్షాశాస్త్రము" తీసి హరిశాస్త్రిగారును, భీమన్నశాస్త్రి గారును విమర్శింప మొదలిడిరి. అందు బ్రాహ్మణులకు మాత్రమే యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహములను షట్కర్మలకు అధికారము గల్గియుండుటయు, యజ్ఞోపవీతమును, గాయత్రీ మంత్ర జపమును ఎట్టి దానదోషమునైనను పరిహరించుననియు, నిష్కర్షగా చెప్పబడియుండెను. మఱియు ఆ శాస్త్రమునందే యొక యుపాఖ్యాసము గూడ కలదు.

సహషుడను రాజు సరయూ తీరమున నొక పట్టణము కట్టుకొని మహావైభవముతో రాజ్యమేలుచుండెను. ఆ రాజ్యమున నొక బ్రాహ్మణుడుం డెను. అతడు మిగుల బీదవాడు. ఆయవారము చేసి జీవించినచో ఇతరులెన్ని బియ్యపుగింజలు పెట్టుదురో అన్ని జన్మములెత్తవలయునని శాస్త్రముల యందు చెప్పబడియుండుటచేత ఆ బ్రాహ్మణుడు ఉంఛవృత్తితో జీవయాత్ర సాగించుచుండెను. ఆ బ్రాహ్మణుడు ఉంఛవృత్తితో జీవయాత్ర సాగించు చుండెను. ఆ బ్రాహ్మణుని పరీక్షించుటకు సహుషుడొకనాడు అక్కడక్కడ కొంచెం కొంచెం ధాన్యపు గింజలను చిన్నచిన్న కుప్పలుగా పోయించెను. ఆ బ్రాహ్మణుడు యధాప్రకారముగా నీ వారధాన్యమునకై బయలుదేరగా మార్గమధ్యమందు గాన్పించిన ధాన్యపుగింజల కుప్పలు చూచి యిదియంత యును మనుష్యకృతముగాని వేఱొకటి కాదని నిశ్చయించి వానిని ముట్టనైనలేదు. చక్రవర్తి నౌకర్లు ఆ బ్రాహ్మణుని ప్రవర్తనము గనిపెట్టి ఆ విషయమును తమ ప్రభువుతో విన్నవించుకొనిరి. ఆ మరునాడు సహషుడు ఆ బ్రాహ్మణునియొద్దకు వచ్చి ఇట్లు పల్కెను.

1. అయ్యా! రాబోవు సరయూ పుష్కర పర్వదినములలో తమకు ఉత్తర దిగ్భూములన్నియు దానము గావించెదను. ఆ భూములపై వచ్చెడి యాదాయమంతయును నేనే వసూలుచేసి మీకిచ్చెదను. ఆ ఫలము నాకక్కరలేదు. అచట నొక యన్న సత్రముగూడ నిర్మింపదలచితిని.

ఆ యన్న సత్రమునకు వలయు సంబారములన్నియు నేనే పంపుదును. ఆయన్న దానఫలమంతయు మీదేగాని నాదికాదు.

2. మఱియు తమ కుమారునికి వివాహము చేయుటకు నిశ్చయించితిని.

3. మీకే సాలగ్రామదానము చేయుటకు నిశ్చయించితిని.

4. సువర్ణదానము,

5. గృహదానముకూడ మీకే చేయదలచితిని.

నేను కట్టించియిచ్చిన గృహమున తాము సాలగ్రామ పూజచేయుచు వచ్చిన యతిథి జనులకు భోజనాది సదుపాయములు గావించుచుండుడు. అన్ని యేర్పాట్లును నేనే చేసెదనని ప్రార్థించెను. సహషుని మాటలన్నియు ఆ బ్రాహ్మణునియెడల నిరుపయోగమయ్యెను. రాజు నిరుత్సాహముతో నింటికి వెళ్ళెను. కొన్ని రోజులకు మరల ఆ బ్రాహ్మణుడును అతని భార్యయును, తమ పుత్రులతో గూడి సహుష చక్రవర్తి మేడముందు వెళు ళ్ళచు నిట్లు ప్రసంగించుకొనుచుండిరి.

"సతీ! ఈ చక్రవర్తి ఎంత బంధము నా మెడకు చుటదలచినాడో చూచితివా! జన్మరాహిత్యమునకై పరితపించుచున్న మనకీ భోగభాగ్యములతో పనియేమి?" అనుకొనుచు సరయూనదికి స్నానమునకు వెళ్లుచుండిరి. సహుడాసంగతి కనిపెట్టి బ్రాహ్మణునికి తెలియకుండ వారిని వెంబడించుచు సరయూతీరము చేరెను.

సరయూపుష్కరము ప్రారంభమయ్యెను. వివిధ ప్రాంతములనుండి వేలకొలది యాత్రికులు స్నానమునకై వచ్చుచుండిరి. ఆ నదియొడ్డున ఒకరాజు అయిదు క్రోసుల వైశాల్యముగల పందిరి వేయించి వైకుంఠవ్రతము చేయుచుండెను. రత్నస&థగితమైన స్థంభములు అమర్చబడియుండెను. పైకప్పు అపరంజి రేకులతో కప్పబడియుండెను. ఇరువదియైదు పెద్ద పాత్రలనిండ బంగారముతో గూడిన సాలగ్రామములు మంటపసానమునకు చేర్చబడెను. వ్రతము ప్రారంభమయ్యెను. రాజు దేవతల నారాధించునపుడు ఒక సాలగ్రామము తీసి బంగారముతో చేసిన తమలపాకులో నుంచుచుండెను. ఇట్లు జరుగుచుండగా పుష్కరస్నానమునకై వచ్చిన

జనులందఱును అచట జేరి యావినోదము కన్నులార గాంచుచుండిరి. వ్రతము ప్రారంభమైనతోడనే యచటనున్న జనసముదాయములో ఇద్దఱు బ్రాహ్మణులమధ్య ఒక్కొక్క నారాయణుడు చొప్పున శంకచక్రగదా ఖడ్గ వనమాలలతో గూడి సాక్షాత్కరించెను. ఆ ప్రదేశమంతయును నారాయణ మయముగా నుండెను. అనేక జన్మలకైనను గాన్పించని శ్రీమన్నారాయణ స్వరూపములను జూచి స్నానమునకై వచ్చిన యాత్రికులందఱును తన్మయులై శరీరములను మఱచియుండిరి. ఇదివరలో దానము తిరస్కరించిన బ్రహ్మణుడు భార్యతోను పుత్రునితోను గూడి వైకుంఠవ్రతము చూచుచు నచ్చటనే తన్మయుడైయుండెను.

పిమ్మట కథ ప్రారంభమయ్యెను. ఇట్టి వ్రతము చేసిన వారికిని చూసిన వారికిని అనంతమైన పుణ్యము కల్గును. సాలగ్రామదానము, భూదానము, గృహదానము, కన్యాదానము, సువర్ణదానము చేసినవారికి, పుచ్చుకొన్నవారికిని అనంత ఫలము కల్గును. ఈ దానములలో నే యొకటిచేయ సంకల్పించి యీయ సిద్ధపడినపుడు నిరాకరించినవానికి సూర్యచంద్రులున్నంతకాలము రౌరవనరకము కల్గునని చెప్పబడెను. అంతకు పూర్వము దానము నిరాకరించిన బ్రాహ్మణునికి ఆ కథ మిగుల భీతి కల్గించెను. వ్రతము పూర్తియైనపిమ్మట ఆ సాలగ్రామములన్నియు బ్రాహ్మణులకు దానము గావింపబడెను. ఎచ్చటి వారచ్చటికి వెళ్ళిపోయిరి. ఆ బ్రాహ్మణుడింటికి వెళ్ళి “అయ్యో! నేనెందులకు దానము నిరాకరించితిని. నాకీ నరకబాధ యెట్లు తప్పును” అని బెంగతో కృషించిపోవుచు తానే నహుష చక్రవర్తికి వర్తమానమంపుటకు సిద్ధముగా ఒకనాడొక గొల్లవాడు వచ్చెను. ఆ బ్రాహ్మణుడా గొల్లవానిని జూచి నీ వెవడవని ప్రశ్నించెను. అపుడా గొల్ల బ్రాహ్మణునితో “అయ్యా! నేను సహుష చక్రవర్తిగారి సేవకుడను. నేనా ప్రభువునకు ప్రతిదినమును తేనె సంపాదించి

యిచ్చుచుందును" అనెను. అపుడా బ్రాహ్మణుడు గాఢమగు నిట్టూర్పువిడిచి "సహుషచక్రవర్తి నీతో మాట్లాడునా?" అని ప్రశ్నించెను. "సేవకుడనగు నాతో ప్రభువు మాట్లాడకుండునాయని" గొల్లవాడు జవాబు చెప్పెను.

అపుడా బ్రాహ్మణుడు "నాయనా! దానము తిరస్కరించిన బ్రాహ్మణుడు మిమ్ముల నొకసారి యిచటికి రాగోరెనని చక్రవర్తితో చెప్పు" మనెను. అపుడా గొల్ల అట్లే రాజుతో విన్నవించెను. రాజువిని మిగుల సంతోషించి తక్షణమే బయటుదేరి పాదచారియై బ్రాహ్మణుడున్న చోటికి చేరెను. అపుడా బ్రాహ్మణుడు ఆ చక్రవర్తిని చూచి "రాజోత్తమా ! నీవిచ్చెదనన్న దానములు తిరస్కరించితిని. అట్టి పవిత్ర దానములు నిరాకరించినయెడల రౌరవనరకము సంభవించునని వైకుంఠవ్రత కథలో వినియున్నాను. అట్టి ఘోర నరకము పొందుటకంటె నీవిచ్చు పవిత్రదానములు స్వీకరించిన యెడల నా హృదయభారము తగ్గును" అని చెప్పెను. వెంటనే సహుషచక్రవర్తి తాను సంకల్పించిన ప్రకారము దానము గావించి వెంటనే యొక మేడ కట్టించి ఆ బ్రాహ్మణపుంగవుని ఆ మేడలో ప్రవేశపెట్టెను. ఆ బ్రాహ్మణుడా మేడలో నివసించుచు అతిధి జనులకు భోజనాది సత్కారములు చేయుచు కాలము గడుపుచుండెను. కొంతకాలమైన తర్వాత శ్రీ మహా విష్ణువు సనకస నందనాదులతోను, తన పరివారముతోను, బయలుదేరి ఒక దివ్య విమానమును తీసికొనివచ్చి సహుష చక్రవర్తిని దానిపై నెక్కించుకొనెను. ఆ దృశ్యమును బ్రాహ్మణుడు చూచి నా సంగతి యేమని విషు&ణవునడిగెను. నీ సంగతి యిప్పుడు కాదని నిర్లక్ష్యభావముతో సమాధానము చెప్పి విషు&ణదూతలు సహుషచక్రవర్తిని విమానముపై తీసుకొని వెళ్ళి పోయిరి. బ్రాహ్మణుడు మాత్రము బెంగతో కృశించిపోవుచుండెను. దానము చేసినవారికిని పుచ్చుకొన్నవారికిని ఫలము సమానమని చెప్పిరే! ఇట్టి వ్యత్యాసమెందులకు కలుగవలెనని

విచారించుచుండెను. కొంత కాలమునకు విష్ణుదూతలు ఒక పాత విమానమును తీసికొనివచ్చి యా బ్రాహ్మణునెక్కించుకొని పోవుచుండిరి. మార్గమధ్యమున యమకింకరులు భయంకర రూపములతోను ఎఱ్ఱగా కాల్చిన కత్తులతోను అడ్డు తగిలి బ్రాహ్మణునిపైబడిరి. "ఇదేమి అన్యాయము! నేనెన్నడును ఏ పాపకార్యము చేసియుండలేదే! నన్నెందులకు బాధించెదరు" అని బ్రాహ్మణుడనెను. "సహుషచక్రవర్తి ఇచ్చెదనన్న దానములు తిరస్కరించిన హేతువుచే నీవు పాపము సంభవించెను. అందుచే మా దర్శనము నీకు కల్గెను. ఇంతటితో నీకు పాపవిముక్తి కల్గినది. ఇక మా మార్గమున మేము పోవుచున్నామని వెడలిపోయిరి".

ఈ కథ సాలగ్రామ పరీక్షాశాస్త్రములో భాగవతుల హరిశాస్త్రిగారు చదువగా శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులు సాంతముగ వినిరి. ఆ కథయందలి విషయములన్నియు మన మహరి&ష హృదయమున గాఢముగా హత్తుకొనిపోయెను. మహర్షి విరచితమైన అద్వైత రహస్యమందలి పద్యములన్నియు మిగుల శ్రద్ధతోను దీక్షతోను చదివి "ఆహా! ఉపనిష త్సారమంతయును ఇట్లు పద్యరూపమున రచింపబడినది" అని మిగుల సంతోషించి హరిశాస్త్రిగారు సుబ్రహ్మణ్యమహర్షి సామర్థ్యమును మిగుల కొనియాడిరి. పిమ్మట గురువర్యులు కోటిఫలి నుండి పామఱ్ఱు వెళ్ళిపోయిరి. గృహదానము నిరాకరించినచో నరకబాధ కల్గునని కోటిఫలిలో వినియున్న సంగతి తలంచుకొనుచు గురువర్యులు పామఱ్ఱులో కాలము గడుపుచుండిరి.

సూర్యభగవానుని యనుగ్రహముచే మహర్షి దంపతులకు క్రోధినామ సం॥ర భాద్రపత బహుళ పాడ్యమి రోజున (1904 స ం॥రమున) రేవతీ నక్షత్రయుక్త శుభ సమయమున ఒక పుత్రుడు జన్మించెను. తిరుపతి వెంకటేశ్వరస్వామి తమకు ఇలవేల్పు అగుటచేతను, సూర్యభగవానుని

యనుగ్రహముచే జన్మించుటచేతను, తాము చేయుచున్నది పరబ్రహ్మోపాస్తి యగుటచేతను ఆ బాలునికి వెంకట సూర్యనారాయణపరబ్రహ్మం అని నామకరణము గావించిరి. ఇంతకు పూర్వమే గురుదంపతులకు శ్రీరాజరాజేశ్వరి – పూర్ణ అను పుత్రికలు జన్మించియుండిరి. శ్రీ రాజరాజేశ్వరీ మహామంత్రోపాసనచే ముక్తీకాంత ప్రతి నిమిషమును దర్శనమిచ్చి కాపాడుచుండును. అందుచే ప్రధమ పుత్రికకు శ్రీ రాజరాజేశ్వరి అను నామకరణము చేసిరి. పరాశక్తికి "పురుషార్ధప్రదా, పూర్ణా" అను నామములు గలవు. అందుచే ద్వితీయ పుత్రికకు పూర్ణా అను నామకరణము చేసిరి.

సీతా పరమేశ్వరికి "సత్యమాత్రా" "నిత్యా" "శాశ్వతీ" అను నామములు గలవు. సీతాపరమేశ్వరియే ముక్తి కాంత సత్యస్వరూపిణియగు సీతాదేవి అనుక్షణమును శ్రీ మహర్షులవారికి దర్శనమిచ్చి కాపాడుచుండును. అందుచే తమ మూడవ కుమార్తెకు సత్యవతియని నామకరణము గావించిరి.

"యాదృశీ బావనాయస్య సిద్ధిర్భవతి తాదృశీ"

ఎవని భావము ఎట్లుండునో అతని కార్యసిద్ధికూడ అట్లే యుండును. చరాచర ప్రపంచమంతయు బ్రహ్మమయముగా భావించు శ్రీ మహర్షులవారికి ఒక్క పుత్రుడే కల్గెను. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అను లక్షణములు జూపుటకై శ్రీరాముడు ఒక్క పుత్రునే ప్రసాదించెను. బ్రహ్మము నిర్గుణము కావున అట్టి పరిశుద్ధతత్వము గురుపుత్రునియందు గోచరించును. శ్రీ పరబ్రహ్మంగారికి ప్రపంచ నాటకములు ఎంత మాత్రమును తెలియవు. గురుకుటుంబము వారి చరిత్ర తెలిసియున్న వారందఱిని ఈ విషయము బాగుగా తెలిసినదే.

భార్యాపుత్రాది పరివారముతో సంసారయాత్ర సాగించుచున్న మహర్షులవారికి ఏకాంతవాసమన్న ప్రీతి.

విజనప్రదేశములో నివసించుటకు నిరంతరము శ్రీ సూర్యభగవానుని ప్రార్థించుచుండిరి. నిరంతరము తనను నమ్మి సేవించుచున్న భక్తుని కోర్కె నీడేర్పక శ్రీరామచంద్రుడు ఎట్లూరకుండగలడు. గురువర్యులకు తపోనిష్ఠ ఏకాంతముగా జరుగుట మిగుల కష్టసాధ్యముగా నుండెను. తూ.గో.జిల్లా, రామచంద్రపురం తాలూకాలో చేరిన మహేంద్రవాడ నివాసులైన శ్రీ భద్ధిరాజు సూర్యనారాయణగారి మూలమున శ్రీ గురువర్యులు పామర్రునుండి మహేంద్రవాడ వచ్చి సి&థర నివాసమేర్పఱచుకొనవలసి వచ్చెను.

# మహేంద్రవాడ అగ్రహార చరిత్ర

తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకాలో మహేంద్రవాడ గలదు. ఆ గ్రామము ఋషులకాలము నుండియు ప్రసిద్ధిగాంచి తుల్యభాగనది యొడ్డున దక్షిణదిక్కున గలదు.

పూర్వము తుల్యభాగుడను రాక్షసుడు తూ.గో.జిల్లా. రామచంద్రపురం తాలూకా సంగమేశ్వరములో నివసించు చుండెడివాడు. ఒకప్పుడు మునులను రాక్షసులకును కలహము సంభవించినపుడు తాను మధ్యవర్తిగా నుండి వారి తగవులు తీర్చి వృద్ధగౌతమినుండి ఒక నదిని తీసికొనివచ్చెను. అదియే తుల్యభాగానది. ఆ నది ధవిళేశ్వరము దగ్గర ప్రారంభమై మహేంద్రవాడకు ఉత్తరదిశనుండి తూర్పుగా ప్రవహించి కాకినాడ సమీపమునగల చొల్లంగి దగ్గర సముద్రగామిని యగతున్నది.

శ్లో॥ తుల్యా...త్రేయీ భరద్వాజీ గౌతమీ వృద్ధగౌతమీ
కౌశికీచ వసిష్ఠాచ సప్తశాఖాః ప్రకీర్తితాః

# సప్తసాగర సంగమములు.

1. తుల్య, 2. ఆత్రేయి, 3. భరద్వాజి, 4. గౌతమి, 5. వృద్ధగౌతమి, 6. కౌశికి, 7. వసిష్ఠ అనునవి సప్తసాగర సంగమములు.

# గౌతమీ మహాత్మ్యము.

తుల్యభాగ పరమపవిత్రమైన జీవనది. అందుచే మునులు ఆ నదిచెంత ఆశ్రమములు నిర్మించుకొని తపోనిష్ఠాదులు గావించుకొనుచుండిరి. ఇల్వల వాతాపులు మునులును బాధించుచు ఈ ప్రాంతముననే నివసించెడివారు ఆ రాక్షసులిద్దఱును లోకములను కొల్లగొట్టి తాము సంపాదించిన ధనమును భూమిలో దాచుకొనెడివారుట. అర్ధము అనగా ధనము. అర్ధము + ఊరు = అర్ధమూరు. ధనము దాచుకొనిన గ్రామము కావున ఆ గ్రామమునకు అర్ధమూరు అను సార్థక నామము కల్గెను. అదియే క్రమముగా అత్తమూరుగా వ్యవహరింపబడుచున్నది.

ఇల్వలుడు నివసించునది ఇల్వలపురము. అదియే నేడు ఉప్పలపాడుగా వ్యవహరింపబడుచున్నది. వాతాపి నివసించిన గ్రామము వాతాపీశ్వరము. అదియే నేడు తాపేశ్వరముగా వ్యవహరింపబడుచున్నది. ఇల్వల వాతాపులిద్దఱును లోకములను కొల్లగొట్టి తాము సంపాదించిన ధనముతో స్వర్గమందలి యింద్రపురమును మించిన యొక పట్టణమును మహియందు (భూమియందు) నిర్మింపదలచి ఒక పురమును నిర్మించిరి. మహియందలి యింద్రపురము కావున మహేంద్రపురమని ప్రసిద్ధిగాంచెను. అదియే నేడు మహేంద్రవాడగా వ్యవహరింపబడుచున్నది.

తుల్యభాగ పరమపవిత్రమైన జీవనదియగుటచే మునులందఱును ఆ నదియొడ్డున ఆశ్రమములు నిర్మించుకొని తపస్సు చేసికొనుచుండెడి వారు. అందుచే మహేంద్రవాడ ప్రాంత ప్రదేశములన్నియు మిగుల

పవిత్రమైనవి.

ఆ గ్రామమున చాలమంది భూమంచి రెడ్లు స్థిరనివాసమేర్పఱచుకొని నివసించుచుండిరి. ఆ రెడ్ల వంశములో వామన పాలగొత్రోద్భవుడును, ఉదారస్వబావుడును, దేవబ్రాహ్మణ భక్తియుక్తుండును అగు కర్రి సుబ్బారాయుడు అను పేరుగల యొక సంపన్న గృహస్థుడుండెను. ఆయన గవర్నమెంటు వారి కంట్రాక్టులవలన విశేషధనము సంపాదించిరి. దేవాలయములు బాగుచేయించుట, బ్రాహ్మణులకు గృహములు కట్టించుట బీదసాదలను కనికరముతో ఆదరించుట, మొదలగు సద్గుణములు ఆయనకు ఉగ్గుపాలతో వచ్చిన లక్షణములు. బ్రాహ్మణ సేవయే ఆయన ప్రధాన ధనము. ఆయన భార్య వెంకమ్మ ఆమె భర్తకు తగిన లక్షణములు గలదియై మంచి ఖ్యాతిగాంచెను.

క్రీ॥శ॥ 1806 సం॥రమునకు సరియైన దుర్ముఖినామ సం॥రమందు వచ్చిన గోదావరి పుష్కర దినములలో కర్రి సుబ్బారాయుడుగారు తమ ధర్మపత్నియగు వెంకమ్మగారితోను, బంధుమిత్ర సపరివారముతోను, గోదావరి స్నానమునకై రాజమండ్రిలో నున్న కోటిలింగ క్షేత్రమునకు వెళ్ళిరి. అచట పుష్కరస్నానము చేసి గోదానము, భూదానము, సువర&ణదానము మొదలగు మహాదానములు చేసి ఒక యగ్రహారము కూడ కట్టించవలెనని సంకల్పించుకొని పరమేశ్వర ప్రీతిగా మానసికదానము చేసిరి. తరువాత శ్రీ సుబ్బరాయుడుగారు మహేంద్రవాడవచ్చి ఒక శుభముహూర్తమున బ్రాహ్మణులను రావించి “అయ్యా! నా శక్తి కొలది బ్రాహ్మణులకు గృహదానము చేయ సంకల్పించితిని. నివశించుటకు తగిన ప్రదేశము మీరే నిశ్చయించి తెల్పుడు”. అని కోరెను. అపుడా బ్రాహ్మణులు తమలో తామాలోచించుకొని ప్రస్తుతము సుబ్రహ్మణ్య మహరి&ష నివసించుచున్న ప్రదేశమే సర్వ విధముల నివాసయోగ్యముగా నుండునని తమ

యభిప్రాయములను దెల్పిరి. ఆ బ్రాహ్మణులు కోరిన ప్రదేశమంతయును అప్పటికి గొలుగూరి వెంకట సుబ్బన్న, కొవ్వూరి గంగిరెడ్డిగార్ల హక్కు భుక్తములలో నుండెను. అందుచే కర్రి సుబ్బారాయుడుగారు వెంకట సుబ్బన్న, గంగిరెడ్డిగార్లతో ఈ విషయమంతయును చెప్పి ది 22 ఆగస్టు 1899 సం॥రము తేదీని వారివద్ద నుండి 80 సెంట్ల భూమిని రు. 400 లకు క్రియమును పొందిరి. తరువాత ఆ ప్రదేశమును 1. పల్లేటి వెంకటావధానులు గారికిని, 2. మల్లాది వెంకట సుబ్బారాయుగు గారికిని, 3. మల్లాది నరసింహశాస్త్రి గారికిని, 4. బద్రిరాజు పెదబంగారయ్య గారికిని, 5. పల్లిభట్ల కామరాజు గారికిని, 6. కాకరపర్తి నరసింహము గారికిని, 7. కాకరపర్తి అచ్యుతరామయ్యగారికిని 8. శ్రీపాద లక్ష్మీపతి సోమయాజులు గారికిని, 9. భద్దిరాజు సూర్యనారాయణ గారికిని, 10. చాగంటి వెంకటరాజు గారికిని దాన విక్రయ సత్త్వాద్యధికారములతో దానముగావించిరి. వెంటనే మల్లాది నరసింహశాస్త్రిగారికి మాత్రము వేయి రూపాయల విలువ పెంకుటింటిని కర్రి సుబ్బారాయుడుగారు కట్టించి యిచ్చిరి. తక్కిన తొమ్మండుగురు బ్రాహ్మణులకు గృహములు కట్టించు ప్రయత్నములో నుండగా కర్రి సుబ్బారాయుడుగారు పరమపదించిరి.

శ్రీ కర్రి సుబ్బారాయుడుగారిచే బ్రాహ్మణులకు గృహములు కట్టుకొనుటకై కొంతకొంత నివేశనస్థలము వాగ్రూపముగా దానము చేయబడియుండెను. కొంత కాలమునకు భద్దిరాజు సూర్యనారాయణగారు, కర్రి సుబ్బారాయుడుగారి వలన సంక్రమించిన స్థలముననొక పెంకుటిల్లు కట్టుకొని నివసింప మొదలిడిరి. మఱియు ఆ సూర్యనారాయణగారు తమ తోబుట్టువగు అన్నపూర్ణమ్మను రాజుపాలెం గ్రామ నివాసులైన పల్లేటి వెంకటావధానులుగారికిచ్చి వివాహము చేసిరి. ఆ వెంకటావధానులుగారు వేదాధ్యయన సంపన్నులును, యజన, యాజన, అధ్యయన, అధ్యాపన,

దాన ప్రతిగ్రహ షట్కర్మ నిరతులును, శతపథ బృహదారణ్యకోపనిద్వాక్య నిధియునై యుండిరి. అందుచే భద్దిర్రాజు సూర్యనారాయణగారు తమ బావగారైన వెంకటావధానులుగారికి మహేంద్రవాడలో గృహము కట్టి స్థిరనివాసమేర్పఱచి కొంత భూవసతి గూడ గల్పించిరి.

ఇట్లు కొంతకాలమైన తర్వాత భద్దిర్రాజు సూర్యనారాయణగారు కాశీయాత్రకు వెళ్ళి స్నానము చేసి గంగలో నిలబడి సద్గుణ గరిష్ఠుడును, తపస్సంపన్నుడును, సంపూర్ణ గృహస్థుడును అగు నొక బ్రాహ్మణునికి గృహదానము చేయుటకు మనస్సులో సంకల్పించుకొనిరి. దానము మానసికమనియు, ధారారూపకమనియు రెండు విధములుగా నుండును, అందు మానసికమైన గుప్తదానము విశేష ఫలప్రదమైనదని యెంచి ఒక బ్రాహ్మణునికి గృహదానము చేయ స్థిర సంకల్పులైరి.

సూర్యనారాయణగారు కాశీయాత్ర ముగించుకొని తిరిగి మహేంద్రవాడవచ్చి తక్షణమే తమ బావగారైన పల్లేటి వెంకటావధానులు గారితో గృహదాన విషయమంతయును చెప్పి అందుకు తగిన సద్బ్రాహ్మణుడెక్కడ మనకు లభించునని యడిగిరి. అంతకు పూర్వము ఎనిమిది సం॥రముల నుండి పల్లేటి వెంకటావధానులుగారు పామర్రులో నివసించుచున్న శ్రీ సుబ్రహ్మణ్య మహరి&ష పాదపద్మముల నాశ్రయించియుండిరి. ఆ విషయ మెవ్వరికిని తెలియక రహస్యముగానే యుండెను. సుబ్రహ్మణ్య మహర్షి పుంగవుల తపోదీక్షయును, జితేంద్రియత్వమును, వైరాగ్య లక్షణములును వెంకటావధానులుగారు సంపూర్ణముగా నెఱిగియుండుటచే తన బావమఱదిగారగు భద్దిర్రాజు సూర్యనారాయణగారిని చూచి "అయ్యా! పామర్రు గ్రామములో రెడ్డి బ్రహ్మన్నగారికి ద్వితీయ పుత్రులును, తపస్సంపన్నులును, పరబ్రహ్మ స్వరూపులును, శిష్యబోధా దీక్షితులును అగు వెంకటసుబ్రహ్మణ్యమహర్షి

గలరు. మీరు చేసిన గృహదానమునకు వారుతప్ప అర్హులెవ్వరును కాన్పించరు. కావున మీరాగురుదేవునికి గృహదానము చేయుడు” అని సలహా చెప్పిరి.

అప్పుడు సూర్యనారాయణగారు పల్లేటి వెంకటావధానులుగారితోను మహేంద్రవాడ గ్రామ మునసబుగారైన తాడి సూరయ్యగారితోను ఇతర పరివారముతోను బయలుదేరి గురుదేవుని దర్శించుటకు పామర్రు వెళ్ళిరి. మహర్షి సోదరులందఱును అంతకు పూర్వమే అనగా క్రీ॥శ॥9 డిశంబరు 1899 వికారినామ సం॥ర మార్గశిర శుద్ధ సప్తమీ స్థిరవారము రోజు నుండియే విభాగస్థులై యెవరి కాలక్షేపము వారు చేసికొనుచుండిరి. కుటుంబము పెద్దదగుటచేతను గృహము చిన్నదగుటచేతను, తపోనిష్ఠ విజన ప్రదేశమందే జరుపవలసి యుండుటచేతను మహర్షి పుంగవులు తమ గృహమందలి అటుకపై గూర్చుండి నిత్యమును తపస్సు చేసికొనుచు కాలము గడుపు చుండిరి. సూర్యనారాయణగారు వెళ్లుసరికి గురువర్యులు అటుకపైన గూర్చుండి తపోనిష్ఠలో నిమగ్నులై యుండిరి. వెంకటావధానులుగారంతకు పూర్వము నుండియు పరిచితులగుట చేత మహరి&ష ధర్మపత్నియగు బాపనాంబగారివద్దఉ వెళ్ళి “అమ్మా! బాబుగారిప్పుడేమి చేయుచున్నారు” అని ప్రశ్నించిరి. అది విని “నాయనా! మీ బాబయ్యగారు అటుకపై జపము చేసికొనుచున్నారు'' అని బాపనాంబగారు జవాబు చెప్పిరి. మధ్యాహ్నము 1 గంట సమయమునకు తపస్సు చాలించి మహర్షివర్యులు క్రిందికి దిగివచ్చి కూర్చుండిరి. సూర్యనారాయణగారును వెంకటావధానులు మొదలగువారును గురుదేవుని పాదారవిందములకు సాష్టాంగ నమస్కారము లర్పించిరి. గురువర్యులు వారినందఱిని కూర్చుండ నియమించి కుశలప్రశ్నలతో సంభాషణములు జరిపిరి. శేషాంబా బ్రహ్మన్న దంపతుల పూర్వ పుణ్య విశేషముచే వారి

గర్భమున మహర్షి అవతరించినందువలన గురువర్యుల వాక్యములు వినుసరికి ఎట్టివారికైనను గాఢమగు భక్తి జ్ఞాన వైరాగ్యములు పుట్టవలసినదే. అట్టి అవతారమూర్తి గనుకనే మహర్షి ప్రతివాక్యమునందును భక్తి తాండవించుచుండును. కుశలప్రశ్నల యనంతరము గురువర్యులు సహజ సిద్ధమైన మృదుమధురవాక్కులతో బోధ ప్రారంభించిరి. ఆ సమయమున శ్రీవారి ప్రియశిష్యుడు కోడూరి వెంకయ్యగూడ నుండెను. మహర్షి బోధామృతపాన పరవశులైయున్న సూర్యనారాయణగారును వెంటకావధానులుగారును ఆకలిదప్పికలు మఱచి తన్మయులై యుండిరి. అప్పటికి మధ్యాహ్నము నాల్గు గంటలయ్యెను. ఇంటిలోని వారెవ్వరు గూడ భోజనములు చేయలేదు. అప్పటికి కొంచెము దేహస్మృతి కల్గి బోధనాపిరి. సూర్యనారాయణగారా బోధవిని మిగుల ఆశ్చర్యపడి "ఆహా! ఇట్టి దివ్యబోధ ఎప్పుడును వినియుండలేదు" అని ఆనందభాష్ప పులకాంకిత దేహులై గురుదేవుని జూచి "స్వామీ! తమంతటి తపశ్శాలిని నేనెచ్చటను చూచియుండలేదు. మా పుణ్యవశమున తమ దర&శనము లభించెను" అని తమ యపరిమితనందమును వెల్లడి చేసిరి. అప్పుడు గురువర్యులు సూర్యనారాయణగారిని చూచి "బాబూ! ఈ తపస్సనగా నెంత. ధృవతపస్సు సంగతి వింటిరా" అని పోతన కృత భాగవతమందలి ధృవోపాఖ్యాన మంతయును పద్యాదోహరణములతో చక్కగా బోధించిరి. "అట్టి తీవ్ర తపస్సు చేయుటచేతనే ధృవుడు సప్తర్షి మండలమును సూర్యమండలమును దాటి అఖండ తేజస్స్వరూపుడై ప్రకాశించుచున్నాడు. కావున అట్టి తపస్సు చేయుటయే మానవజన్మమెత్తినందులకు ఫలము" అని యూరకుండిరి.

అపుడు పల్లేటి వెంకటావధానులు గారు గురుదేవుని జూచి సూర్యనారాయణగారు కాశీయాత్రచేసి వచ్చినట్లు చెప్పిరి. అందఱును భోజనమునకు లేచిరి. ఈలోగా గురువర్యులు ఆలోచనానిమగ్నులై

కాశీయాత్ర సంతర్పణచందాకు సూర్యనారాయణగారు వచ్చియుండినట్లు భావించి అందులకు తగిన భోజన పదార్థములకై యేబది రూపాయలు తమ శిష్యులచే నిప్పించుట కేర్పాటు చేసిరి. కోడూరి వెంకయ్యగారు కొంత ద్రవ్యమిచ్చుటకు సంకల్పించుకొనిరి. రాత్రి భోజనానంతరము భద్దిరాజు సూర్యనారాయణగారు గురుదేవుని దగ్గరచేరి కాశీయాత్రలో గంగయందు నిలబడి గృహదానముచేయ సంకల్పించినట్లును, అట్టి గృహదానమునకు తగిన లక్షణములన్నియు తమ వద్దనే గలవని విని మేమిచ్చుటకు వచ్చితిమి. అని మనవిచేసిరి. ఆ మాట వినినంతనే గురుదేవులు నిశ్చేష్టులై గుండెలలో ఊయిపడినట్లు మాటలాడక యూరకుండిరి. అంతకు పూర్వము గురువర్యులు కోటిఫలిలో భాగవతుల హరిశాస్త్రిగారి వలన గృహదానము నిషేధించినవారికి రౌరవనరకము కల్గునని సంగతి వినియుండిరి. అందుచే సూర్యనారాయణగారికేమి చెప్పుటకును దోచక గురువర్యులు మౌనముగా నిరుత్సాహులై యుండిరి. ఆలోచనా సముద్రములో మునిగియున్న సుబ్రహ్మణ్య మహర్షి ముఖలక్షణములు చూచి “అయ్యా! మీ రెంత మాత్రమును సందేహింప పనిలేదు. నా గృహదానము తమకే సంకల్పింపబడినందున నేనన్యధా చేయుటకు వీలులేదు'' అని సూర్యనారాయణగారు ప్రార్థనా పూర్వకముగా మనవిచేసిరి. గురువర్యులు గాఢమగు నిట్టూర్పు విడిచి కొంతసేపటికి మెల్లగా సరేయని తమ యంగీకారమును వెలిబుచ్చిరి. గురువర్యులు గృహదానము నంగీకరించిరని తెలిసిన తోడనే మహర్షి సోదరులలోను, పామర్రు గ్రామవాసులలోను అపరిమితమైన యాందోళన ప్రారంభమయ్యెను. గురుసేవాధురంధురులైన కోడూరి వెంకయ్యగారు భద్దిరాజు సూర్య నారాయణగారిని చూచి “అయ్యా! ఈ రాచకార్యమునకా తమ రిచ్చుటికి దయచేసినది! మా గురువుగారు ఈ గ్రామము విడిచి యెచ్చటికిని రారు.

వారిని మేము వెళ్ళనీయము” అని సోల్లుంతనముగా పల్కిరి.

ఈ వార్త యొక్క క్షణకాలములో గ్రామమంతయు వ్యాపించెను. అపుడు దేవరపల్లి కామయ్యగారి కొడుకు పెదబాపనయ్యగారు తొౖట్రుపాడు పడుచు వచ్చి “బాబూ ! తమకీ గృహము ఇరుకుగా నున్న యెడల తాము నివసించుటకు సర్వ విధములగాను అనుకూలముగానున్న గృహము నేనిచ్చెదను. తాము మాత్రము మమ్ములవీడి మఱియొక చోటికి వెళ్లుట న్యాయము కాదు” అని విన్నవించిరి. జననీ జనకుల బలవంతముపై గృహస్థాశ్రమము స్వీకరించుటయును, రౌరవ నరక భీతిచే గ్రామాంతరమందలి గృహదానము అంగీకరింపవలసి వచ్చుటయును, ఆ పైన పెదబాపయ్యగారు మఱియొక గృహము నిచ్చెదనని పల్కుటయు గోరుచుట్టుపై రోకలిపోటువలె గురుదేవుని మిగుల బాధింపసాగెను. మహేంద్రవాడ నివాసము గురుకుటుంబమునకు తప్పనిసరియయ్యెను. అందుచే క్రీ॥శ॥ 1905 సం॥రమునకు సరియైన విశ్వావసు సం॥ర కార్తీక బహుళ సప్తమీ ఆదివారము రోజున శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పుండవులు సకుటుంబ సపరివారముగా మహేంద్రవాడవచ్చి స్థిర నివాసమేర్పఱచుకొనిరి. భద్దిరాజు సూర్యనారాయణగారిచే సమర్పింపబడిన గృహమందు గురుపుంగవులు నివసించుచుండిరి. అప్పటికి కర్రి సుబ్బారాయుడు గారిచే బ్రాహ్మణులకు గృహ నిర్మాణము నిమిత్తము ఈయబడిన నివేశన స్థలములకు లిఖిత రూపమైన దానపట్టాలు లేకుండెను. అందుచే కర్రి సుబ్బారాయుడుగారి కుమారులు 1 వెంకటరెడ్డి 2 నారయ్యగారలు 4 ఆగస్టు 1905 సం॥రము తేదీన శ్రీ మహర్షి పుంగవులకును తక్కిన వారికిని దానపట్టాలు వ్రాసి యిచ్చిరి. ఆ తరువాత భద్దిరాజు సూర్యనారాయణగారు కూడ శ్రీ గురువర్యులకు దానపట్టా వ్రాసియిచ్చిరి.

1908 సం॥రములో వచ్చిన గోదావరి పుష్కర కాలమున శ్రీ కొవ్వూరి గంగరాజుగారు అయిదు సెంట్ల భూమిని మానసికముగా దానముచేసి గురుచక్రవర్తికి స మర్పించిరి. ఇప్పుడు మేడకట్టిన ప్రదేశము అదే. ప్రాచీన కాలమున ఇది సిద్ధాశ్రమమనియు అందుచేతనే ఈ స్థలమున తపోనిష్ఠాదులు జరుగుచున్నవనియు గురువర్యులు బోధన సమయములో దెల్పియున్నారు. ఇప్పుడు వంటశాల నిర్మింపబడిన స్థలమును, గాని సావిడిగానున్న స్థలములో కొంతభాగమును ఈ స్థలములకు ఉత్తరదిశగా పదకొండు సెంట్ల భూమిని శ్రీ గొలుగూరి వెంకట సుబ్బన్నగారు 29 - 4-1932 సం॥రం తేదీని శ్రీమహర్షుల వారికి భక్తి పురస్సరముగా దానపట్టా వ్రాసియిచ్చిరి.

# శ్రీగురుచక్రవర్తి మహేంద్రవాడ నివాసము.

శ్రీ గురువర్యులు మహేంద్రవాడలో నివసించుచుండుటయు, వారి తపోమహిమాదులును తెలిసికొని మహేంద్రవాడ నివాసులైన గొలుగూరి వెంకటసుబ్బన్నగారు క్రీ.శ. 1907 ప్లవంగనామ సం॥రములో శిష్యులైరి. పిమ్మట తాడి అప్పన్న మొదలగు వారు మహర్షికి శిష్యులైరి. తమ శిష్యగణముతో గూడ గురువర్యులు హాయిగా కాలము వెళ్ళబుచ్చుచు శిష్యులను తరింపజేయుచుండిరి. కొంత కాలమునకు మహేంద్రవాడ నివాసులైన కర్రి నారయ్యగారు కూడ 1923 సం॥రములో మహర్షికి శిష్యులైరి. పిమ్మట రాయవరం గ్రామ నివాసులైన ముళ్ళపూడి గంగరాజు గారు 1924 సం॥రములో శిష్యులైరి. ఇట్లు కొంతకాలము గడిచెను. అప్పటికి భద్రిరాజు సూర్యనారాయణగారిచే నీయబడిన గృహము శిధిలము

కాజొచ్చెను. ఎలుకలబాధకంతములేకుండెను. గోడలన్నియు గుల్లలుఆ చేయబడుచుండెను. ఆహారపదార్థములన్నియు ఎలుకలపాలగుచుండెను. అట్టి గృహమందే మహర్షి పుంగవులు శిష్యులకు తత్త్వ బోధ చేయుచుండిరి. కొంతకాలమైన తర్వాత గృహమంతయు జీర్ణ దశలో నుండుట చూచి కొందఱు శిష్యులు గురువర్యులతో "స్వామీ! ఈ గృహము శిధిలమగు చున్నది. నూతన గృహము మేము గట్టించి యిచ్చెదము. తమ యనుజ్ఞకై నిరీక్షించుచున్నాము" అని పల్కిరి. భక్తి రసపూరితమైన శిష్యుల ప్రార్థన విని గురువర్యులందులకంగీకరించిరి. గృహము కట్టుటకు స్థల నిర్ణయము విషయమున శిష్యులలో భిన్నాభిప్రాయ మేర్పడెను. గోదావరీ తీర స్థలమగుటచే రాజమహేంద్రవరములో బాగుగా నుండునని కొందఱును, రాయవరములో బాగుగా నుండునని కొందఱును, మహేంద్రవాడలోనే బాగుగా నుండనని మఱికొందఱును వాదులాడజొచ్చిరి. ఇట్లుండగా నొకనాడు గురువర్యులు కర్రి నారయ్య, ముళ్ళపూడి గంగరాజు అను భక్తులకు ఆ గృహమందే తత్త్వబోధ చేయుచుండిరి. ఆ సమయమున మహర్షి పుత్రికయగు సత్యవతికి (కవచమ్మకు) రాజరాజేశ్వరీదేవి ఆవేశించి గురుదేవుని చెంతకు వచ్చి "గృహనిర్మాణము విషయములో ఇంతతొట్రు పాటెందులకు? ఈ గ్రామముననే గృహ నిర్మాణము గావింపు"డని చెప్పెను. అంతకు పూర్వమునుండియు ముళ్ళపూడి గంగరాజుగారు కలప కోయించు చుండిరి. కాని మహేంద్రవాడలో గృహ నిర్మాణము గావించుటకు తగిన పవిత్ర స్థలమేది? అను ప్రశ్న వచ్చెను. అపుడు ముళ్ళపూడి గంగరాజుగారి కోడలు చి॥సౌ॥ యగు సీతారత్నం అనునామెకు పార్వతీదేవి ఆవేశించి పాత గృహమున్న చోటనే గృహము నిర్పింపుడని ఖండితముగా చెప్పెను.

క్రీ॥శ॥ 1933 సం॥రమునకు సరియగు శ్రీముఖనామ సం॥ మాఘశు ద సప్తమి రోజున ఉదయము 9 గంటలకు మేడ కట్టుటకు శంకస్థాపనము

జరిగెను.

గృహము ఎట్టిదిగా నుండవలెనని ముళ్ళపూడి గంగరాజుగారు గురువర్యులను కోరిరి. దానిపై శ్రీ గురువర్యులు "నాయనా! సామాన్య గృహస్థులకు సరిపడు గృహము నిర్మించిన చాలును" అని జవాబు చెప్పిరి. కొంతమంది మండువా లోగిలి బాగుండునని సలహా చెప్పిరి. కాని గురు దేవునికి మాత్రము గృహనిర్మాణము విషయములో మిగుల చిన్న చూపుగానే యుండెను. అట్టి సమయమునకే మహర్షి ప్రియశిష్యులైన శ్రీ కామరాజుగెడ్డ పాపరాజుగారు గురువర్యులను దర్శించుటకు రాజమండ్రీ నుండి మహేంద్రవాడ వచ్చిరి. బాల్యము నుండియు విజన ప్రదేశముల లోను, పర్వత గుహలలోను తపోనిష్ఠ కలవాటుపడియున్న గురుదేవుని శిష్యులు చేయు పెద్ద ప్రయత్నము మిగుల బాధను కల్టించుచుండెను. శిష్యులెవరేమి చెప్పినను వారి మాటలు గురుదేవుని చెవికెక్కవయ్యెను. అట్టి పరిస్థితి చూచి పాపరాజుగారు గురుపాదముల సన్నిధిని జేరి "బాబూ! తపస్సు చేసికొనుటకు విజనప్రదేశమును, పర్వత గుహవంటి ప్రదేశమును తాము కోరుచుందురు గదా! సామాన్య గృహము నిర్మించినచో వచ్చుచు పోవుచు నుండు శిష్యుల సందడి యెక్కువై తపస్సునకు భంగము కల్గదా! ప్రకృతి సంబంధులగు జనుల కందరానిదై విజనముగ గుహవలె నుండుటకు మేడయే కట్టవలెను. అచటికెవరును వచ్చుటకు వీలుండదు. పూజా మందిరమము గూడ ప్రత్యేకముగా నుండును. తమ తపస్సు అఖండము గాను నిర్విఘ్నముగాను, చేసికొనుటకు మేడ గట్టుటయే సర్వ విధముల మంచిదని నాకు తోచుచున్నది. నా మనవి సాంతముగ ఆలోచించి శిష్యుల కోరిక మన్నింపు"దని సవినయముగా ప్రార్థించిరి. శిష్యులలో నొకరగు శ్రీ కర్రి పుల్లయ్యగారు గూడ తపస్సునకు సౌధము మంచిదికదాయని సలహా యిచ్చిరి. అపుడు గురుపుంగవులు దీర్ఘముగా నాలోచించి సరే మీ

యిష్టమువచ్చినట్లు చేయుడని యెట్టకేలకంగీకరించిరి.

శ్రీ గురుదంపతులు మహేంద్రవాడలో మేడకు శంకుస్థాపనము చేసి కార్యాంతరముపై నిడదవోలు వెళ్ళియుండిరి. భక్త శిఖామణియగు ముళ్ళపూడి గంగరాజుగారు గురువర్యుల మేడ కట్టించు దీక్షలో నుండిరి. కర్రి నారయ్య మొదలగు శిష్యులు గూడ సౌధనిర్మాణమునకు శక్తివంచన లేకుండగ పాటుపడుచుండిరి. మేడ పూర్తియైన పిమ్మట వంటశాల గూడ గంగరాజుగారే పూర్తి చేయించిరి. శంకుస్థాపనము మహర్షి పుంగవులచే చేయబడినది మొదలు మేడ పూర్తియగువఱకును, రమారమి అయిదు మాసములు ఒక్క వర్షపు చినుకైనను పడలేదు సరిగదా మృగశిరకార్తి ప్రవేశించినను మేఘదర్శనమే లేకపోయెను. వ్యవసాయదారులందఱును గురువుగారి గృహము నిర్మింపబడు చుండుటచేత వర్షము స్తంభించి పోయినది. వారి గృహ ప్రవేశమైనగాని వర్షము కురియనే కురియదని అల్లకల్లోలముగా చెప్పుకొనసాగిరి. మేడపైకప్పు నేయుట పూర్తియై కూలీలు క్రిందికి దిగివచ్చినవెంటనే వారం రోజులు రాత్రింబగళ్ళు విరామము లేకుండగ అఖండవర్షము కురిసెను. ఇది యంతయును గురువర్యుల తపోమహిమయని చుట్టుపట్ల గ్రామములోని జనులు వింతవింతలుగా చెప్పుకోసాగిరి.

శ్రీభావనామ సం॥ర వైశాఖబహుళ ....మి (నవి) బుధవారము ది 6-6-1934 సం॥రం తేదీ రాత్రి ఘ. 16-0 లకు (గం॥ 12-52 లకు) నూతన సౌధప్రవేశ ముహూర్తము నిశ్చయింపబడెను. ఆనాటికి బంధువులును. పండితులును. కవులును, మహర్షి గృహమునలంకరించిరి. ఆ నాటి రాత్రి గురుదంపతులను రెండు మేనాలపై గూర్చుండబెట్టి భక్తులగు వారందఱును ఎరమరికలేకుండగ బ్రహ్మరథముపట్టి భజనలతోను, మేళతాళములతోను, పెద్దలైట్లతోను, మహేంద్రవాడ గ్రామమంతయును

మహేంద్ర వైభవముతో నూరేగించిరి. ప్రత్యక్ష పార్వతీ పరమేశ్వరులైయున్న యా మహర్షి దంపతులు పీటలపై గూర్చుండియున్న శుభసమయమున వేదపండితులు వేదపఠనముతో కార్యక్రమము ప్రారంభించిరి. బ్రాహ్మణ పండితులు వేదపఠనముతో కార్యక్రమము ప్రారంభించిరి. బ్రాహ్మణ పండితులు వందలమందికిపైగా నాటి సభనలంకరించిరి. వారినందఱిని చందనతాంబూలాది సత్కారణములతోను, నూతన వస్త్రములతోను గురువర్యులు యథోచితముగ సత్కరించిరి.

కొందరు కవులు వినమ్రులై భక్తిరసపూరితమైన పద్యరత్నహారములను గురుదంపతులకు సమర్పించిరి.

ఈ సమయమున కొవ్వూరు హైస్కూలు పండితులు శ్రీ అనిపెద్ది జగన్నాథశాస్త్రిగారు సమర్పించిన పద్యకుసుమ హారము.

సీ॥ శ్రీరామతారకార్జిత వైభవోపేతుఁ
బరమయోగాభ్యాస భవ్యచరితు
నిరుపమాన తపో వి – నిష్ఠా గరిష్ఠాత్ము
సాధుసన్నుత సదా – చార నిరతు
పరతత్త్వబోధనా – పరదక్షిణామూర్తి
దివ్యజ్ఞాన ని – ర్జితతమస్కు –
శిష్యసందేహ వి – చ్ఛేదక్రియా దక్షు
రెడ్డి వంశాబ్ధిను – ర్వీ సురేంద్రు

గీ॥ శుక్లయాజిషు కాశ్యప – శుద్ధగోత్రు
బ్రహ్మనాత్మజుఁ బాపాంబ – ప్రాణనాధు
సుజన వినుత పదాంబుజు – సూరివర్యు
సుబ్బరాయఖ్య గురునిఁబ్ర – స్తుతియొనర్తు.

సీ॥ సంసారమను మహా - సాగరంబున నీదు
నను మాటయేగాని గ - ట్టున నెయుండు
బంధుమిత్రాది సం - బంధుడనుటయె గాని
పరభావమున నె దాఁ - దిరుగుచుండు
జాయాసుత భ్రాతృ - జనుల జూచుటగాని
సధిక సంబంధమే - ర్పడవలంచు
బిలిచి మాట్లాడింపఁ - బలుక నేర్చునుగాని
బ్రహ్మించిందను మారు - పలుకడయ్యె

తే॥ అట్టి రెడ్డ్యయాంబుధి - నవతరించి
సోమువలె శోభపడసిన - సుబ్బరాయ
మణి జగంబున జన్మించి - మసలుటెల్ల
మన పురాకృత సుకృతంపు - మహిమగాదె. (2)

సీ॥ ఏ మహారాజులూ - రేగినారీ రీతి
గోవిందనామ సం -కులరవములు
ఏ గృహస్థు జనులఎ ను - తించినారీ రీతి
పాదాబ్జ సాష్టాంగ - వందనములు
ఏదేవుఁ గీర్తించి - రీ రీతి నిండ్లలో
గల పిన్న పెద్ద లె - క్కాలమందు
ఏ యతీంద్రుని నాద - రించినారీ రీతి
నొక యూరఁ గలకాల - ముండఁబెట్టి

గీ॥ రాజువౌ గృహస్థువౌ యతి - రాజమణివౌ
దైవతమవేమో యెఱుఁగ మా - తరముగాదు
నీదు జన్మంబు పాప ని - షూదనంబు
నర శరణ్య ! సుబ్రహ్మణ్య - గురువరేణ్య ! (3)

సీ॥ బ్రహ్మాధి రాజ్య సం - పత్తి గల్గిన నీకు
నల్ప భక్తులొసంగు - నర్ఘ్యమెంత
నవవిధ భక్తి సంతత యుకుఁ - డౌ నీకు
బరమ సేవకు లిచ్చు - పాద్యమెంత
నవవిధ భక్తి సంతత యుకుఁ-డౌ నీకు
భూ జనులఎ గావించు - పూజయెంత
బ్రహ్మ సౌధంబెక్కి - పరిఢవిల్లెడు నీకు
వాడలోఁ గట్టించు - మేడయెంత

తే॥ చిత్కళామూర్తిఁ గన్నులంఁ - జేర్చు నీకు
నీర సులొసంగు మంగళ - హారతెంత
శీతకరునకు నమృతంబు - భాతి గొనుమ
మా సపర్య సుబ్రహ్మణ్య - మాన్యగణ్య 4

చ. సామర్థ్యంబు శరీరమందు సడలెన్-జాగైన యేరీతియో
సేమంబంచును మీరు పుట్టినయెడన్-శ్రీరామ సప్తామమున్
బామర్తిన్నెరవేర్చి రెల్లరును సే-బాసంచు రంజింపనీ
గ్రామస్థుల్ విని మేడగట్టి రిట-శ్రీ రామున్ మిమున్ గొల్లగాన్. 5

ఇట్లు
భవదీయ శిష్యుడు,
అనిపెద్ది జగన్నాధశాస్త్రి
తెలుగు పండితుఁడు, బోర్డుహైస్కూల్
కొవ్వూరు ప.గో.జిల్లా.

వైశాఖ ...(నవమి)
బుధవారము - భావ
6-6-1934

ఈ శుభ సమయమున శ్రీ చాగంటి కామేశ్వరరావుగారు గురుదంపతులకు సమర్పించిన పద్యరత్నహారము.

ఉ॥ శ్రీరమణీ మనోహర కిరీటమణీ రుచితాంచితాంఘ్రివం
కేరుహ సత్సుధానుభవ కింకరమానస భృంగుడీశుడిం
పారగ నోముగాత, మహిమాఢ్యుని, నూత్న గృహప్రవేశని
స్ఫారము దాంతరాత్ము, ఘన సద్గురువర్యుని, సుబ్బరాయనిన్॥

సీ॥ వేదవేదాంగ కో - విద మహీదేవతా
శీర్వాద రవమొక్క - చెంతఁజెలగ।
సమ్మద్గురూత్తము - లని పెద్దివంశ్యులు
పండిత కవులొక్క - వంకనుండ।
ఈ మహోత్సవమున - కేగుదెంచిన బంధు
జాలములొక చక్కి - సంతసింప ।
కర్రి నారయ్యాది - ఘనులు శిష్యులు నమో
వాకంబులతో నొక్క - ప్రక్క మ్రొక్క ।

గీ॥ పూజ్యురాలైన భార్యయు - పూర్ణసత్క
ళోన్నతుండగు సుతుఁడంఘ్రు - లొత్తుచుండ।
నూత్న సౌధప్రవేశమా - న్యులరు మీరు ।
వెండికొండను శంకరు - నిండు కొలువుఁ
బరిహసింత్రు సుబ్రహ్మణ్య - గురువరేణ్య ॥

సీ॥ శ్రీరామ తారక - చింతామణీమంత్ర
సిద్ధుఁడే మౌనీంద్ర - శేఖరుండు।
సతత యోగాభ్యాస - సంలబ్ధసుజ్ఞాన
మోక్ష ఫలుండే ప్ర - బుద్ధ మౌని
సామాన్య మానవ - సంసార మధ్యస్థి
తాంబికాధవుఁడేప మ - హాతపస్వి ।
కరుణాప్రపూర్ణ హృ- త్కంఠసుధామర

తీకృత శిష్యుఁడే - దివ్యమూర్తి ।

గీ॥ సంతాతాద్వైత యోగప్ర-శస్తికలనం ।
గలియుగపు యాజ్ఞవల్క్యుఁడే - జ్ఞానమూర్తి ।
రెడ్డి వంశాంబువిధి పవిత్రీకరింపఁ।
బుట్టినట్టి సుబ్రహ్మణ్య - మూర్తి యెవడు ।
అట్టి నిన్నెంచఁబుట్టువు - లడగిపోవు॥

సీ॥ మాటలాడినచో, క్రొ-మ్మావి క్రొంజివురులో,
స్వాదుత్వమును బ్రాత - పడగజేయు
స్మృత్యర్థము నుపన్య - సించుచో, వేద పా
రాశర్యమునిఁ, ద్రోసి - రాజొనర్చు
పద్మాసనంబున - వసియించి యున్నచోఁ
బమ్మకునఎ రిమ్మవే - గమ్మె గూర్చు
శ్రీరామ మహిమావి - శేష మధ్యాపింప
వాల్మీకికిన్ దల - వంపుగూర్చు

గీ॥ నట్టి త్రైలోక్యవంద్య వి - ద్యాతపస్వి,
గురువరుఁడు, సుబ్రహ్మణ్య - వర మునీంద్రు
పాదపమ్మ మరంద ము - పాస్వసించు
ప్రాతపుం దేటినై మోక్ష - పదముఁజొత్తు.

సీ॥ లోకైక కవిరాజు - ఠాకూరు నిల్పె, శాం
త్యాశ్రమము జగద్ధితంబున కని
సత్యాగ్రహ మహింసఁ - జాటి గాంధీ గూర్చె
యరవాడలో నొక్క - గురుకులమ్ము
యోగీంద్రుఁడరవింద - యోగి కట్టించెను
పుదుచేరి నాశ్ర మం - బున నొకండు

జరిగెంద్రయోదశ - శతవత్సరములు శం
కరుఁడు శృంగేరిలో - మఠముగట్టి

గీ॥ యొక్కటియు జ్ఞానదమునొచు - నుర్విహైంద
వమత పారమార్థిక కళా - వైభవంబు
దెలుపలేకున్న వన్న సం- దియము లేదు
యుష్మదీయ సౌధాశ్రమ - మొకటి దక్క

గీ॥ వయసు డెబ్బదిపైన పై - బడెను మీకు
మేఘ నిర్ఘోషణ రవంబ - మౌచు యోగ
శక్తి వర్ణాశ్రమాచార - యుక్తి సడల
లేదు, సాక్షాన్మహేశులు - గాదె మీరు.

గీ ॥పరమ దారిద్ర్య జీవన - పథమునందు
గడపుచుండెడి నినిచ్చు - కట్నమేమి?
భక్తి సంయుక్తమైన యీ - పద్యచయమె
స్వాదు ఫలయుతో పాయన - భంగిగనుమ

క॥ దారాసుత పౌత్ర సు సౌ
ధారామమ్ముల మహాయురారోగ్యములనన
జేరిమిగను పదికాలము
లీరీతిని మాదుకండ్ల - యెదుటను తండ్రీ

ఇట్లు,
భవద్విధేయ ప్రశిష్యుడు
చాగంటి కామేశ్వరరావు.

గృహప్రవేశమైన మరునాడు 7-6-1934 తేదీ గురువారము రోజున జాతిమత వివక్ష లేకుండగ అన్ని వర్ణముల వారికిని గొప్ప యన్న ప్రదానము జరిగెను. గృహ ప్రవేశమైనది మొదలు ఆ కుటుంబము సకల సంపదలతో తులతూగుచు తామర తంపరగా వర్ధిల్లసాగెను.

# మహర్షులవారి దినచర్య

శ్రీ మహర్షులవారు పామర్రులో నున్న కాలమున తెల్లవారగట్ల మూడు గంటలకేలేచి శ్రీరామతారక పరబ్రహ్మ మూర్తికి మానసికారాధనము గావించి మూడు మైళ్ళ దూరములో గల గోదావరికి స్నానమున కేగెడువారు. పామర్రు గ్రామము విడిచి ఒంటరిగా మార్గమధ్యమున నెళ్ళుచున్నప్పుడు శ్రీరామచంద్రుడు ధనుర్ధరుడై మహర్షులవారి పాదములు త్రొక్కుచు వెంబడించి కాపాడుచుండెను. కూళ్లమల్ల వరము త్రొక్కుచు వెంబడించి కాపాడుచుండెను, కూళ్లమల్ల వరము దగ్గర మనుష్యులెవ్వరును ప్రవేశించుటకు సాధ్యము గానిచోట గోదావరిలో దిగి స్నానము చేసి రెల్లు దుబ్బులలో కూర్చుండి జపము గావించుకొని పామర్రులోగల తమ గృహము చేరి మధ్యాహ్నము గం 1-0 వఱకును అఖండ తపస్సు గావించి పిమ్మట భోజనము చేసెడివారు. మధ్యాహ్నము గం 3.0 ల నుండి నమ్మిన శిష్యులకు శ్రీరామతత్త్వమును బోధించుచుండెడివారు. మరల రాత్రి 12 గంటల వరకును తపోదీక్షలో నుండి తెల్లవారగట్ల గం 3.0 లకే గోదావరి స్నానమునకేగు చుండెడివారు.

శ్రీ విశ్వావసుసం॥ర కార్తీక బహుళ సప్తమీ ఆదివారము (క్రీ॥శ॥ 1905) రోజున శ్రీ మహర్షి పుంగవులు పామర్రునుండి మహేంద్రవాడవచ్చి స్థిరనివాసమేర్పఱచుకొనిరి. మహేంద్రవాడ చేరిన తర్వాత ప్రతిదినమును

తెల్లవారగట్లనే లేచి ఆ గ్రామమునకు సమీపమునందుగల తుల్యభాగ నదిలో స్నానముచేసి కొంత ప్రొద్దెక్కు వఱకును అచట తపో నిష్ఠాదులు గావించుకొని మరల నింటికి చేరి మధ్యాహ్నము గం॥ 1-0 వఱకును శ్రీరామ తారక పరబ్రహ్మతత్త్వమునందు లీనమై తపస్సు గావించుచుందురు. మధ్యాహ్నము గం॥ 3-0 ల నుండి శిష్యులకు శ్రీరామతత్త్వ విశేషముల బోధించుచుందురు. మహేంద్రవాడలో కర్రి నారయ్య అను భక్త శిఖామణి గలడు. ఆయన భూమంచి రెడ్ల వంశమునకు చెందినవారు. మహేంద్రవాడకు సమీపమునగల రాయవరంలో ముళ్లపూడి గంగరాజు అను భక్త వర్యుడుండెను. ఆయన కమ్మవారును సంపన్న గృహస్థులునై యుండిరి.

శ్రీ కర్రి నారయ్యగారు క్రీ॥శ॥ 1923 సం॥రములోను శ్రీ ముళ్లపూడి గంగరాజుగారు క్రీ॥శ॥ 1924 సం॥రములోను శ్రీ మహర్షులవారికి శిష్యులై యుండిరి. విష్ణు మందిరమున జయ విజయులు ద్వారపాలకులై యుండినట్లు శ్రీ నారయ్య శ్రీ గంగరాజుగార్లు ఇద్దఱును శ్రీ మహర్షులవారికి ద్వారపాలకులై సర్వదా గురుకుటుంబమును కాపాడుచుందురు. వీరిద్దఱును దేహాభిమానమును వీడి తమ తమ పరివారముతో గురుసేవ చేయుటయే జీవిత లక్ష్యముగా నెంచుచుందురు.

ఈ శిష్యవర్యులిద్దఱును తమ సర్వస్వమును గురుసేవకై వినియోగించుచుందురు. మధ్యాహ్నము గం. 3-0 ల నుండి అచట చేరిన శిష్యులందఱికిని గురువర్యులు జ్ఞానబోధ చేయుచుందురు. ఏ తరగతివారికి ఎట్లు బోధింపదగునో అట్లే శ్రీ గురువర్యులు బోధించుచుందురు. ఒకనాడు నేను గురువర్యుల చెంత బోధసమయములో నుంటిని. ఆనాడు సీతాపరమేశ్వరి అయిదేండ్లు బాలికయై సాయంకాలము గురుపుంగవుల చెంత కూర్చుండియుండెను. మహర్షులవారు బోద ముగించి ఒక్కొక్కరిని

పిలిచి ప్రసాదములిచ్చువేళ "ఈ బాలిక యెవరు?" అని ప్రశ్నించిరి. వెంటనే దేవి అదృశ్యురా లయ్యెను. ఆ దృశ్యము మహర్షులవారికి మాత్రమే గోచరించెను. ప్రతినిత్యమును స్త్రీలును పురుషులును దూర ప్రదేశములనుండి వచ్చి శ్రీ సీతారాములను గురుపాదములను పూజించి వెళ్లుచుందురు. శ్రీవారి దర్శనమునకు వచ్చిన భక్తులు సాష్టాంగ దండ ప్రణామము గావించి గురుసన్నిధిని గూర్చుండి గురుబోధ విని తన్మయులగుచుందురు. మేడ పై భాగమున గురుపత్నియగు శ్రీ బాపనాంబగారు వచ్చిన భక్తులనందఱిని వాత్సల్యముతో ఆదరించి భోజనాది మర్యాదలు జరుపుచుందురు. వీరు నివసించు మేడకుత్తరభాగమున వంటశాల గలదు. ఆతిధ్యభ్యాగతులతోడను, బంధుమిత్ర పరివారముతోడను, భక్త జనుల తోడను భోజన సమయములందాశాల కలకలలాడుచుండును. ఎట్టి యపరిచితుడేతెంచినను భోజనాది గౌరవములలో అచటివారు మిగుల శ్రద్ధ వహించియుందురు. మహర్షులవారి దివ్యభవనమునకు ఈశాన్య దిక్కున "తారకతీర్థము" అను పేరుగల నూయి గలదు. శ్రీ గురువర్యులు గంగానది పుణ్యనదులలోని జలమును శ్రీరామ తారకమంత్రముతో మంత్రించి పుణ్యక్షేత్రములయందుగల మహత్తరశక్తిని ఆ నూతిజలమున గుప్తము గావించిరి. అందుచేతనే ఆ నీరు త్రాగినంతనే ఆకలి దప్పికల బాధ లణంగి తాపత్రయాగ్ని చల్లారి మనస్సునకు నూతనోల్లాసము కల్గించుచుండును, ఆ చుట్టుప్రక్కల నెచట చూచినను అంత సంతుష్టి కల్గించు జలము కాన్పింపదు. దీనికి గూడ మహర్షి తపో మహిమయే కారణమని భక్తుల గాఢ విశ్వాసము. 2-1-1941 తేదీ నుండి నేను శ్రీ గురుచక్రవర్తి పాదసేవకుడనై యుంటిని. అప్పటికే శ్రీవారి వయస్సు ఎనుబది సం॥రములు మీరి యుండెను. శరీర పాటవము సన్నగిల్లెను. అందుచే తుల్యభాగనదికి వెళ్ళి స్నానము చేసి వచ్చుటకు శక్తి చాలకుండెను. మేడ

పై భాగమున ఈశాన్య దిక్కునగల గదిలో శ్రీరామ పీఠము గలదు. దానికెదురుగా పడమర వైపునగల గదిలో గురువర్యులు యోగసమాధుల నెఱపుకొనుచుందురు. ప్రతిదినమును సాయంకాలమునందు ప్రదోష సమయమునకే తపస్సు ప్రారంభించి రాత్రి గం. 11-0 లకు భుజించుచుందురు. ఆంతరంగిక శిష్యులు శ్రీవారి భోజనాది కృత్యములు నెరవేర్చుచు భోజనమైన పిమ్మట గురుపుంగవులకు పాదసేవ చేయుచుందురు. అట్టి ప్రశాంత సమయములో శిష్యులకు చక్కని జ్ఞానబోధ గావించుచుందురు; రాత్రి గం. 12-0 ల నుండి గం॥ 3 -0 ల వఱకును యోగ నిద్రలో నుందురు.

ఆ యోగ నిద్రలో సృష్టి చిత్రములను హృదయాకాశమున దర్శించి బ్రహ్మానందమున మునిగి యుందురు.

"యానిశా సర్వభూతానాంతస్యాం జాగర్తి సంయమీ"

భగవద్గీత॥

సర్వభూతములకును రాత్రిగా నుండునపుడు జ్ఞానికి పగలుగా నుండును. ఈ లక్షణమే శ్రీ మహర్షులవారియెడ సార్థకమై యొప్పును. యోగ సమాధి విశేషములను ఆంతరంగిక శిష్యులకు దెల్పుచుందురు. మరల తెల్లవారగట్ల గం. 3-0 లకే లేచి తపస్సు ప్రారంబించినంతనే శ్రీరాముడు సగుణ నిర్గుణ లక్షనములతో సాక్షాత్కరించుచుండును. మహర్షులవారు జపించునపుడు ఇట్లుందురు.

సీ॥ ఒకవేళఁ దనయందు -సకల ప్రపంచంబు
కల్పితంబని యెంచి - కాంచినవ్వు ।
నొకవేళ సర్వభూతోపాధి తతియందుఁ
దనుజూచి మిగుల స ం- తసముఁ జెందు ।

నొకవేళ దేహోదు - లొప్పుగా విహరింప
సర్వసాక్షినటంచు - సంభ్రమించు ।
నొకవేళ నన్యమించుక లేదొకండనే
నని నిర్వికల్ప సమాధినొందు !

తే॥గీ॥ అతుల వైరాగ్య బోధో పరతులగల్గు
నతని మహిమలు గణుతించి యభినుతింప
హరిహర హిరణ్య గర్భులకు నైన దరమె
యపరిమిత సద్గుణనికాయ యాంజనేయ॥

(సీతారామాంజనేయము 3 ఆ. 179 ప.)

శ్రీరాముడు ఆంజనుయునికి బోధించిన మహాజ్ఞాని లక్షణములన్నియు శ్రీ మహర్షులవారియందు అనుక్షణమును తాండవమాడుచుండును.

శ్లో ॥ కరమూలే మహాగౌరీ కరమధ్యే సరస్వతీ
కరాగ్రేవసతేర్లక్ష్మ్యః ప్రభాతే కర దర్శనం:

అనిపఠించుచు రెండరచేతులను దగ్గరచేర్చి పార్వతిని, సరస్వతిని, లక్ష్మిని దర్శించి చేతులు కండ్లకద్దుకొని ప్రక్కపై నుండి లేచెదరు. సూర్యోదయమునకు పూర్వమే లేచి దంతధావనము చేయునపుడు కూడ మానసికార్చన చేయుచుందురు. అందుచే దంతధావనము కూడా సుమారు ఒక గంటకాలముపట్టును. ఒకనాడు దంతధావన సమయములో నేను శ్రీవారి దగ్గఱనుండు పుణ్యము లభించెను. వారి స్థితి గుర్తింపనేరక నేనేదియో దురువర్యులను ప్రశ్నించితిని. “శ్రీ సీతారాములు సింహాసనము లపై ఇప్పుడే వచ్చి కూర్చుండిరి. నేను అర్చన ప్రారంభింపబోవుచుండగా నీవు ప్రశ్నించితివి. నా సమాధికి భంగము కల్గినది. జ్ఞానుల చెంత నెట్లు మెలగవలెనో నీకు తెలియదు. మనస్సునకు తోచినట్లుగా సమయము

నెఱుగక జ్ఞానులను ప్రశ్నించరాదు" అని మందలించిరి. అని మందలించిరి. మన గురువర్యులు దంతధావన సమయములోగూడ సమాధిస్థితిలో నుందురని అప్పుడు గుర్తించితిని. సూర్యోదయమునకు ముందే కాలకృత్య ములు నిర్వర్తించుకొని తారక తీర్థమును స్నానముచేసి శ్రీరామునర్చించి ఏకాంతముగా గూర్చుండి తపస్సు గావించుకొనుచుందురు. మహేంద్రవాడ లో కొవ్వూరి సత్యనారాయణరెడ్డి అను పేరుగల శిష్యుడుండెను. ఆయన నిత్యమును ఉదయము పూట తులసిదళములు, మారేడు చిగుళ్లు, మారేడు కాయలు, ఉస్తికాయలు, బలుసుఆకు తెచ్చి రహస్యముగా గురువర్యులకు సమర్పించి వెళ్లుచుందురు. తులసిదళములు శ్రీరామపూజకుపయోగించి మారేడు చిగుళ్లు, మారేడు కాయల గుంజు, బలుసుఆకు పచ్చడి గురు వర్యులు భుజించుచుందురు. మఱియు ప్రతి ద్వాదశి రోజునను అవసెకూర తెచ్చి సత్యనారాయణ రెడ్డిగారు గురువర్యులకు సమర్పించుచుండుట పరిపాటి.

శా॥ అనిష్ఠానిధి గేహసీమ నడురేయాలించిననఎ మ్రోయు, నెం
తేనాగేంద్రశయాను పుణ్యకథలుం, దివ్య ప్రబంధానుసం
సంధాన ధ్వానము, "నాస్తిశాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్తపూ
పో, నాస్త్యోదన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య" మన్పల్కులున్॥

(విష్ణుచిత్తీయము 1 అ. 84 ప॥)

శ్రీ మహర్షులవారి పుణ్యాశ్రమమున అర్ధరాత్రి వేళ లందైనను భగవత్కథా ప్రసంగములును, పుణ్యకథలును, దివ్య చరిత్రలును, భోజనశాల లో అతిథిసత్కారమునకు సంబంధించిన మర్యాదవాక్యములును వినబడు చుండును. శ్రీ మహర్షులవారు దేవతా నివేదనము చేయుచున్నప్పుడు శ్రీరామచంద్రుడు పరివారముతో వచ్చి సాక్షాత్కరించి నివేదన పదార్థము లను ఆరగించుచుండుట నిత్యమును పరిపాటి. నివేదనము చేయుటకు

ఒక గంట పట్టును. త్యాగరాజు 96 కోట్లు రామనామము జపించుటకు 13 సంవత్సరములు పట్టెను. రాత్రింబగళ్ళు నిర్విరామముగా 13 సంవత్సరములు జపించిన పిమ్మట శ్రీరామలక్ష్మణులు ధనుర్ధరులై ద్వారమునొద్ద నిలబడి తలుపుతట్టి త్యాగరాజునకు దర్శనమిచ్చిరి. కాని, శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారి జపమాల ఎన్ని కోట్లు శ్రీరామనామము జపించినదో ఒక్క శ్రీరామచంద్రునికి మాత్రమే తెలియును. మనస్సును మంత్రమును, లక్ష్యమును, ఏకముగావించి జపించుటయే మహర్షులవారి నిత్యకృత్యము, నా జపమాల ఎన్నికోట్లు రామనామము జపించినదో నాకే తెలియదని శ్రీ గురువర్యులే ఒకసారి ప్రసంగవశమున నాతో బల్కియున్నారు.

29-1-1944 తేదీకి సరియగు స్వభానునామ సం॥రం మాఘశు ద్ధ పంచమీ శనివారము రోజున మధ్యాహ్నము 12 గంటలకు శ్రీ గురువర్యులు మేడపై భాగమున దేవతా మందిరములో శ్రీ రామునికి నైవేద్యము చేసి ఒంటరిగా గూర్చుండి భోజనము చేయుటకుపక్రమించిరి. అంతకుపూర్వమే శ్రీ మహర్షి శిష్యులు శ్రీరామ సప్తాహము చేయుటకు సంకల్పించి చుట్టుప్రక్కల గ్రామాదులలో ప్రచారము చేసియుండిరి. ఏ కారణము చేతనో సప్తాహ ప్రయత్నము సన్నగిల్లెను. అందుచే శ్రీరామచంద్రుడు ఆనాడు కాలాగ్నిరుద్రుడై సాక్షాత్కరించి భుజించుచున్న శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి జుట్టుపట్టుకొని ఈవలికి ఆవలికిని వసరికొట్టెను. ఆ దెబ్బలు మేడక్రింది భాగములోని వారికి గూడ వినబడెను. ఈ విషయము ముందు ప్రకరణములో వివరించెను.

మఱియొకప్పుడు నేను మహర్షియాశ్రమములో నుంటిని. వారు నన్ను దేవతామందిరము లోనికి వెళ్ళి నివేదనము చేయుమని తాము వేఱొకచోట తపస్సు చేసికొనుచుండిరి. ఆనాడు నేను పట్టుకొనివచ్చిన నివేదన

పదార్థములను గురువర్యులు చూడనైనలేదు. ఆ రోజున విఘ్నేశ్వరునికి బియ్యము పిండితో చేసిన చలిమిడి నివేదన పదార్థములలో నుంచబడెను. నేను నివేదనము చేసి యీవలికి వచ్చు సరికి గురువర్యులు "నాయనా! ఈ రోజున దంతముల ప్రక్కలనుండి చలిమిడి కారుచున్నట్లు నాకు గణపతి దర్శనమిచ్చినాడు. నీవు పట్టుకొనివచ్చిన చలిమిడి ఎట్లున్న" దని నన్ను పిలిచి నివేదన పదార్థములు చూడగా చలిమిడి కొంచెము పలుచగా చేయబడి యుండెను. ఈ కారణములచే ప్రతిదినమును దేవతలువచ్చి నివేదన పదార్థములను స్వయముగా ఆరగించుచుందురని స్పష్టమగు చున్నది. మధ్యాహ్నము దేవతా నివేదనమైన వెంటనే ఆంతరంగిక శిష్యులను చేరబిల్చి మహర్షి సంప్రదాయములను అనుభవ పూర్వకముగా బోధించు చుందురు. ఈ పుణ్య సమయము శిష్యులకు అపభృద స్నానము వంటిది.

స్త్రీ పురుషులైన శిష్యులను క్రమశిక్షణలో నుంచుటలో శ్రీ గురువర్యుల ప్రతిభ సాటిలేనిది. స్త్రీలకు తేట తెలుగు పద్యములతోను, కీర్తనలతోను, మృదుమధురములగు వాక్కులతోను బోధించుచుందురు. పండితులకును, పురుషులకును శృతిస్మృతి ఇతిహాసాది ప్రయాణములతో శ్రీరామతత్త్వము బోధించుచుందురు. వీరి గురువర్యులు దీక్షాంతమున సాగనంపుచు "నాయనా! నీకు బోధనశక్తి బాగుగా గలదు. భో! ధన శక్తి బాగుగా గలదు" అని హస్తమస్తక సంయోగము గావించుచు ఆశీర్వదించి పంపిరి. అందుచేతనే వీరితత్త్వ బోధలోనొక విశిష్టమైన నూతన చైతన్యశక్తి తాండవ మాడుచుండును. వీరి సేవ చేసిన వారికిగాని, వీరిని దర్శించిన వారికిగాని, ఎట్టిదోషములును దగ్గఱ చేరవు. మహత్తర మహిమాన్వితులగుటచే వీరి యాశ్రమము నిత్యకళ్యాణము, పచ్చతోరణముగా విరాజిల్లుచుండును.

శ్రీ మహర్షులవారు ఈశ్వరాంశ సంభూతులై యుండుటచే వీరి ధర్మపత్నియగు బాపనాంబగారు కూడ పరమేశ్వరి కళతో జన్మించియుండిరి.

శ్రీ గురుచక్రవర్తి జాతకమునుబట్టి కళత్ర స్థానాధిపతియగు శుక్రుడు విక్రమస్థానమందు బలవంతుడై యున్నాడు. కావుననే మహర్షులవారి పాదపూజతో పాటు శ్రీమతి బాపనాంబగారి పాదములకుగూడ అపరిమితమైన కుంకుమపూజ జరిగెను. గురుదంపతులకు పాదపూజలు జరుగునప్పుడు శ్రీ మహర్షులవారి పాదపద్మములకు వేదోక్త విధిగా అభిషేకములును పుష్పములతో పూజలును జరుగుచుండును. గురుపత్ని పాదారవిందములకు శ్రీ  సూక్త విధానముగా కుంకుమపూజలును జరుగుచుండును. విద్యాధికులైన పండితులుగూడ గురుపత్నిని పరమేశ్వరిగా భావించి కుంకుమ పూజలు చేయుచుందురు. ఆమె పాదములయందు ఎన్ని మణుగుల కుంకుమపూజ జరిగియుండెనో శ్రీ సీతారాములకు మాత్రమే తెలియును. శ్రీ మహర్షులవారి యాధ్మాత్మిక జీవిత విధానమంతయును పరమ గోప్యముగా సాగుచుండును.

శ్రీరామతారక పరబ్రహ్మోపాసన చేయువారి చెంత భక్త శిఖామణి యగు ఆంజనేయుడు తాండవమాడుచు భక్తుల కోరికలనన్నిటిని తానే నిర్వహించుచుండును. ఆంజనేయుడు సనకాది మునులకిట్లు బోధించెను.

శ్లో॥ యోరామం సంస్మ రేన్నిత్యం భక్త్యామను పరాయణః
తస్యాహ మిష్ట సంసిద్ధ్యై దీక్షతో....స్మి మునీశ్వరాః
వాంఛితార్థం ప్రదాస్యామి భక్తానాం రాఘవస్యతు
సర్వధా జాగరూకో...స్మిరామకార్య ధురంధరః

ఎవరు నిత్యమును శ్రీరామమంత్రానుష్ఠానపరులై భక్తితో మెలగుచుందురో అట్టి రామభక్తుల కోరికలను రామకార్య ధురంధరుడగు ఆంజనేయుడు జాగరూకుడై నెరవేర్చుచుండును

(రామరహస్యోపనిషత్)

రాజాధిరాజులకు గూడ జరుగని గౌరవ ప్రతిష్ఠలు కల్గించుచు, ఏ విషయమునను లోటు కలుగనీయక సర్వకాల సర్వావస్థలయందును హనుమంతుడు శ్రీ గురుమండలమును కాపాడుచుండును.

శ్రీ మహర్షులవారు తపస్సులో ప్రవేశించినపుడు తమ దివ్య చక్షువుతో శిష్యుల నందఱిని చూచుచుందురు. ఎంత దూరములో నున్నను శిష్యుని ప్రవర్తనమంతయును శ్రీగురువర్యులకు గోచరించుచుండును. ఎవరికిని తెలియకుండగ నేను గావించిన పొరపాటును గుర్తించి శ్రీ గురువర్యులే ఒకప్పుడు సరిదిద్దిరి. అహంభావపూరితులైన వారికి గురుసన్నిధిని స్థానమేలేదు.

ఒకనాడు గురువర్యులు నన్నొంటరిగా మేడ పై భాగమునకు పిలిపించి దివ్యబోధ చేయుచుండిరి. అపుడు మధ్యాహ్నము మూడుగంటలయ్యెను. “అబ్బాయి! నాకు తినుటకేమైన పెట్టెదవా?” అని నన్ను ప్రశ్నించిరి. ఈ సంభాషణము జరుగుచుండగనే ఎవరో భక్తులు ఒక తట్టెడు బత్తాయిపండ్లు మేడ పై భాగమునకు పంపించిరి. “ఇదియే శ్రీ రామచంద్ర ప్రభువు వారి ప్రత్యక్షమహిమ, నాకు సంకల్పము కల్గినంతనే రాముడే ఈ పండ్లు పంపినాడు” అని పల్కిరి. ఆహారాది విషయములలో గూడ మహర్షులవారిని రాముడే కాపాడుచు రక్షించుచుండును.

మహర్షులవారి యుపాసనాపద్ధతి గూడ విశిష్టమైనది. ఉపాసనా । ఉప + ఆసనా. అనగా ఉప = సమీపమందు ఆసనా = ఉండుట అని యర్థము. భగవంతుని దగ్గరచేరి జపించుటకు ఉపాసన యనబడును. మనస్సును మంత్రమును లక్ష్యమును ఏకముగా జేసి జపించుటయే మహర్షులవారి యుపాసనా పద్ధతి. కావుననే శ్రీ గురువర్యులు జపించుచున్నపుడు శ్రీరాముడు సగుణ నిర్గుణ రూపములతో ప్రతి నిమిషమును సాక్షాత్కరించుచుండును. ఆంజనేయుడు మొదలగు దేవతా

మూర్తులు జపించుచున్న గురువర్యులకు నమస్కరించి వెళ్ళుచుండుట నిత్యమును పరిపాటి, బ్రహ్మోపాస్తి చేయుచున్నపుడు గురుమూర్తివంటి మఱియొక మూర్తి తమ శరరము నుండి యెదుటికి వచ్చి సంభాషించుచుండుటగూడ జరుగుచుండును.

నేనొకసారి దేవీ నవరాత్రములలో గురుదేవునిప్రక్క కూర్చుండియుంటిని. ఆ సమయమున శ్రీ కంటిపూడి శ్రీరాములుగారును వారి ధర్మపత్ని వీరమ్మగారును, ముళ్ళపూడి గంగరాజు, కర్రి నారయ్య మొదలగువారును దేవీపూజలు చూచుచుండిరి. గురుపుత్రులు వెంకటసూర్యనారాయణ పరబ్రహ్మంగారు దేవికి కుంకుమ పూజలు చేయుచుండిరి. గురువర్యులు మేడపై భాగమున తమ చిత్రాసనముపై జపించు చుండిరి. ఆ సమయమున జగజ్జనని గురుసన్నిధిని నిలబడి యుండెను. ఆ దేవి నీలవర్ణముగల జరీపట్టుచీర ధరించి ఉత్తర ముఖముగా నుండెను. వెడల్పైన వాలుజడ వీపుపై వ్రేలాడుచుండెను. ఆ జగన్మాత రమారమి పండ్రెండు అడుగుల ఎత్తుగా నుండెను. ఇది మధ్యాహ్నము గం. 12-0 ల వేళ జరిగెను. ఆ జగన్మాత రూపమును ఆపాదమస్తకము నేను చర్మచక్షువుతో గాంచగల్గితిని. కావున నిరంతరమును శ్రీ గురుదేవునికి దేవతలతోనే చుట్టఱికము.

# శిష్యశిక్షణము - భక్తరక్షణము

కేసిరాజు సుబ్బారాయుడుగారు ఆఱువేల నియోగి బ్రాహ్మణులు. తల్లి కామాంబ. తండ్రి పుల్లమరాజుగారు. ప.గో.జిల్లా మలకపల్లి. వీరి నివాస గ్రామము. వీరు క్రీ॥శ॥ 1958 సం॥ రమున జన్మించిరి. వీరు గూటాల, మాధవరం, మలకపల్లి, అన్న దేవరపేట గ్రామములలో ప్రాథమిక పాఠశాలలయందు ఉపాధ్యాయులుగా పనిచేసిరి. సంస్కృతాంధ్రములలో చక్కని పాండిత్యము గలదు. మితభాషిత్వము, నిత్యసంతోషము సహజ గుణములు, అన్నదేవరపేటలో నుపాధ్యాయుడుగా పనిచేయు కాలమున అనిపెద్ది వెంకటరత్నముగారి వలన శ్రీ మహర్షులవారి మహిమా విశేషములను విని మన గురువులకు శిష్యులైరి. గోదావరి తీరమందుగల చిడిపి అను గ్రామములో శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి కేసిరాజు సుబ్బరాయకవి గారికి తారకమంత్రోపదేశమిచ్చిరి. నిత్యమును దేవతార్జన చేయుచు రాత్రివేళల పురాణము చెప్పుచుండెడివారు. గురూపదేశమహిమచే వీరికి పవిత్రమైన వాక్శుద్ధికల్గెను. ఒకప్పుడు మలకపల్లి ప్రాంతములో వర్షములు లేక క్షామము సంభవించెను. అందుచే మలకపల్లి గ్రామవాసులు వారిచే భారతమును పురాణము చెప్పించిరి. వీరి సంగీతమునకును, కథాకథనమునకును, ఆ బాలగోపాల మందఱును తన్మయములగుచుండిరి. పాండవుల జననఘట్టము వచ్చుసరికి తప్పక వర్షము కురియునని సుబ్బారాయుడుగారు చెప్పిరి. సరిగా పాండవుల జననఘట్టము చదువునాడే అఖండవర్షము కురిసెను. సగుణ నిర్గుణారాధనములు చేయుచుండుటచే తఱచు నధ్యాత్మరామాయణము పురాణము చెప్పుచుండెడివారు. ప్రతి సంవత్సరమందును శ్రీరామనవమికి సీతాకళ్యాణము చేసికొనుచు

శక్తివంచన లేకుండగ అన్నదానము చేసికొనెడివారు. వెలివేటి సుబ్బారాయుడుగారితోను వారి కుమారులైన చలపతిగారితోను, ఇతరభక్తులతోను భజనలు చేయుచుండెడివారు. నిరంతర రామధ్యాన తత్పరులైయున్న సుబ్బారాయుడుగారు పరమపదించు కాలమాసన్న మాయెను. అందుచే మనస్సును శ్రీరామునియందు లగ్నము చేసియుండిరి. 1899 సం॥ రమున ఆషాడ శుద్ధ చవితి రోజున రాత్రి గం॥ 10లకు యమకింకర దర్శనమయ్యెను. వారిని జూచి పండ్లు పటపట గొరుకుచు రామమంత్రమును జపింపసాగిరి. ఆ మంత్రజపముతో యమకింకరులు పారిపోయిరి. వెంటనే విష్ణుదూతలు ఎదుట ప్రత్యక్షమైరి. యమకింకరుల సంగతియును, విష్ణుదూతల సంగతియును సుబ్బారాయుడుగారు దగ్గర నున్నవారితో చెప్పిరి. పిమ్మట విష్ణుదూతలను చూచుచు నవ్వుచు జీవాత్మను పరమాత్మతో నైక్యమొనరించిరి. ఇదియంతయును గురుదేవుని శిక్షణ విశేషమేగదా!

## తాడి అచ్చయ్యమ్మగారి విశేషములు

బ్రహ్మవిద్య పట్టుబడుటకు వాసనాత్రయమును నశించవలెను. అనగా దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన నశించవలెను. ఈ వాసనాత్రయము నశించుటకు సద్గురుబోధ కావలెను. గురుబోధలేనిదే వాసనాత్రయమును సంకెళ్ళు విడవు. అట్టి బోధకుడే సద్గురుమూర్తి. శ్రీ సుబ్రహ్మణ్య గురు పుంగవులు గూడ తమ శిష్యులకు వాసనాత్రయమును నశించుమార్గములనే బోధించుచుందురు.

"అంత్యకాలమందు హరిచింతనముసేయఁ!
బుట్టువునకు ఫలము భూసురేంద్ర"

అను భాగవత లక్షణముబట్టి మానవజన్మము లభించినందులకు నిష్కారణము హరిస్మరణయే కర్తవ్యము. ఆ లక్ష్యము అంత్యకాలమున

చెడకుండగ అభ్యసించవలెను. అట్లు తయారగుటకు సద్గురు శిక్షణమును, గురుబోధయు, శరణ్యములు, ముముక్షువునకు గ్రంధపఠనముతో బనిలేదు. శాస్త్ర పాండిత్యముతో ప్రయోజనములేదు. ఆ విషయములను నిదర్శన పూర్వకముగా జూచినగాని లోకులు విశ్వసించరు. అందుచే మహర్షి శిష్యురాలైన తాడి అచ్చయ్యమ్మగారి చరిత్ర తెలుపవలసియున్నది.

మహేంద్రవాడలో చాలకాలము భూమంచిరెడ్లు నివసించుచుండిరి. వారిలో శ్రీ తాడి అప్పన్నవారి ధర్మపత్ని అచ్చయమ్మ అను పుణ్యాత్ములుండిరి. అప్పన్నగారు వ్యవసాయము చేసి కాలము గడుపుచుండిరి. తీరికవేళలందు ఆ దంపతులిద్దఱును హరికథలు పురాణములు వినుటకు అలవాటు పడియుండిరి. అప్పన్నగారికి సూరయ్య అను పేరుగల యన్నగారుండిరి. శ్రీ సూరయ్యగారు ప్రతిదినము తెలుగు భాగవతము చదువుచు వారిద్దఱికిని వినిపించుచుండెడివారు. అప్పన్న అచ్చమయ్య గార్లకు పుత్రిపుత్రికా సంతానము లేదు. అయినప్పటికిని వైరాగ్యమవలంబించి జన్మరాహిత్య మార్గములకై వెదుకనారంభించిరి. అప్పటికి అప్పన్నగారికి 25 ఏండ్లును అచ్చయ్యమ్మకు 18 ఏండ్లును గలవు. అట్టి యౌవన వయస్సులోనే వారిద్దఱును విషయలంపటులుగాక భోగభాగ్యముల తృణీకరించి భక్తులై సంసారయాత్ర సాగించుచుండిరి. పుత్రులు లేకపోయినప్పటికిని అచ్చయ్యమ్మగారు విచారమెఱుంగక ఎప్పటికైనను ఆత్మ పుత్రుని కనవలెననియు, వశిష్ఠుడు, వ్యాసుడు కృష్ణుడు, మొదలగువారితో సమానుడగు సద్గురువును సేవించవలెననియు, లేనిచో మనజన్మము వ్యర్థమనియు ప్రతిదినమును భర్తను ప్రోత్సహించు చుండెడివారు. భాగవతాది గ్రంథములలో గురువులేనిదే ముక్తిమార్గము దొరకదని వినియుండుటచేత అచ్చయమ్మగారు గురువుకొఱకు బెంగపెట్టుకొని కన్నీరు కార్చుచు భోజనముచేయక మిగుల విచారములో మునుంగుచుండిరి.

అపుడు భార్యాభర్తలిద్దఱికిని ఈ రీతిగా సంభాషణము జరిగెను.

అప్పన్న :- ఓసీ! నీవు ప్రతిదినమును బెంగతో కృశించి విచారించుటకు కారణమేమి?

అచ్చుయ్యమ్మ :- స్వామీ ! భాగవత కథలందు విన్న శ్రీశుకుని వంటి సద్గురువును సేవించినగాని నాకు మనశ్శాంతి కలుగదు. లేనిచో మన జన్మములు నిరర్థకములు సుమా!

అప్పన :- ఓసీ ! మనకు కాన్పించు బైరాగులును, సన్యాసులును, నిజమగు గురువులు కారు. ఉదరపోషణార్థమై బయలుదేరిన కపటవేషధారులు. అట్టివారు గురువులైనచో సాటివారందఱును మనలను చులకనచేయుదురు. భక్తిమాటయటుండ ముక్తికి దూరమగుదుము. మనము నిరీక్షించుచుండిమేని తప్పక సద్గురువు లభించును అని యోదార్చుచుండెను.

ఇట్లుండగా క్రీ॥శ॥ 1904 సం॥రమునకు సరియైన క్రోధి సం॥రమందు ఒక శుభ దినమున శ్రీ తాడి సూరయ్యగారు, భద్ధిర్రాజు సూర్యనారాయణగారితోను, పల్లేటి వెంకటావధానులుగారితోను బయలుదేరి పామర్రు వెళ్లవలసి వచ్చెను. వీరు వెళ్ళుసరికి శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులు గ్రంథాపేక్ష లేకుండగనే భాగవతమందలి ధృవోపాఖ్యాన పద్యములు చదువుచు అందలి రహస్యనుభవార్థములు చెప్పుచు తన్మయులై శిష్యకోటికి తత్త్వబోధ చేయుచుండిరి. ఆ గురుబోధ తాడి సూరయ్యగారు విని పరమానందభరితులై "ఆహా! ఈ స్వామి అవతారమూర్తిగాని సామాన్యవ్యక్తిగాదు". అని యుప్పొంగుచు ఈ రాత్రికి మహేంద్రవాడవచ్చి గురుస్వామి విషయమంతయును తన తమ్ముడైన అప్పన్నతోను, అచ్చుయ్యమ్మలోను సవిస్తరముగా జెప్పిరి.

ఆ విషయము వినినది మొదలు అచ్చుయ్యమ్మగారు "ఆహా! ఆ

గురుస్వామి పాదసేవ నాకెప్పుడు లభించును? ఎట్లు లభించును? నాకు మనశ్శాంతి యెప్పుడు కల్గును?" అని సంతోషపరవశురాలై ఎట్లో కాలము గడుపుచుండిరి. రాత్రింబగళ్ళు గురుస్మరణ తప్ప అన్య మెఱుంగకుండెను. ఆ దంపతుల పుణ్యవశముచే అది జరిగిన యొక సంవత్సరమునకే శ్రీ గురువర్యులు సకుటుంబ సపరివారముగా మహేంద్రవాడవచ్చి స్థిర నివాసమేర్పఱచుకొనిరి.

మహేంద్రవాడకు రెండు ఫర్లాంగుల దూరములో ఉత్తర దిక్కున తుల్యభాగయను పుణ్యనది గలదు. అందుచే ప్రతిదినమును గురుస్వామి తెల్లవారగట్లనే లేచి తుల్యభాగా నదికి స్నానమునకు వెళ్లుచుందురు. ఆ మార్గమధ్యమున తాడి అప్పన్నగారికి పొలముగలదు. ఒకనాడు అప్పన్నగారు తమ పొలములో పనిచేసికొనుచుండగా గురువర్యులు తుల్యభాగలో స్నానముచేసి మహేంద్రవాడ వచ్చుచుండిరి. సర్వభూతజాలముల యందును నిండి నిభిడీకృతమైయున్న పరబ్రహ్మ స్వరూపులై తన్మయులై వచ్చుచున్న మహర్షి పుంగవులను జూచినంతనే అప్పన్నగారి హృదయము ద్రవించి "ఆహా! ఈ కలియుగ శుకమహర్షి యెవరు? నేటికిట్టి మహానుభావులను దర్శించితిని గదా!" యని తమలో తాము ఉప్పొంగుచు మహర్షిని వెంబడించిరి. ఆనంద భాష్పపులకాంకిత దేహుడై వెంబడించుచున్న భక్తుని జూచి "నీది యే గ్రామము? కులమేది? వృత్తియేమి?" మొదలుగాగల కుశల ప్రశ్నలు వేయుచు తమ యింటికి తామేగిరి. అప్పన్నగారికి అదే గురుస్వామి ప్రథమ సందర్శనము. అప్పన్నగారు తడబడుచు తొందరగా యింటికి వెళ్ళి తన భార్యయగు అచ్చయ్యమ్మతో గురుస్వామి విషయము దెల్పిరి. ఆ మాటలు విన్నంతనే అచ్చయ్యమ్మ ఆనంద సాగరమున మునిగి నిశ్చేష్టురాలై కొంత సేపటికి తెలివి తెచ్చుకొని "ఆహా! నేటికిగదా! మన జన్మములు సార్థకమైనవి. అట్టి

సద్గురు పాదాశ్రయణము లేనిచో నేనొక నిమిషమైనను నిలువజాలనని ప్రార్థన పూర్వకముగా తన భర్తను కోరెను. పిమ్మట ఆ దంపతులిద్దఱును ఒక శుభ దినమున గురువర్యుల సందర్శించి "గురుదేవా! మాకు జన్మరహితమార్గము దెల్పి తరింపజేయుడు" అని ప్రార్థించిరి. సర్వజ్ఞులగు మునిపుంగవులా దంపతుల భక్తిజ్ఞాన వైరాగ్య లక్షణములు చూచి వారిద్దఱిని దమ శిష్యులుగా నంగీకరించిరి. క్రీ॥వ॥ 1905 సం॥రములో ఆ దంపతులు గురువర్యులకు శిష్యులైరి.

శ్రీ గురుచక్రవర్తి బోధామృతము ప్రతి రక్తకణమందును జీర్ణమై యుండుటచే ఆ పుణ్యదంపతులిద్దఱును "నగురో రధికం నగురో రధికం నగురో రధికం నగురో రధికం" (గురువుకంటె అధికమైనది లేదు.) అను తారకమంత్రమును జపించుచు గురుసేవతో కాలము గడుపుచుండిరి. క్రీ॥శ॥ 1905 నుండి క్రీ॥శ॥ 1941 సం॥రము వఱకును 36 సం॥రములు నిరంతర గురుసేవలొనర్చిరి. ఆ దంపతులను జూచినంతనే గురుస్వామికి అపారమైన వాత్సల్యము. అందుచే వారికి బ్రహ్మ విద్య కరతలామలముగా అనుభవమయ్యెను. శ్రీ అప్పన్నగారు ప్రతిదినమును ఉదయము 8 గంటలకు గురుదర్శనము చేసికొని గురువర్యులు రచించిన కీర్తనలు గురువులచెంత పాడి ఆనంద భాష్పములు తుడుచుకొనుచు బ్రహ్మానందమున మునిగి వెళ్ళుచుందురు. ఏ కారణముచేనైనను ఒక రోజున అప్పన్నగారు రానియెడల గురువర్యులే ఆయన క్షేమ సమాచారముల నారసితమ సన్నిధికి రప్పించుకొనెడువారు. అప్పన్నగారి గురుసేవ గమనించినచో శాస్త్ర పాండిత్యము నిరర&ధకమనిపించును.

పిమ్మట అచ్చయ్యమ్మకు సంసారకర్మ బంధముల నుండి పరిపూర&ణ తారక బ్రహ్మమును జేరుకాల మాసన్నమాయెను. ఆ మహా పతివ్రత హృదయమెంత పరిశుద్ధమై పరిపక్వమైనదోగాని భౌతిక దేహమును

వీడి పరిపూర్ణాచల బ్రహ్మమునందు తన యాత్మను జేర్చునపుడు ఈ క్రింది విధముగా లోకులకు బోధించుచు బ్రహ్మైక్యమొదెను. ఆమె యెంతమాత్రమును చదువుకొనలేదు.

## ఆమెబ్రహ్మైక్యమొందుచు పాడిన కీర్తన.

గురుకటాక్షమున । శివబ్రహ్మయాత్రకు నేను బోవు
చున్నానే । శ్రీరామ గురుసామీప్యానికి జేయుచున్నా నే ॥

శ్రీరామ గురుపాదపద్మములు నమ్మి । నిపుణులైన వారికి మార్గమిదేసుమా । సహోదరులారా ! నాతోడి శిష్యులారా ॥ (పల్లవి)

1. గురుకటాక్షమున కర్మ యుగ్మ భ్రాంతి రహితజ్ఞానులతో కలిసి మెలసియు । నిర్మలాక్షపురములో । అతి నిర్వికారపు త్రోవబట్టి ॥ శివ ॥

2. గురుకటాక్షమున । ప్రణవనాదములెల్ల పరికించి అందులో ।
ప్రభలెల్ల వీక్షింపుచు । అణుమహత్తులతోడ వెలిగెడి
యాత్మకళలను ప్రాపుగొణుచును । మనము లయమును
చెందియుండెడు మార్గమును విడువకను నడిచియు ॥

॥ శివబ్రహ్మ ॥

4. గురుకటాక్షమున । ఈషణత్రయములు । ఎవసియుండెడి
చిత్తము । ఇలలోనే దిగనాడుచు । వాసనాత్రయమమనెడు
ప్రకృతి వాసనచే మోసపోవక । దేశికేంద్రుడొసంగినట్టి
దివ్యపదవినిబట్టి శుద్ధ ॥ శివబ్రహ్మ ॥

5. గురు కటాక్షమున । సదసత్తులకు పైని సారమై మిగిలిన
స్వానుభూతిని జెందుచు । పదవుల మూడింటిపైన బయలు
రీతిని బరగుచుండెడు । మదమడంచిన యోగులకు సమ్మ
తమునై భాసిల్లుచుండెడు ॥ శివబ్రహ్మ ॥

6. గురుకటాక్షమున । ఆరు పువ్వులయందు అజపమంత్రార్థము
హంసభావము చెందుచున్ । తీరముల మూడింటిపైన తేజ
రిల్లెడు పరమహంసను । చేరి గురుగృహమందు జేర్చి చిత్సు
రూపాబ్ధిని తరించి ॥ శివబ్రహ్మ ॥

7. గురుకటాక్షమున । పరమపావనమైన బయలందు చిత్తము
పట్టుచెదరక నిల్పుచునఽ । గురుడొసంగిన పరమమంత్రము
గోప్యముగ లోనుంచి యెన్నడు । మరువకను దలచేటి
వారలు మగిడి జన్మలు చూడపట్టి ॥ శివబ్రహ్మ ॥

8. గురుకటాక్షమున । బాగుగ రెడ్డి సుబ్రహ్మణ్య వరదుడగు
పాప యార్యుల జేరిననఽ । రాగ విరహితులైన మునులకు
లక్ష్యమునకు దోచుచుండెడు । ఆగమాంత వాక్యములచే
అనుదినము నుతియింపబడ్డ ॥ బ్రహ్మ ॥

ఇట్టి యోగ మార్గముతో గూడిన బ్రహ్మానుసంధానము చేయుచు భౌతిక దేహమును వీడు సమయమున ఆమె శరీరము నుండి అద్భుతమైన తేజోరాశి బయలుదేరి పరబ్రహ్మమంధైక్యమయ్యెను. ఆ సమయమున మహర్షి శిష్యకోటికి చెందిన శ్రీ కర్రి నారయ్యగారును వారి భార్య శ్రీమతి చెల్లాయమ్మగారును దగ్గరనే యుండిరి. ఆ వెలుగు కర్రి నారయ్యగారు బాగుగా చూచిరి. అచ్చయ్యమ్మ పతివ్రతా శిరోమణి యగుట చేతను, మహా గురుభక్తురాలగుట చేతను. గురుకులవాస శిక్షితురాలగుటచేతను, (17-9-1941) తేదీకి సరియైన) వృష సం॥ర భాద్రపద బహుళ ఏకాదశీ పర్వకాలమున ఏకాదశి ఘడియలు వెళ్ళి ద్వాదశి ఘడియలు వచ్చు సంధికాలమున ఆమె బ్రహ్మైక్యమందెను. ఏకాదశి ద్వాదశి సంధికాలమున ఆమె బ్రహ్మైక్యమందెను. ఏకాదశి ద్వాదశి సంధికాలములోనే భగవంతుడు ధర్మ సంస్థాపనమునకై అవతరించుచుండును.

“ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే” అను గీతా వాక్యము ననుసరించి భగవంతుడవతరించు పుణ్యకాలమదియే. కావుననే ఏకాదశి తిథి ఏమాత్రము మిగిలియున్నను మిగుల తిథినే ఏకాదశీ పర్వముగా జ్యోతిష్కులు పంచాంగములలో వ్రాయుచుందురు. అవతారములు వచ్చిన కాలమగుటచేతను, శ్రీరామ గురుభక్తురాలగుటచేతను, నిర్గుణరాముడు జ్యోతిస్స్వరూపుడగుటచేతను, అచ్చెయ్యమ్మ గృహస్థురాలై యుండిగూడ యోగీశ్వరులు పొందు బ్రహ్మమును చేరెను. ఇది యంతయును గురుసేవా భాగ్యముచే లభించిన జ్ఞాన మార్గము.

ఈమె జీవితకాలములో గురుకులవాసము చేయుచున్నట్లు లోకులకు ఎంతమాత్రమును తెలియనీయకుండగనే కాలము గగపి లోకమునకు మార్గదర్శకురాలయ్యెను. ఈమె చరిత్రవలన తేలినదేమనగా చదువుతోను, వర్ణాశ్రమ ధర్మములతోను, బ్రహ్మజ్ఞానమునకు పనిలేదనియు, కేవలము గురుసేవకంటె తరించుటకు శరణ్యము లేదనియు స్పష్టమగుచున్నది. ఈమె అంత రీవిగా బ్రహ్మమును జేరుటకు శ్రీ మహర్షులవారి దివ్యబోధామృతమే కారణము.

# చిట్టూరి శేషగిరిరావుగారు కృతార్థులైన విధము.

తూ.గో.జిల్లా, రామచంద్రపురం తాలూకా కపిలేశ్వరపుర గ్రామములో శ్రీ చిట్టూరి శేషగిరిరావుగారు శ్రీ మహర్షి పుంగవులకు శిష్యులై పరాకాష్ఠతో బ్రహ్మ విద్యను సాధించిరి. సర్వము బ్రహ్మమయముగా ఆయనకు గోచరించుచుండెను. నిర్యాణ సమయము తమకు ఆసన్నమైనదని గుర్తించి “నా గురుదేవుని నా వద్దకు గొనిరండు” అని తన యాప్తవర్గముతో

శేషగిరిరావుగారు చెప్పిరి. కూళ్ళ గ్రామములో పరమపదించుటకు సిద్ధమై గురుదర్శనాభిలాషియగు తమ శిష్యుడైన శ్రీ శేషగిరిరావుగారి దృఢ సంకల్పము శ్రీ మహర్షులవారికి తెలిసెను. శిష్యుని హృత్తాపమును చల్లార్చి పరబ్రహ్మామృత సాగరమయిన జేర్చుటయే సద్గురుణి పరమధర్మము. కావున శ్రీ సుబ్రహ్మణ్య యోగీంద్రులే శేషగిరిరావుగారి మోక్షేచ్ఛను దివ్యదృష్టివలన గుర్తించి తామే స్వయముగా శేషగిరిరావుగారి చెంతకు వచ్చిరి. గురుదేవులను జూచినంతనే "ఓ గురుదేవా! ఓ గురుదేవా! ఓ గురుదేవా " అని ముమ్మారు పిలిచి గురుమూర్తిని జూచుచు నమస్కరించుచు ఆనందభాష్ప పులకిత గద్గద గాత్రులై బ్రహ్మైక్యమందిరి. అచట నున్న వారందఱును "గురుదేవా! మీ దర్శనమునకై యీ ప్రాణి నిలిచియున్నది. అతడు మిగుల ధన్యుడు. మేము మిగుల పుణ్యాత్ములము'' అని పొగడసాగిరి. శ్రీ గురువర్యులు అచట వారందఱికిని దేహి దేహముల సంబంధమును వివరించి దేహి నిమిత్తమై మనము దుఃఖింప వలసినపని లేదని సద్బోధలు గావించిరి.

గురువు అనగా గురు రూపములులేని పరబ్రహ్మము. ఆ పరతత్త్వము శిష్యులకు బోధ నిమిత్తమై మానవరూపము దాల్చును. "యాంతేమతిః సాగతిః" అంత్య కాలమున జీవుడు ఎట్టి భావముతో నుండునో అట్టి పదవినే పొందును. శిష్యుడు అట్టి యారూఢ స్థితికి వచ్చు వఱకును సద్గురువు మార్జాలకిశోర న్యాయముగా శిష్యుని కాపాడుచునే యుండును. శ్రీకృష్ణపరమాత్మను జూచుచు భీష్ముడు నిర్యాణమునందెను. అట్టి సద్గతినే శేషగిరిరావుగారు పొంది లోకులకు మార్గదర్శకులైరి. శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి భృగ్వాది మహర్షుల కూటమికి చెందిన మహాత్ములనుటకు ఇదియొక నిదర్శనము. భీష్ముడు తన దృష్టిని హరిమోముపై బరపి బ్రహ్మైక్యమందిన విధము చూడుడు.

శా. ఆలాపంబులు మాని చిత్తము మనీషాయత్తముంచేసి దృ
గ్జాలంబున్ హరిమోముపై బఱపి తత్కారుణ్య దృష్టిన్ విని
ర్మూలీభూతశరవ్యథా నిచయుడై మోదించి భీష్ముండు సం
శీలం బొప్ప నుతించె గల్మషగజ శ్రేణీహరినసం శ్రీహరిన్ ॥

భాగవతము 1 స్కం. 179 ప.

# దేవరకొండ సూరయ్యగారు తరించిన విధము.

తూ.గో.జిల్లా, రామచంద్రపురం తాలూకాలో కూళ్ళగ్రామమున దేవరకొండ సూరయ్యగారు ఉండిరి. ఆయన భార్య సుబ్బమ్మగారు. ఆ దంపతులు చతుర్విధ శుశ్రూషలు గావించి శ్రీ గురుచక్రవర్తికి శిష్యులై బ్రహ్మబోధలనందియుండిరి.

ఈ పుణ్యదంపతులకు 1 వెంకటరమణమూర్తి, 2. వెంకటాచలపతి, 3. సూర్యనారాయణమూర్తి, 4 శ్రీరామమూర్తి అను కుమారులును, 1 బుల్లెమ్మ, 2 వెంకటరత్తమ్మ అను పుత్రికలను గలరు. వీరిలో –

1 వెంకటరమణమూర్తిగారి భార్య సత్యవతిగారు,

2 వెంకటాచలపతిగారి భార్య వెంకటసుబ్బమ్మగారు,

3 సూర్యనారాయణమూర్తిగారి భార్య అన్నపూర్ణగారు,

4 శ్రీరామమూర్తిగారి భార్య మహాలక్ష్మిగారు.

శ్రీ దేవరకొండ సూరయ్యగారు తమ ధర్మపత్నితో గురుపుంగవులకు శిష్యులైరి. తరువాత కుమారులును కోడండ్రును పుత్రికలును శిష్యులైరి.

శ్రీ సూరయ్యగారు శ్రీ గురుపాదపూజ చేసినపిమ్మట సంపదలు తామర తంపరలై వర్ధిల్ల సాగినవి. క్రీ॥ శ ॥ 1904 ప్రాంతమునుండి శ్రీ సూరయ్యగారు గురుబోధలు విని అఖండ తేజో రాజ్యములో విహరించుచుండిరి. నిరంతర తపోనిష్ఠాగరిష్ఠులై గురుభక్తులై మోక్ష సామ్రాజ్యాధి నేతలైయున్న శ్రీ సూరయ్యగారు నిర్యాణమందుకాలము వచ్చెను. క్రీ॥శ॥ 1932 సం॥ర మందు అంగీరసనామ సం॥ర పుష్యబహుళ పాడ్యమిరోజున మధ్యాహ్నము గం. 12-0 లకు శ్రీ సూరయ్యగారు గురుమంత్రమును బ్రహ్మ సముద్రమందు సంధించి పరమపదించిరి, నిర్యాణ సమయములో వారి శరీరము నుండి అఖండ తేజస్సు బయలు వెడలెను. అపర రామదాసు అను ఖ్యాతి గాంచిన శ్రీ కూచిమంచి మూర్తిరాజుగారు ఆ సమయమున అచ్చటనే యుండిరి. పుత్రులును బంధువులును ఆప్తవర్గమును అచటచేరియుండిరి. సూరయ్యగారి శరీరమునుండి బయలుదేరిన యఖండ తేజస్సునుగాంచి అచటివారందరును మిగుల నాశ్చర్యపడిరి.

ఆ॥ కట్టెలోన నిప్పు గల్గినరీతిని
తిలల తైలముండు తీరు గాగ
దేహమందునాత్మ తేజరిల్లుచునుండు
రఘుకులాబ్ధిసోమ రామనామ ॥

(అద్వైత రహస్యము. 98 పద్యము)

శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులే తమచే రచింపబడిన అద్వైత రహస్యమునందు ఆత్మ తేజో రూపమని దెల్పియున్నారు. పట్టిన శిష్యులనుగూడ తేజో రాజ్యాభిషిక్తుల నొనరించుటయే ఈ చరిత్ర నాయకుని ముఖ్య కర్తవ్యము.

# కమండలోదకముచే సిరిపెల్ల వెంకట్రామన్నగారికి ప్రాణదానము చేయుట.

గురుదేవుని జన్మస్థలమైన పామఱ్ఱు గ్రామములో సిరిపెల్ల వెంకట్రామన్న అను భక్తుడుండెను. ఆయన గురువర్యులకు శిష్యులై నిత్యము భగవద్గీత పారాయణము గావించుకొనుచుండిరి. క్రీ॥శ॥ 1905 సం॥రములో ఆయనకు జబ్బు చేసెను. వ్యాధి తీవ్రరూపముదాల్చి ప్రమాదస్థితిలోనికి మారుచుండెను. ఇంటిలోనివారు తొట్రుపాటు పడుచుండిరి.

ఆయన అట్టి ప్రమాదస్థితిలో నుండగా శ్రీ గురువర్యులు కోరుమిల్లి దగ్గఱనున్న గోదావరిలో స్నానముచేసి తపస్సు ముగించుకొని వచ్చుచు వెంకట్రామన్నగారిని చూచుటకు వెళ్ళిరి. గురుదేవుని చూచినంతనే వెంకట్రామయ్యగారు నూతనత్సాహమునంది "గురుదేవా! మీ కమండలోదకము నిప్పించినచో నా వ్యాధి కుదురును" అని ప్రార్థించిరి. శ్రీ గురువర్యులు తమ కమండలోదకమును శ్రీరామమంత్ర పురశ్చరణ పూర్వకముగా వెంకట్రామయ్యగారికిచ్చిరి. పరమపవిత్రమైన గురుదేవుని మంత్రోదకము కంఠము దిగిన తోడనే వెంకట్రామన్నగారి ముఖమున నూతన చైతన్యశక్తితో గూడిన దివ్యతేజము తాండవమాడజొచ్చెను. నీరసమంతయును పటా పంచలై వర్ణింపశక్యముగాని బలము చేకూరెను. ఆనాటి నుండియే వెంకట్రామన్నగారు సంపూర్ణారోగ్యమునందిరి. శిష్యవాత్సల్యమును గురువర్యులు ఈ విధముగా చూపి ప్రాణదానము గావించిరి.

# శ్రీరెడ్డి పెదనారాయణమూర్తిగారు వరాహావతార సాక్షాత్కారము నొందుట విచిత్ర నిర్యాణము

పెదనారాయణమూర్తిగారు మహర్షికి సోదరులు. ఈయనగూడ 1920 ప్రాంతములో శ్రీవారికి శిష్యులై యుండిరి. గుర్వాజ్ఞ మీరక నిరంతరము శ్రీరామతారకమంత్ర తపోదీక్షతో కాలము గడుపుచుండిరి. ఇంటిలో తపస్సు సాగదని తలచి పామర్రు గ్రామమునకు ఉత్తరదిశనున్న కణ్వనది యొడ్డున హైరోడ్డును చేరియున్న తమ పొలములో నొక పర్ణశాల యేర్పఱచుకొని అందు గూర్చుండి నిత్యమును తపస్సు చేసికొనుచుండిరి. గుర్వాజ్ఞ ప్రకారముగా ఒక కోటి సంఖ్యగల శ్రీరామతారక మంత్రమును జపించియుండిరి. తాము గావించిన తపస్సునకు శాంతి నిమిత్తమై ప్రతి వేసవికాలమందును చలివేందల పెట్టించి పాటకపు జనులకు నూకలజావయు, తక్కినవారికి మజ్జిగ తేటయు ఇచ్చి అనేకులకు మండు వేసవిలో ప్రాణదానము చేయుచుందురు. ఈ చలివేందల పామర్రునుండి నెంటూరు వెళ్ళు రోడ్డు ప్రక్క ప్రారంభింపబడెను. అచటనే ఒక పర్ణవాలగూడ గట్టించి గాఢమగు వైరాగ్య వృత్తితో తపస్సు చేసికొనుచుండిరి.

తమ సోదరుడును శిష్యుడును అగు పెదనారాయణమూర్తిగారిని చూచుటకు ఒకనాడు శ్రీ గురువర్యులు మహేంద్రవాడనుండి పామర్రు వెళ్ళుచు పెదనారాయణమూర్తిగారు తపస్సు చేసుకొను పొలములోని కుటీరములోనికి వెళ్ళి గూర్చుండిరి. ఆ ప్రదేశమంతయును ఎత్తుపల్లములుగ నుండుటచే గురుదేవుని శరీరమునకు బెడ్డలు గ్రుచ్చుకొనెను. కొంతసేపు అచట విశ్రమించి గురువర్యులు పామర్రులోని తమ గృహము చేరిరి. ఆ

మరునాడు సాయంకాలము చలివేందల కుటీరములో పెదనారాయణమూర్తిగారు తపస్సు చేసికొనుచుండగా కటి సూర్యులతో సమానమైనకాంతి గల్గినట్టియు ముఖమున నామములు గల్గినట్టియు, రత్న హారముతో ప్రకాశించుచున్నట్టియు కొన్నివేల వరాహమూర్తులు ఒక్కసారిగా ఎదుట సాక్షాత్కరించెను. కొంతసేపటికి అవియన్నియు మాయమయ్యెను. మఱియు నిత్యము జపము చేసికొను పొలములోనున్న కుటీరములో గూడ కొన్ని వరాహములు గోచరించెను. అప్పటికి జాము రాత్రి అయ్యెను. ఆ వింత చూచుటకు పెద నారాయణమూర్తిగారు చలివేందుల కుటీరమునుండి బయలుదేరి పొలములోనున్న కుటీరము వద్దకు వచ్చి లోనికి వెళ్ళబోయిరి. అందు కొన్ని పిల్లలతోనున్న పెద్దవరాహము గుఱ్ఱుగుఱ్ఱు మని ధ్వని చేయుచు పండుకొనియుండెను. ఆ యద్భుతమును చూపుటకై పెదనారాయణమూర్తిగారు అచటినుండి పామఱ్ఱు గ్రామములోనికివెళ్ళి తమకు గల్గిన వరహావతార సాక్షాత్కార విశేషములను గురుస్వామికి విన్నవించిరి. ఆ మాట విన్నంతనే గురుస్వామి దేవరపల్లి శ్రీరాములుగారితోను పెదనారాయణమూర్తిగారితోను బయలుదేరివర్చి యా కుటీరము సమీపించిరి. అందు విలక్షణ రూపములుగల వరాహములు గుఱ్ఱుగుఱ్ఱు మనుచు కోలాహలము చేయుచుండెను. వారు ముగ్గురును ఆ వింత చూచుచు ఈవలనే యుండిరి. కొంత సేపటికి అవి యన్నియు లేచి కుటీరములో నుండి యీవలకి వచ్చి వెళ్లిపోవుచుండెను. వారు ముగ్గురును వానిని పరీక్షించుటకు వెంబడించి వెళ్ళుచుండిరి. ఒక యర ఫర్లాంగు దూరము నడచి చూచుచుండగనే అవి యన్నియు నొక్కసారి అదృశ్యమైపోయెను. అపుడు మహర్షి సోదరులిద్దఱును కుటీరములోనికివెళ్ళి చూడగా నేలయంతయును గచ్చు చేసినట్లు ఏక సమానముగా నుండెను. అంతకు పూర్వము రోజుననే ఆశ్రమ ప్రదేశము

ఎత్తుపల్లములుగా నుండి గురుదేవునికి బాధ కల్గించుటచే శ్రీరామచంద్రుడే వరాహావతార రూపముదాల్చి యా ప్రదేశమంతయును బాగుచేసి వెళ్ళెను. ఆహా! శ్రీరాముడెంత భక్త పరాధీనుడు ! లేనిచో నిట్టి ప్రత్యక్ష నిదర్శనములు చూపి రక్షించునా? పిమ్మట గురుస్వామి అచటనుండి మహేంద్రవాడ వెళ్ళిపోయిరి. శ్రీ గురువర్యులు ఎచట సంచరించినను ఆ ప్రదేశము దేవతామూర్తులతో తాండవమాడుచుండును.

పెదనారాయణమూర్తిగారికి కనకదండి నారాయణమూర్తి అనునొక స్నేహితుడుండెను. వారిద్దఱును ఒక్క సమయముననే మహర్షి పాదములాశ్రయించి శిష్యులైరి. వారిద్దఱును మిగుల స్నేహముతో నొకేచోట గూర్చుండి తపస్సు చేసుకొనుచుందురు. వారిద్దఱును కోటి సంఖ్య గల రామమంత్రమును జపించిరి. పెదనారాయణ మూర్తిగారు సంవత్సరాది మొదలుకొని ఆషాడమాసము వఱకును నాల్గు మాసములు విరామము లేకుండగ 20 సం॥రములు చలివేందల నడిపిరి. కాని అందుకు తగిన శాశ్వత భవనము లేకుండెను.

రెడ్డి పెదనారాయణ మూర్తిగారు చలివేందల ధర్మకార్యము జనుల వలన విని వేళంగి గ్రామ నివాసురాలును, కమ్మవారును, మారిన వీరన్నగారి భార్యయును అయిన సత్తెమ్మగారు రెండువేల రూపాయలతో శాశ్వతమైన భవనము కట్టించి యిచ్చిరి. తాము గావించిన తపస్సునకు శాంతి నిమిత్తమును భూతతృప్తిని శ్రీ నారాయణ మూర్తిగారు చలివేందల ప్రారంభించిరి. అంతకు పూర్వము సామాన్యస్థితిగానున్న వీరి సంసార సంపద క్రమముగా వృద్ధియై ఏ లోటుపాట్లను లేక యుండెను. ఈ చలివేందల ప్రారంభించుటకు గూడ శ్రీ గురువర్యుల యాదేశమే ముఖ్యకారణము.

శ్రీ పెదనారాయణమూర్తి భౌతిక దేహమును వీడు

సమయమాసన్నమయ్యెను. ఆయన గావించిన తపస్సు పండెను. ఒకరోజున ఆయన చలివేందల భవనములో గూర్చుండి తపస్సు చేసికొనుచుండగా కడుపులో పోట్లు ప్రారంభమై జ్వరమంకురించెను. మరణమాసన్నమైనదని బాగుగా గ్రహించి ఆయన బ్రహ్మైక్యమునకు సంసిద్ధులై గురుమంత్రమును శ్రీరామతారక పరబ్రహ్మమందు సంధించియుండిరి.

ఆ సమయమునకే నేను పామర్రు వెళ్ళవలసివచ్చెను. అపుడాయన నన్ను జూచి “అడుగో గురుమూర్తి” “అవిగో ఆత్మకళలు” అని నాతో పల్కిరి. మరణము సమీపించినది సుమాయని గూడ నాతో పల్కిరి. అప్పటికి గురుమూర్తి నిరంతరమును ఎదుట సాక్షాత్కరించుచుండుటయును, ఆత్మ కళలమధ్య ఆనందవారధిలో నోలలాడు చుండుటయును నారాయణమూర్తిగారికి కల్గిన యనుభవ విశేషములు. కాని ఆ విషయమును ఇంటిలోని వారికి తెలియనీయలేదు.

ఇక నాల్గు రోజులకు భౌతిక దేహముతో సంబంధము వదలిపోవుననగా తన పుత్రులను, పుత్రికలను చేరబిల్చి “నేను పూర్తి చేసికొనవలసిన జప విశేషములు గలవు. నా లక్షణములు చూచి సంధి ప్రవేశించినదేమోయని మీరు ఖంగారు పడవద్దు. నేను తపస్సులో ప్రవేశించుచున్నాను. నా దగ్గర ఎంతమాత్రమును ధ్వని పనికిరాదు. అతినిశ&శబ్దముగా నుండవలెను” అని నచ్చచెప్పి పాదాదిశిరః పర్యంతము పెద్దదుప్పటి ముసుగు పెట్టుకొని తపోదీక్షలో ప్రవేశించిరి.

1942 సం॥రము 10 మే తేదీని పోవుటకు పది నిమిషములలకు ముందు మంచముపై నుండి నెమ్మదిగా లేచి కుర్చీలో గూర్చుండిరి. ఆయన స్థితి చూచి జ్యేష్ఠపుత్రికయగు రామలక్ష్మి కన్నీరు గార్చుచుండెను. అది చూచి నారాయణమూర్తిగారు

"అమ్మాయి! నా కొఱకు మీరెవ్వరును విచారించ వలసిన పనిలేదు. మీరు రామస్మరణము చేయుచుండుడు" అని ఓదార్చిరి. అట్లే కుమార్తెలును, అల్లుండ్రును. బంధుమిత్రులును రామస్మరణ చేయనారంభించిరి. అపుడు నారాయణమూర్తిగారు కుర్చీలో గూర్చుండి,

శ్లో ॥ రామం రత్న కిరీట కుండలధరం కేయూర హారన్వితం
సీతాలంకృత వామభాగమమలం సింహాసనస్థం విభుం
సుగ్రీవాది సమస్త వానరయుతం సంసేమానం సదా
విశ్వామిత్ర పరాశరాది మునిఖిస్సం సేవ్యమానంభజే ॥

అను శ్రీ రామస్తవ శ్లోకమును చదివిరి. వెంటనే శ్రీ సీతారాములు రత్నస్థగితమైన సువర్ణ సింహాసనముపై గూర్చుండి యెదుట సాక్షాత్కరించుచు మాజరైయుండిరి. ఆ శ్రీరామచంద్రమూర్తిని జూచి "అదుగో శ్రీరామచంద్రుడు ! అదిగో కిరీటము ! అవిగో భుజకీర్తులు" అని అందఱును వినునట్లు బిగ్గరగా స్తుతింపనారంభించిరి.

కనురెప్ప వేయక తదేక దీక్షగా జూచుచు "గురునారాయణా! గురునారాయణా! గురునారాయణా!" అని పల్కుచు 10 మే 1942 సం॥రమునకు సరియగు చిత్రభాను సం॥ర అధిక జ్యేష్ఠ శుద్ధ తదియా సోమవారము ఉదయము గం.10లకు బ్రహ్మైక్యమొందిరి. నారాయణమూర్తిగారు కుర్చీలోనే గూర్చుండి యుండుటజూచి ధ్యాననిష్ఠలో నుండిరేమోయని దగ్గరగా నున్నవారు పలుకరించుటకు భయపడుచుండిరి. కాని యా మహాత్మునికి ఈ మాయాప్రపంచముతో సంబంధము వదలిపోయెను. కొంతసేపటికి ముసుగుపెట్టియున్న దుప్పటి తీసి చూడగా శరీరమంతయును అదివఱకెన్నడును లేని దబ్బపండువంటి ఛాయతో మెఱయసాగెను. ఆహా! ఏమి ధన్యజీవి!

"అంత్యకాలమందు హరిచింతనము సేయఁ
బుట్టువునకు ఫలము - భూసురేంద్ర॥"

అను లక్షణములతో శిష్యుని జీవయాత్ర ముగింపజేసిన సుబ్రహ్మణ్య మహర్షి ప్రభావమేమనవచ్చును? పెదనారాయణమూర్తిగారు అంత ఠీవిగా దేహమును వదలుటకు గురుశిక్షణమే ముఖ్యకారణము. ఒక్కొక్క శిష్యుని ఇట్టి యాగాఢస్థితికి దెచ్చుట గురువునకెంత కష్టమో చదువరులే గుర్తింతురుగాక.

# వరదా సత్తిరాజును రక్షించిన విధము

రాజమహేంద్రవరములోని వీరభద్రపురం నివాసులును, వైశ్యులును నగు శ్రీ వరదా సత్తిరాజుగారు శ్రీ గురుదేవునికి శిష్యులైయుండిరి. ఒకప్పుడు శ్రీ సత్తిరాజుగారికి అమితమైన జబ్బుచేసి జీవితముపై నిరాశ కల్గెను. బంధువులును స్నేహితులును తొట్రుపాటు పడుచుండిరి. ఈ సంగతి సమాదిలోనున్న శ్రీ గురువర్యులకు గోచరించెను. తమ పాదములాశ్రయించి నమ్మియున్న శిష్యుని రక్షించుట ప్రథమ కర్తవ్యమని తలచి శ్రీ గురువర్యులు స్వయముగా సత్తిరాజుగారి యింటికి వెళ్ళిరి. అప్రయత్నముగా గురువర్యులే తెంచుట అందరికిని ఆశ్చర్యము కల్గించెను. శ్రీ మహర్షులవారి గాలిసోకిన వెంటనే సత్తిగారికి స్పృహకల్గి గురువర్యులకు నమస్కరించిరి. క్రమక్రమముగా వ్యాధినివారణమయ్యెను. ఇట్టి గొప్ప పరిణామము గురుసందర్శన ప్రాప్తిచే కల్గినదని యెల్లరును సంతసించిరి.

పిమ్మట కొంతకాలమునకు సత్తిరాజుగారి భార్యకు కూడ జబ్బుచేసెను. అప్పుడుగూడ శ్రీ గురువర్యులు అప్రయత్నముగా వారి యింటికి వేంచేయుటచే ఆమెకు వెంటనే స్పృహకల్గి క్రమక్రమముగా సంపూర్ణారోగ్యము కల్గెను. ఈ పుణ్యదంపతులకు కల్గిన సంఘటనలనుబట్టి శ్రీ మహర్షిపుంగవులు భక్తాభీష్ట వర ప్రదాతలనియు, ప్రాణదాతలనియు, లోకోత్తర మహిమాన్వితులనియు లోకులు చెప్పుకొనసాగిరి.

# గాది సుభద్రమ్మగారిని రక్షించిన విధము

శ్రీగాది చలమయ్య సుభద్రమ్మ అను దంపతులు తాళ్ళరేవులో నివసించుచుండిరి. శ్రీ చలమయ్యగారు .....డిగ్రీ పొంది జిల్లా బోర్డువారి వైద్యశాలలో డాక్టరుగా పనిచేయుచుండిరి. 1928 సం॥రములో రాయవరములో నుండు కాలమున ఈ దంపతులు శ్రీ మహర్షికి శిష్యులై యుండిరి. అందుచే వీరెచ్చటయున్నను నిరంతరమును గురుదేవుని స్మరించుచు పరమభక్తులై యుండిరి. ఇట్లుండగా 1945 సం॥రం జూన్ నెలలో సుభద్రమ్మగారి యారోగ్యము చెడిపోయి క్రమక్రమముగా శరీరము క్షీణించిపోవుచుండెను. లేచి నిలబడుటకు గూడ శక్తిలేని స్థితిలోనికి శరీరము మారెను. ఆమెకు ఎంతమాత్రమును మనస్థితిలోనికి శరీరము లేకుండెను. వైద్యము తమ చేతిలో నున్నను ప్రయోజనము లేకపోయెను. ఇట్లుండగా 15 జూన్ 1945 తేదీకి సరియగు పార్థివనామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ పంచమీ శుక్రవారము రోజున శ్రీ సుభద్రమ్మగారు ఉదయముననే లేచి స్నానము చేసి ఒక గదిలో కూర్చుండి ప్రశాంతముగా గురు దంపతులను ధ్యానించుచు ఆరోగ్యము ప్రసాదించవలసినదిగా పరిపరివిధముల ప్రార్థించుచుండిరి.

భక్తురాలై శిష్యురాలైయున్న సుభద్రమ్మగారి ప్రార్థన గురువర్యులకు గోచరించెను. మహర్షులవారి యుపాసనా దేవతయగు శ్రీరాజరాజేశ్వరీ మాత గురుపత్నీ రూపముదాల్చి సర్వాలంకార శోభితయై కలకలలాడు ముఖముతో చిఱునవ్వునవ్వుచు సాక్షాత్కరించి సుభద్రమ్మగారి చేయి పట్టుకొని "నీకు భయములేదు. క్రమముగా సంపూర్ణారోగ్యము కల్గును" అని చెప్పి అదృశ్యురాలయ్యెను. జగజ్జనని స్పర్శ తగిలిన వెంటనే ఆమెకు గొప్ప బలమును నూతనోత్సాహ శక్తియు కల్గెను. దేవి సందర్శనభాగ్యము ఉదయము గం. 8-00లకు కల్గెను.

తక్షణమే సుభద్రమ్మగారు కుంకుమ, పుష్పములు, పూజాద్రవ్యములు మొదలగునవి సేకరించి తమ పుత్రుడగు రాజారావును వెంటబెట్టుకొని ఆ రోజు ఉదయము గం. 11-0 లకు మహేంద్రవాడ వెళ్ళి దేవీ సాక్షాత్కార విశేషములను గురుదంపతులకు విన్నవించి జగన్మాతకు సహస్రనామము లతో కుంకుమపూజ చేయించుకొనిరి. ఆ మరునాటి నుండియే సంపూర్ణారోగ్యము కల్గెను. మందులతో పనిలేకపోయెను.

డాక్టరు చలమయ్యగారు తాళ్ళరేవులోనున్న కాలములో వారి దౌహిత్రుడు చలపతిరావుకు హఠాత్తుగా జబ్బు చేసెను. ఆ బాలుడు స్పృహతప్పి పడియుండెను. జీవితాశ వదలుకొని ఆ బాలుని ఇంటి వెలుపలకు తీసికొని వెళ్ళిరి. ఎంతమంది వైద్యులు వచ్చినను ప్రయోజనము లేకపోయెను అందఱును నిరాశచెందియుండిరి. ఆ సమయమున చలమయ్యగారి భార్య సుభద్రమ్మగారు గురుదంపతుల పటము చేతితో పట్టుకొని ప్రార్థింపనారంభించిరి. ఆ బాలుని తల్లియగు శేషాంబ తన తల్లియైన సుభద్రమ్మగారి చేతిలోనున్న గురుదంపతుల పటము తాను పుచ్చుకొని ఆ బాలునికి తగిల్చెను. వెంటనే ఆ బాలుడు స్ప ృహకల్గి కదలజొచ్చెను. కనులు తెరచి అటునిటు చూచుచు నిద్రనుండి మేల్కాంచిన

వానివలె నుత్సాహవంతుడయ్యెను. అపుడా బాలుని ఇంటిలోనికి తీసికొని వెళ్ళిరి. గురుప్రభావముచే ఆ బాలుడు శ్రీఘ్రంకాలములోనే సంపూర్ణారోగ్యవంతుడయ్యెను.

# శ్రీ కందర్ప సూర్యనారాయణగారి శిష్యత్వము, అద్భుత విశేషములు - విశ్వరూప సందర్శనము.

శ్లో ॥ శ్రీరామచంద్ర రఘుపుంగవ రాజవర్య
రాజేంద్రరాజ సురనాయక రాఘవేశ
రాజాధిరాజ రఘునందన రామభద్ర
దాసో...స్మ్యహంచభవత శ్శరణాగతో...స్మి ॥

పరమేశ్వరుడు భక్తుల హృదయము ననుసరించి దర్శనమిచ్చు చుండును. హృదయము పవిత్రముకానిదే భగవద్దర్శనము లభించదు. భగవత్సాక్షాత్కారమనగా ఒడిలో వేసికొని మూటకట్టుకొను వస్తువువంటిది కాదు. ఎన్నియో జన్మలెత్తవలెను. ఆయా జన్మలయందెన్నియో పుణ్య కార్యములు చేసి యుండవలెను. నిష్కామబుద్ధితో సత్కర్మల నాచరింపవలెను. అట్లు కొన్నివేల జన్మములైన తరువాత భగవంతుడు సద్గురు రూపమున సాక్షాత్కరించి భక్తుని తరింపజేయును.

“బహునాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే

– భగవద్గీత.

(అనేక జన్మలెత్తిన తరువాత జ్ఞాని నన్ను జేరును సుమా)

అని శ్రీ కృష్ణ గురువు తన శిష్యుడైన యర్జునునికి బోధించెను. అర్జునుడు పవిత్రవంశమున బుట్టినవాడగుటచేతను పవిత్ర హృదయుడగుట చేతను శ్రీకృష్ణగురువు విశ్వరూప సందర్శనాదులు చూసి తత్త్వబోధచేసెను. సద్గురుని బోధనలవలనగాని జన్మరాహిత్యము కలుగదు. అట్టి పవిత్ర హృదయుడగు శిష్యుడు దొరకినపుడు భగవంతుడు గురురూపమున సగుణ బ్రహ్మమై సాక్షాత్కరించి అనేకాద్భుత లీలలు చూపుచుండును. శుద్ధ నిర్గుణ పరబ్రహ్మమే తన ప్రకృతితో గూడి సగుణమూర్తియై యవతరించుచుండును. సగుణబ్రహ్మముయొక్క లీలలు తెలిసికొనుట మిగుల కష్టము, భగవంతుడు రామాద్యవతారములు దాల్చినపుడు ఆ విధముగానే సంచరించెను. భగవంతుడు సగుణమూర్తియై యవతరించి సామాన్య మానవునివలె సంచరించుచుండుట సహజమై యుండుటచేతనే ఆయా యవతార కాలములయందలి కొందఱు ఆ భగవల్లీలలు సరిగా గుర్తింపలేకపోయిరి. భగవల్లీలా రహస్యములు నిజభక్తులకు మాత్రమే గోచరించుచుండును. భక్తుడుగూడ పవిత్రవంశమున జన్మించినవాడై యుండవలెను! భగవద్దర్శనమునకై తహతహలాడుచు నిరీక్షించుచు సత్ప్రవర్తనము కలవాడై యుండవలెను అట్టి లక్షణములుగల భక్తునికి భగవంతుడు సులభసాధ్యుడు.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి పుంగవులు తమ మహిమా విశేషములను శ్రీ కందర్ప సూర్యనారాయణగారి మూలమున లోకమునకు వెల్లడిచేసిరి. అందుచే శ్రీ కందర్ప సూర్యనారాయణగారి పవిత్ర చరిత్రాంశములు ఇందు పొందు పఱచుట ముఖ్య కర్తవ్యము. శ్రీ మహర్షులవారు తాముద్ధరింప దలచిన శిష్యునికి ముందుగానే కొన్ని మహిమలు చూపి భక్తుని చిత్తము భగవదాయత్తము చేసి సాధన చతుష్టయ సంపన్నునిగా నొనర్చి మంత్రోప దేశము గావించెదరు. ఈ లక్షణములే శ్రీ కందర్ప సూర్యనారాయణగారి యెడల చూపట్టును.

తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకాలో చేరిన మండపేట గ్రామము మహర్షుల కాలమునుండియు ప్రసిద్ధి గాంచియున్నది. ఈ గ్రామము మాండవ్య మహర్షిచే నిర్మింపబడెనందురు. ఆ మహర్షి తపశ్శక్తిచేతనే ఆ గ్రామవాసులు సకల సంపదలతో నేటికిని గౌరవ స్థానమునందియున్నారు.

ఆ గ్రామమున యజుర్వేద పారంగతులైన శ్రీ కందర్ప సూరావధానులుగారు గలరు. ఆయన సకాలమునకు స్నాన సంధ్యాద్యనుష్ఠానములు నెఱపి, సూర్యోపాసన, శ్రీరామోపాసన చేయుచుందురు. ఒకనాడు హరిజనులు శ్రీరామభజన చేయుచుండగా రామావధానులుగారు భక్తి పారవశ్యమున వారితో కలిసి భజనచేసిరి. కొంతమంది స్నేహితుల సహాయముతో మండపేటలో ధర్మగుండం చెఱువునొద్ద శ్రీరామమందిరము నొకదానిని శ్రమించి కట్టించిరి. అందు శ్రీరామ పంచాయతనమును ప్రతిష్ఠించిరి. అందు నేటికిని నిత్య ధూపదీప నైవేద్యాదులు అవిచ్ఛిన్నముగా జరుగుచున్నవి. ప్రతి సం॥రము వసంత నవరాత్రోత్సవములును, శరన్నవ రాత్రోత్సవములును వైభవోపేతముగా జరుగుచుండును.

శ్రీరామావధానులుగారికి వెంకటేశ్వర్లు అను కుమారుడుండెను. ఆయన హూణవిద్యయందు మెట్రిక్యులేషను పరీక్ష ప్యాసై సంస్కృతభాష నభ్యసించి ప్రస్థానత్రయము పఠించిరి. అందు భగవద్గీతయందు వీరికి భక్తిమెండు. అందుచే సనాతనాధునాతన భాష్యముల మథించి గీతాసారమును జీర్ణింపజేసికొనిరి. నిత్యమును భగవద్గీతా పారాయణము, శ్రీమద్రామాయణ పారాయణము, అధ్యాత్మరామాయణపారాయణము చేయుచుందురు. శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకమును, శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేకమును, అఖండ వైభవముగా జరుపుకొనిన భక్త శిఖామణి. మఱియు సాంఘిక కార్యకలాపముల పెక్కింటిని నిర్వర్తించి

ప్రజాదరణమునందిన ప్రతిభాశాలి. వెంకటేశ్వర్లుగారి భార్య వెంకట సుబ్బమ్మగారు. ఈ పుణ్యదంపతుల తపఃఫలితముగా 12 సెప్టెంబరు 1910 తేదీకి సరియగు సాధారణ నామ సం॥ర భాద్రపద శుద్ధ అష్టమీ శుక్రవారము రోజున శ్రీ సూర్యనారాయణగారు జన్మించిరి.

ఈయనకు బాల్యమునుండియు పితృ మాతృభక్తి, దైవభక్తి సహజసిద్ధమయ్యెను. పాఠశాలలో చదువుచున్నపుడు ఇంగ్లీషు భాషలోను, తెలుగు భాషలోను మొదటి స్థానమునో రెండవ స్థానమునో పొందుచుండిరి. చిన్నప్పటినుండియు ఇంగ్లీషుభాషయందే వ్యాసంగము సాగుచున్నను స్నానసంధ్యాద్యనుష్ఠానములు విడువలేదు. 1923 సంవత్సరములో వివాహము జరిగెను. పదునాఱవయేట (అనగా 1926 సం॥రములో) తండ్రిగారైన వెంకటేశ్వర్లుగారు శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ వివేకానందులవారి ప్రవచనములను ఉపదేశించి పఠింపజేసి, వానియందు అభిరుచిని గాఢముగా కల్గించిరి. శ్రీమద్భగవద్గీతయందుగూడ మిక్కుటమగు నభిరుచిని కల్గించిరి. అందుచే క్రమముగా భక్తిముదిరి వైరాగ్యము మెండయ్యెను. ఏకాంతసేవ, నిష్కామభక్తి, ధ్యానయోగనిష్ఠ అలవడజొచ్చెను.

నిత్యమును బ్రహ్మముహూర్తమునకే లేచి యెంత చీకటిగానున్నను గ్రామమునకు దూరముగా వెళ్ళి విజనప్రదేశమున దంతధావనాది కృత్యములు నెఱవేర్చుకొని కాలువలో స్నానము చేసి సంధ్యావందనము చేసి గాయత్రీ ధ్యానపారవశ్యమున మైమఱచుచుందురు. ఏమి చదువు చున్నను, ఏ యూర నివసించుచున్నను, ఎట్టి పట్టణవాసమైనను ఈ నిత్య కర్మానుష్ఠానము ఏ విఘ్నములు లేక కొనసాగుచునేయుండెను.

వైరాగ్యముతో గూడిన భక్తి దినదిన ప్రవర్ధమానమగు చుండెను. తాతతండ్రుల కాలమునుండియు శ్రీ రామచంద్రుడు ఇలువేల్పు వీరి కుటుంబమును తారకమంత్రానుష్ఠాన బలము చేతను వంశోద్ధారకుడైన

కుమారుడు జన్మించెను. చరాచర ప్రపంచమంతయును గురుశక్తితో నిండియున్నది. పరిపూర్ణ పరబ్రహ్మ తత్త్వమునకు గురువు అని మహర్షులు నామమిడిరి.

శ్లో ॥ గుకారశ్చ గుణాతీతో రూపాతీతో రుకారకః
గుణరూపవిహీనత్వాద్గురురిత్యభిధీయతే॥

(స్కాందపురాణ)

గుణరూప విహీనమైన పరబ్రహ్మమే గురువనబడును. ప్రపంచమంతయును గురుశక్తితో నిండియున్నది. కావుననే,

శ్లో ॥ గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యేస్థితో గురుః
గురుర్విశ్వం సమస్తంతు తస్మై శ్రీ గురవేనమః॥

అని గురువు – పరతత్త్వమని చెప్పబడినది. పవిత్ర హృదయములగు వారికి గురుశక్తియే మానవరూపము దాల్చి బోధ లొనర్చుచుండును. శ్రీ కందర్ప సూర్యనారాయణగారి హృదయము నిష్కళంకమై వైరాగ్యయుక్తమై గురుబోధకు తగిన క్షేత్రమై యుండెను. అందుచే ఈ భక్త శికామణికి భగవల్లీలు సాక్షాత్కరింప మొదలిడెను.

ఒకనాడు సూర్యనారాయణగారు ధ్యానావస&థలో నుండగా శ్యామసుందర రూపిణియగు దేవి సాక్షాత్కరించెను. ఆ దేవి నవకోటి మన్మథ విలాస సౌందర్యము గలదియై మోమున చిఱునవ్వుతో విరాజిల్లుచుండెను. ఆ దేవియే సీతారాములై మరల పరంజ్యోతియై యెదుట సాక్షాత్కరించెను. ఆ సమయమున బాహ్య ప్రపంచము మఱచి యద్భుతానందములందుచుండువారు.

ఒకనాటి సాయంకాలమున నేకాంత ప్రదేశమున గూర్చుండి జపము చేసికొనుచుండగా శ్యామసుందర స్వరూపుడును, శాంతమూర్తియు,

సుఖాసీనుడును నగు నొక మహాత్ముడు దర్శనమిచ్చెను. చాయాపటమును బట్టి యా మహాపురుషుడు శ్రీరామకృష్ణ పరమహంసయేయని ఆయన గ్రహించెను. అది మొదలా మహాత్ముడు ఎన్నియో మారులు దర్శనమిచ్చెను. భక్తుని హృదయమును పరీక్షించుటకు భగవంతుడు సాధురూపమున గూడ సాక్షాత్కరించుచుండును. సత్యనారాయణవ్రత కథలో వచ్చిన కోమటులను పరీక్షించుటకు భగవంతుడు సాధురూపముగానే దర్శనమిచ్చెను. తరువాత సూర్యనారాయణగారు రామకృష్ణ పరమహంస యొక్కయు వివేకానందస్వామియొక్కయు గ్రంథములు బాగుగా పరిశీలించిరి.

1928 సం॥రములో రాజమండ్రిలో ఇంగ్లీషు చదువనారంభించి 1930 సం॥రములో స్కూలు ఫైనల్ ప్యాసై యింటర్మీడియేటు పరీక్ష చదువనారంభించిరి. కాని వైరాగ్యము తీవ్రమగుటచే చదువుపై శ్రద్ధ మందగించెను, చదువుపై రోత పుట్టెను. రాజమహేంద్రవరమున నున్న కాలములో నిత్యమును తెల్లవారగట్ల రెండుమూడు గంటలకే లేచి రాజమహేంద్రవరమునకు మూడుమైళ్ళ దూరములో నున్న బొమ్మూరు మెట్టపైకి వెళ్ళుచుండెడివారు. ఆ మెట్టపై పెద్ద మఱ్ఱిచెట్టు గలదు. ఆ ప్రదేశమునకు జనులెవ్వరును వెళ్ళరు. అచట మిగుల ప్రశాంతముగాను, నిశ్శబ్దముగాను నుండును. అందుచే ఆయన మఱ్ఱి చెట్టు క్రింద గూర్చుండి వెలుగు వచ్చు వఱకును ధ్యాననిష్ఠ నభ్యసింపసాగిరి. 1930 సం॥రము లోనే భార్య కాపురమునకు వచ్చెను. అదివఱకే వైరాగ్యము ముదిరియుండుటచేతను, గృహజీవితమందసహ్యము కల్గుటచేతను, సంసార సుఖములయందాయనకు ఎంతమాత్రమును ఆసక్తి లేకుండెను. తన వైరాగ్య లక్షణములను ఎవ్వరికిని తెలియకుండగ సంచరించుచు సన్యసించుటకు గూడ ప్రయత్నించుచుండిరి. ఆయన మానసిక ప్రవృత్తిని భార్యయగు సుబ్బలక్ష్మి గ్రహించెను. కాని పాపమామె యేమి చేయగలదు?

ఆయన మండపేటలో నున్నపుడు వారియింటికి సమీపముననున్న యొక తోటలోనికి వెళ్ళి పద్మాసనముపై గూర్చుండి ధ్యాననిష్ఠులై శ్రీ రామచంద్రుడీరోజున గాన్పించనిచో ఆత్మహత్య గావించుకొందునని కృతనిశ్చలులరై శ్రీరామనామ స్మరణ చేయ నారంభించిరి. ఇప్పుడుపేక్షించిన తప్పక ముప్పు కల్గునని యొంచి భక్తునికోరిక నెరవేర్చుటకై శ్రీరామచంద్ర ప్రభువు సీతా పరమేశ్వరితో సాక్షాత్కరించెను. రాముని దేహము నీలమేఘ చ్ఛాయతో నిగనిగలాడుచుండెను. శిరస్సుపై నవరత్న స్థగితమైన సువర్ణ కిరీటము ప్రకాశించుచుండెను. ఎడమభుజమున ధనుస్సుగలదు. మోమున చిఱునవ్వు మొలకలెత్తుచుండెను. నేత్రములు తామర రేకులవలె విశాలముగా నుండెను. శ్రీరామచంద్రుని యెడమవైపున సర్వాలంకార శోభితయగు సీత మెఱపుతీగవలె ప్రకాశించుచు నిలబడియుండెను. కొంతసేపటికి సీతారాములు అదృశ్యులైరి.

ఇట్లు కొంతకాలమైన తరువాత నొక పూర్ణిమనాటి రాత్రి యేకాంత ప్రదేశమున గూర్చుండి ధ్యానావస్థలో నుండగా తూగుటుయ్యేలలో శ్రీకృష్ణుడు కాలిమీద కాలు వేసికొని సవిలాసముగ గూర్చుండి యెదుట సాక్షాత్క రించెను. శ్రీకృష్ణుడు కోటి మన్మథ విలాస సుందరుడైయుండెను. శిరోజములు తుమ్మెద ఱెక్కలవలె నల్లగా నిగనిగలాడుచుండెను. వివిధ కాంతులతో విరాజిల్లు వజ్రములును, రత్నములును, సువర్ణ కిరీటముపై నక్షత్రములవలె ధగద్ధగాయముగా ప్రకాశించుచుండెను. మణిగణస్థిగితమైన భుజకీర్తులు మిగుల వింత గొల్పుచుండెను. భుజముపై పల్లెవాటుగా ధరించిన కండువా గాలికి కదలుచుండెను. దివ్య సుందరుడగు శ్రీకృష్ణుని చూచుచుండగనే ప్రపంచమంతయును జ్యోతిర్మయమై ఆయనకు గోచరించెను.

కII నర్తకుని భంగి పెక్కగు
మూర్తులతో నెవ్వడాడు - మునులున్ దివిజుల్
కీర్తింపనేర రెవ్వని
వర్తనమొరులెఱుగరట్టి వానినుతింతున్ II

అను భాగవత లక్షణములన్నియు ఈ భక్త శేఖరునియందు ప్రత్యక్షము కాజొచ్చెను.

కII ఇందుగలడందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందేగలడు దానవాగ్రణివింటే II

అను ప్రహ్లాద లక్షణములుగూడ నీయనయెడల ప్రత్యక్షమై చూపెట్టెను. భగవత్సాక్షాత్కారమహిమా విశేషములతో ఏకాంతవాసము సాగించుచున్న శ్రీ సూర్యనారాయణగారికి సంసారిక విఘయములన్నియు పిప్పివలె నిస్సారముగా దోచెను. శ్రీ రామదర్శనమైనది మొదలు ఆయన జీవితాధ్యాయము పూర్తిగా మారిపోయెను.

అయ్యయ్యో ! నా జీవిత కాలమంతయును తగ్గిపోవుచుండెనే! సద్గురువు లభించినగాని ఈ విద్య యెన్నటికిని పూర్తికాదే!

“గురువులేని విద్య కూడ దెందులకైన” అని పెద్దలు పల్కుదురే! నా జీవిత మీ రీతిగా వ్యర్థమై పోవలసినదేనా! అని వితర్కించుకొనుచు గాలి తుపానులో ప్రయాణము సాగించు జీవివలె తహతహలాడుచు సద్గురు దర్శనమునకై పరితపించుచుండిరి. అందుచే ఆయన రేగడిమట్టితో ఒక విగ్రహము చేసి దాని చుట్టును ప్రదక్షిణము చేయుచు “సద్గురు - సద్గురు - సద్గురు” అని నామములను మహామంత్రముగా పఠించుచుండిరి. ఆ

సాయం సమయములయందాయనకు భగవంతుడు శ్రీరామకృష్ణ పరమహంస రూపమున సాక్షాత్కరించుచుండెను. ఇంటరు మీడియెటు పరీక్ష ప్యాసైన తరువాత చదువుపై శ్రద్ధ మందగించెను. ఆరోగ్యము చెడెను. అందుచే ఆయన రెండు సం॥రములు ఇంటియొద్దనే యుండిపోవలసి వచ్చెను.

ఒకప్పుడు సూర్యనారాయణగారు కాకినాడ వెళ్ళవలసి వచ్చెను. ఆ సమయమునకే రాధాస్వామీ మత గురువులైన శ్రీశ్రీశ్రీ ఆనంద స్వరూపఀ సాహెబఀ జీ మహరాజఀ వారు కాకినాడలో మకాముచేసి ఉపన్యాసము లిచ్చుచుండిరి. వారి యుపన్యాసము విన్నయెడల హృదయము కరుగని వారుండరు. ఆ సంగతి విని సూర్యనారాయణగారు ఆ స్వామిని దర్శించిరి. అపుడా స్వామి కందర్ప సూర్యనారాయణగారిని చూచి "అయ్యా! మీరు మీ యూరగాని, మీ జిల్లాలోగాని, మీ రాజధానిలోగాని, సద్గురువుకొఱకు బాగుగా వెదకుడు. అప్పటికిని మీకు సద్గురువు లభించని యెడల మా రాధాస్వామి దేవాలయ కవాటములు ఎప్పుడును తెరువబడియే యుండును" అని చెప్పిరి. మఱియు రాధాస్వామీ మతావలంబకులైన కొందఱు సాధకులు "సూర్యనారాయణా! నీవు సత్సంగివి కమ్ము" అని ప్రోత్సహించిరి. అందుచే వారలమధ్య ఈ విధముగా సంభాషణ జరిగెను.

సూర్య :– అయ్యా! సాధన ఫలితముగా శ్రీ రాముడుగాని, కృష్ణుడుగాని ప్రత్యక్షమగునా?

రాధామతావలంబి :– ఏమి? రాముడా! కృష్ణుడా ! వారిని మించిపోయిన ధామునందు నీవు చేరెదవు.

సూర్య :– అయ్యా! రాముని, కృష్ణుని మించిన పదవులు నాకేమీ అక్కరలేదు. సాధన ఫలితముగా శ్రీరామచంద్ర ప్రభువును దర్శించి ఆ

దేవదేవునితో సంభాషించి తీరవలెను.

రాధా :– అయితే అది మా మతమున పొసగదు.

సూర్య :– అయితే మీ మతముతో నాకసలే పొసగదు. అని ధైర్య సాహసములతో గట్టిగా నొక్కి చెప్పిరి.

భగవంతుని దర్శింపజేయుని మతము నిరర్ధకమని సూర్యనారాయణగారు స్థిరపఱచుకొనిరి. కాని హృదయము సద్గురు దర్శనమునకై దహించి పోవుచుండెను. ఏకలవ్యునివలె నొక మట్టి విగ్రహమునకే ప్రదక్షిణలు చేయుచు ఆ విగ్రహమునే సద్గురు, సద్గురు అని మ్రొక్కుచున్న భక్తుని తరింపజేయవలసిన శుభసమయమేతెంచెను.

"వెదుక వెదుక దొరకు వేదాంత వేద్యుండు
వెదకువారిందానె వెదకుచుండు".

అని వేమనయోగి చెప్పినటుల శ్రీ సూర్యనారాయణగారిని సంసారార్ణవమునుండి తరింప జేయుటకు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షియే సూక్ష్మదేహముతో సంసిద్ధులై యుండిరి. భక్తునికి ఆర్తి గల్గినపుడు భగవంతుడేల రక్షించడు.

నీవే తప్ప నితఃపంబెఱుగ మన్నింపందగునని దీనునినని ।
రావే ; యీశ్వర ।కావవే వరద । సంరక్షింపు భద్రాత్మకా । "

అని గజేంద్రుడు ప్రార్థించినంతనే వైకుంఠమునుండి శ్రీ మహావిష్ణువే గజేంద్రునిచెంత కేతెంచెను. అట్లే భక్తజన రక్షాదక్షులైన శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారు సద్గురు దర్శనమునకై పరితపించుచున్న శ్రీ కందర్ప సూర్యనారాయణగారిని రక్షించుటకు సూక్ష్మదేహముతో నిరాలంబములో నిరీక్షించి యుండిరి.

1932 సం॥రమున వసంత ఋతువునందు చైత్రమాసమున నొకనాడు ఉదయము 8, 9 గంటలకు మండపేటకు తూర్పున ప్రవహించుచున్న పిల్లకాలువలో స్నానముచేసి అచటనేగల మామిడి తోటలో సంధ్యావందనాద్యనుష్ఠానములు తీర్చుకొని ధ్యాన నిమగ్నులైరి. ప్రకృతి యంతయు నిశ్చల గాంభీర్యభావము వహించి యుండెను. ఏకాంత ప్రదేశము. ఆ సమయమున నిరాలంబములో అంతరిక్షమునుండి

"శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం
శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం
శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం"

అను శబ్దము గంభీరముగా ముమ్మారు వినబడెను. ఎవరు పలుకుచుంటిరా? యని కండ్లువిప్పి చూచుసరికి ఎవరును కాన్పింపరైరి. శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులే సూక్ష్మదేహముతో వచ్చి నిరాలంబములో పల్కుచున్నట్లు సూర్యనారాయణగారికి అప్పుడు గోచరించలేదు. 1928 సం॥రము నుండి రాజమండ్రిలో ఆంగ్లభాష చదువుచుండిరను సంగతి లోగడనే తెలిపియున్నాను. 1930 సం॥రము నుండి రాజమండ్రీ ప్రభుత్వ కళాశాలాధ్యక్షులైన శ్రీ కేసిరాజు సత్యనారాయణగారితో సూర్యనారాయణగారికి పరిచయమేర్పడియుండెను. శ్రీ సత్యనారాయణగారు ప్రతిదినమును సాయాంకాలము బొమ్మూరు మెట్టకు షికారు వెళ్ళుచుందురు. సూర్యనారాయణగారు కూడా ఆ ప్రదేశమునకే నిత్యమును ధ్యానసాధనకు వెళ్లుచుందురు. సూర్యనారాయణగారికి శ్రీ కేసిరాజు సత్యనారాయణగారు గణితశాస్త్రాధ్యాపకులు. 1934 సం॥రములో ఒకనాడు శ్రీ కేసిరాజు సత్యనారాయణగారికిని కందర్ప సూర్యనారాయణగారికిని ఈ క్రింది విధముగా సంభాషణము జరిగెను.

శ్రీ సత్య :- అబ్బాయీ ! నీవు ఏకాంతమున ధ్యానయోగమభ్యసించుట చూచితిని. నీకు ఎవరైనను గురువులు గలరా? లేక నీ యిచ్ఛ వచ్చినట్లు చేయుచుందువా?

కం. సూ :- నా కెవ్వరును గురువులు లేరు. శ్రీ రామకృష్ణ పరమహంస వారియొక్కయు, శ్రీ వివేకానంద స్వాములవారియొక్కయు జీవిత చరిత్రలు, ఉపదేశములు చదువుకొని నా యిచ్ఛవచ్చిన రీతిని ధ్యానము చేయుచుందురు.

శ్రీ సత్య :- ఎన్నటికిని గురువులేని విద్య కూడదు. అందును అధ్యాత్మ విద్యకౌఅకు సద్గురువుల నాశ్రయించినగాని యోగము సలుపరాదు.

సూర్య :- చిత్తము. నాకుగూడ ఇట్టి కోరికయే బయలుదేరినది. అనుభవ వేత్తలయిన మహానుభావుల మహానుభావుల నన్వేషించుటకై హిమపర్వత ప్రాంతములకుబోయి పర్వత గుహలయందు వెదుకవలెనని అనుకొనుచున్నాను.

శ్రీ సత్య :- నీవు ఆ ప్రాంతముల కెక్కడికిని పోనక్కరలేదు. శ్రీరెడ్డి సుబ్రహ్మణ్యంగారి పేరు ఎప్పుడైనా విన్నావా?

సూర్య :- ఆ పేరు బాగుగా వినినట్లే ఉన్నది. కాని అట్టి పేరుగల ఒక మానవ్యక్తి కలరా?

శ్రీసత్య :- ఏమి అట్లు అడిగెదవు? అట్టి పేరుగలవారు లేకేమి? ఎక్కడనో యెందులకు? మీ మండపేటకు మిగుల దగ్గరలోనే మహేంద్రవాడ గలదు. అందు శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం అను నామధేయము గలవారొకరున్నారు. వారు కృతయుగమునాటి యొక సత్యఋషిగాని యీ కాలమునాటివారుగాదు. ఈ ప్రపంచముతో వారికి పనిలేదు. గుర్వాజ్ఞానుసారముగా గృహస్థాశ్రమమును పాలించుచున్నారే కాని ప్రపంచ

వాసనలేవియు వారినంటవు. గొప్ప నైష్ఠికులు; భక్తిజ్ఞాన వైరాగ్యతత్త్వములకు నిధి; మహాయోగి పుంగవులు...నిరంతర శ్రీరామపాదసేవా ధురంధరులు. బహుజన్మార్జిత సుకృత విశేషముచేగాని వారిసేవాభాగ్యము లభించదు. అట్టి మహిమాన్విత సత్పురుషులు లోకములో అరుదుగా నుందురు. అతి ప్రభావ గుణసంపన్నులు. నిరంతర తపోనిష్ఠాగరిష్ఠులు. మా నాయనగారగు సుబ్బారాయుడుగారికిని మా అక్కయ్యగారగు వెంకట సుబ్బమ్మగారికిని వారు గురువులు. వారిని నేను బాగుగా ఎరుగుదును. వారు సరిగా శ్రీ వసిష్ఠ, విశ్వామిత్ర భృగు, యాజ్ఞ్యవల్క్యాది మహర్షులను బోలియుందురు. నేటికాలమున అట్టివారిని ఎక్కడను దర్శించలేవు. వారు నిరంతరమును తపోనిష&ఠలోనుందురు. నీవు తిన్నగా వారిని దర్శింపుము. వారి యుపదేశము గ్రహింపుము. పట్టు విడువక సాధనము చేయుము. నీవు తప్పక తరించగలవు. కృతార్థుడవగుదువు.

సూర్య : – చిత్తము, మహానుబావా! మహాప్రసాదము. తమరు నాకు సద్గురుమూర్తిని చూపించిన గురువరుయలు. తా మొనరించిన మేలు ఎన్నటికిని మఱువజాలను. నాకు వెలుగుబాటను చూపించితిరి. తమ కనేక పాదాభివందనములు. తప్పక అట్లే చేయుదును. సనాతన ధర్మానిషా&ఠ గరిషు&ఠల వద్దనే విలువయిున విషయుములు తెలిసికొనవలెనను కోరిక నాకు మిక్కుటముగ గలదు. తమకు నా కృతజ్ఞతాభివందనములు.

సత్య :– అబ్బాయిా! వారిని దర్శించి వచ్చిన యెడల ఆ విషయము మరల నాకు గూడ చెప్పుము.

అని ఆయనను ప్రోత్సాహకరముగా సాగనంపిరి. వారి వద్ద సెలవు పుచ్చుకొని సూర్యనారాయణగారు ఒక వారములోనే మహేంద్రవాడ వెళి&ళరి.అప్పుడు (అనగా 1932 సం॥ రము ఆంగీరసలో) గోదావరి

పుష్కర దినములు. అందుచే గురువర్యులు భార్యా సహితులై రాజమండ్రీ గౌతమీ స్నానమునకై వెళ్ళియుండిరి. గురుదేవుని యింట నెవరును లేకుండిరి. కేసిరాజు సత్యనారాయణగారివద్ద సెలవు పుచ్చుకొని కందర్ప సూర్యనారాయణగారు కాకినాడలోగల పిఠాపురం మహారాజావారి కళాశాలలో ....క్లాసులో చేరి గురు దర్శనమునకై మహేంద్రవాడ వచ్చియుండిరి. మహేంద్రవాడలో గురుదర్శనము లభించని కారణముచే సూర్యనారాయణగారు తిరిగి కాకినాడ వెళ్ళిపోయిరి.

గోదావరీ పుష్కర దినములు గడచిన వెంటనే సూర్యనారాయణగారు గురుదర్శనమునకై మహేంద్రవాడ మరల వచ్చిరి.

ఆనాడు ఆదివారము. ఉదయ సమయమున శ్రీ గురువర్యులు తపోనిష్ఠలో నుండిరి. విజ్ఞానముచే పండిన జడలు శిరమున ప్రకాశించుచుండెను. తెల్లని గడ్డము. విశాల కపోలములు. బ్రహ్మతేజముతో విరాజిల్లు విశాలమైన ఫాలభాగమున విభూతిరేఖలు. అందు కుంకుమాంకితమైన యూర్ధ్వ పుండ్రము, పట్టు పీతాంబరము, పైన పచ్చని శాలువ, చేత తులసితావళము.

సీ॥ సర్వాంగముల సము - జ్వలభంగిఁ దీర్చిన
భస్మంబు రుద్రదూ -పంబుఁదెల్ప
గళమున విలసిల్లు - తులసి మాలికలు శ్రీ
వాసుదేవాంశవై -భవముఁ దెల్ప
సవర వేదంబులై - యవతరించెడు మహా
వాక్యములఁ బ్రహ్మ సం-పత్తి దెల్ప
శాంభవీముద్రా వి -శాల నేత్రయుగంబు
పంచభూతాభావ - పదవిఁదెల్ప

గీ॥ ముక్తి శైలాధిరూఢులై - భక్తవరులు
చెంత గొల్వంగ బృందావ - నాంతరమున
సుముఖులై యున్నయట్టి శ్రీ -సుబ్బరాయ
సద్గురుస్వామి మదికి సా -క్షాత్కారించె ॥

అని శ్రీ కూచి సత్యనారాయణశాస్త్రిగారు గురుచక్రవర్తి దివ్యమంగళ విగ్రహమును కవితా రూపమున సహజ సిద్ధముగా చిత్రించియున్నారు. ప్రతి రక్తకణమందును సీతారాములు తాండవమాడుచున్న యా కలియుగ మమర్షి జూచినంతనే సూర్యనారాయణగారు బాహ్య ప్రపంచము మఱచి భక్త్యుత్సాహములు ముప్పిరిగొన తన్మయులై యుండిరి. మధ్యాహ్న కాలము వఱకును తపోదీక్ష నెఱపి శ్రీ సీతారాములకు మహానైవేద్యము గావించి ఆ ప్రసాదమును సూర్యనారాయణగారికి పెట్టించిరి. శ్రీ గురువర్యులు భుజించిన తరువాత కొంచెముసేపు విశ్రమించి తరువాత సూర్యనారాయణగారిని చేరబిల్చి యిట్లు సంభాషింప దొడగిరి.

శ్రీ గురు :- అబ్బాయీ ! నీవు ఎవరవు? ఇట కెందులకు వచ్చితివి?

కం. సూ :- నేనొక విద్యార్థిని, మాది మండపేట. శ్రీ కందర్ప వెంకటేశ్వర్లుగారి కుమారుడను. శ్రీ కేసిరాజు సత్యనారాయణగారి శిష్యుడను. వారి పనుపుననే తమ దర్శనార్థము వచ్చితిని.

శ్రీగురు :- శ్రీ కేసిరాజు సత్యనారాయణగారు పంపినచో నీకింక పరీక్ష అక్కరలేదు. నీకు ఏమి కావలయునో చెప్పుము. నాయనా!

కం. సూ :- నాకు శ్రీరామచంద్ర సాక్షాత్కారము కావలెను. గాఢమైన వాంఛతో వచ్చితిని. అది సాధ్యమగునా! తండ్రీ!

శ్రీగురు :- నాకేమి! తప్పక సాధ్యమగును. ఎందుకు కాదు నాయనా! ప్రహ్లాదుని యొక్కయు, నారద మహర్షి యొక్కయు, శ్రీ శుకులవారి

యొక్కయు, కొన్ని సుగుణములనైనను అలవరచు కొనిన యెడల తప్పక నీ కోరిక సిద్ధించును. శ్రీ రాముడు దర్శనమిచ్చును. ఇందుకు సందేహము లేదు.

సూర్య :- తాము సెలవిచ్చినట్లు శమము, దమము, స్నాన సంధ్యాద్యనుష్ఠానములు, ఏకాంతసేవ, జపము, ధ్యానము, మున్నగువాటిని నా నేర్పుకొలది అలవరచుకొంటిని.

సద్గురు :- ధ్యానము చేయుచుంటిననుచున్నావు. నీకు ఎవరైనను గురువులు గలరా?

సూర్య :- నా కెవ్వరును గురువులు లేరు. గ్రంథములు చూచియే కొన్ని యోగ సాధనలు చేయుచుంటిని.

సద్గురు :- గ్రంథములు చూచి యోగాభ్యాసమా! నాయనా!

"గురుర్వినేదం స్థానం దేవానామపి దుర్లభం"
గురవులేకుండగ దేవతలకైనను ఈ పదవి దుర్లభము.

శ్రీరామచంద్రమూర్తి వసిష్ఠ మమామునిని నాశ్రయించి తరించిరి. శ్రీజనకచక్రవర్తి యాజ&ఇ్యవల్క్య మునిచంద్రుల నాశ్రయించి తరించిరి. శ్రీకృష్ణమూర్తి శ్రీ సాందీపగురు చక్రవర్తి నాశ్రయించి తరించి మూడు లోకములను తరింపజేసెను.

మరీచి, భృగు అత్రి, అంగిరస్సు, వసిష్ఠ, విశ్వామిత్ర, యాజ్ఞ్యవల్క్య, జనక, శుక, సాందీప, శ్రీకృష్ణ, నారద, పరాశర, వ్యాస, అంబరీషాది సద్గురు పపంపరాగతమైన రహస్యముల నెఱింగిన యనుభవవేత్తల నాశ్రయించి సేవించి వారి దయ సంపాదించిననాడు మోక్షము కరతలా మలకముగాదు. వ్రతములు, దానములు, తపములు, తీర్థ సేవనములు మున్నగు సమస్త సాధనములు సద్గురు లాభమును కలుగజేయుటకే

యుపకరించును. ఇట్టి సుకర్మ పుంజ పరిపాక విశేషంబున, భగవదను గ్రహమున, సద్గురుపాదము లభించును. అట్టి సద్గురు సేవ వలన ముక్తి కరతలామలకమగును.

సూర్య :- సరే, బాగుగానేయున్నది. కాని, గార్హస్థ్యమున మోక్షము అసంభవముగాదా తండ్రీ!

సద్గురు : - విశిష్ట, విశ్వామిత్ర, అత్రి, అంగిరస్సు, గౌతమ, జమదగ్ని, వాలఖిల్యాది మహర్షులును, జనకాదులును, శ్రీకృష్ణాదులును, నిత్య నిరతియ పరిపూర్ణ పరబ్రహ్మాను సంధాన పరవశులయ్యు, సకల కార్యకలాపదక్షులయి ప్రవర్తించిరి. వారి జ్ఞానమును శంకింతువా?

సూర్య :- సన్యసించినగాని మోక్షము లేదందురు. దానియర్థమేమి?

సద్గురు :- సన్యాసమునకు కొమ్ములున్నవనుకొనుచున్నావా?

క॥ హృదయము పదిలంబైతే
గుదిగొన సన్యాసమునకుఁ గొమ్ములుగలవా ।
ఇది యెఱుగరు చదువయ్యలు
మది ముక్తికి నాస్పదంబు - మహిలో వేమా ॥

మఱియు సన్యాసమనగా ఏమనుకొనుచుంటివి? ఇదిగో చూడుము. నేనొక నిమిషము నిష్టయందుండెదను.

అని శ్రీ గురుదేవులు నిమీలిత నేత్రులయి. నిశ్చేష్టులయి, పాలశిలా ప్రతిమచందమున మౌనముద్ర ధరించి ఊరకుండిరి. అపుడు వారి ముఖారవిందము నుండి ఒక యప్రాకృతమగు దివ్య తేజోరాశి చూపట్టెను. సూర్యనారాయణగారు ముగ్ధులైరి. ఆయన సందేహములు పటాపంచలయ్యెను హృదయగ్రంథి విడిపోయెను. హృదయమున ఉత్సాహము, బలము, ఆనందము, నూతన చైతన్యము ఒక్కసారి విజృంభించి

తాండవమాడసాగెను. పునర్జన్మనందినట్లు ఆయనకు తోచెను. ఆ సమయము నుండియే ఆయనకు నూతనశకము ప్రారంభమయ్యెను.

“ఆహా! నేటికిగదా ద్విజన్ముడనైతివని చెప్పుకొనుటకు అర&హత గలవాడ నైతిని” అని తనలో తానుప్పొంగుచు గురుదేవుని పాదపద్మములపై వ్రాలి ఆనంద భాష్పములతో గురుదేవునభిషేకించుచుండిరి.

కొంతసేపైన తర్వాత శ్రీ గురుదేవులు ఇట్లు ఉపదేశించిరి.

అబ్బాయి ! అవధూతల కాశ్రమములు లేవు. వారే యాశ్రమమునైనను రవరగా పరిపాలింతురు. అదియునుగాక యీ కలియుగంబున సన్యాసము బహుదుష్కరము. ఇది వినుము. ఏనాసన్యాసులు పొందు రావు పొందుటెట్లని పరమ భాగవతోత్తముండగు నుద్ధవుండడిగిన శ్రీ కృష్ణుండిట్లనియె.

‘‘కుపథంబులకుం జనక సన్మార్గవర్తియై పరమంబైనమన్ని వాసంబునకుం జనుము. సర్వమూల శక్తి సంపన్నుండైన నన్ను సాంఖ్యయోగపరులు నిరంతర భావంబులందు పురుష భావంబు భావించి తలంచుచుందురు. మఱియు నేకద్విత్రిచతుష్పాద బహుపాద యుక్తంబులైయున్న జీవజాలంబులోన ద్విపాదంబులు గల మనుష్యులు మేలు. వారలలోన నిరంతర ధ్యాన గరిష్ఠులైన యోగీంద్రులుత్తములు, వారలలో సందేహపరులచే నగ్రాహ్యుండగు నన్ను సత్త్వగుణగ్రాహ్యునిగా నెఱింగి నిజచేతః పంకజంబునందు జీవాత్మ పరమాత్మలనేకంబుగా జేసి శంఖచక్రగదా ఖడ్గ శార్ఙ్గ కామోదకీ కౌస్తుభా భరణ యుక్తునిగా నెఱుంగుచుండు వారలు పరమ యోగీంద్రులనియు పరమ జ్ఞానులనియును” జెప్పె. ఇదియే మనకు రాజమార్గము అని చెప్పిరి.

అదియునుగాక వేద వాదములలోను, పాండిత్య ప్రకర్షలోను, ఆశ్రమ

భేదములలోను భగవంతుడు లేడు.

మ॥ఉపవాస వ్రత శౌచశీల మఖసధోయపాసనాగ్ని క్రియా
జపదానాధ్యయనాది కర్మముల మోక్ష ప్రాప్తిసేకూరద
చ్చపుభక్తిన్ హరిఁ బుండరీకసయనున్ – సర్వాతిశాయిన్ రమా
ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని నర్థిన్ గొల్వలేకుండినన్॥

నిశ్చలమైన భక్తి లేనిదే భగవత్సాక్షాత్కారము కలుగదు. అట్టి యచ్చపు భక్తిగూడ గురుకటాక్షము వలననే ప్రాప్తమగును.

నీవు శివకేశవాది మూర్తులయందుగాని, శ్రీరామకృష్ణా ద్యవతారములయందుగాని నియమ నిష్ఠలతో భక్తి సలిపిన నీవు తప్పక భగవద్దర్శన భాగ్యము పొందగలవు. ఇందుకు సందేహములేదు.

సూర్య :– తండ్రీ, సద్గురు మహాప్రభూ! నా సంశయములన్నియు పటాపంచలయ్యెను. నా జన్మ తరించెను. తమ వంటి సద్గురు మహా ప్రభువును సేవించు భాగ్యమిప్పటికి గల్గెను. ఇంతటి నుండి నన్ను శిష్యునిగా అనుగ్రహింప వేడెదను.

సద్గురు :– మంచిది నాయనా ! అట్లే అగుగాక !

సూర్య :– నేను ప్రస్తుతము కాకినాడలో పిఠాపురం మహారాజావారి కాలేజీలో ....చదువుచున్నాను. నాకు వివాహమైనది. భార్యకూడ కాపురమునకు వచ్చినది. తమరు నన్నేమి చేయుమని యాజ్ఞాపించినట్లే ఒనర్తును.

సద్గురు :– నీవు చదువుగాని గార్హస్థ్య కృత్యములుగాని ఏమియు మాననక్కరలేదు. నే నెట్లు గృహస్థాశ్రమమున నడచుకొనుచుంటినో నీవును అట్లే నడచుకొనుము. తఱచుగా నా వద్దకు వచ్చుచుండుము. నేను చెప్పిన రీతిని జపము, ధ్యానము చేసికొనుచుండుము. నియమనిష్ఠలు లేనిచో

బ్రహ్మజ్ఞానము అబ్బదు. కావున బాగుగా భక్తి – భావన, వృద్ధి పొందించుకొనుము. క్రమముగా నీకు అన్నియు సంప్రాప్తమగును.

సూర్య :– చిత్తము. మహాప్రభూ! తండ్రీ, గురుచక్రవర్తీ! సర్వసంశయములు బాపి సర్వభయములణగించితిరి.

అని ఆనందపారవశ్యమున బల్కిరి.

పిమ్మట నొక పుణ్య శుభసమయమున శ్రీ మహరులవారు సర్వోత్కృష్టమగు శ్రీరామ తారక మంత్రోపదేశమొనరించిరి. అపుడు సూర్యనారాయణగారు గురువర్యులను గాంచి "మోక్షము కరతలామలక మొనరించిన పరమ దయానిధీ! తమకు పరిపూర్ణ బ్రహ్మజ్ఞాన ముపదేశింప పుడమి నెలసిన సాక్షాతశ్రీ దక్షిణామూర్తి స్వరూపులే. ఇందుకు సందేహము లేదు" అని గురుస్తవ మొనర్చిరి.

పిమ్మట శ్రీ విద్యారణ్యస్వాములవారు పంచదశియందు చెప్పిన శ్లోకములను శ్రీ మహర్షులవారు శిష్యునికిట్లు బోధించిరి.

1. శ్లో ॥ ధన్యో...హం ధన్యో...హం తృప్తేకోపమా భవేల్లోకే
ధన్యో...హం ధన్యో....హం ధన్యోధన్యః పునః పునర్ధన్యః॥

2. అహోపుణ్య మహోపుణ్యం ఫలితం ఫలితం దృఢమ్
అస్యపుణ్యస్య సంపత్తే రహోవయ మహోవయమ్॥

3. అహోశాస్త్ర మహోశాస్త్ర మహోగురు రహోగురుః
అహోజ్ఞాన మహోజ్ఞాన మహోసుఖ మహోసుఖ॥

మహర్షి పుంగవుల బోధామృతముతో శిష్యుని సంశయములన్నియు నొక్కసారిగా హరించిపోయెను. "ఆహా! నేటితో నా భవబంధములు సడలిపోయినవి. నా జన్మ సఫలమయ్యెను. ఏ పుణ్య పురుషుని కొఱకు నే ననేక జన్మములలో తప మాచరించితినో ఆ మహనీయమూర్తి నాకు

లభించిన తర్వాత నాకింకేమి కావలయును? నిజముగా గురుభజన తక్క వేనితోను పనిలేదు. వినవలసిన బోధ వింటిని. చూడ వలసిన పుణ్య గురుదంపతులను దర్శించితిని. పొందవలసిన దానిని పొందితిని" అని సూర్యనారాయణగారు తనలో తాను ఉప్పొంగుచు ఆనందాబ్ధి నోలలాడుచు గురుదేవునివద్ద సెలవు పుచ్చుకొని మండపేట వెళ్ళిపోయిరి.

ఆయన యింటికి వెళ్ళి సంధ్యావందనము చేసికొనుచు ధ్యాననిష్ఠలో ప్రవేశించినపుడు దేదీప్యమైన సుందర వదనార విందముతోను మహోజ్జ్వలమైన కాంతిపుంజముతోను సద్గురు మూర్తి మాటిమాటికి సాక్షాత్కరింప దొడగిరి. "మంచివారికెల్ల మంగళ ప్రదుడగు" అనుభగవల్ల క్షణముల కింతకంటె సాక్ష్యమేమి కావలెను? ఈ సద్గురు దేవుడు భగవంతుడే గానిచో తలచినంత మాత్రమున భక్తుని యెదుట మాటిమాటికినీ సాక్షాత్కరించుచుండుట యెట్లు పొసగెను?

సూర్యనారాయణగారు గాయత్రీ మంత్రము జపించుచున్నపుడు దివ్యసుందర విగ్రహముతో గాయత్రి ప్రత్యక్షమగుచుండును. ఆ దేవియే సీతారాములై కాన్పింప దొడగెను. మఱియొక యద్భుత విశేషమేమనగా అనేక మణిగణస్థగితమైన సువర్ణ సింహాసనమునందే గురుదేవుడు ప్రత్యక్షమగుచుండెను. ఒకసారి రాముడును, ఒకసారి గురుదేవుడును ఒకే సింహాసనమున సాక్షాత్కరించుచుండిరి. ఆహాహా! ఏమి రాముడు! ఏమి గురువు! ఏమి దివ్యోపదేశము!

ఆహా! ఏమి గురుశిష్య బాంధవ్యము! శ్రీమహర్షులవారు సంసార లంపటులైయున్న సామాన్య మానవులేయైనచో నిట్టి యద్భుత లీలలు శిష్యులకు గాన్పించునా?

ఇంతవఱకును తేలిన సారాంశమేమనగా మహత్తరశక్తి

సంపన్నులైయున్న శ్రీ సుబ్రహ్మణ్య మహర్షులవారే భక్తుని యభిరుచి ననుసరించి ఒకసారి దేవీ రూపముగాను, మఱియొకసారి ఆకాశవాణీ రూపముగాను, మఱియొకసారి శ్రీరామ రూపముతోను, మఱియొకసారి నిజరూపముతోను దర్శనమిచ్చుట గురువర్యుల యవతార లక్షణములనే ఋజువు చేయుచుండెను.

1933 సం॥రమున కాకినాడలో ....చదువుచున్నపుడు ఆంగ్లభాషావ్యాసరచనా పోటీ పరీక్షలు వచ్చెను. ఇంగ్లీషు భాషలో గొప్ప పాండిత్యము లేకపోవుటచేతను, నేటి విద్యావిధానముపై విరక్తి కల్గి యుండుటచేతను, సూర్యనారాయణగారు ఆ పరీక్షకు పోటీచేయ దలచుకొనలేదు. ఒక యుపాధ్యాయుని బలవంతముచే పరీక్షలో పోటీ చేయవలసి వచ్చెను. కాని అందు జయము కల్గునను నాశ ఆయన కెంతమాత్రమును లేదు.

పరీక్షలో గూర్చుండి ఏమమో వ్రాయుచు ముందు విషయము తోచక యూరకుండిరి. కొంత సేపటికి జరిగిన విచిత్రమేమనగా భక్త రక్షణ దీక్షాదక్షులగు శ్రీ సుబ్రహ్మణ్య గురువర్యులే స్వయముగా వచ్చి సూర్యనారాయణగారి కలము పుచ్చుకొని ఆ వ్యాసమంతయు పూర్తి చేసిరి. ఆ రహస్యమును ఆ గురుకృత్యమును సూర్యనారాయణగారికి మాత్రమే తెలియును.

భాగవత శిఖామణియగు బమ్మెరపోతన శ్రీరామచంద్రుని హృదయపీఠమున నిల్పి భాగవత గ్రంధ రచన ప్రారంభించెను. గజేంద్రమోక్ష కథా సందర్భము వచ్చెను. “అల వైకుంఠపురంబులో” అను భాగము వరకును పోతన వ్రాసెను. తక్కిన భాగము స్ఫురింపక పోయెను. పోతన కుమార్తె లక్ష్మి ఆ గ్రంధము దగ్గఱనే యుండెను. ఏదియో పనిమీద పోతన

ఇంటిలోని కేగెను. హృదయపీఠమున స్థిర నివాస మేర్పఱచుకొనిన శ్రీరామచంద్రుడు పోతన రూపముతో వచ్చి

మ॥అలవైకుంఠ పురంబులో నగరిలో – నామూల సౌధంబులో
పల మందారవనాంతరామృతనరః – ప్రాంతేంగు కాంతోపలో
త్పల పర్యంక రమా వినోదియగు నావన్న ప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహిపాహియనఁగుయ్యాలించి సంరంభియై॥

అని పద్యము పూర్తి చేసెను. భగవంతునికి భక్త రక్షణ మట్టి సహజగుణము. ఆ విధముగానే కందర్ప సూర్యనారాయణగారు గురుదేవుని హృదయపీఠమున నిల్పి వ్రాయబూనినంతనే గురుదేవులేవచ్చి ఇంగ్లీషు వ్యాసమును పూర్తి చేయుట ఎట్టివింత! ఈ మహర్షి అవతారమూర్తి అనుటకింతకంటె ప్రబల సాక్ష్యమేమి కావలెను?

కొలది దినములకే బాలుర బహుమతుల పట్టిక యందు మొదటి తరగతి సువర్ణ పతకము సూర్యనారాయణగారికి ఇచ్చినట్లుగా కాలేజీలో లిఖింపబడి ప్రకటింపబడెను. ఆహాహా! ఇదియే కదా సద్గురు లీలా విశేషము. ప్రత్యక్ష నిదర్శనములతో గురువర్యులు రక్షించు చుండ భక్తుని జీవితరంగములకు కావలసిన భాగ్యమేమిగలదు? గురుదేవునియందాయన మనస్సు నిరంతరము లీనమై పరిపక్వదశనొందెను. భక్తుని హృదయమెంత పవిత్రముగానున్న భగవంతుడుగూడ అట్టి విధముగానే సాక్షాత్కరించుచుండును. శ్రీకృష్ణ పరమాత్మ తన శిష్యుడైన యర్జునునికి క్రమబోధ చేయగా చేయగా జ్ఞానోదయమయ్యెను. ఆ స్థితి గనిపెట్టి శ్రీ కృష్ణగురువు అర్జునునికి విశ్వరూప సందర్శనము కలుగజేసెను. అంతటితో విషాదయోగము నశించి అర్జునుడు కృతార్థుడయ్యెను. ఆత్మార్పణ గావించెను. క్రమశిక్షణలోనున్న శిష్యునికి ఏ యే సమయములందేయే

విషయములు బోధింపనగునో గుర్తించుచు సద్గురువులు అట్టి క్రమబోధనే చేయుచుందురు.

ఈ సూర్యనారాయణగారి హృదయము పరిపక్వమై ఆ రూఢస్థితికి వచ్చెను. అందుచే శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తన శిష్యునికి విశ్వరూపమును జూపదలచి యుండెను.

శ్రీ సూర్యనారాయణగారు 1936 సం॥రములో ....పరీక్ష చదువుటకై మద్రాసులో నుండవలసి వచ్చెను. ఆయన ప్రతిదినమును సాయంకాల సమయములందు సముద్రతీరమందలి యిసుక తిప్పమీద విహారముచేయ నలవాటు పడియుండిరి. ఒకనాడున్నత కళాశాల మైదానమున సాయంకాలము గం 5–0 లకు నొంటరిగా గూర్చుండి సద్గురు ధ్యానము చేయ మొదలు పెట్టిరి. ఆ సమయమున జరిగిన విశేషమేమనగా పరబ్రహ్మజ్ఞాన తేజోరాశితో ప్రకాశించు కోటి మహర్షుల కూటమి ఒక్కసారిగా యెదుట ప్రత్యక్షమయ్యెను. తారలనడుమ చంద్రునివలె వారల మధ్య శ్రీ మహర్షులవారు గూర్చుండి తత్త్వబోధ చేయుచుండిరి. ఆది మధ్యాంతములు లేని యా మహర్షుల కూటమి తరంగములతో చెలరేగి తాండవమాడుచున్న మహాసముద్రమువలె నుండెను. ఏ వైపు చూచినను మహర్షి సంఘములే కాన్పించుచుండెను. అట్లు అయిదు నిమిషముల సేవా యద్భుతమను చూచుచు తన్మయులై యుండిరి. కొంతసేపటికి అంతయును అదృశ్యమై పోయెను. ఆ సమయముననే మహేంద్రవాడలో తమ గృహమందు శిష్యుల మధ్య గూర్చుండి తత్త్వబోధ చేయుచుండిరి. మద్రాసునకు మహేంద్రవాడకును సుమారు మూడువందల మైళ్ళ దూరముగలదు. ఒకే సమయములో రెండు వివిధ దూర ప్రదేశములలో దర్శనమిచ్చుట అవతార లక్షణముగాక మఱేమగును?

పరమేశ్వరుడొక్కొక్క యవతారమున నొక్కొక్క రీతిగా విశ్వరూపము ప్రదర్శించుచుండును. పూర్వమొకప్పుడు మహాయోగీశ్వరుడైన శంకరుడు విష్ణువుతో గూడి నిరాలంబమున నృత్యము చేయుచు విశ్వరూపమును జూపెను. సనత్కుమారుడు, సనకుడు, భృగువు, ఆంగీరసుడు, వామదేవుడు, శుక్రుడు, అత్రి, కపిలుడు, మరీచి మొదలగు బ్రహ్మావాదులైన మునులు శంకర విశ్వరూపమును దర్శించి కృతార్థులైరి.

(శంకర విశ్వరూపము - కూర్మపురాణము - ఉత్తర భాగము - 5 అధ్యాయము చూడడు.)

శంకరుడు యోగీశ్వరుడు. శంకరావతారులైన శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి పుంగవులు గూడ యోగీశ్వరులకూటమితోనే పట్టపగలు జాగ్రదవస్థలో తమ భక్తుడై సేవించుచున్న శ్రీ సూర్యనారాయణగారికి విశ్వరూప సందర్శనము కలుగజేసిరి. మద్రాసులో గురుదేవుని విశ్వరూపమును సందర్శించిన తక్షణమే తమ సామనునంతను భోజన హోటలులో జాగ్రత్త పెట్టుకొని ఆ హోటలువారివద్ద రు 14-00 లు బదులు పుచ్చుకొని ఆ రాత్రి మెయిలులోనే బయలుదేరి మహేంద్రవాడవెళ్లి గురుచక్రవర్తిని దర్శించుకొనిరి. అప్పటికిగాని ఆయనకు గల్గిన యానందసాగరముయొక్క పొంగు చల్లారలేదు.

"గురుమధ్యేస్థితం విశ్వం విశ్వమధ్యేస్థితో గురుః
గురుర్విశ్వం సమస్తంతు తస్మై శ్రీ గురవేనమః"॥

అని శంకరుడు పార్వతికి బోధించెను. మహేంద్రవాడలో గురుదర&శనము గావించుకొని మరునాడే మద్రాసు వెళ్ళిపోయిరి. మహేంద్రవాడకును మండపేటకును పదిమైళ్ళ దూరము మాత్రమే. దగ్గరకు వచ్చి తన జన్మభూమినిగాని తల్లిదండ్రులనుగాని చూడవలెనను

కోరికయే లేక మద్రాసు వెళ్ళి పోవుటచూడగా గురుభక్తితయును. రహస్య ప్రవర్తనమును, ఆయనలో నెంత గూఢముగా నున్నదియును స్పష్టమగుచున్నది.

1940 సం॥రము మొదలుకొని మండపేటలోనే ఆయన హెూమియోపతి వైద్యము చేయుచు ఇతర సాంఘిక కార్యకలాపములలో గూడ ప్రధానపాత్రవహించి ప్రజల మన్ననలకు పాత్రులై ఉత్తమశ్రేణికి చెందిన గౌరవనీయులలో నొకరుగా మెలంగుచున్నారు. శ్రీ మహారు&షలవారి వలన పరిపూర్ణ బోధనంది చరాచర ప్రపంచమునంతను శ్రీరామ తారక పరబ్రహ్మమయముగా భావించుచు ఠీవిగా గృహస్థాశ్రమము నెఱపుచుండిరి. ఒకనాటి సాయంకాలమునందు ఏకాంతముగా గూర్చుండి ధ్యానావస్థలో నుండగా "నీవు శుద్ధాత్మా రామ బ్రహ్మానందమును పొందుచు ఈ ప్రపంచమున సకల కార్యకలాప దక్షుడవై సంచరింపుము". అని శ్రీ గురువర్యులే అదృశ్య రూపమునవచ్చి ఆజ్ఞాపించిరి.

ఆహా! శ్రీ కందర్ప సూర్యనారాయణగారు ఎంతటి ధన్యజీవి. ఎట్టి గురుశిక్షణము. ఎట్టి భగవత్సాక్షాత్కార భాగ్య విశేషములు. భగవత్సాక్షాత్కారము నంద దలచిన ముముక్షువులకు ఈ మహనీయుని చరిత్రాంశములు వెలుగుబాటలై లోకమున నెలయుగాక.

# మణుగుల ఆదిలక్ష్మికి ప్రాణదానము చేసిన విధము

క॥ సదసత్తత్త్వ పరాపర
సదనంబగు నినున బొగడ జలజభవాదుల్
పెదవులుఁగదలుప వెఱతురు
నదలక నిను బొగడ నెంతవారము రుద్రా.॥

భాగవతము 8 సం. 228

శుద్ధ నిర్గుణ బ్రహ్మమైన పరమేశ్వరుడు సగుణబ్రహ్మమైనపుడు నిజభక్తులకు కొన్ని లీలలు కనబరచుచుండును. సగుణ బ్రహ్మముయొక్క లీలలు తెలిసికొనుటయే మిగుల కష్టము. ఆపదలనుండి ప్రత్యక్షముగా రక్షించుటకు సాకార మూర్తియే కావలయును. సామాన్యముగా మంచిస్థితియందు మానవులకు భగవంతుడు జ్ఞాపకమేరాడు. దుర్భరకష్టము వచ్చినపుడు తప్పక జ్ఞాపకము వచ్చును. అట్టి కష్టకాలమున అనన్యభక్తితో ప్రార్థించిన భక్తుని భగవంతుడు రక్షించి తీరును. ఈ విచిత్ర సంఘటనమే శ్రీమతి మణుగుల ఆదిలక్ష్మి యెడల సార్థకమై యొప్పెను. శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తన భక్తురాలై యున్న ఆదిలక్ష్మికి ఎట్లు ప్రాణదానముచేసి రక్షించిరో గమనిపింపుడు.

పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు తాలూకాలో చేరిన దుద్దుకూరు గ్రామములో మణుగుల వెంకట సత్యనారాయణమూర్తి – ఆదిలక్ష్మి అను బ్రాహ్మణ దంపతులుండిరి. ఆదిలక్ష్మి మహేంద్రవాడ గ్రామనివాసులైన భద్దిరాజు సూర్యనారాయణగారి కుమార్తె. ఆమె ఏమియు

చదువుకొనకపోయినప్పటికిని మిగుల భక్తురాలై యుండిరి. ఆమె మహేంద్రవాడలోనే జన్మించినదగుటచే నప్పుడప్పుడు శ్రీరామక్షేత్రమునకేగి గురు దంపతులను మాత్రము దర్శించుచుండెడిది. ఆమె గురుదేవుని శిష్యురాలు కాదు.

22వ యేట 1945 సం॥రములో రుద్దుకూరులో ఆమె ఒక మగశివువును గనెను. ఆమె బాలింతరాలుగా నున్నపుడే సూతిక సంబంధమగువ్యాధి సంభవించెను. క్రమక్రమముగా వ్యాధి తీవ్రరూపము దాల్చెను. 35 రోజులు భోజనము లేక పోవుటచే ఆమె శరీరమంతయును మిగుల శుష్కించిపోయెను. మంచముపైకి లేచి కూర్చుండుటకు గూడ ఓపికలేని నీరసస్థితిలో నామెయుండెను. దేహస్మృతి గూడ తప్పిపోయెను. ఇంటిలోని వారందఱును జీవితాశ వదులుకొనియుండిరి. లౌకిక వైద్యము వలన లాభము లేకపోయెను. అందుచే నామె భవరోగ వైద్యులైన శ్రీ మహర్షి దంపతుల నొక్కసారి నిష్కళంకమగు భక్తితో ఆర్తురాలై ప్రార్థించెను. ఆర్తురాలై తననే నమ్మియున్న భక్తురాలిని రక్షింపవలసిన సమయమేతెంచెను.

అందుచే 3-9-1945 తేదీకి సరియగు ప్రార్థివనామ సం॥ర శ్రావణ బహుళ ద్వాదశీ సోమవారము రాత్రి మూడు గంటలకు గురుదంపతులు దుద్దుకూరులో సత్యనారాయణగారి ద్వారమువద్ద నిలచియుండిరి. ఆ సమయమున వీధి తలుపులు బంధింపబడి యుండెను. అందుచే గురుదంపతులు వీధి తలుపు తట్టుచు ఆదిలక్ష్మిని పిలుచుచుండిరి. త్యాగరాజు 96 కోట్లు రామనామము జపించుసరికి ధనుర్ధరులై రామలక్ష్మణులు తలుపులు తట్టి తీయించి త్యాగరాజునకు దర్శనమొసగిరి. అది భగవంతుని సహజగుణము.

ఇప్పుడుగూడ శ్రీ గురువర్యులు భార్యతో గూడ వెళ్ళి తలుపుదగ్గఱ నిలబడి తట్టుచుండిరి. అపుడాదిలక్ష్మి ఇంటిలోని వారితో

"మహేంద్రవాడనుండి రెడ్డి సుబ్రహ్మణ్యం బాబయ్యగారును, వారి భార్య బాపనాంబగారును వచ్చి గుమ్మము వద్ద నిలబడి పిలుచుచున్నారు. ఆలస్యము చేయక వెంటనే తలుపు తీయుడు", అని పెద్ద పెద్ద కేకలు వేయసాగెను. అంతకు పూర్వమునుండియు దేహస్మృతి లేక పడియున్న యామె కేకలకు ఇంటిలోని వారందఱును మిగుల నాశ్చర్యపడుచు తలుపులు తీసిరి, మహర్షి పుంగవులు పట్టుపంచె కట్టుకొని తులసిమాల ధరించి వెండి కమండలముతోను, వెండి పాదుకలతోను ఆమె యెదుట సాక్షాత్కరించి నిలబడియుండిరి. సర్వాలంకార భూషితయగు బాపనాంబగారు ముక్కున పెద్దవత్తు ధరించి చేతిలో వెండికుంకుమ బరిణె నుంచుకొని చిఱునవ్వుతో ఆమె యెదుట నిలబడిరి.

ఆ గురుదంపతులను జూచినంతనే ఆదిలక్ష్మి ఆనంద పరవశురాలై రెండు పీటలు వేయుడని ఇంటిలోని వారిని తొందర పెట్టసాగెను. ఆమె చెప్పిన ప్రకారము రెండు పీటలు ఆ మంచము దగ్గర వేసిరి. గురుదంపతులా పీటలపై గూర్చుండిరి. కాని ఆ దృశ్యము ఒక్క ఆదిలక్ష్మికి తప్ప ఇంటిలోనివారికెవ్వరికిని గాన్పించకుండెను. ఆదిలక్ష్మి చేయు ప్రసంగములన్నియు చూచువారంరణికిని మిగుల యద్భుతముగా నుండెను. ఆదిలక్ష్మి మంచముపై గూర్చుండి గురుదంపతులకు నమస్కరించుచు గురుదేవునితో "'బాబయ్యగారూ! నా రోగము నిర్మూలమగునా?" అని ప్రశ్నించెను. పరమ దయార్ద్ర హృదయులును భక్తజన రక్షణ దీక్షితులును నగు శ్రీ గురువర్యులు ఆదిలక్ష్మిని జూచి "అమ్మా! నీకు రేపటినుండియే సంపూర్ణారోగ్యము కల్గును. సందేహమెంతమాత్రమును లేదుసుమా!" అని అభయమిచ్చి,

"రామ రామ రామ రామ నామ తారకం
రామకృష్ణ వాసుదేవ భక్తి ముక్తి దాయకం॥

అను మంత్రముపదేశించి దీనిని పఠింపుచుండమని చెప్పి ఆ గురుదంపతులు అదృశ్యులైరి.

గురుదేవుని యుపదేశానుసారముగా ఆదిలక్ష్మి

"రామ రామ రామ రామ నామ తారకం
రామకృష&ణ వాసుదేవ భక్తి ముక్తి దాయకం॥

అను మంత్రమును తదేక దీక్షగా పది నిమిషములసేపు ఆమె పఠించెను. ఆమె అంతకు బూర్వము పద్యములుగాని, పాటలుగాని, కీర్తనలుగాని, ఎన్నడును పాడియెఱుగదు. ఏమియు చదువుకొనలేదు. లౌకిక జీవయాత్రకు పనికివచ్చు చదువులకును భక్తి మార్గమునకును సంబంధములేదు.

మ॥ ఏ వేదంబుఁబఠించెలూత, భుజగంబే శాస్త్రముల్ సూచె దా
నే విద్యా భ్యసనం బొనర్చెఁగరి, చెంచేమంత్రమూహించె, బో
ధావిర్భావ నిధానముల్ చదువులయ్యాకావు మీపాద సం
సేవాసక్తియేకాక జంతుతతికినఎ శ్రీ కాళహస్తీశ్వరా॥

అని యొక భక్తుడు భగవంతుని స్తుతించెను. మిగుల ప్రమాదస్థితిలో నున్న యామెకు గురుదంపతులు సాక్షాత్కరించుటఁము, భగవన్నామము తీవ్రముగా జపించుటయు జూచి యింటిలోనివారందఱును ఆశ్చర్య పడుచుండిరి. పది నిమిషముల కాలమామె రామనామమును బిగ్గరగా కీర్తించుటచేత ఆమె శరీరమంతకును చెమట పట్టెను. 35 రోజులనుండి నిద్రాహారములులేని యామె గాఢనిద్రలో మునింగెను. ఆ మరునాటి నుండియే ఆమెకు సంపూర్ణారోగ్యము కలుగనారంభించి త్వరలోనే ఆమె కోలుకొనెను.

నాల్గురోజులు పోయిన తర్వాత భర్తయగు వెంకట

సత్యనారాయణమూర్తిగారు "నీవిదివఱలో చేసిన రామనామ స్మరణము ఇంకొకసారి చేయుము" అని యడిగిరి. కాని ఆ మంత్రము ఆమె నోటినుండి పల్కించుటయే కష్టమయ్యెను. ఆమె ఇప్పుడు సంపూర్ణారోగ్యవంతురాలై దుద్దుకూరులో హాయిగానున్నది.

ఆహా! ఏమి గురుమహిమా విశేషము! ఆదిలక్ష్మికి సాక్షాత్కరించిన సమయముననే గురుదంపతులు మహేంద్రవాడలో గూడ నుండిరి. ఒకే సమయములో రెండుచోట్ల దర్శనమిచ్చుట అవతార లక్షణముగాక మఱేమగును?

"ఇందుగల డందులేడని సందేహమువలదు" అను భాగవత లక్షణమునకిదియే ప్రబల నిదర్శనము.

ఈ మహిమనుగూర్చి "గురుదేవా!" ఈ యద్భుతమేమి" అని నేను మహర్షులవారి నడిగితిని. ఇది యంతయును ఆత్మోపాసనగల్గు విశేషమనునాయని గురువర్యులు సెలవిచ్చిరి.

# భద్రకాళి గురుపీఠము నలంకరించిన విధము.

గురుదంపతులు ప్రతి సం॥రమందును ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి లగాయితు ఆ తొమ్మిదిరోజులును ప్రధాన శిష్యవర్గముగూడి దేవీ నవరాత్రములు మహావైభవముగా జరుపుచుందురు. ఆ తొమ్మిది రోజులలోను అచట యపారమైన యన్నదానము జరుగుచుండును. ఆ దేవిని ప్రార్థించినంతనే ఎట్టి కార్యములైనను సఫలమగుచుండుట ప్రత్యక్ష నిదర్శనము.

రాయవరం గ్రామములో ముళ్ళపూడి గంగరాజు, సూరమ్మ అను పుణ్యదంపతులుగలరు. వారిద్దఱును 1924 సం॥రమునుండి మహర్షికి శిష్యులై పరమభక్తితో కాలము గడుపుచుండిరి. 1930 సం॥రములో సూరమ్మగారికి జబ్బుచేసి ప్రమాదస్థితిలోనికి మారెను. అపుడు గంగరాజు గారు మహేంద్రవాడ వచ్చి గురుపీఠముననున్న దేవికి కుంకుమపూజ చేయించెదనని మ్రొక్కుకొనిరి. గురుపత్నియగు బావనాఅంబగారు కూడ ఎత్తెడు కుంకుమతో పూజ చేయించెదనని మ్రొక్కిరి. ప్రాచీన మహర్షుల సంప్రదాయము ననుసరించి అర్చింపబడుచున్న శ్రీ రాజ రాజేశ్వరీదేవి భక్తులను సర్వకాల సర్వావస్థలయందును కాపాడుచుండును. గంగరాజు గారు వెంటనే దేవికి కుంకుమ పూజ చేయించుకొనిరి. సూరమ్మగారికి త్వరలోనే సంపూర్ణారోగ్యము కల్గెను. అప్పటినుండియు గంగరాజుగారు ప్రతి శుక్రవారము రోజునను గురుపీఠమందలి దేవికి కుంకుమపూజలు చేయించుకొనుచుందురు.

రాయవరం గ్రామములోనే డాక్టరు గాది చలమయ్య - సుభద్రమ్మ అను దంపతులుండిరి. వారుగూడ మమర్షికి శిష్యులై యుండి మధ్యాహ్న సమయములందు మహేంద్రవాడవెళ్ళి గురుబోధ వినుచుందురు. దేవీ నవరాత్రములలో జరుగు పూజలు, ప్రత్యక్ష మహిమలు గాంచి ఒక దేవీ విగ్రహము చేయించి గురుపీఠమునందుంచిన జన్మ సార్థకమగునని సుభద్రమ్మగారికి సంకల్పము కల్గెను. తమ సంకల్పమును గురుదంపతులకు ఆమె విన్నవించుకొనెను. కాని ఆ దేవీ విగ్రహ స్వరూపము లెట్లుండవలెనో తెలియక ముళ్ళపూడి గంగరాజుగారి భార్యయగు సూరమ్మగారితో సుభద్రమ్మగారు చెప్పిరి. సూరమ్మగారి జన్మ స్థలము జేగురుపాడు. అచట దేవతా విగ్రహములు చేయు శిల్పులుగలరు. అందుచే సూరమ్మగారు జేగురుపాడునుండి యొక శిల్పిని తీసికొనివచ్చి గురుదేవులతో ఆలోచించి

విగ్రహము చేయించిరి. ఆ దేవీ విగ్రహము చతుర్భుజములతో విరాజిల్లు చుండెను. శిరోభాగమున కిరీటము గలదు. ఒక కుడి హస్తమున గండ్ర గొడ్డలియు, ఒక కుడి హస్తమున బాణమును గలవు. ఒక వామహస్తమున అంకుశమును, మఱియొక వామహస్తమున ధనుస్సును గలవు. భాద్రపద బహుళ అమావాస్యనాటికి ఆ విగ్రహమును తయారుచేసి శిల్పి తెచ్చి యిచ్చెను.

నూతన వస్త్రములు అలంకరించి నూతన విగ్రహమును గురు పీఠమున నుంచిరి. హనుమత్సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న సకల దేవతా పరివార సహితుడగు శ్రీరామచంద్రు నుద్దేశించి గురువర్యులు పూజలో ప్రవేశించినపుడు దేవతలందఱును ప్రత్యక్షముగా నచటకు వచ్చియుందురు. ఆ మూర్తులు ఎదుట చైతన్య రూపములతో సాక్షాత్కరించినగాని గురువర్యులు పూజచేయనే చేయరు. అంతట పూర్వపు రోజు నుండియు ఆ విగ్రహమునకు ఏమి పేరు పెట్టవలెనా? అని గురుపత్ని బావనాంబగారు ఆలోచించుచుండిరి. అపుడు మహర్షి పుత్రికయగు సత్యవతికి దేవి ఆవేశించి "నేను భద్రకాళిని భోజన ప్రియురాలను భద్రమైన కాళిని సుమా" అని హెచ్చరించెను. అప్పటినుండియు సుభద్రమ్మ అను భక్తురాలిచే సమర్పింపబడిన యా దేవికి భద్రకాళియని పేరుపెట్టిరి. భద్రమనగా క్షేమము శుద్ధ నిర్గుణ పరబ్రహ్మమునకు భద్రమను సంజ్ఞ గలదు. మహర్షులవారు గావించు దేవ్యుపాసనగూడ బ్రహ్మవిద్యయే కావున ఆ దేవి భద్రకాళి యనిపించుకొనెను. గురువర్యులు నిరంతర పరబ్రహ్మోపాసనా మహిమా న్వితులు. వారు శిష్యులకు బోధించునదిగూడ బ్రహ్మవిద్యయే. విగ్రహము సమర్పించిన భక్తురాలు సుభద్రమ్మ కావున ఆ దేవి భద్రకాళీ రూపమున గురుపీఠముపై వెలసెను. "భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః" అని వేదము భద్రశబ్దము పరబ్రహ్మ ప్రతిపాదకము. కావున దేవికి భద్రకాళీ నామకరణము సముచితము.

# మహర్షి దివ్యశక్తి

పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలో చేరిన దువ్వగ్రామములో మునుకుట్ల సీతారామయ్య అను భక్తుడుండెను. ఆయన మహర్షి శిష్యకోటిలోనివారు. ఆ భక్తుడు "నగురో రధికం నగురోరధికం" అను నామమును స్మరించుచు ఆనంద భాష్ప పులకిత గద్గద భాష్పములతో సంచరించుచుండును.

1942 సం॥రములో సీతారామయ్యగారు తన మేనల్లుని వివాహమునకు భీమవరం తాలూకాలోని కోలమూరు గ్రామము కుటుంబ సహితముగా వెళ్ళిరి. వివాహము జరిగిన మరునాడు మధ్యాహ్నము గం 12-0 లకు జరిగిన యద్భుతమేమనగా బంధువులైన స్త్రీ పురుషులందఱును సుమారు రెండు వందలమంది భోజనములు చేయుటకు కూర్చుండి యుండిరి. సీతారామయ్యగారి బావమఱిదియగు వారణాసి బాపయ్య సిద్ధాంతిగారును, సీతారామయ్యగారును ఒక చోటనే భోజనమునకు గూర్చుండియుండిరి. పెండ్లి కుమారునికి తమ్ముడును, సాతారామయ్యగారికి రెండవ మేనల్లుడును అగు శేషయ్య పండ్రెండేండ్ల బాలుడు సీతారామయ్యగారి ప్రక్కనే కూర్చుండి యుండెను. వడ్డన పూర్తియై అందఱును భుజించుటకు సిద్ధముగా నుండిరి. అపుడు శేషయ్య అను బాలుడు లేచి నిలబడి వీరావేశముతో "నేను రెడ్డివెంకట సుబ్రహ్మణ్యమును సుమా" యని గంభీరముగా పలుకజొచ్చెను. 12 ఏండ్లు యీడుగల శేషయ్య యను 18 ఏండ్ల యీడు గల మహాలక్ష్మియను భార్యాభర్తల వలె విచిత్రముగా సంభాషించుకొనసాగిరి. ఆ వింత చూచి అందఱును భోజనములుమాని యచట గుమిగూడి చూచుచుండిరి. అపుడు వారిద్దఱిని సీతారామయ్యగారు

ఒక విజన ప్రదేశమునకు తీసికొనివెళ్ళి ఆనంద భాష్ప పులకాంకిత గద్గద కంఠముతో ప్రార్థింప మొదలిడిరి. కొంత సేపటికి ఆవేశము తగ్గి నిద్రావస్థ చెందినట్లు తన్మయత్వము నందిరి. వారిద్దఱును అంతకు పూర్వము మహేంద్రవాడ వెళ్ళుటగాని, గురు దంపతులను జూచుటగాని, ఎఱుగరు. అయినప్పటికిని మహర్షులవారు తమ భగవదంశమును లోకమునకు వెల్లడి చేయుటకై ఆ నాడా రీతిగా తమ లీలలను భక్తులకు చూపి యుండిరి.

# ప్రమాదకరమైన జబ్బు స్థితిలో మహర్షి సమాధి నిష్ఠ

భగవంతుడు మానవ రూపము నంగీకరించినపుడు బాల్యము, కౌమారము, యౌవనము, వార్ధ్యము, కష్టము, సుఖము, ఆరోగ్యము, అనారోగ్యము, అను లక్షణములు గూడ అనుభవించక తప్పదు. గురువర్యులు మహేంద్రవాడలో స్థిరనివాస మేర్పఱచుకొని యుండిన తర్వాత క్రీ.శ 1915 (రాక్షస) సం॥రములో కొంచెము ఆరోగ్యము చెడిపోయెను. కపిలేశ్వర పురములో సుసర్ల వెంకటసుబ్బమ్మ అను నొక భక్తురాలు మహర్షి శిష్యురాలైయుండెను. గురుదేవుని యనారోగ్య స్థితి తెలిసి వెంకట సుబ్బమ్మగారు కపిలేశ్వరపురమునుండి మహేంద్రవాడ వెళ్ళిరి. కపిలేశ్వరపురములో నొక వైద్యుడు గలడు. అందుచే వైద్యము నిమిత్తము గురుదేవుని వెంటబెట్టుకొని వెంకటసుబ్బమ్మగారు కపిలేశ్వరపురము చేరిరి. అచట చేరినతర్వాత గురువర్యుల యారోగ్యము పూర్తిగా చెడిపోయెను. కపిలేశ్వరపురం జమీందారు వారి ఠాణాలో గుమాస్తాగా నుండినట్టియు మహర్షి శిష్యుడునునగు ఉప్పులూరి

పుల్లయ్యగారు గురుదేవుని యనారోగ్య స్థితిని జూచి యా విషయమును పామఱ్ఱులోనున్న మహర్షి సోదరులకు వర్తమానమంపిరి. అప్పుడు మహర్షి సోదరులైన వెంకప్పగారును, చిననారాయణగారును బయలుదేరి కపిలేశ్వరపురం వెళ్ళిరి. అప్పటికి వ్యాధి తీవ్రరూపము దాల్చెను. అందుచే నొక మేనాపై గురుదేవుని పామఱ్ఱు తీసికొని వెళ్ళిరి. గురువర్యుల యనారోగ్య స్థితి తెలిసి మహేంద్రవాడనుండి గురుపత్నియగు బావనాంబగారును, దువ్వనుండి మునుకుట్ల వీరయ్యగారును, అన్నదేవరపేట నుండి లింగాల బంగారమ్మగారును, దంగేరు నుండి కూచి బ్రహ్మయ్య, కూచి సత్యనారాయణ శాస్త్రిగార్లును, కూళ్ళ నుండి చిట్టూరి శేషగిరిరావు, చిట్టూరి రామయ్య, చిట్టూరి బాపయ్య, దేవరకొండ సూరయ్య అను శిష్యులును పామఱ్ఱు వచ్చియుండిరి.

అప్పటికి గురుస్వామి దేహస్మృతి తెలియని స్థితిలో నుండిరి. పామఱ్ఱులో పెద్దింటి జగన్నాథాచార్యులు అనుపేరుగల యాయుర్వేద వైద్యులుండిరి. ఆయనగూడ చిరకాలము నుండి మహర్షికి శిష్యులై యుండిరి. ఆయన వచ్చి గురుదేవుని హస్తనాడీ పరీక్ష చేసి కొద్ది రోజులలో వ్యాధి ముదురును. మిగుల జాగ్రత్తగా నుండుడని శ్రీవారి బంధువులకు చెప్పి వెళ్ళిపోయిరి. అట్లే కొద్దిరోజులకే వ్యాధి తీవ్రరూపము దాల్చెను. జీవితాశలేని స్థితికి మారెను. శిష్యులందఱును గురుదేవుని పాదపద్మములను శిరస్సున జేర్చుకొని కండ్లకద్దుకొని ఆవలికి వెళ్ళి విచార సముద్రములో మునుగుచుండిరి. శరీరమంతయును చల్లబడి పోయెను. నాడీ చలనము కొంచమైనను లేకుండెను. రెప్పపాటులేక తదేకనిష్ఠగా గురుదేవులు చూచుచుండిరి. జబ్బు చేయునను విషయము ఆరు మాసములకు ముందే గురువర్యులకు గోచరించెను. అందుచే ఆత్మ బాణమును పరిపూర్ణాచల బ్రహ్మలక్ష్యముపై సంధించి బ్రహ్మయాత్రకు సంసిద్ధులై యుండిరి. చేతిలోని

జపమాల తిరుగుచునే యుండెను. అపుడు గురుదేవుని ముఖారవిందము నుండి కీర్తన రూపమైన బ్రహ్మ విద్యా వాహిని బయలుదేరెను.

## అసావేరిరాగం - కీర్తన.

బ్రహ్మయాత్రకు నేడు పయనము గనుక ఓ ప్రజలారా దయయుంచుడీ
॥ పల్లవి ॥

1. కర్మయుగ్మ భ్రాంతి రహిత జ్ఞానులతో కలసి మెలసి
నిర్మలాక్షపురములో నతినిర్వికారపు త్రోవ బట్టియు ॥ బ్రహ్మ ॥

2. ప్రణవనాదములెల్ల - పరికించి యందులో
ప్రభలెల్ల వీక్షింపుచున్ అణు మమత్తులతోడ
వెలిగెడి యాత్మకళలను ప్రాపు గొనుచును
మనము లయమును జెందియుండెడు మార్గమును విడువకను
నడచియు ॥ బ్రహ్మ॥

3. లోకజాలములెల్ల లోనే సృష్టించి నా
లోనే మోదము నొందుచున్
ఆకృతులన్నింటికి నీయాత్మ శేషించెనని గని
రాకపోకలు శూన్యమైన రాజవీధినిబట్టి శుద్ధ ॥ బ్రహ్మ ॥

4. సదసత్తులకుపైని సారమై మిగిలిన
స్వానుభూతిన్ జెందుచున్
పదవులు మూడింటిపైని బయలు రీతిని బరగుచుండెడు
మదమడంచిన యోగులకు సమ్మతమునై భాసిల్లు చుండెడు
॥బ్రహ్మ॥

5. ఆరు పువ్వులయందు అజపమంత్రార్థము
హంసభావము చెందుచున్

తీరముల మూడింటిపైన తేజరిల్లెడు పరమహంసను

చేరి గురుగుహయందు జేర్చి చిత్స్వరూపాబ్ధిని తరించి ॥బ్రహ్మ॥

6. పరమ పావనమైన బయలందు చిత్తము

పట్టు చెదరక నిల్పుచున్

గురుడొసంగిన పరమమంత్రము గోప్యముగ లోనుంచి

యెన్నడు మరువకను దలచేటి వారలు

మగిడిజన్మలు చూడనట్టి ॥బ్రహ్మ॥

7. బాగుగరెడ్డి సుబ్రహ్మణ్య వరదుడౌ

పాపయార్యుల జేరినన్

రాగ విరహితులైన మునులకు

లక్ష్యమునకు దోచుచుండెడు

ఆగమాంత వాక్యములచే అనుదినమునుతియింపబడ్డ ॥బ్రహ్మ॥

ఇంకను హస్తమందు నాడీ చలనము కలుగలేదు. ఆ సమయమందే నిరాలంబములో శ్రీరాముడు బంగారుటుయ్యేలలో ఠీవిగా నూగుచు దర్శనమిచ్చి ఆనంద పెట్టుచుండెన. ఆ విషయము బాహ్యామునకు కొంచెమైనను తెలియకుండెను. మహర్షులవారు రెప్పవేయక సమాధిలో నుండి ఉయ్యేలలో నూగు చుండిన బాల రామచంద్రుని దర్శించు చుండిరి. ఆ సమయమున గురుదేవుని ముఖమునుండి ఒక కీర్తన బయలుదేరెను.

ఊగుచున్న బాల రామచంద్రుని జోలపాడుచు నీ విధముగా స్తుతించిరి.

## జోలపాట

డోలనూచరమ్మా శ్రీరామమూర్తిని

జోలపాడరమ్మ ॥ పల్లవి॥

1. డోలనూచుచు మోదమలరగ
జోలలు పాడుచు నిదురను
మేలుకొన్న తరణి గోవుల
పాలుపట్టించుచు తరుణులు ॥ డోలనూచ ॥

2. విష్ణువును దా బోలును
ఈ బాలు డఖిల శిష్టులను రక్షించును
దుష్టులైన రావణాదుల దోర్బలం బడగించిలంకా
పట్టణంబా యనుజునకును
పరమదయ నిచ్చేటివాడని ॥ డోల ॥

3. పోరు పెట్ట నీయక
నిదురించువరకును నూచుటలలు నెడమీయక
ధీరతతో మీరెల్ల గూడి దివ్య పురుషుని గీతములచే
సారసాక్షముకుంద కృష్ణ జలజనాభ హరేయటంచును ॥డోల ॥

5. అద్రి జానుత పాదుడు
ఇతడేరు పాల సముద్ర జాతాత్మేశుడు
భద్రుడు తన శిరమునందున
భద్రముగ నివసింప గోరిన
భద్రవరములు నతని కిచ్చియు
భద్రగిరియం దుండువాడని ॥ డోల ॥

6. పరమ హంసాధీశుడు
ఇతడేను కారణగురువులకు స్వాధీనుడు
పరమహంసాధీశుడగుచును పరమహంసల బ్రోచువాడై
పరమ సూక్ష్మ ద్వారమున సు
ప్రభలు గ్రక్కి వెలుంగువాడని ॥డోల ॥

7. చిన్మ యాత్మాకారుడు
ఇతడేను మతి హైరణ్య కోశాధీశుడు
చిన్మయాత్మాకారుడై హైరణ్యకోశమునందు వెల్గుచు
ఉన్మనీ భావమునుజెంది మనోన్మనిచే రాణించు దొరయని ॥ డోల॥

8. భద్రమనుచును పాడుడీ
ఇతనికి మాయానిద్ర లేదని తెలియుడీ
భద్రశైలమునందు యోగ నిద్రుడై జాగ్రత్త చేచి
న్మద్రభావము వాయుసుతునకు మొదమునను బోధించు గురుడని
॥డోల॥

9. సృష్టికాదియందున
సృజనేమిలేకను బట్టబయలై యుండినన్
కృష్ణుడనియెడు విష్ణుడు రోచిష్ణుడై అందుద్భవించి
నట్టి హేతువుచేత గురువులపట్టి తెలిసెడి నరముడితడని ॥ డోల॥

10. దేశికుల కృపచేతను
శ్రీరెడ్డి సుబ్బయదాసు డరమరలేకను
బాసురంబుగ జేసినట్టి భద్రకవితను చదివి విన్నను
దోషములు హరియించి తుదనీ
తోయజాక్షుని బొందు నిజనమని ॥ డోల ॥

అప్పటికి గూడ గురువర్యులకు దేహస్మృతి కలుగలేదు. నాడీ సంచలనము అసలే కలుగలేదు. మహర్షి శిష్యులైన కూచి బ్రహ్మయ్యగారా కీర్తనలు వెంటనే వ్రాసిరి. మహేంద్ర వాడనుండి తాడి అప్పన్న, గొలుగుల వెంకట సుబ్బన్న, మొదలగువారు గురువర్యుల చెంతనే యుండిరి. శరీరములో చలనము లేకుండుట చూచి పెద్దింటి వెంకటాచార్యులుగారు

మూడు తులముల కర్పూరము ఆముదములో కలిపి పోయించిరి. ఆరాత్రి 12 గంటలకు కొంచెము సుగుణము కాన్పించెను. మరల రెండు తులముల కర్పూరము పోయించిరి. అప్పటినుండి క్రమముగా ఆరోగ్యము కలుగజొచ్చెను. మహర్షి తపోనిష్టకును, అట్టి ప్రమాదస్థితిలో అనర్గళమైన కవిత్వము బయలు దేరుటకును అందఱును అత్యాశ్చర్య చకితులై యీ గురువర్యులు సామాన్య మానవులు కారని వేనోళ్ళ చెప్పుకొనసాగిరి. ఆరోగ్యముగా నున్నపుడును అనారోగ్యముగా నున్నపుడును, సర్వకాల సర్వావస్థలయయందును గురువర్యులు సమాధినిష్ఠలో నుందురని పై విషయమల వలన దెలియుచున్నది.

# శ్రీ గురుచక్రవర్తి దివ్యలీలా తరంగిణి

## మహర్షి యొడిలోని కాకిదొండపండ్లు శ్రీరాముడు భుజించుట :-

కII దళమైఁ బుష్పమైనను
ఫలమైనను సలిలమైనఁ - బాయనిభక్తిన్
గొలిచిన జనులర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె - యేను భుజింతున్
(భాగవII 10 స్కం 1010 వ)

భగవంతుడు భక్తులకనేక లీలలు చూపుచుండును. శ్రీగురుచక్రవర్తి ఒకప్పుడు రాజమండ్రీ వెళ్ళిరి. అచట శ్రీ విశ్వనాధావధూత స్వామివారు తమ శిష్యుని జూచి “నాయనా! నీతో మాట్లాడవలసిన విషయములు గలవు. నేను చెప్పిన రోజుకు ఏలూరువచ్చి నన్ను కలిసికొనుము” అని ఆజ్ఞాపించిరి.

ఇది జరిగిన కొన్ని రోజులకు సుబ్రహ్మణ్య స్వామి అవధూత చక్రవర్తిని దర్శించుటకు పామర్రునుండి ఏలూరు బయలుదేరిరి. ఆ కాలమున రోడ్లుగాని ప్రయాణ సౌకర్యములుగాని లేకుండెను. క్రీ.శ. 1857 నాటికి ధవిళేశ్వరం ఆనకట్ట నిర్మాణము పూర్తియై కాలువలు త్రవ్వబడియుండెను.

కాని వేసవికాలమగుటచే కాలువలు కట్టివేయబడియుండెను. మండువేసవి కాలము. అట్టి వేసవి కాలములో పామర్రు నుండి కాలినడకను బయలుదేరి రాత్రికి ధవిళేశ్వరము చేరిరి. ఆ రాత్రి యచట విశ్రమించి వేకువజాముననే లేచి గోదావరిలో స్నానము చేసి ఆనకట్టపై గూర్చుండి సంధ్యావందనాది నిత్యకృత్యములు నెరవేర్చుకొనుసరికి ఉదయము ఎనిమిది గంటల ప్రొద్దెక్కెను. అచటి నుండి బయలుదేరి విర్శ్వేశ్వరమునకును ఏలూరునకును సుమారు నలుబది మైళ్ళ దూరము గలదు. మార్గమధ్యమున త్రాగుటకు మంచినీరైనను దొరకకుండెను. కాలినడకనే ప్రయాణము సాగించుచుండిరి. ఇట్లు గమన వేగమున ప్రయాణము చేయుచు మధ్యాహ్నము 12 గంటలగుసరికి తాడేపల్లిగూడెం చేరిరి. అచటనొక బ్రాహ్మణోత్తముడు మహర్షిని జూచి “అయ్యా! మండు వేసవికాలము; త్రాగుటకు నీరుగూడ దొరకుటలేదు. కనుక మా యింట భుజించి కొంచెము సేపు విశ్రమించి వెళ్ళుడు” అని కోరెను. మహర్షి మనస్సు అవధూత స్వామి వారియందు లగ్నమై యుండుటచే ఆ బ్రాహ్మణునిమాట త్రోసిపుచ్చి కాలువగట్టుదారినే కాలినడకను ప్రయాణము సాగించు చుండిరి. ఎండవేడిమికి నోరెండి పోకుండునట్లు చింతాకు మాత్రము బుగ్గనుంచుకొని ప్రయాణము సాగించుచుండిరి. ఏలూరు సమీపమునకు జేరునప్పటికి మధ్యాహ్నము నాల్గు గంటలయ్యెను. అప్పటికి రైల్వేలైను రాలేదు.

అచటి ప్రదేశములన్నియు మహారణ్యములతో నిండి యుండెను. అచటికి చేరునప్పటికి ఆకలి దప్పికలు కొంచెము హెచ్చెను. అందుచే

అచటనొక డొంకపై నెట్టిగా పండిన కాకిదొండపండ్లు కాన్పించెను. శ్రీ మహర్షులవారు కాకి దొండపండ్లు ఒడినిండ గోసికొని ఒక చెట్టునీడను చేరి కూర్చుండి యుండిరి. ఏది భుజించినను శ్రీరామ చంద్రునికి నైవేద్యము పెట్టనిదే గురువర్యులు భుజించరు. అందుచే శ్రీరామచంద్ర ప్రభువునకు మానసికార్చనము చేసి నైవేద్యము పెట్టుటకుపక్రమించిరి. క్షుధార్తుడైయున్న తన భక్తుని రక్షించుటకు శ్రీరామచంద్రుడు ఎనిమిదేండ్ల ప్రాయమువాడై పరమదయార్ద్ర హృదయుడై, పరమశాంతుడై భక్త పరాధీనుడై యెదుట సాక్షాత్కరించెను. అపుడు శ్రీ రామచంద్రుని దేమము నీల మేఘచ్ఛాయ కాంతితో నిగనిగలాడుచుండెను. మెడలో రత్నహారములు గలవు. శిరస్సునందలి కిరీటముపై నెమలి పింఛము చల్లగాలికి కదలుచుండెను. చిఱునవ్వు ముఖచంద్రుని కొక వింతకాంతిని గల్గించుచుండెను. తళతళలాడు పీతాంబరము ధరించి యుండెను. ఆ దేవదేవుడు అరణ్య ప్రదేశమందలి యొక మూలనుండి వచ్చి మహర్షి యొడిలో నున్న కాకిదొండపండ్లు సగముతిని త్రేన్చుచు తాము వచ్చినదారినే వెళు&ళచు అదృశ్యుడై పోయెను. ఒడిలో మిగిలిన శ్రీరామ ప్రసాదమును తినుచు రామరూప సౌందర్య విశేషములచే గల్గిన యానంద బాష్పములలో స్నానము చేసిరి. అంతటితో మహరి&ష బడలిక పోవుటయేగాక నూతనోత్సాహము కల్గెను. అచటినుండి ఏలూరు వెళ్ళి అవధూత స్వామిని సేవించి తిరిగి పామర్రు చేరిరి.

అది జరిగిన కొలదిరోజులకు మహర్షి దంపతులు కోటిఫలి క్షేత్రమున కేగిరి. అచటగల ఛాయా సోమేశ్వరస్వామిని దర్శించినంతనే వారి ముఖారవిందమునుండి శివస్తుతి యీ రీతిగా బయలు వెడలెను.

పల్లవి ॥ శతలక్షఫలి సోమనాధా – నీ సేవకుడు ననుబ్రోవరాదా ॥

1. శతలక్షఫలిని నీ సేవకుల నందటిని । సతతంబు బ్రోచు

చును సన్నిధికి జేర్తువట ॥ శతలక్ష ॥

2. నిను దక్క నిరతంబులెన్న । నాకు నీ వెగతి రక్షించు

మన్న । కన్న తండ్రివలె కరుణతో రక్షించు ॥

....

28.మండలంబులు మూడు దాటి । ఊర్ధ్వ కుండలిని కొన

గోటమీటి । దండిగా వీక్షించు తత్త్వవేత్తలలోన ।

పండు వెన్నెల రీతి పరికింప గనుపించు ॥ శతలక్ష ॥

...

31. సర్వ సమభావమును జెంది । నీవు సర్వరూపములను

బొంది । సర్వ సమభావమున సర్వేశ్వరుండవై ।నిర్వాణ

పథమందు నిల్చియున్నట్టి శ్రీ ॥ శతలక్ష ॥

కోటిఫలి అనుపదమునకు శతలక్షఫలి అని ప్రయోగించి ముప్పదియొక్క చరణముల కీర్తనను ఆశువుగా చెప్పిరి. కొన్ని చరణములు మాత్రమే యిచట నుదాహరింపబడినవి.

మఱియొకప్పుడు తూ.గో. జిల్లా కపిలేశ్వరపురము వెళ్ళిరి. అచట అగస్త్యేశ్వరస్వామి దేవాలయము గలదు. ఆ దేవుని జూచినంతనే గురువర్యుల ముఖమునుండి శివస్తుతి సంబంధమగు పద్యములు వెలువడెను.

మ ॥ శ్రీకరంబుగఁ బాపయార్యులఁ – జిత్తమందున నిల్పుచునఁ

బ్రాకటంబుగ విశ్వనాథుని – భక్తితో మది నెంచెదనఁ

ఏకలంకము లేక వెల్గెడి – యీశ్వరా ! పరమేశ్వరా!

నీకు నంకిత మాచరింతును – నీలకంఠ నమో....స్తుతే ॥

మ॥ భూత నాథుడవటంచు ఖ్యాతినిఁ – బూనవే పరమాత్మవై

భూత పంచకమందు వెల్గివిభూతి – ధారుఁడవైతివా :

పాతకాళినిఁ ద్రుంపలెస్సగ – ఫాలనేత్రుడవైతివా !

ధాతృపూజితపాద ! శంకర దాసవంద్య నమో...స్తుతే ॥

మ॥ పంచవర్ణములందు వెల్గుచుఁ – బాలకాగ్రణి వైతివా !

పంచభూతములందు వెల్గుచుఁ బంచువక్త్రుడవైతివా

సంచితాఘములెల్లఁ ద్రుంచెడి – సాక్షియును నీవేకదా

సంచకాంతులతోడ వెల్గెడి – ఫాలనేత్ర నమో...స్తుతే ॥

మ॥ పంచముద్రలయందు నీవును – బాగుగా నెలకొంటివా

పంచభూతము లంటకెప్పుడు – బాగుగా నెలకొంటివా

పంచవక్త్రము లంది వెల్గెడి – భావజాంతకు డంటికిన్

పంచపంచక శేషమూర్తివి – ఫాలనేత్ర నమో...స్తుతే ॥

మ॥ మూడు వేళలయందు నీకును – ముఖ్య పూజలఁ జేసినన్

మూడు నాడులయందు యోగము – ముక్తి కేయని చేసినన్

బాడిపంటలు కీర్తి సంపద – భక్తి ముక్తుల నిచ్చుచున్

బాడు సంస్కృతిఁ జేరనీయవు – భక్త పోష నమో...స్తుతే ॥

(మహర్షి విరచిత శివతారావళినుండి )

# శ్రీరాముడు శునక రూపమున సాక్షాత్కరించుట.

శ్లో ॥ విద్యా వినయ సంపన్నే । బ్రాహ్మణేగవిహస్తిని
శునిచైవ స్వపాకేచ । పండితాస్సమదర్శినః

భగవద్గీత.

విద్యా వినయ సంపన్నుడైన బ్రాహ్మణునియందును. గోవునందును, ఏనుగునందును, కుక్కయందును, కుక్క మాంసము తినువానియందును భగవంతుని జూచువారు పండితులు. ఈ లక్షణమే మహర్షులవారి యెడల సార్థకమై యెప్పును.

క్రీ॥శ॥ 1905 సం॥ రమునకు పూర్వము గురుకుటుంబమువారు పామఱ్రులో నివసించుచుండిరి. ఒక పుణ్యదినమున గురుదంపతులు గోదావరికి స్నానమునకై పామఱ్రునుండి బయలుదేరిరి. కోటిఫలి ॥ సమీపమున మసకపల్లి గలదు. అచట గోదావరిలో శ్రీరామ పాదక్షేత్రము గలదు. అందుచే గురుదంపతులు మసకపల్లి వెళ్లుచుండిరి. ఆ దంపతులిద్దఱును శ్రీరామ భక్తులగుటచే రామసంబంధమైన కథలు చెప్పుకొనుచు కాలి నడకను వెళ్ళుచుండిరి. కొంత దూరము వెళ్ళు సరికి ఆ పుణ్య దంపతులనొక కుక్క వెంబడించెను. దాని శరీరమంతయును క్షీరాబ్ది పట్టు తాపితా రంగువలె ధవళివర్ణముతో నిగనిగలాడుచుండెను. దానికి పెద్ద కుచ్చుతోక కలదు. దాని సౌందర్యము వర్ణింప శక్యముగాకుండెను. మార్గమధ్యమున గురుదంపతులాగినపుడు ఆ కుక్క గూడ ఆగుచు వారు నడక ప్రారంభించినపుడు వెంటనడచుచుండెను.

వారు రామపాద క్షేత్రమునకు వెళ్ళి గోదావరిలో స్నానము చేయుచుండిరి. అపుడా కుక్కగూడ గోదావరిలో దిగి యా మునిదంపతుల చుట్టును ముమ్మారు ప్రదక్షిణముచేసి స్నానముచేసి యిసుకలో దొర్లి నీటియొడ్డున నిరీక్షించి యుండెను. గురువర్యులు మాత్రము స్నానము చేసి ముందుగా గట్టెక్కిరి. గురుపత్ని బాపనాంబగారు తడిచీర విడిచి మఱియొకచీర ధరించు వఱకును ఆ కుక్క ఆమె యెదుటనే నిరీక్షించియుండెను. పిమ్మట గురుదంపతులు బయలుదేరి మసకపల్లి వెళ్ళిరి.

అచట కట్టా లక్ష్మయ్య అను పేరుగల లాకు సూపరెంటెండెంటుగారు గలరు. చాలకాలమునుండి గురుదేవుని ప్రభావము వినియుండుటచేత ఆ లక్ష్మయ్యగారు గురువర్యుల చెంతకు వచ్చి "స్వామీ ! తాము ఇచ్చట భోజనములు చేయుడు తగిన సదుపాయములు ఏర్పాటు చేసెదను. మీ రిచట భుజించి మిమ్ములను తరింపజేయుడు" అని ప్రార్థించెను. అందుచే గురు దంపతులా లక్ష్మయ్యగారి కోరికను అంగీకరించిరి. లక్ష్మయ్యగారు భక్తి పారవశ్యమున భోజన సామాగ్రి బాపనాంబారికి సమర్పించిరి. బాపనాంబగారు ఒక గదిలో వంటచేయుచుండిరి. గురువర్యులు ఒక గదిలో గూర్చుండి తపస్సు చేసికొనుచుండిరి. ఆ కుక్క ఆ గదిముందుకు వచ్చి సాగిలబడి మ్రొక్కుచున్నట్లు ముందు కాళ్ళుచాచి తదేకదీక్షతో గురువర్యులను జూచుచుండెను. కొంతసేపటికి వంట పూర్తియయ్యెను. అపుడు గురుస్వామి దేవతా నివేదనము చేసి ముందుగా కుక్క రూపముతో వచ్చిన శ్రీరామచంద్రునికి పాయసము పిండివంటలు మొదలగువానితో భోజనము పెట్టిరి.

"సర్వభూత నివాసోసి వాసుదేవ నమో...స్తుతే"

(సర్వ భూతములయందును నివసించునో వాసుదేవా! నీకు

నమస్కారము.)

అని శ్రీ మహర్షులవారి భావన. అందుచే శ్రీరాముడా రోజున కుక్క రూపముగా వచ్చెను. పెట్టిన పదార్థములన్నియు కుక్క పూర్తిగా భుజించి ఆ యాకును నోటితో కఱచి యావల పారవైచి సమీపమందున్న కాలువ దగ్గరకు వెళ్ళి తనమూతిని నీటిలో జాడించి మరల గురుస్వామి గదియెదుటకివచ్చి వెనుక కాళ్ళపై గూర్చుండి కొంత సేపైన తర్వాత చూచుచుండగనే అదృశ్యమయ్యెను. ఆ వినోదమంతయును మహర్షి పుంగవులు ప్రత్యక్షముగా చూచుచునే యుండిరి. అదిగాంచి "ఆహా! శ్రీరామచంద్రుడీనాడు మనలను బరీక్షించుటకు కుక్కరూపమున వచ్చినాడు" అని గురువర్యులు తమ పత్నితో బల్కిరి. భక్తుల హృదయమును బరీక్షించుటకు శ్రీరాముడనేక విధములుగా దర్శనమిచ్చుచుండును.

"శునిచైవశ్వపాకేచ పండితాస్సమ దర్శినః"

అను గీతా వాక్యమునకు అనుభూతి యిదియే.

పామర్రులో నున్న కాలములో గురువర్యులు ఏకాదశీ పర్వదినములలో నుపవసించుచుందురు. ఆ యేకాదశి రోజున గురువర్యులు జపించు ప్రదేశమునకు శ్రీరాముడు కుక్క రూపముతో వచ్చి నిరీక్షించి యుండును. జపము పూర్తియైన తర్వాత ఇంటిలోనివారు ఒక పళ్ళెమునిండ నివేదన పదార్థములుంచి గురువర్యుల గదిలో బెట్టి వెళ్ళిపోవుచుందురు. ప్రతిదినమును నివేదనము ఏకాంతముగానే జరుగుచుండును. ఏకాదశీ పర్వదినములలో కుక్క రూపముగా వచ్చిన రామునికి పళ్ళెములోనున్న భోజనమంతయును పెట్టి తాము గంధపు బొట్టు పెట్టుకొని భోజనము చేసినట్లుగానే కాలక్షేపము చేయుచుండిరి. తల్లిగారైన శేషాంబగారు పెట్టిన భోజన పదార్థమంతయును కుక్కకు పెట్టుచుండిరి. ఏకాదశీ

పర్వదినములయందున వసించుచు భోజనము కుక్కకు పెట్టుచు ఇంటిలోనివారికి తమ రహస్యములను తెలియనీయక పండ్రెండు సంవత్సరములు గడిపిరి.

1923 సం॥రములో కర్రి నారయ్యగారును, వారి ధర్మపత్ని చెల్లాయమ్మగారును గురువర్యులకు శిష్యులైయుండినట్లు తెల్పియున్నాను. ఆ పుణ్యదంపతులిద్దఱును గురువర్యులకు నిరంతర స ఏవ లొనర్చుటయేగాక శ్రీరామ పాదసేవా తత్పరులై యుండిరి. నమ్మిన భక్తులను సర్వదా కాపాడుచుండుటయే భగవంతుని ధర్మము. ఆ దంపతులకు బుల్లి వెంకయ్య అను కుమార్తెగలదు. ఆమెను పందలపోక నివాసులగు మల్లిడి గంగరాజుగారికిచ్చి వివాహము చేసిరి. కొంత కాలమునకు బుల్వి వెంకయ్య అనునామె గర్భవతి యయ్యెను. ప్రసవకాలము సమీపించెను. నొప్పులు ప్రారంభమై ఆమె బాధపడుచుండెను. అందుచే 14 జనవరి 1928 తేదీ రాత్రి నారయ్యగారు మహేంద్రవాడనుండి గురు మందిరమునకు వెళ్ళి గురువర్యులకును శ్రీరామ పీఠమునకును సాష్టాంగ దండ ప్రణామము లర్పించి తమ కుమార్తె ప్రసవ వేదనను గురువర్యులకు విన్నవించుకొనిరి. అపుడు గురువర్యులు మంత్రోదకమునిచ్చి ఆ జలమును పుచ్చుకొనినచో సుఖప్రసవమగునని నారయ్యగారిని సాగనంపిరి. భక్తజన రక్షాదక్షులగు శ్రీ గురువర్యులు ఆమె సుఖ ప్రసవమగునట్లు సీతారాములను ప్రారి&థంపసాగిరి. నారయ్యగారు తమ యింటికేగి మంత్రోదకము కుమార్తెకిచ్చి మంచముపై పరుండిరి. ఆయనకు నిద్రపట్టలేదు. తెల్లవారగట్ల గం. 4–0 లకు తమ కుమార్తెయగు బుల్లివెంకయ్య రూపముతో దేవి నారయ్యగారి మంచము దగ్గర నిలబడియుండెను. ఆ జగన్మాతను తిలకించి పులకించి స్నానము చేసి జపములో కూర్చుండిరి. 15 జనవరి 1928 తేదీ వుదయము గం 6–0 లకు జపములోనున్న నారయ్యగారికి

ఇరువైపులను రామలక్ష్మణులు ధనుర్ధరులై సర్వాలంకార శోభితులై దేదీప్యమానముగా ప్రకాశించుచు పరమశాంతరూపులై సాక్షాత్కరించిరి. ఆ యుదయము గం. 8 లకు ఆమె సుఖప్రసవమయ్యెను. సుపుత్రుడు కల్గెను.

ఉ॥ పాపములొందువేళ రణపన్నగ భూత భయజ్వరాదులం
దాపదనొందువేళ భరతాగ్రజమిమ్ము భజించువారికినఽ
ప్రాపుగనీవు తమ్ముడిరు పక్కియలంజని తద్విపత్తి సం
తాపము మాన్పి కాతువట - దాశరథీ । కరుణాపయోనిధీ ॥

అని రామదాసుగారు చెప్పిన భగవల్లక్షణమున కిదియొక ప్రబల నిదర్శనము. పురుటిశుద్ధి అయిన తర్వాత ఆ బాలునికి వీర్రాజు అని నామకరణము చేసిరి.

# శ్రీ షట్చక్ర సీతారామ తారక బ్రహ్మానంద ప్రధమ సప్తాహ యజ్ఞము.

## పామర్రు గ్రామములో

శ్రీ మహర్షులవారు తాము గావించిన శ్రీరామమంత్ర జపమునకు శాంతి గావించుటకై సంకల్పించుకొనిరి. క్రీ.శ.1905 సం॥ రములోనే గురుకుటుంబమువారు మహేంద్రవాడ మకాము మార్చుకొనిరి. కాని జన్మస్థల మగుటచేతను, శిష్యుల ప్రార్థనల చేతను అప్పుడప్పుడు పామర్రు వెళ్ళుచు వచ్చు చుండిరి. ఇట్లు కొంత కాలమైన తర్వాత పామర్రు

గ్రామములోని భక్తులకు శ్రీ గురుచక్రవర్తిచే శ్రీరామ సప్తాహమహోత్సవములు జరిపించవలెనను సంకల్పము కల్గెను. ఆంగీరసనామ సం॥ర వైశాఖ శుద్ధ సప్తమీ గురువారము (12-5-1932 తేదీ) ఉదయం సూర్యోదయాది ఘడియలు ....అప్పుడు పుష్యమీ నక్షత్రయుక్త మిధునలగ్నమందు శ్రీ షట్చక్ర సీతారామతారక బ్రహ్మానంద సప్తాహమహోత్సవము జరిపించుటకు దైవజ్ఞులచే ముహూర్తము నిశ్చయింపబడెను. సప్తాహము కొన్ని రోజులుండగా సీతా పరమేశ్వరి శ్రీ మహర్షి యెదుట సాక్షాత్కరించెను. ఆ దేవి తళతళలాడు పట్టుచీర ధరించి యుండెను. మెడలో ముత్యాల హారములు మెఱయుచుండెను. శిరస్సుపైన నవరత్న స్థగితమైన బంగారు కిరీటము తేజోమయమై ప్రకాశించుచుండెను. కిరీటము పైన గూడ ముత్యాల జాలరులు అలంకరింపబడెను. ఆ జగన్మాత మెడలోని మంగళ సూత్రము గురువర్యుల భుజమునకు తగిలెను. కొంతసేపటికి సీతా పరమేశ్వరి అదృశ్యురాలయ్యెను.

గురుదంపతులచే శ్రీరామసప్తాహము జరిపింపబడునన్న విషయము పామర్రు గ్రామములోనివారి కందఱికిని దెలిసెను. గ్రామములోని వారందఱును సర్వవిధముల శక్తిపంచన లేకుండగ పాటుపడుచుండిరి. ఆ గ్రామములో నొక పెద్ద చెరువును ఆ చెరువుగట్టున నొక పాఠశాలా భవనమును గలవు. అందుచే పెద్ద చెరువు ప్రక్క సప్తాహమందిరము తూర్పు ముఖముగా నిర్మింపబడెను. ఒక యకరము భూమిలో విశాలమైన పందిళ్ళు వేయబడెను. శ్రీరామ మందిరము ముత్యాల జాలరులతో అలంకరింపబడెను. సుముహూర్తమునకు శ్రీగురుదంపతులచే సప్తాహదీక్ష ప్రారంభింపబడెను. శ్రీ సీతారాముల పాదపద్మములను నిరంతరము హనుమంతుడు సేవించుచున్నట్లు శిష్యవర్యుడగు దేవరపల్లి శ్రీరాములుగారు గురుదంపతుల చెంతజేరి వారి యాజ్ఞకై నిరీక్షించుచుండిరి. గ్రామములోని

వారందఱును భక్తి పరవశులై శ్రీరామ సప్తాహ కార్యక్రమములో మునింగియుండిరి. విధి విధానముగా సప్తాహము ప్రారంభమయ్యెను.

1. రుద్రాభిషేకమునకు :- 1. రెడ్డి సుబ్రహ్మణ్యావధానులుగారు
2. పెదసనగంటి అప్పన్నగారు
3. దేవరభొట్ల సుబ్రహ్మణ్యంగారు.

2. సూర్యనమస్కారములకు :- చింతావిశ్వనాధావధానులుగారు.

3. వేదపారాయణలకు:- 1. దేవరభొట్ల సత్యనారాయణావధానులు గారు,
2. పిడపర్తి వీరావధానులుగారు.

4. శ్రీరామ తారకమంత్ర జపమునకు :-
1. దువ్వూరి వఝుల సోమయాజులుగారు,
2. అనిపెద్ది జగన్నాధశాస్త్రిగారు.

5. నవగ్రహజపమునకు :- కనకదండి కామేశ్వరిగారు

6. రామాయణ పారాయణమునకు :-
1. కూచి స త్యనారాయణశాస్త్రిగారు,
2. వింజమూరి సత్యనారాయణగారు.

7. భాగవత పారాయణమునకు :-శొంఠి కృష్ణమూర్తిశాస్త్రిగారు.

8. హనుమదుపాసనకు :- డొక్కా సోమనాధశాస్త్రిగారు.

9. భగవద్గీత పారాయణకు :- ఈమని పరదేశి శాస్త్రిగారు.

10. పూజలు చేయించుటకు :- గుడిమెట్ల సీతారామయ్యగారు మొత్తము 15 గురు ఋత్విక్కులు నియమింపబడిరి. నామ సంకీర్తనములకు

కాకరపర్తి బ్రాహ్మణులును ఇతర భక్తులును నియమింపబడిరి.

ఉదయము శ్రీరామ సహస్రనామార్చనలును, రాత్రి సహస్రనామము లతో కుంకుమ పూజలును జరుగుచుండెను. ఆ మహావైభవము చూచుటకు మహర్షి బంధువులును, మహర్షి శిష్యులును, వివిధ గ్రామములనుండి వచ్చియుండిరి. మహర్షి శిష్యులైన శ్రీరాంభట్ల అప్పన్నశాస్త్రిగారు పురాణ కాలక్షేపము చేయుచుండిరి. హరికథలు భజనలు నిర్విరామముగా జరుగుచుండెను.

సప్తాహములో రెండవరోజున పామర్రులోని రూరలఎ డిస్పెన్సరీ డాక్టరుగారైన శ్రీఆలమూరు సీతారామయ్యగారు తమ భార్యతో గూడి పుత్రకామేష్టి జరుపుకొనిరి. ఏకాదశి రోజున మహర్షి శిష్యులైన దేవరపల్లి శ్రీరాములుగారు తమ ధర్మపత్ని రత్తమ్మగారితో గూడవచ్చి సీతాకల్యాణము జరుపుకొనిరి. గురువర్యుల తపఃప్రభావముచే జనులు తండోపతండము లుగా వచ్చుచుండిరి. ఎనిమిది రోజులకును సరిపోవునని అంచనావేయ బడిన భోజనసామాగ్రి యంతయును రెండురోజులకే ఖర్చు అయిపోయెను. జనులు సముద్రపు కెరటములవలె తండోపతంధములుగా వచ్చుచుండిరి. రెండవనాటి రాత్రి గురువర్యులు దేవరపల్లి శ్రీరాములుగారిని పిలిచి “అబ్బాయీ! భోజనపదార మంతయు ఖర్చుపడిపోయినదే! ఇకముందు సంగతియేమని ప్రశ్నించిరి. అపుడు శ్రీరాములుగారు ఆనందబాష్ప పులకాంకిత దేహులై “స్వామీ! సంసారసుఖము శాశ్వతము కాదనియు, గురుసేవయే జన్మమెత్తినందులకు సార్ధకమైన సత్కార్యమనియు నిశ్చయించుకొంటిని. తాము విలువలేని మహాధనము మాకిచ్చియుండిరి. నాకు ధాన్యపు పురులు గలవు. ఈ గ్రామములో రెండు మిల్లులుగలవు.

నా సర్వస్వమును శ్రీరామార్పణముగా సమర్పించెదను. లోటు రానీయను” అని పరమభక్తితో విన్నవించిరి.

శ్రీరామచంద్ర ప్రభువు వారి మహిమా విశేషముచే మూడవనాటి యుదయమునకు వివిధ గ్రామములనుండి బియ్యము, కూరలు, ఆకులు మొదలగు భోజనపదార్థములు విరివిగా రా దొడగెను. అదిగాంచి గురువర్యుల తపో మహిమగాని వేరొకటిగాదని జనులు తమలో తాము చెప్పుకొనసాగిరి.

అయిదవ యేట నుండియే శ్రీరామచంద్రునితో స్వేచ్ఛా విహార మొనర్చుచుండిన సుబ్రహ్మణ్యమహర్షి సప్తాహ యజ్ఞమునకు లోటు కల్గునా! కాని భగవంతుడు భక్తుల హృదయములను పరీక్షించుటకు అనేక విచిత్రలీలలు గనబరచుచుండును. భక్తులు చేయు సత్కార్యములు చెడిపోవునంతటి విఘ్నములు గూడ భగవంతుడు కల్గించుచుండును. అప్పుడే భక్తుల హృదయము వెల్లడియగును. శ్రీరామచంద్రుడు భక్తులను పరీక్షింపదలచెను. ఏకాదశిరోజున విపరీతమైన వర్షము కురిసెను. ఏకాదశి పర్వదినమగుటచే చుట్టుప్రక్కల గ్రామములలోని జనులా సప్తాహ మహోత్సవమును జూచుటకై తీర్థ ప్రజలవలె వచ్చుచుండిరి. వంటచేయు ప్రదేశమంతయును జలమయమైపోయెను. శ్రీరామచంద్రునిచే గల్పింప బడిన దగుటచే ఉదయము ఎనిమిది గంటలగుసరికి వర్షమాగిపోయెను. వచ్చిన జనులందఱికిని భోజనములు ఎట్లు పెట్టగలము? వంటలేరీతిగా జరుగును? అని కార్యభారము వహించినవారు త్రొక్కులాడుచుండిరి. వంట బ్రాహ్మణులకు మేనేజరుగారైన అయిదుసోలల రామమూర్తిగారు శ్రీరామ భక్తులు. ఆయన వంటలో ప్రవేశించినది మొదలు రామ స్మరణముతోనే తన్మయులగుచుందురు. వర్షపు భీభత్సమునుజూచి దేవరపల్లి శ్రీరాములు గారు వంట బ్రాహ్మణుల మేనేజరు దగ్గఱకు వెళ్ళి “అయ్యా! ఈ రోజున వంటలు భోజనముల విషయమై నాకేమియు దోచకున్నది. ఇపుడు గత్యంతరమేమి?” అని ప్రశ్నించిరి. అపుడా రామమూర్తిగారు “అయ్యా!

గాడిపొయిలోని నీరు తోడించి ఊక పోయించుడు. ఇంక రెండు గంటలలో ఎన్ని వేలమందికైనను భోజనపదార్థములందిచ్చెదను” అని ధైర్యముగా పల్కిరి. ఆ ప్రకారముగాడి బాగుచేయించి ఉదయము 9 గంటలకు శ్రీరామస్మరణ చేయుచు రామమూర్తిగారు గాడిలో నిప్పువేసిరి. 11 గంటలగుసరికి రెండువేలమందికి భోజన పదార్థములన్నియు సిద్ధము చేయబడెను. కార్యభారము వహించిన వారందఱును రామమూర్తిగారు చేసిన వంట ప్రయత్నమునకు మిగుల ఆశ్చర్యపడిరి. జనులందఱును భోజనములు చేయుచునేయుండిరి. వంటలు తయారగుచునే యుండెను. ఆ రోజున దేవరపల్లి ప్రసాదరావు అను భక్తునికి హనుమంతు డావేశించి గురువర్యుల చెంతకు వచ్చి “నాయనా! నీ యుత్సాహమునకు ఆనందించితి” నని చెప్పెను. పిమ్మట నా ప్రసాదరావుకే శ్రీరాముడు ఆవేశించి భక్తులకు బోధగావించెను. మహర్షి శిష్యుడైన వాడ్రేవు పెంటయ్య అను భక్తునికి గూడ హనుమంతుడావేశించి బ్రహ్మానందముగా సప్తాహము జరుగుచున్నదని చెప్పెను. ఆ బాల గోపాల మన్ని వర్షములవారును శ్రీరామ ప్రసాదము భుజించుచుండిరి. సుమారు ఇరువది యైదువేల జనమునకు సమారాధనము జరిగెను. అన్ని వేల జనులు వచ్చినప్పటికిని దొంగతనములుగాని, అల్లరులుగాని లేక ప్రశాంతముగా సప్తాహదీక్ష ముగిసెను. పూర్ణాహుతి రోజున సామ్రాజ్య పట్టాభిషేకము శ్రీరామభక్త సమాజమువారు చేయించిరి. మహర్షి బంధువర్గమునకును, శిష్య వర్గమునకును, మకాములు చేయుటకు ప్రత్యేక భవనములు ఏర్పాటు చేయబడెను. పూర్ణాహుతినాటి రాత్రి శ్రీ మహర్షులవారిని లాలకీలోను, గురుపత్ని బాపనాంబగారిని మేనాలోను గూర్చుండబెట్టి శిష్యులందఱును బ్రహ్మరథముపట్టి భజనలతోను, వాద్య విశేషములతోను, గ్రామమంతయునూరేగించి గృహ ప్రవేశము చేయించిరి. పూర్ణాహుతి

రోజున అన్ని వర్ణముల వారికిని మహా సమారాధనము జరుగుచుండగా కొన్ని మణుగుల పంచదార తెప్పించి చీమలకు ఆహారముగా గురువర్యులు వేసిరి. "సర్వభూత నివాస...సి వాసుదేవ నమో....స్తుతే". పిపీలికాది బ్రహ్మపర్యంతము చరాచర ప్రపంచమంతయును రామమయముగా జూచి ఉపాసనము గావించు శ్రీమహర్షులవారి భావనాశక్తి యెంత పవిత్రమైనదో చదువరులే యూహించుకొందురుగాక.

అది మొదలుకొని ప్రతి సంవత్సరమును సప్తాహ జ్ఞానకార్థమై వైశాఖ శుద్ధ సప్తమి రోజున పామర్రు గ్రామములో గురుదేవుని గృహమందు శ్రీ సీతారాములకు సహస్ర నామార్చనయును, బ్రాహ్మణ సమారాధనమును దేవరపల్లి శ్రీరాములుగారు చేయించుచుందురు. ఆ రోజున గురుదంపతులు పామర్రు వెళ్ళుచుందురు. లోకకల్యాళ కరుడగు శ్రీరామచంద్రుడు భక్తుల నెప్పటికప్పుడు పరీక్షించుచు తన లీలలను వెల్లడిచేయుచునే యుండును.

1936 సం॥రములో గురుపత్నియగు బావనాంబగారు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు తాలూకాలో చేరిన విప్పర్రు గ్రామము తమ బంధుగృహమున జరుగు వివాహమునకై వెళ్ళియుండిరి. ఆ పెండ్లి వైభవము పూర్తియైన పిమ్మట అచట నుండి నిడదవోలు వెళ్ళిరి. అచట చిన్న జగన్నాథము అను భక్తవరుడుండెను. ఆయన మహర్షి శిష్య కోటిలోనివారు. అందుచే బాఆపనాంబగారు తమ శిష్యుడైన చిన్ని జగన్నాధము అను భక్తపరుడుండెను. ఆయన మహర్షి శిష్యకోటిలోనివారు. అందుచే బాపనాంబగారు తమ శిష్యుడైన చిన్ని జగన్నాధముగారి యింటిలోనే మకాము చేసిరి. విప్పర్రులో నుండగానే బాపనాంబగారి నేత్రములు ఎఱ్ఱబడి మిగుల బాధింపసాగెను. అందుచే నిడదవోలులోగల డాక్టరు ఎఱ్ఱమిల్లి దీక్షితులుగారి ఆసుపత్రిలో నేత్రవైద్యము ప్రారంభించిరి.

ఆ విషయమంతయును మహేంద్రవాడలో సమాధి నిష్ఠయందున్న శ్రీ గురు చక్రవర్తికి గోచరించెను. అందుచే గురువర్యులు నిడదవోలు వెళ్ళిరి. కొన్ని రోజులకు బాపనాంబగారి నేత్రములు బాగుపడెను. వైశాఖ శుద్ధ సప్తమి రోజునకు పామర్రు సప్తామపు గుర్తు సమారాధనకు వెళ్ళుటకు వీలులేక నిడదవలోలులోనే ఉండిపోవలసి వచ్చెను. పామర్రులోనివారుగూడ గురువర్యులు రాకపోవుటకు ఖిన్నులై శ్రీరామ పూజాదికములు యధావిధిగా జరిపించిరి. కాని శ్రీరామచంద్రుడు తన మహిమ నొక్కసారి వెళ్ళడి చేయదలచెను.

1936 సం॥ రమున శ్రీధాత సం॥ర వైశాఖ శుద్ధ సప్తమి రోజున గురువర్యులు చిన్ని జగన్నాధముగారి మేడపై భాగమున నొక గదిలో తపస్సు చేసుకొనుచుండిరి. కాని పామర్రు వెళ్ళలేకపోతిమిగదా యని గురువర్యుల మనస్సు పీకులాడుచుండెను. ఆ విషయము గూడ తమ శిష్యుడైన జగన్నాధముతో పల్కిరి. శ్రీ గురువర్యులు ఆ రోజుకు 11 లంఖనముల జ్వరముతో నిడదవోలులో బాధపడుచుండిరి. అట్టి జ్వరముతోనే గురు వర్యులు సప్తమిరోజు మధ్యాహ్నము నైవేద్యము చేయుచుండగా శ్రీరాముడు దేవరపల్లి శ్రీరాములుగారి తండ్రియగు తాత రూపమున ఎదుట సాక్షాత్కరించెను. శిరస్సుపై కిరీటము గలదు. చేతిలో ఈడిగముంత గలదు. అట్టి రూపముతో సాక్షాత్కరించిన శ్రీరామచంద్రుడు ఈ చేనిలోనికి వెళ్ళుము అని చెప్పుచు ఈ నైవేద్యము నాకు చాలునాయని చెవి దగ్గరకు వచ్చి రహస్యముగా చెప్పి అదృశ్యుడయ్యెను. సీతా పరమేశ్వరి మెడలోనున్న దివ్యమంగళసూత్రము మహర్షి కుడిభుజమునకు తగిలెను. వెంటనే జగన్మాత అదృశ్యురాలయ్యెను. మఱియొక విశేషమేమనగా ఆ రోజున గురువర్యులు భోజనము చేయుచుండగా ఎడమకంటి నుండి నీరు కాల్వలై ప్రవహింపజొచ్చెను. అది యంతయును శ్రీ రామ మమిగా గురువర్యులు

గుర్తించిరి. కంటినుండి నీరుకారుటకు నేవిధముగా పరిశీలించినను కారణము కాన్పించకుండెను. మంచి తీర్థము పుచ్చుకొనినచో గురువర్యుల కంఠము మండిపోవుచుండెను. ఇదియంతయును శ్రీరామమహిమ సుమాయని గురువర్యులు తమ ధర్మపత్నితో బల్కిరి. నిడదవోలు గ్రామ నివాసులును, ఆయుర్వేద వైద్యులుననగు బొమ్మగంటి రామమూర్తిగారు శ్రీవారి శరీరతత్త్వము బాగుగా పరీక్షించి "అయ్యా! హేతువేదియును నాకు గోచరించుటలేదు" అని సలహాయిచ్చిరి.

అపుడు తమ ప్రియశిష్యుడైన చిన్ని జగన్నాధమును బిలిచి "అబ్బాయీ! ఇదియంతయును శ్రీ రామమహిమ సుమా! పామర్రులో నేను చేయవలసిన శ్రీరామ పూజాదికములన్నియు నిచ్చటనే జరుప సంకల్పము కల్గినది". అని చెప్పిరి. గురుదేవుని ముఖమునుండి ఆమాట వినినతోడనే "ఓ దేవదేవా! నాజన్మకింతకంటె కావలసిన పుణ్యకార్యమేమి కావలెను?" అని జగన్నాధముగారు పరవశులై తమ యమందానందమును గురుపుంగవులకు విన్నవించిరి. అంతకు పూర్వమురోజున రాత్రి చిన్ని జగన్నాధముగారి భార్యయగు లక్ష్మినరసమ్మగారు నిద్రావస్థలో నుండిరి. జగన్నాధముగారికి జానకమ్మ అను పేరుగల పదునైదేండ్ల బాలిక కలదు. నిద్రలోనున్న నరసమ్మగారికి సీతాదేవి జానకమ్మ రూపమున గాన్పించి నాకు పెరుగు అన్నము పెట్టుమని కోరెను. ఆ మాటవిని లక్ష్మీనరసమ్మ తన కుమార్తె రూపముతోనున్న సీతాదేవితో అమ్మా! నీకు కావలసినంత తృప్తిగా భుజింపుమని పల్కుచు లేచి చూడగా నేమియు గాన్పించక పోయెను. అదేరోజున మధ్యాహ్నమువేళ గురువర్యులు దేవతానివేదనము చేయుచున్నపుడు "ఇది చాలునా" అని శబ్దము పల్కుటయు, ఆ రాత్రియే 15 ఏండ్ల బాలిక రూపమున లక్ష్మీనరసమ్మగారికి దేవి స్వప్నమున దర్శనమిచ్చుటయు జరిగెను.

ఈ విషయములన్నియుగాంచి "ఆహా! ఏమిరాముడు! ఏమిసీత! ఏమి ప్రత్యక్ష నిదర్శనములు! సాక్షాతస పార్వతీ పరమేశ్వరులై గురుదంపతులే మన యింటనుండు భాగ్యమేమి? మనజన్మములు సార్ధకమైనవి" అని జగన్నాధంగారును లక్ష్మీనరసమ్మగారును ఆనంద పరవశులై శ్రీరామ పూజకు తగిన ప్రయత్నములు పరమభక్తితో జేసిరి. నిడదవోలు పుర నివాసులైన శ్రీ చెరుకుమిల్లి దక్షిణామూర్తిగారు కూడ జగన్నాధంగారు చేయు ప్రయత్నములకు పూర్తిగా సహకరించిరి. ప్రతి సం॥రమును పామర్రులో జరుగు సమారాధనముకంటె మిగుల వైభవముగా నచట జరిగెను. సీతారాములెంతటి దయార్ద్రహృదయులు! అట్టే కానిచో భక్తులకు జ్ఞాపకముచేసి పూజలు చేయించుకొందురా? ఇది యంతయును గురువర్యుల తపోమహిమ కాక మఱేమగును?

ఇది జరిగిన కొంతకాలమునకు జగన్నాధంగారు తమ గృహమున తపోనిష్ఠాగరిష్ఠులై యుండగా శ్రీమహర్షులవారు నిజరూపముతో నెదుట సాక్షాత్కరించిరి.

# ఆంజనేయ సాక్షాత్కారము

హనుమంతుడు సనకాది మహర్షులతో నిట్లు చెప్పెను.

శ్లో॥ యోరామం సస్మరేన్నిత్యం భక్త్యామనుపరాయణః
తస్యాహమిష్ట సంసిద్ధ్యై దీక్షితో...స్మి మునీశ్వరాః
వాంఛితార్థం ప్రదాస్యామి భక్తానాం రాఘవస్యతు
సర్వథా జాగరూకో....స్మి రామకార్య దురంధరః

(ఎవడు నిత్యమును భక్తితో శ్రీరామమంత్రమును జపించుచుండునో అట్టివాని కోరికలను, రామభక్తుల కోర్కెలను, రామకార్య దురంధరుడగు హనుమంతుడు సర్వదా జాగరూకుడై నెరవేర్చుచుండెను)

రామరహస్యోపనిషత్.

మఱియు శ్రీరామచంద్రుడు దుష్టశిక్షణమును, శిష్ట రక్షణమును గావించి వైకుంఠపురమున కేగునపుడు హనుమంతునితో నిట్లనుచున్నాడు.

శ్లో ॥ మత్కథాః ప్రచష్యంతి యావల్లోకేహరీశ్వర

తావదఽ రమస్వసుప్రీతో మద్వాక్యమనుపాలనయనఽ ॥

(ఉత్తర రామాయణమఽ॥ 108 సం॥ 30 శ్లో॥)

ఆంజనేయా! నా కథలు లోకమున నెంతకాలము ప్రచారములో నుండునో అంతవఱకును నా యాజ్ఞను పాలించుచు భూలోకమున సంతోషముతో నుండుము.

రామునికి హనుమంతుడిట్లు సమాధానము చెప్పెను.

శ్లో ॥ యావత్తవ కథాలోకే విచరిష్యతి పావనీ

తాయత్స్థాస్యామి మేదిన్యాం తవాజ్ఞానుపాలయనఽ॥

(ఉత్తర రామాయణమ్. 108 సం॥ 32 శో॥)

(శ్రీరామచంద్రా! పవిత్రమగు నీ కథ భూలోకమున నెంతకాలము ఉ ండునో అంతకాలము నేను నీ యాజ్ఞను పాలించుచు భూలోకమున నుందును)

నిరంతర రామనామ జప తత్పరులైయున్న శ్రీ సుబ్రహ్మణ్య మహర్షికి ఆంజనేయుడు దర్శనమీయవదలచెను. భద్రిరాజు సూర్యనారాయణగారిచే నీయబడిన గృహమందు ప్రవేశించిన తర్వాత నొకనాడు గురువర్యులు

తపోనిష్ఠలో ప్రవేశించిరి. అపుడు తెల్లని దేహముతో ఆంజనేయస్వామి జపించుచున్న గురువర్యుల శిరస్సుపై నుండి ఆవలికిని ఈవలికిని దుముకుచు కొంతసేపటికి అదృశ్యుడయ్యెను.

శ్లో ॥ యత్ర యత్ర రఘునాథకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిం

భాష్పవారి పరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకం ॥

(ఎచ్చట శ్రీరామ సంకీర్తనము జరుగుచుండునో అచటనంజలి ఘటించి ఆనంద భాష్పములతో ఆంజనేయుడు పరవశుడై యుండును. అట్టి మారుతిని నేను మ్రొక్కెదను.)

సీతారాములు ఎదుట ప్రత్యక్షమైనగాని గురువర్యులు ఆ రోజున భోజనముగూడ చేయరు. రాముడచట నుండుటచేతనే భక్తాంజనేయుడు గురువర్యుల శిరస్సుపై నుండి ఆనందపవశుడై దుముక నారంభించెను. ఆహా! ఈ మహర్షులవారి యుపాసన యెంత పవిత్రమైనది.

# జగజ్జనని మహిమా విశేషములు

తూ.గో.జిల్లా రామహేంద్రవరమున శ్రీకామరాజుగెడ్డ పాపరాజు, విజయలక్ష్మమ్మ అను పుణ్యదంపతులుండిరి. వారికి పేరయాచార్య అను కుమారులుండెను. ఆ దంపతులు పరమభక్తులై కాలము గడుపుచుండిరి. పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలో చేరిన దువ్వ గ్రామములో మునుకుట్ల వీరయ్యగారు గలరు. ఆయన మహర్షి శిష్యకోటిలోనివారు. క్రీ॥శ॥ 1916 సం॥రములో పాపరాజుగారును విజయలక్ష్మమ్మగారును వీరయ్యగారికి శిష్యులైయుండిరి. ఆ దంపతుల హృదయక్షేత్రములు మిగుల

పరిశుద్ధమై ఫలోన్ముఖమై యుండెను. అందుచే సుబ్రహ్మణ్య మహర్షికి 1926 సం॥రములో శిష్యులైరి. అప్పటినుండియు గురుసేవా ధర్మములు పాటించుచు ఆ దంపతులు అప్పుడప్పుడు మహేంద్రవాడవెళ్ళి గురుస్వామిని సేవించి వెళ్ళుచుండిరి. ఇట్లు కొంతకాలమైన తర్వాత 10 జూన్ 1941 సం॥రము తేదీనుండి విజయలక్ష్మిగారి గర్భకోశమున పెద్ద వ్రణము బయలుదేరి భరింపరాని బాధకల్గుచుండెను.

రాజమండ్రిలోని డాక్టర్లు నెలరోజులు వైద్యముచేసిరి. కాని కొంచెమైనను సుగుణము కాన్పింపదయ్యెను. రాజమండ్రీలోనున్న డాక్టర్లు విశాఖపట్టణము ఆసుపత్రిలో చేర్పించి పెద్దయాపరేషను చేయించినగాని వ్యాధినివారణము సాధ్యము కాదని గట్టిగా చెప్పిరి. అందుచే ఆ దంపతులు తమ పుత్రునితో గూడి 12 ఆగస్టు 1941 సం॥రము తేదీని రాజమండ్రిలో బయలుదేరి గురుదర్శనమునకై మహేంద్రవాడ వెళ్ళిరి. విజయలక్ష్మమ్మగారు రాజమండ్రీలో బయలుదేరునపుడు మహేంద్రవాడలోగల గురుపీఠముననున్న శ్రీ రాజ రాజేశ్వరీ జగన్మాతను తలచుకొని “జగజ్జననీ! నాకు ఆపరేషను అక్కరలేకుండగజేసి కాపాడుభారమునీది. నిన్నే నమ్మితిని. నీకంటె మాకు దిక్కులేదు రక్షింపుము”. అని ఆర్తురాలై తీవ్రమైన భక్తితో ప్రార్థించిరి.

ఆ దంపతులు మహేంద్రవాడవెళ్ళి గురుదేవుని గురుపీఠమును దర్శించి ప్రణమిల్లి ఆ విషయమంతయును గురువర్యులకు విన్నవించిరి. మహర్షులవారి శుభాశీస్సులంది వారి వద్ద సెలవు పుచ్చుకొని ఆ రాత్రియే విశాఖపట్టణము వెళ్ళుటకు బయలుదేరిరి. అందుచే మహేంద్రవాడలో నొక జట్కా బండినెక్కి వారు ముగ్గురును రాత్రివేళ బిక్కవోలు స్టేషనుకు వెళ్ళుచుండిరి. ఆ భక్తురాలు మొదటనే ప్రార్థించి బయలుదేరుటచే

గుఱ్ఱపుబండి మిగుల వేగముగా వెళ్ళుచుండెను. అప్పుడు జరిగిన యద్భుతమేమనగా ఎఱ్ఱనిచీర కట్టుకొని సర్వాలంకార శోభితయై విఘ్నేశ్వరుని చంకబెట్టుకొని దేవి బండికి ముందుభాగమున నడువసాగెను. బండి వేగముగా వెళ్ళుచున్నపుడు దేవికూడ వేగముగా నడువసాగెను. ఆ జగజ్జనని దివ్య సందర్శనము విజయలక్ష్మమ్మగారికి మాత్రమే లభించెను. భర్తయగు పాపరాజుగారికిగాని కుమారుడగు పేరయాచార్యకుగాని దేవి కాన్పించలేదు. ఆ జగన్మాత బండిముందు బిక్కవోలు రైల్వేస్టేషను సమీపించుసరికి అదృశ్యురాలయ్యెను. వెన్నెలరాత్రి యగుటచే జగజ్జనని రూపసౌందర్యాది విశేషములు విజయలక్ష్మమ్మగారికి స్పష్టముగా గాన్పించెను.

వారు ముగ్గురును బిక్కవోలు స్టేషనుచేరి తెల్లవారగట్ల బండిలో విశాఖపట్టణము చేరిరి. 16-8-41 తేదీని విశాఖపట్టణములోని “కింగ్‌జార్జి గవర్నమెంటు హాస్పటలు”లో శ్రీ విజయలక్ష్మమ్మగారిని చికిత్సకు చేర్పించిరి. జగన్మాతయే ఆమెను వెన్నంటి కాపాడుచుండగా మానవమాత్రుల వైద్యమేపాటిది? దేవీప్రభావముచే నచటి డాక్టర్లు ఈ వ్యాధికి ఆపరేషను అక్కరలేదనియు రేడియము ట్రీట్‌మెంటు చేయుదుమనియు చెప్పి ఆ రోజు నుండియే వైద్యము ప్రారంభించిరి. మూడుసార్లు రేడియం ట్రీటుమెంటు చేసిన తోడనే ఆ వ్యాధి తీవ్రత తగ్గి ఉత్సాహముతో గూడిన యారోగ్యము కలుగజొచ్చెను. కొన్ని రోజులకే ఆమెకు సంపూర్ణారోగ్యము కల్గెను. అందుచే నచటి డాక్టర్లు ఇక మీరు వెళ్ళవచ్చునని చెప్పుచు చెన్నపట్టణములో 15 రోజులపాటు విద్యుత్కిరణ ప్రసార వైద్యముకూడ చేయించుడని సలహాయిచ్చిరి. అందుచే ఆ దంపతులు 12-10 - 41 తేదీని రాజమహేంద్రవరము తిరిగి వచ్చిరి. అప్పటికామెకు సంపూర్ణారోగ్యము కల్గెను. కాని మరల ఆ వ్యాధి కలుగకుండుటకై 22-10-41 తేదీని

రాజమండ్రీలో బయలుదేరి మద్రాసువెళ్ళి 25-10-41 తేదీని ఎగ్మూరు మెటర్నిటీ హాస్పటలులో చికిత్స నిమిత్తమై విజయలక్ష్మమ్మగారిని చేర్పించిరి. 15 రోజులచ్చట విద్యుత్కిరణ ప్రసార వైద్యము చేయించిరి. ఆమె గర్భకోశము బాగుపడి సంపూర్ణారోగ్యము కల్గెను.

వైద్యకాలములో జరిగిన విశేషమేమనగా పాపరాజుగారికికూడ దేవి సాక్షాత్కరింపదొడగెను. ఒకపుడు సర్వాలంకార భూషితయై దర్శనమిచ్చుచుండెను. మఱి యొకపుడు ఎఱ్ఱనిచీర కట్టుకొని బంగారుమువ్వల యొడ్డాణము ధరించి చెవులకు దుద్దులు పెట్టుకొని మెడలో మంగళసూత్రము ధరించి దర్శనమిచ్చుచుండెను. అనేక విధములుగా దేవి పాపరాజుగారికి దర్శనమిచ్చుచునే యుండెను. మద్రాసులో చికిత్స పూర్తియైన తోడనే ఆ దంపతులు తిరిగి తమ నివాసస్థలమైన రాజమండ్రీ చేరిరి. అచటికి వచ్చిన కొలది రోజులలోనే విజయలక్ష్మమ్మగారు సంపూర్ణారోగ్యవంతురాలయ్యెను. బిక్కవోలు స్టేషనుకు వెళ్ళునపుడు విజయలక్ష్మమ్మగారిని, వైద్యకాలములో పాపరాజుగారిని దేవీ సాక్షాత్కారములు కల్గి యుండుటచేతను, ఆపరేషను అక్కరలేకపోవుటచేతను, అనతి కాలములోనే సంపూర్ణారోగ్యము కల్గుటచేతను, ఇదియంతయును దేవీ మహాత్మ్యముకాని మఱియొకటికాదని ఆ దంపతులు నిశ్చయించుకొనిరి.

అందుచే మహేంద్రవాడలో గురుస్వామి పీఠమందుగల దేవికి శక్తివంచన లేకుండగ పూజలు చేయించుకొనుటకు సంకల్పించుకొనిరి. ఒక శుభదినమున పాపరాజుగారు మహేంద్రవాడవెళ్ళి తమ సంకల్పమును గురుస్వామికి విన్నవించిరి. "నాయనా! పుష్యమాసములో పూర్ణిమ ముందువచ్చు శుక్రవారము దేవీపూజకు మిగుల శ్రేష్ఠమైన పర్వదినము. ఆ రోజున దేవిపూజ గావించుకొనుడు'' అని గురువర్యులు

పాపరాజుగారితో చెప్పిరి.

గుర్వాజ్ఞపొంది పాపరాజుగారు మహేంద్రవాడనుండి రాజమండ్రి వెళ్ళి దేవీపూజకు గావలసిన సంబారములన్నియు సమకూర్చుకొన మొదలుపెట్టిరి. గురువర్యులు నిర్ణయించిన ముహూర్తమునకు రెండురోజులు ముందుగానే బంధుమిత్ర పరివార సహితముగా బయలుదేరి పాపరాజుగారు మహేంద్రవాడ చేరిరి.

శ్రీమహర్షి తాము రచించిన యద్వైత రహస్యమందు

గీ॥ పంచవింశతి తత్త్వములఁ పరగ జూచి
ధరణి షడ్వింశకుని మదిఁ-దలచి మ్రొక్కి
పరమ పదమై బ్రహ్మంబు - బయలు సేతు
రఘుకులాంబోధి సోము శ్రీ - రామ నామ ॥

అని వ్రాసిరి. అందుచే పాపరాజుగారు పరమభక్తితో ఒక్కొక్క తత్త్వమునకు నొక్కొక్కటి చొప్పున భోజన పదార్థములు తయారు చేయదలచిరి. 26 డిశంబరు 1941 తేదీకి సరియగు వృష సం॥ర పుష్యశుద్ధ అష్టమీ శుక్రవారము రోజున దేవీ పూజ జరుపుటకు నిశ్చయింపబడెను. ఆ రోజు యుదయముననే లేచి జగన్మాతకు నూతనవస్త్రములు కట్టి బంగారు టొడ్డాణము, మంగళసూత్రములు, దుద్దులు అలంకరింపబడి అయిదు విధములైన పూలతో గ్రుచ్చబడిన మాలలు దేవికి అలంకరింపబడెను. పంచవింశతి తత్త్వములనగా నిరువదియైదు తత్త్వములు.

కర్మేంద్రియ పంచకము - 5

జ్ఞానేంద్రియ పంచమకు - 5

ప్రాణపంచకము - 5

భూత పంచకము – 5

మనోబుద్ధి చిత్తాహంకారములు 4 + జీవుడు 1 = 5

ఇవి యిరువదియైదు తత్త్వములు. ఇరువది యారవది ఆత్మతత్త్వము. ఇరువది యేడవది పరిపూర్ణ తత్వము. అందుచే ఆ తత్వసంఖ్యకు సరిపోవునట్లుగా దేవీనివేదనమునకు భోజన పదార్థములు పాపరాజుగారు చేయించిరి.

పంచకముల క్రమము

1. 1. పప్పు, 2 పనసకాయకూర, 3 వంకాయకూర, 4 కొబ్బరికాయ పెరుగు పచ్చడి, 5 దోసావకాయ – ఇది యొక పంచకము.

2. 1 బూరెలు, 2 గారెలు, 3 లడ్డువులు, 4 మైసూరుపాకు, 5 పంచదార జిలేబి – ఇదియొక పంచకము.

3. 1 బియ్యపు పాయసము, 2 సగ్గుబియ్యపు పాయసము, 3 సేమ్యా పాయసము, 4 గోధుమ పాయసము, 5 బాదంపప్పు పాయసము – ఇది యొక పంచకము.

5. 1 జున్ను, 2 మీగడ, 3 వెన్న, 4 పెరుగు, 5 మజ్జిగ – ఇదియొక పంచకము.

ఇవియన్నియుగాక సువాసన ద్రవ్యములతో గూడిన పంచదార పానకము షడ్వింశక సూచకము.

శ్రీ గురుస్వామి యిచ్చెడి పవిత్ర తీర్థము అమృతత్త్వము. ఇదియే పరిపూర్ణ తత్త్వము.

ఈ విధముగా నిట్టి పదార్థములన్నియు సిద్ధముచేసి గురుదంపతులతో బాటు పాపరాజుగారును, విజయలక్ష్మమ్మగారును విధివిధానముగా శ్రీ

రాజరాజేశ్వరీ జగన్మాతకు కుంకుమ పూజలు చేయుచుండిరి. గురుదేవుని పుత్రికయగు పూర్ణమ్మగారికి దేవి ఆవేశించి భక్తుల యభీష్టములు దెల్పుచుండెను. ఆ సమయమున రాజమండ్రీ నివాసులైన నిమిషకవి వెంకటరమణమ్మగారును, సత్యనోలు సీతమ్మగారును, గురుస్వామి సాన్నిధ్యమున గూర్చుండియుండిరి. శిష్యులును భక్తులును దేవీ పూజలు భక్తితో తన్మయులై చూచుచుండిరి. పూజా సమయములో జరిగిన యద్భుత మేమనగా జగజ్జనని ప్రసన్నవదనయై సర్వాలంకార భూషితయై, చైతన్య మూర్తియై దేదీప్యమానముగా ప్రకాశించుచు శ్రీ గురుపీఠమున సాక్షాత్కరించెను. ఆ చైతన్య మూర్తియగు జగన్మాత నిమిషకవి వెంకటరమణమ్మగారికి మాత్రమే కాన్పించెను.

పూజ సమాప్తమైన పిమ్మట పైన దెల్పబడిన పదార్థములన్నియు నైవేద్యము చేయబడెను. పిమ్మట మహర్షి శిష్యులకును ఇతర వర్గముల వారందఱికిని గొప్ప సమారాధనము జరిగెను. నేనుగూడ ఆ రోజున మహేంద్రవాడలో నుండుటచే ఆ వైభవ మంతయును ఆ మూలాగ్రముగా చూచి యాచరించు భాగ్యము లభించెను.

మఱియొకప్పుడు రాజమహేంద్రవరము నివాసులైన శ్రీ పోచిరాజు సీతారామమూర్తిగారి కుమార్తెయును, అయ్యగారి సూర్యనారాయణగారి భార్యయునగు సూర్యకాంతమ్మగారికి వృష సం॥రములో జబ్బుచేసెను. వైద్యము వలన ప్రయోజనము లేకపోయెను. ఆమె కామరాజుగెడ్డ పాపరాజుగారి పిన్నత్తగారి కుమార్తె. వ్యాధిచే నామె జీవితాశలేని స్థితిలో నుండెను. అపుడు శ్రీ పాపరాజుగారు మహేంద్రవాడలోగల దేవిని తలచుకొని "ఓ దేవీ! ఈమె వ్యాధి తగ్గినయెడల నీకు పూజలు చేయించి బూరెలు నైవేద్యము పెట్టుదుము" అని మ్రొక్కుకొనిరి. అమృత స్వరూపిణియగు జగన్మాతయనుగ్రహముచే ఒక గంట కాలములోనే

రోగోద్ధతితగ్గి ముఖమున నూతన వికాసము కలుగజొచ్చెను. పిమ్మట కొలది రోజులకే సూర్యకాంతమ్మగారికి సంపూర్ణారోగ్యము కల్గెను. అందుచే పాపరాజుగారు దేవీపూజకు గావలసిన పూజాద్రవ్యములన్నియు సమకూర్చుకొని మహేంద్రవాడ వెళ్ళి వృష సం॥ర జ్యేష్ఠ బహుళ ఏకాదశీ శుక్రవారమురోజున దేవీపూజ చేసుకొనిరి. గురుమండలాయైనమః। వాంఛితార్థ ప్రదాయిన్యైనమః। అను దేవీ నామముల యనుభూతి ఇదియే.

# శంకర దర్శనము

శివునికి, రామునికిని అభేదము. సీతకును, పార్వతికిని అభేదము. మంత్రశాస్త్రమున శివోమా రామమంత్ర ధ్యానమిట్లు దెల్పబడినది.

శ్లో ॥ రామం త్రినేత్రం సోమార్ధధారిణం శూలినం పరం

భస్మోద్ధూళిత సర్వాంగం కపర్ధిన ముపాస్మహే ॥

త్రినేత్రుడైనట్టియు, అర్ధచంద్రుని ధరించినట్టియు, శూలమును ధరించినట్టియు, శరీరమంతకును భస్మము పూసికొనినట్టియు, జటాఆజూటము ధరించినట్టియు రామునుపాసించెదను.

శ్లో ॥ రామాభిరామాం సౌందర్య సీమాం సోమావతం సకాం

పాశాంకుశ ధనుర్బాణ ధరాం సీతాం త్రిలోచనాం ॥

శ్రీరాముని సాన్నిధ్యమున దివ్య స్వరూపిణియు, సౌందర్య పతియు, చంద్రుడు శిరోభూషణముగా గల్గినట్టియు, పావమును, అంకుశమును,

విల్లును, బాణమును ధరించినట్టియు, మూడు నేత్రములు గల్గినట్టియు సీతా పరమేశ్వరి నుపాసించెదను.

సీతారాములు తమ యద్వైతస్థితినే శ్రీ మహర్షికి చూపదలచిరి. సుబ్రహ్మణ్య మహర్షి అనేక కోట్లసార్లు శ్రీరామమంత్ర పురశ్చరణ గావించియుండిరి. 19-6-941 తేదీ వృష సం॥ర జ్యేష్ఠ బహుళ నవమీ బుధవారము రోజున మేడపైభాగమున మధ్యాహ్నము గం॥ 12-0 లకు గురువర్యులు పూజామందిరము చేరి సకల దేవతా పరివార సహితుడగు శ్రీరామచంద్రునికి నైవేద్యము చేయుచుండిరి. ఆ రోజున సీతారాములు పార్వతీ పరమేశ్వరులై మహర్షికి సాక్షాత్కరించిరి. శంకరుడు స్పటిక కాంతిగల మేనుతోను, నాగభూషణములతోను, జటాజూటమందు గంగయును, ఫాలభాగమున త్రినేత్రమును, శరీరమంతయును భస్మాంగరాగమును గల్గి దర్శనమిచ్చెను. ఎడమ పార్శ్వమున పార్వతీదేవి సర్వాలంకార శోభితయై ప్రకాశించుచుండెను. ప్రమధ గణములు పార్వతీ పరమేశ్వరులను సేవించుచుండెను. పూజామందిరము తలుపులు బంధింపబడియుండెను. మందిరము లోపల నివేదనము పూర్తిగావించి గురువర్యులు తమలో తాము పకపక నవ్వుచుండిరి. కొంత సేపటికి పకపక నవ్వుచు ఆనందాబ్ధి నోలలాడుచు బయటికి వచ్చిరి. నేను పూజామందిరము ద్వారము దగ్గరనే ఆ రోజున నుంటిని. ఆనాటి మధ్యాహ్నము బోధ సమయమున శంకర దర్శన విశేషములు శిష్యులకు గురువర్యులు దెల్పిరి. శ్రీరాముడు నిరంతరమును గురువర్యులకు అనేక దివ్యలీలలు చూపుచుండును. నిరంతరము గురుదేవునికి దేవతలతోనే చుట్టరికము.

# గురుస్వామి శ్రీ మహావిష్ణువై సాక్షాత్కరించుట

తూర్పుగోదావరిజిల్లా రామచంద్రాపురం తాలూకాలో జేరిన కూళ్ళ గ్రామములో ముష్టి బాపన్న యనునొక బ్రాహ్మణోత్తముడుండెను. ఆయన కూళ్ళ గ్రామములోని స్కూలులో ఉపాధ్యాయుడుగా పనిచేయుచు గురుదేవుని హృదయపీఠమున నిల్పి సంసారయాత్ర సాగించుచుండెను. ఇట్లు కొంతకాలమైన తర్వాత 1943 సం॥రములో నొకనాడు బాపన్నగారు గురుమూర్తిని స్మరించి ధ్యాననిష్ఠలో ప్రవేశించిరి. భక్తజన కల్పతరువగు గురుస్వామి ఆ భక్తునికిట్లు సాక్షాత్కరించిరి. గురుదేవుని శిరస్సుపై నవరత్న స్థగితమైన సువర్ణమయ దివ్యకిరీటము దేదీప్యమానముగా ప్రకాశించుచుండెను. మణిగణ స్థగితమైన భుజకీర్తులు ప్రకాశించుచుండెను. మెడలో వివిధజాతి పుష్పమాలలు అలంకరింప బడియుండెను. సహజ సిద్ధమగు వనమాల మోకాళ్ళ వఱకును వ్యాపించి వ్రేలాడుచు మిగుల వింతగొల్పుచుండెను. శంఖ, చక్ర, గదా, ఖడ్గములు దాల్చి చతుర్భుజ యుక్తులై యుండిరి. అట్లు దర్శనమిచ్చి గురుస్వామి వెంటనే అదృశ్యులైరి. ఇది పట్టపగలు జాగ్రదవస్థలో జరిగిన విచిత్ర సంఘటనము.

# గురుదంపతులకు లక్షబిల్వార్చనము

అత్యద్భుత మహిమాన్వితులైన శ్రీ గురుపుంగవులకు లక్షబిల్వార్చన చేయుటకు మహేంద్రవాడ నివాసులైన శ్రీ కర్రి నారయ్యగారును వారి ధర్మపత్నియగు చెల్లాయమ్మగారును సంకల్పించుకొనిరి. 1943

సం॥రమునకు సరియగు స్వభాను నామ సం॥ర శ్రావణశుద్ధ పూర్ణిమ రోజున సంపూర్ణ చంద్రగ్రహణము వచ్చెను. ఆ పర్వపుణ్య సమయమున గురువర్యులకు లక్షబిల్వార్చన చేయుటకు సంకల్పింపబడెను.

ఆ పర్వదినము సాయంకాలమునకే వివిధ గ్రామముల నుండి శిష్యులు వచ్చి చేరిరి. రాయవరం నుండి ముళ్ళపూడి గంగరాజుగారు తమ పరివారముతో వచ్చిరి. కంటిపూడి వీరమ్మగారును, మండపేటనుండి కందర్ప సూర్యనారాయణగారును, రిటైర్డు ....క్లర్కు లింగాల సూర్యనారాయణగారును, వేగాయమ్మపేట నుంచి లింగాల సూర్యనారాయణయును, కూళ్ళ నుంచి గుడిమెట్ల సూరయ్యగారును, ముష్టి బాపన్నగారును వచ్చిరి. పామర్రునుంచి దేవరపల్లి శ్రీరాములుగారును కొందఱు భక్తులును వచ్చిరి. గ్రహణ సమయమునకు శిష్యులందఱును తారక తీర్థమున స్నానముచేసిరి. గురుదేవుని పాదములకు అభిషేకములును మారేడు దళములతో లక్షపత్రి పూజయును జరిగెను. గురుపత్నీ పాదములకు కుంకుమపూజ జరిగెను. ఆ సమయమున గురుదంపతులు ప్రత్యక్ష పార్వతీ పరమేశ్వరులై భక్తులకానందము గొల్పిరి. శ్రీనారయ్య చెల్లాయమ్మ దంపతులు గావించిన గురుసేవా పరంపరలో ఇదియొక యుదాహరణము మాత్రమే. మఱియు చిరకాలసేవ లొనరించి గురుఋణము దీర్చుకొనుటకై శ్రీ కర్రి నారయ్యగారు తమ సర్వస్వమును సమర్పించిరనుటలో అతిశయోక్తి లేదు.

# శ్రీరామలీల

మహర్షికి సత్యవతియను పేరుగల యొక కుమార్తె గలదు. ఆమె కండ్ల వైద్యము నిమిత్తము 1943 డిశంబరులో తూ.గో.జిల్లా కాకినాడ

వెళ్ళవలసివచ్చెను. శ్రీగురు వర్యులు సకుటుంబ సపరివారముగా కాకినాడ వెళ్ళిరి. అచట నేత్రవైద్యములో సుప్రసిద్ధులైన సదాశివరావుగారిచే వైద్యము ప్రారంభింపబడెను. రిటైర్డు....క్లర్కు శ్రీ లింగాల సూర్యనారాయణగారు గురుసేవ సేయుచుండిరి. ఇట్లు కొన్ని రోజులు గడచెను.

శ్రీరామచంద్రుడు తన గురుమండలముయొక్క యోగక్షేమములను స్వయముగా పరిశీలింపదలచెను. అందుచే నొకనాడు ఒక నూతన వ్యక్తి గురువర్యుల మకాములోనికివచ్చి అన్ని మూలలు చూచి గురుస్వామి ముఖము దగ్గరకు వచ్చి పరీక్షించి వెళ్ళుచుండెను. మఱియు సదాశివరావుగారి యాసుపత్రిలోనికి వెళ్ళి ఆపరేషనుచేయు గదిలోనికి వెళ్ళి నాలుగు మూలలు పరికించి వెళ్ళుచుండెను. అట్లు ప్రతిదినమును గురువర్యుల మకాములోనికి సదాశివరావుగారి ఆసుపత్రిలోనికి వచ్చి నాల్గు మూలలు పరీక్షించి ఎవరితోను మాటాడక వెళ్లిపోవుచుండెను. ఆ నూతనవ్యక్తి గురుదేవునికితప్ప నితరులకు కాన్పించకుండెను. ఆ వింత చూచి గురుస్వామి తమ శిష్యుడైన లింగాల సూర్యనారాయణ (రిటైర్డు క్లర్కు పిడబ్ల్యుడి) ను చూచి "నాయనా! కొన్ని దినములనుండి యిచటికొక నిరుద్యోగ వ్యక్తి వేళతప్పక ప్రతినిత్యమును వచ్చుచు నా ముఖము పరీక్షించి యిల్లు నాల్గుమూలలు చూచి వెళ్ళుచున్నాడు. ఈ రోజున అతనిరాక నిరీక్షించియుండుము" అని చెప్పిరి. అట్లే ఆ లింగాల సూర్యనారాయణగారు ఆ వ్యక్తికై నిరీక్షించు చుండిరి. కాని మాయామానుష విగ్రహుడగు శ్రీరాముడా దినమునుండి వచ్చుట మానివేసెను. పిమ్మట గురుస్వామి అంతటిని బిలిచి "కొన్ని దినములనుండి శ్రీరామచంద్రుడు ఎవ్వరికిని తెలియకుండగ వచ్చి మన యోగక్షేమములు తెలిసికొని వెళ్ళుచున్నాడు. అని చెప్పగా నందఱును మిగుల యాశ్చర్యపడిరి. వీధిలోనున్న వారికిగాని వాకిలిలో నున్న వారికిగాని కాన్పించక ఒక్క గురుస్వామికే మాయామానుష

వేషముతో వచ్చి శ్రీరాముడు దర్శనమిచ్చెను.

''మాయయా మానుష వేషవినోద'' అని భక్తులు రాముని కొనియాడుచుండుట కిదియే ప్రబల నిదర్శనము. ఇట్టి శ్రీరామ లీలలు గురుదేవునికి రాత్రింబగళ్ళు నిరంతరము లభించుచునే యుండును.

మఱియు కాకినాడలో నుండు కాలముననే 23-12-1943 తేదీకి సరియగు స్వభానునామ సం॥ర మార్గశిర బహుళ ద్వాదశీ గురువారము రోజున మహర్షి చంద్రులు సమాధినిష్ఠలో నుండగా నాల్గు వేదములును, సకల శాస్త్రములును, అష్టాదశ పురాణములును మూర్తీభవించి సాక్షాత్కరించెను. ఆ మరునాడు జరిగిన విశేషమేమనగా అంతకుపూర్వము కొన్ని రోజుల నుండి వచ్చుచున్న యావ్యక్తి నవరత్న స్థగితమైన సువర్ణ కిరీటము ధరించి గురుదేవునియెదుట సాక్షాత్కరించెను. శిష్యులకు తత్త్వబోధ రహస్యములు దెల్పు సందర్భమున శ్రీరామచంద్రుని యద్భుతలీలలు గురుస్వామి వెల్లడించిరి.

# శివైకాహ మహోత్సవము

శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారును వారి ధర్మపత్ని సూరమ్మగారును 1924 సం॥రము నుండి గురువర్యులకు శిష్యులైయుండి నిరంతర గురుసేవాతత్పరులై యుండిరి. వీరిది రాయవరం గ్రామము. ఆ గ్రామములోనే కంటిపూడి శ్రీరాములు అను గృహస్థుడుండెను. ముళ్ళపూడి గంగరాజుగారి కుమార్తెయగు వీరమ్మను కంటిపూడి శ్రీరాములుగారు పరిణయమాడిరి. శ్రీరాములు వీరమ్మ దంపతులిద్దఱును గురుదేవునికి శిష్యులైరి. గురుదంపతులు ప్రతి సం॥రము దేవీ నవరాత్రములు

చేయుచుందురు. ఏకాదశిరోజున శ్రీరామ భజనలతో ఏకాహము జరుగుచుండును. ఆ యేకాహామునకు భజనపరులను రప్పించి ద్వాదశిరోజున అన్ని తరగతులవారికిని సమారాధనము చేయించుటలో శ్రీరాములుగారును వీరమ్మగారును మిగుల శ్రద్ధవహించి శ్రీరామోత్సవములు జయజయనాదములతో చేయించుచుందురు. ఆ దంపతులకు కపిల నారాయణమూర్తి అను కుమారుడుండెను. ఆ బాలునికి 1942 సం॥రములో జబ్బుచేసి తీవ్రరూపము దాల్చెను. ఆ విషయము గురువర్యులకు తెలిసెను. అందుచే శ్రీమహర్షులవారు ఆంజనేయుని ఆ బాలుని మంచముచుట్టును కావలియుంచి శ్రీరామజపము నారంభించిరి. కొలది రోజులకే ఆ బాలుడు ఆరోగ్యవంతుడు కాజొచ్చెను. గురువర్యుల తపః ప్రభావముచే ఆ బాలుని యరిష్టములు తొలగెను.

దేవీ మహిమలును, శ్రీరామ మహిమలును అనుభూతిలో నుండుటచే ముళ్ళపూడి గంగరాజుగారు గురుమందిరమున శివైకాహము చేయించుటకు సంకల్పించుకొనిరి. 19-6-1941 తేదీ బుధవారము మధ్యాహ్నాము గం॥ 12-0 లకు సీతారాములు పార్వతీ పరమేశ్వరులై గురువర్యులకు సాక్షాత్కరించి యుండిరని ఇదివరలోనే తెల్పియున్నాను. గంగరాజుగారి శివైకాహ సంకల్పముగూడ శ్రీరామ ప్రేరణచే గల్గినదని చెప్పనొప్పును, మానవుడు నిమిత్తమాత్రుడే. కావున కృష్ణుడు అర్జునునితో “నిమిత్తమాత్రం భవ సవ్య సాచినన” నీవు నిమిత్త మాత్రుడవే. సర్వమును నేనే చేయించెదను అని చెప్పియున్నాడు. శ్రీ గురువర్యులు విజ్ఞాన శిఖరమునధిరోహించి యుండియు కర్మకాండను విడువలేదు. బాహ్యమునకు గురుపుంగవులు కర్మకాండలో మునిగి తేలుచున్నట్లు కాన్పించుచుందురు.

యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరోజనః
సయత్ప్రమాణం కురుతే లోకస్త దనువర్తతే ॥ (భగవద్గీత)

(శ్రేష్ఠపురుషులైన మహాత్ములెట్లు సంచరించెదరలో లోకులుగూడ వారి ననుసరించెదరు).

కావున మమాజ్ఞానులుగూడ తాము సత్కర్మల నాచరించి యితరులకు మార్గదర్శకులగుచుందురు. శివకేశవులకు భేదబుద్ధి కూడదను విషయము క్రియారూపమున గురువర్యులు చూపదలచి యుండిరి. మహర్షి ప్రియశిష్యులైన గంగరాజు గారు శివైకాహము జరుపు ప్రయత్నములలో నుండిరి. 8-11-1943 సం॥రము తేదీకి సరియగు స్వభానునామ సం॥ర కార్తీక శుద్ధ ఏకాదశీ సోమవారము రోజున శివైకాహము జరుపుటకు నిశ్చయింపబడెను. అప్పటికిని గంగరాజుగారి కుమారుడు "శ్రీరామ తారకము" అనునతడు మిక్కిలి జబ్బుస్థితిలో నుండెను. అయినప్పటికిని పుత్ర వ్యామోహముచే నిరుత్సాహపడక గంగరాజుగారు తమ బంధుమిత్ర పరివారముతోను, భజనపరులతోను, పూజాద్రవ్యములతోడను ఆ రోజు సూర్యోదయమునకే మహేంద్రవాడ చేరిరి. శ్రీ గురుదంపతులు సూర్యోదయమగుసరికి శివలింగమును ప్రతిష్ఠచేసి నమకచమకములతో నభిషేకించి మరేడు దళములతోను పుష్పములతోను, శివసహస్ర నామార్చన గావించిరి. శ్రీరాముడు హరిహరాభేదరూపుడు కావున శివనామ సంకీర్తనలతోడను, మృదంగాది వాద్యములతోడను భక్తవరులచే భజనలు గావింపబడెను. ఆ మరునాడు గొప్ప యన్నదానము జరిగెను. ఆ రోజునుండియే శ్రీరామతారకమునకు సంపూర్ణారోగ్యము కలుగజొచ్చెను. దేవీ మహిమలుగూడ వీరి కుటుంబము వారికి బాగుగా దెలియుటచే ప్రతి శుక్రవారము రోజునను దేవికి కుంకుమ పూజలుగూడ చేయించుచుందురు.

15-1-1944 తేదీ స్వభానునామ సం॥ర పుష్య బహుళ పంచమీ

శనివారము రోజున మధ్యాహ్నము నివేదన కాలమున దేవి వాలుజడ ధరించి నాట్యము చేయుచు నివేదన మారగించెను. ఆ రోజున నేను గురుసాన్నిధ్యమున నుండగా బోధ సమయమున వారు తమ యనుభూతిని దెల్పిరి.

# శ్రీ షట్చక్ర సీతారామ తారక బ్రహ్మానంద ద్వితీయ సప్తాహ యజ్ఞము

(మహేంద్రవాడలో)

క॥ కరణత్రయంబుచేతను
నరుడే కర్మంబుసేయు - నయ్యైవేళన్
హరికర్పణమని పలుకుట
పరువడి సుజ్ఞానమంద్రు - పరమమునీంద్రుల్.

(భాగవతము 11 స్క ॥ 42 ప॥)

భగవంతుడు భక్తుల హృదయములను పరీక్షించుటకు అనేక విచిత్ర కారణములను గల్పించుచుండును. భగవంతునారాధించునపుడు మనోవాక్కాయ కర్మల మూడింటిలోనేమాత్రము మాలిన్యమున్నను భగవంతుడు క్షమించడు. అట్లుకాక పరిశుద్ధాంతఃకరణుడై భగవంతుని సేవించినవాడూ సుజ్ఞాని. అందుచే భగద్విషయ కార్యములయందేమాత్రమును సంశయాత్మ కూడదు. నిష్కల్మష హృదయులగు సాధువులకే భగవంతుడు సులభసాధ్యుడు. కావుననే

క॥ సాధుల హృదయము నాయది
సాధుల హృదయంబు నేను – జగముల నెల్లనం
సాధుల నేన యెఱుంగుదు
సాధు లెఱుంగుదురు నాదు – చరితము విప్రా.

(భాగ 9 స్క. 123 ప.)

అని భాగవతము ఖండితముగా దెల్పుచున్నది. భగవత్కార్యములు చేయునపుడు సంశయాత్మ కూడదను విషయము వెల్లడి కావలెను. అందుకు తగిన నిదర్శనము అనుభవమైనగాని లోకులు నమ్మరు. అట్టి నీతినే భగవంతుడు భక్తులకు ఋజువు చేయదలచి యుండెను.

ఒకప్పుడు మహర్షి శిష్యకోటికి చెందిన కొందఱు భక్తులకు మహేంద్రవాడలో శ్రీ గురుదంపతులచే శ్రీరామ సప్తాహము జరిపించవలెనను సంకల్పము కల్గెను. విషయముగూడ వెల్లడి చేసిరి. కాని యే కారణముచేతనో వారి యుత్సాహ శక్తి మందగించెను. సప్తాహము జరుగునని మాత్రము చుట్టు ప్రక్కల గ్రామములకు ప్రాకెను.

ఇట్లుండగా 7-1-44 తేదీకి సరియగు స్వభాను నామ సం॥ర పుష్యశుద్ధ ద్వాదశీ శుక్రవారము ఉదయము ఎనిమిది గంటలకు మహర్షి పుంగవులు సమాధినిష్ఠలో నుండగా నూరుమైళ్ళు ఏకకాలమందు బయలుదేరినప్పుడు ఎంత పెద్ద ధ్వని కలుగునో అంత భయంకరమైన ధ్వనితో గూడిన పెద్ద సుడిగాలి వారికి గోచరించెను. ఆ గాలి నక్షత్రమండలమునకు ఎగురగొట్టునేమో యనిగూడ వారు భయపడిరి. ఆ రోజున నేను గురుదేవుని సన్నిధియందే యుంటిని. కొంతసేపటికి ఈవలికి వచ్చి "అబ్బాయి! ఇప్పుడు భయంకరమైన హెూరుతో గూడిన పెద్దసుడిగాలి వచ్చినది. నీకేమైనను భయము కల్గినదా అని మహర్షి పుంగవులు నాతో బల్కిరి. "గురుదేవా! పెద్దహెూరుగాని, సుడిగాలిగాని

యేమియు నే నెఱుగను” అని నేను సమాధానించితిని. అంత గురుస్వామి “అబ్బాయి! ఏదియో భయంకరమైన ప్రళయము మిగుల సమీపములో నున్నదిసుమా!” అని నాతో బల్కిరి. అప్పటికి ద్వితీయ ప్రపంచ సంగ్రామము తీవ్ర రూపముదాల్చి విదేశములు నాశనమగు చుండెను. అపుడు గురుదేవునితో “స్వామీ ఇప్పుడు విదేశములలో యుద్ధాగ్ని బయలుదేరి అన్ని దేశములను దగ్ధ పటలము చేయుచున్నది. అట్టి ప్రళయము మన దేశమునకు ఏమైనను సంభవించునా” అని నేను గురువర్యులను ప్రశ్నించితిని. అపుడు గురువర్యులు “అబ్బాయి! మన దేశమునకు యుద్ధమువలన ప్రమాదము మాత్రము సంభవించదు. కాని నాకు గోచరించిన ప్రళయ మే రీతిగా తాండవించునో నేను చెప్పజాలకున్నాను” అని గురువర్యులు సమాధానించిరి. భక్తులచే సంకల్పింపబడిన సప్తాహ ప్రయత్నము చల్లారెను. చుట్టు ప్రక్కల గ్రామములవారు మాత్రము మహేంద్రవాడలో సప్తాహము ఎప్పుడెప్పుడని చెప్పుకొనుచుండిరి. మహరి&షకి ప్రళయము గోచరించిన యిరువది మూడవరోజున (అనగా 29-1-44 తేదీకి సరియగు స్వభాను నామ సం॥ర మాఘ శుద్ధ పంచమీ శనివారము రోజున) ఉదయమునకు జొన్నాడ గ్రామ నివాసియు, మోటమర్రి గంగయ్యగారి కుమారుడునునగు విశ్వనాథము అను భక్తుడు మహేంద్రవాడవచ్చి గురుస్వామిని దర్శించి “అయ్యా! తాము చేయు సప్తాహ ముహూర్తమెప్పుడు” అని యడిగెను. శ్రీరామచంద్రుడే యా దూతను బంపి భక్తుల హృదయములను బరీక్షింపదలచెను. ఆ బాలుని మాటలువిని “నాయనా ! ఇంకను సప్తాహ ముహూర్తము నిర్ణయింపబడలేదు” అని గురువర్యులు సమాధానము చెప్పిరి.

ఆ రోజుననే ప.గో.జిల్లా తణుకు తాలూకా దువ్వ గ్రామము నుండి మునుకుట్ల సీతారామయ్య అనునొక శిష్యుడు వచ్చియుండెను.

సీతారామయ్యగారు వార్ధక్య దశలో గురువర్యులకు అపారమైన సేవలు చేసియుండిరి. 29-1-44 తేదీ శనివారము రోజున మధ్యాహ్నాము గం ॥ 12-0 లకు గురుస్వామి దేవతామందిరము చేరి శ్రీ హనుమత్సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న సకల దేవతా పరివార సహితుడగు శ్రీరామచంద్ర ప్రభువుకు మహానైవేద్యము చేయుచుండిరి. దేవతలందఱును ఎదుట ప్రత్యక్షమై గురువర్యులర్పించు నివేదన పదార్థములు స్వీకరించుచుందురు. వారు మహా నైవేద్యము చేయునపుడు ఎవ్వరును దగ్గర నుండగూడదు. ఇంచుమించు నొక గంటసేపటికిగాని గురువర్యుల నివేదనా క్రమము తేలదు. అందుచే గురుస్వామి ఒంటరిగా దేవతా మందిరముచేరి తలుపులువేసి నైవేద్యము చేయుచుండిరి. భక్తజన రక్షాదీక్షితుడుకు, పరమ శాంత స్వరూపుడునగు శ్రీరామచంద్రుడా దినమున తీవ్రరూపము దాల్చి కాలాగ్ని రుద్రునివలె నుండెను. గురుస్వామి మూలకముగా దన మహిమా విశేషమును భక్తులకు జూపదలచియుండెను. అట్లు చేసినగాని భక్తుల హృదయములు బాగు పడవని తలచెను. శ్రీమహర్షులవారు దేవతా నైవేద్యము చేసి భోజనమునకు గూర్చుండి యొక్క కబళము మాత్రమే నోటిలో బెట్టుకొనిరి. భోజనము చేయునపుడు గూడ దగ్గర నెవరును నుండగూడదు. వెంటనే సకల దేవతా పరివార సహితుడగు శ్రీ రామచంద్రుడు గురువర్యుల జుట్టుపట్టుకొని నాల్గు గోడలమీదికిని విసరికొట్టసాగెను. భుజించుచున్న యన్నమంతయును చెల్లాచెదరై పోయెను. అచటనున్న బిందెలమీదను, గిన్నెలమీదను, గోడలమీదను, విసరికొట్టుటచే గురుపుంగవులకు శరీరమంతటను బలమైన దెబ్బలు తగిలెను. అట్లు దెబ్బలు తినుచు ఆర్తులై "సీతారామయ్యా! సీతారామయ్యా!" అని గురుస్వామి బొబ్బలిడుచునే యుండిరి. ఈ భీభత్సమంతయును మేడ పై భాగమున దేవతా మందిరములో జరుగుచుండెను. మేడ క్రింది భాగమునందలి

వంటశాలలో అందఱును భోజనములు చేయుచుండిరి. అపుడేదియో పనిమీద మహర్షి పౌత్రికయగు చి॥ సౌ॥ అగు బాపాయమ్మ మేడపైకివెళ్ళి దేవతా మందిరము చూడగా గురుస్వామి శరీర స్మృతిలేక పడియుండిరి. భోజన పదార్థములును దేవతా విగ్రహములును చెల్లాచెదరై పోయి గాలి తుపాను పట్టునప్పటి భీభత్సముగా నుండెను. అది చూచి బాపాయమ్మ తొట్రుపాటు పడుచు క్రిందికి వెళ్ళి చెప్పెను. అందఱును భోజనములు మానివేసి మేడపైకి పరుగెత్తిరి. మునుకుట్ల సీతారామయ్యగారు రివ్వున పైకివెళ్ళి బాబయ్యగారూ! బాబయ్యగారూ ! అని దగ్గరచేరి పిలిచిరి. శ్రీ గురువర్యులు శరీర స్మృతి యెఱుగక నేలపై పడియుండిరి. ఇంటిలోని వారందఱును తొట్రుపాటు పడుచు ముందు మార్గము తోచకుండిరి. శ్రీరామచంద్రుడు గావించిన ప్రళయ భీభత్సము నూహింపనెవరి తరము? మహర్షి యైదవ యేట నుండియే మిత్రుడై కనుఱెప్పవలె గాపాడుచున్న శ్రీరామచంద్రుడానాడు తన తీవ్రస్థితిని ప్రత్యక్షముగా భక్తులకు జూపదలచియుండెను.

ఆ గదిలో నుండి గురుస్వామి నీవలికి దీసికొనివచ్చి ఒక చిత్రాసనముపై పరుండబెట్టిరి. ఇట్లు రెండు రోజులా గురుస్వామి ఎవరితోను మాట్లాడక శరీరస్మృతియే యెఱుగకుండిరి. కాని యా మహర్షి నిర్వికల్ప సమాధిలో ప్రవేశించియున్నట్లు చాలమంది గ్రహించలేకపోయిరి. రెండు రోజులైన తర్వాత శరీరమునకు కొంచెము చలనము కల్గెను. శ్రీవారు అఖండ తపోదీక్షలో మునింగియుండిరి. చీమ చిటుక్కుమన్న శబ్దము విన్నను వారికి మిక్కిలి దుస్సహముగా నుండెను. అఖండ తపోదీక్షలో మునింగియుండుటచేత ఎవరైనను పలుకరించినచో వారికి కంపరమెత్తుచుండెను. మహర్షుల తపోదీక్షా రహస్యములు ప్రమత్తులగు సంసారులకు గ్రహింపదరమా!

ఉ॥ అచ్చపుఁ జీకటింబడి గృహవ్రతులై విషయ ప్రమత్తులై
చచ్చుచు బుట్టుచున్ మరలఁ జర్విత చర్వణులైన వారికిన్
జెచ్చెరఁబుట్టునే పరులు - సెప్పిననైన నిజేచ్ఛనైననే
మిచ్చినైనఁగానలకు - నేగిననైన హరిప్రబోధముల్
(భాగవతము)

మమర్షి లక్షణములన్నియు జూచి బంధువులును, స్నేహితులును, ఇదేదియో భయంకరమైన వ్యాధియని భ్రమపడిరి. అందుచే ఇంగ్లీషు డాక్టరును, ఆయుర్వేద వైద్యులను రప్పించి పరీక్ష చేయించ మొదలుపెట్టిరి. ఏ వైద్యునికిని ఆ లక్షణముల మూలకారణము గోచరింపదయ్యెను. నాడీ పరిజ్ఞానమునుబట్టి గూడ శరీరమందెట్టి వ్యాధియు లేనట్లు వైద్యులు నిశ్చయించిరి. కాని గురుస్వామి ఆకలి దప్పికలతో నిమిత్తము లేకుండగ శ్రీరామ తారక పరబ్రహ్మమందు లీనమై తమలో దాము అమృతపానము చేయుచునే యుండిరి. సామాన్య మానవ దృష్టికకి ఆ లక్షణములెట్లు గోచరించును? శ్రీరామ జనయజ్ఞ దీక్షలో నుండిన యా దివ్య పురుషుని భౌతిక దేహస్థితిని గుర్తింప నెవరితరము? గురుపత్నియగు బావనాంబగారును, ఇతర భక్తులును శ్రీరామచంద్రునికనేక విధములుగా మ్రొక్కుకొనుచుండిరి. ముళ్ళపూడి గంగరాజుగారును, కర్రి నారయ్యగారును సకుటుంబముగా వచ్చి గురుసాన్నిధ్యమున నిల్చి పరిపరి విధములుగా శ్రీరామచంద్రుని ప్రార్థించుచుండిరి. భక్తుల హృదయములలో నంకురించిన మాలిన్యము పోయినగాని గురుదేవుని మంచముపై నుండి లేవనీయనని శ్రీరామచంద్రుడు గట్టిగా పట్టుపట్టెను. సప్తాహ సంకల్పము నిష్కళంకము కావలెనని శ్రీరాముడు గురువర్యుల యొడిలో గూర్చుండి మాటిమాటికి చెప్పుచుండెను. ఆ విషయము గురువర్యులకు మాత్రమే తెలియును. ఆ సంగతి గురుపత్ని బావనాంబగారు తెలిసికొని స్నానము చేసివచ్చి

దేవతామందిరము చేరి "ఓ దేవదేవా! ఓ ఆపద్బాంధవా! అనాధరక్షకా! శ్రీరామచంద్రా! జగజ్జననీ జానకీ! మీ మాయం దెలిసికొన మానవమాత్రులమగు మేమంతటివారము? బాల్యమునుండియు నిన్ను నమ్మిన భక్తుని ఈ విధముగా బాధించుట న్యాయమేనా! మా యపరాధములను, మా భక్తుల యపరాధములను క్షమించి కాపాడుము. మా భక్తులందఱిచేతను శ్రీరామ సప్తాహమహోత్సవము యధాశక్తిగా తప్పక చేయించెదను. కరుణింపుము. నీ భక్తునికి వెంటనే సంపూర్ణారోగ్యము కల్గించుము. ఎంతమాత్రమును సందేహము లేదు". అని తదేక దీక్షతో పరిపరివిధముల ప్రార్ధించిరి. గురుపత్ని ప్రార్ధన శ్రీరాముడు గ్రహించెను. పరమ దయార్ద్ర చిత్తుడును, భక్తజన దీక్షాదక్షుడును నగు శ్రీరామచంద్రుడు ప్రసన్నుడయ్యెను. భక్తుల హృదయములు గూడ పరిపక్వమయ్యెను. అప్పటికి 17 రోజులయ్యెను. ఆ 17 రోజులలోను మంచినీరు త్రాగినను విషము త్రాగిన విధముగా గురువర్యుల కంఠనాళము మండిపోవుచుండెను. అనగా 17 రోజులు ఆహార పాణీయములు లేక శ్రీరామతారక పరబ్రహ్మమందు లీనమై తమలో తాము అమృతపానము చేయుచునే యుండిరి. ఇక తన భక్తుని బాధించుట యుక్తముగాదని శ్రీరామచంద్రమూర్తి తలంచెను. తాను ప్రసన్నుడై సప్తాహ మహాయజ్ఞమునకు సంసిద్ధుడై యున్నట్లు శ్రీరామచంద్ర మూర్తి లోకులకు నమ్మకము కల్గించదలచెను.

మహేంద్రవాడకు సమీపమున నాల్గు ఫర్లాంగుల దూరములో రాయవరము అను గ్రామము గలదు. ఆ గ్రామమున వయోవృద్ధుడును. తత్త్వవేత్తయును. కాపువంశమున పుట్టినవాడును, సత్యవాదియును, మహర్షి ప్రియశిష్యుడును నగు కర్రి పుల్లయ్య యనునొక భక్తుడుండెను. అతడు గూడ నిత్యమును గురుదేవుని దేహస్థితి చూచి వెళ్ళుచుండెను. 17వ నాటి రాత్రి (అనగా 15 ఫిబ్రవరి 1944 తేదీరోజున) కర్రి

పుల్లయ్యగారు భగవద్ధ్యాన పరాయణులై గురుమంత్రమును జపించుచుండగా నీలమేఘశ్యామ సుందర దేహుడగు శ్రీరామచంద్రుడెదుట సాక్షాత్కరించెను. ఆ దేవదేవుడు మెఱపు తీగను మఱపించు పీతాంబరము ధరించియుండెను. నవరత్న స్థగితమైన సువర్ణ కిరీటము శిరస్సుపై ప్రకాశించుచుండెను. మెడలో వనమాలగలదు. రెండు హస్తములలోను శంఖము చక్రము ప్రకాశించుచుండెను. మోముపై చిఱునవ్వు తాండవమాడుచుండెను. అట్టి శ్రీరామచంద్రుడు 'కర్రి పుల్లయ్యను జూచి "ఓ భక్తాగ్రేసరా! నీ గురుమూర్తి యిన్ని రోజులు నిరాహారులై యుండగా నీవిట్లు నిశ్చింతగా గూర్చుంటివా ? నీ బీరువాలో రెండు బత్తాయిపండ్లు గలవు. అచ్చటనే సగ్గుబియ్యపు పొట్లము గూడ గలదు. గోక్షీరము పట్టుకొని వెళ్ళి సగ్గుబియ్యపు పాయసమును చేయించి, బత్తాయిపండ్ల రసమును, సగ్గుబియ్యపు పాయసమును నీ గురువర్యులకు ఇప్పించుము" అని చెప్పి అదృశ్యుడయ్యెను. ఇది యంతయును జాగ్రదవస్థలో జరిగిన విచిత్ర సంఘటనము. తన యింటిలో బత్తాయి పండ్లున్నట్లుగాని, సగ్గుబియ్యపు పొట్లమున్నట్లుగాని, పుల్లయ్య గారికి తెలియనే తెలియదు. శ్రీరాముడు చెప్పిన ప్రకారము ధ్యాననిష్ఠలో నుండి లేచి తాళముతీసి చూడగా బీరువాలో రెండే బత్తాయిపండ్లును, సగ్గుబియ్యపు పొట్లమును జాగ్రత్తగా దాచియుంచబడెను. ఆహా! శ్రీరామచంద్రుడెంతటి కపటనాటక సూత్రధారి, తానే స్వయముగా బత్తాయి పండ్లును, సగ్గుబియ్యమను, బీరువాలో సిద్ధముచేసి తరువాత జపదీక్షలోనున్న కర్రి పుల్లయ్యకు సాక్షాత్కరించి గురుదేవుని దగ్గరకు వెళ్ళుమని తొందరపెట్టెను. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీరాముడే స్వయముగా గురుదేవునికి ఫలములిచ్చి పంపుట యెట్టివింత! బాపనాంబగారి ప్రార్థన యెంత పవిత్రమైనది. ఏమి ప్రత్యక్షమహిమ?

శ్రీ కర్రి పుల్లయ్యగారు శ్రీరామచంద్రుని యాజ్ఞ ప్రకారము తక్షణమే రాయవరం నుండి బయలుదేరి మహేంద్రవాడ వెళ్ళి శ్రీరామ దర్శనాది విశేషములను పూసగ్రుచ్చినట్లు తమ గురువర్యులకు విన్నవించుకొనిరి. అప్పటికి గురువర్యుల నిరాహార తపోదీక్ష గూడ ముగిసెను. శ్రీరాముడే స్వయముగా ఫలములు పంపినపుడు మహరి&ష యూరకుండుటయెట్లు? 18వ రోజుకు అనగా 16 ఫిబ్రవరి 44 తేదీ యుదయమునకు గురుదేవుని గర్భకోశమున జఠరాగ్ని కొంచెము ప్రజ్వలించెను. అందుచే శ్రీరామాజ్ఞాప్రకారముగా రెండు బత్తాయిపండ్ల రసమును, గిద్దెడు సగ్గుబియ్యపు పాయసమును, శ్రీరామునికి నైవేద్యముచేసి ఆ ప్రసాదము కండ్లకద్దుకొని పుచ్చుకొనిరి. అప్పటి నుండియే క్రమక్రమముగా మహర్షికి దేహదార్ఢ్యము కల్గెను. గురుదేవుని శిష్యులు శ్రీరామ సప్తాహ దీక్షకై ప్రయత్నములు చేయనారంభించిరి.

స్వస్తి శ్రీ చాంద్రమాన తారణనామ సం॥ర వైశాఖ శుద్ధ సప్తమీ స్థిరవారము (అనగా 29-4-1944 తేదీ) రోజున సూర్యోదయాత్పూర్వము గం. 5-30 లకు పునర్వసూ నక్షత్ర చతుర్థ చరణయుక్త మీన లగ్నమందు శ్రీ సుబ్రహ్మణ్య గురుదంపతులచే శ్రీ షట్చక్ర సీతారామ తారక బ్రహ్మానంద ద్వితీయ సప్తాహ మహోత్సవము మహేంద్రవాడలో జరుపుటకు దైవజు&ఞులచే నిశ్చయింపబడెను.

పందిరి ఎక్కడవేసిన బాగుగా నుండునని భక్తులు ఆలోచించుచుండగా కర్రి నారయ్యగారి భార్యకు, జగన్మాత నిరాలంబములో కనబడి విశాలం విశాలం అని చేయి ఊపుచు దర్శనమిచ్చెను. ఆ దేవి ఎఱ్ఱని చీర కట్టుకొని పెద్దబొట్టు పెట్టుకొని చెవులకు జూకాలు అలంకరించుకొని విశాలం విశాలం అని పల్కెను. అప్పుడు పందిరి విశాలముగా వేసిరి. మహేంద్రవాడలో శివాలయము నెదుట శ్రీరామమంటపము తూర్పు

ముఖముగా నలంకరింపబడెను. పలురంగులతో చిత్రింపబడిన వివిధములగు దేవతా విగ్రహములతోడను, చిత్ర విచిత్రములైన రంగు కాగితపు పూలలతలతోను, విద్యుద్దీపములతోను, శ్రీరామమందిరము ప్రత్యక్ష వైకుంఠ మందిరమువలె నలంకరింపబడెను. గురుదేవుని యాశ్రమము సప్తాహము చేయుచోటికి నాల్గు ఫర్లాంగుల దూరములో గలదు. అందుచే సుముహూర్త సమయమునకు ముందుగా గురు దంపతులను రెండు మేనాలలో గూర్చుండబెట్టి భజనలతోను, వివిధ మంగళవాద్య విశేషములతోను, భక్తులందఱును బ్రహ్మరథము పట్టి యూరేగించుచు సప్తాహము చేయు మందిరము దగ్గరకు తీసికొని వెళ్ళిరి. వేదవాక్కులతోను, స్వస్తివాచకములతోను, సరియైన సుముహూర్త సమయమునకు శ్రీరామ సప్తాహ యజ్ఞము ప్రారంభింపబడెను.

వేదపారాయణలతోడను, రామాయణ పారాయణలతోడను, గీతాపారాయణముల తోడను, రుద్రాభిషేకములతోడను, సూర్యనమస్కారములతోను, నిర్విరామ శ్రీరామ భజనలతోను, హరికథలతోను, పురాణ కాలక్షేపములతోను, సప్తాహదీక్ష వైభవముగా జరుగుచుండెను. ఉదయము గం.10–0 లకు శ్రీరామ సహస్రనామార్చనయును, సాయంకాలము సీతాపరమేశ్వరికి సహస్రనామములతో కుంకుమార్చనయును జరుగుచుండెను. శ్రీ కర్రి నారయ్యగారు నిరంతరము గురుసాన్నిధ్యముననుండి వారి యాజ్ఞకై నిరీక్షించుచుండిరి. గురుదేవుని శిష్యులును, వివిధ గ్రామముల భక్తులును, సప్తాహ దీక్షలో పాల్గొనియుండిరి. మధ్యాహ్నము గం. 2–0లు మొదలు గం. 4–0 వఱకును బ్రహ్మశ్రీ అనిపెద్ది జగన్నాథ శాస్త్రిగారి పురాణ కాలక్షేపము జరుగుచుండెను. మధ్యాహ్నము గం. 4–0 లు మొదలు 7 గంటలవఱకును కృష్ణాజిల్లా అవనిగడ్డ గ్రామనివాసులైన శ్రీనముడూరి

విశ్వనాధశాస్త్రిగారిచే అష్టపది, తరంగములతో గూడిన హరికథా కాలక్షేపములు జరుగుచుండెను. రాత్రివేళలందు వివిధ గ్రామముల నుండి వచ్చిన హరిదాసులచే హరికథా కాలక్షేపములు జరుగుచుండెను. తెల్లవారగట్ల మూడు గంటలనుండి ఆరు గంటలవఱకును నముడూరి విశ్వనాధశాస్త్రిగారిచే ప్రభాత సేవలు గావింపబడుచుండును. వారి ప్రభాతసేవా కీర్తనలు భక్తులందఱును నిశ్శబ్దముగా వినుచుండిరి. ఆ పుణ్యసమయమున లింగాల సూర్యనారాయణ సత్యవతి అను దంపతులు శ్రీసీతారాములకు ప్రభాత సప్తాహ దీక్ష పూర్తియగువఱకును మునుకుట్ల సీతారామయ్యగారు గురువర్యులకు అపారసేవలొనర్చిరి. “అతడు నాకు గావించిన సేవలు శిష్యులలో ఎవరును చేసియుండలేద”ని గురువర్యులే ఒక సందర్భమున నాతో బల్కిరి. ఆ సప్తాహ దీక్షలో ఋత్విక్కులుగా ఈ క్రిందివారు పనిచేసిరి.

1. శ్రీ నాగదేవర సుబ్బారాయుడుగారు
2. ,, తుట్టగుంట జోగిశర్మగారు
3. ,, తుట్టగుంట వెంకట రత్నావధానులుగారు
4. ,, రేగడమిల్లి శ్రీరాములుగారు
5. ,, ముష్టి కామావధానులుగారు
6. ,, మహేంద్రవాడ సుబ్బన్న శాస్త్రిగారు
7. ,, మల్లాది సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.
8. ,, పోతుకుచ్చి రామమూర్తి శాస్త్రిగారు
9. ,, వారణాసి ప్రకాశశాస్త్రిగారు
10. ,, కనకదండి కామేశ్వరశాస్త్రిగారు

11.,, దేవరకొండ సత్యనారాయణగారు

ఎనిమిదవ రోజున (వైశాఖ శుద్ధ చతుర్ధశి స్థిరవారము రోజున )

పూర్ణాహుతి జరిగెను. ఆ రోజున గురుదంపతులను రెండు మేనాలలో గూర్చుండబెట్టి భక్తులందఱును బ్రహ్మరథముబట్టి గ్రామమంతయు నూరేగించి తుల్యభాగానదికి అవభృథస్నానమునకు వెళ్ళిరి. ఆ నదిలో శ్రీ గురుదేవుని పాదతీర్థముచే నందఱును పవిత్రస్నానమునకు వచ్చి సామ్రాజ్య పట్టాభిషేకము జరిపిరి. హోమశేషమైన పాయసము గురుదేవునిచే నందఱికిని ప్రసాదముగా నీయబడెను. పిమ్మట ఋత్విక్కులును, ఇతర పండితులును సత్కరింపబడిరి. ఆ రాత్రి గురుదంపతులను రెండు మేనాలలో గూర్చుండబెట్టి భక్తులు ఊరేగించుచు వారి స్వగృహము చేర్చిరి.

ఈ శ్రీరామ సప్తాహ మహాజ్ఞమునకు అహర్నిశలు నిర్విరామ కృషి సల్పి శ్రీరామచంద్రప్రభువునకును, శ్రీగురుదంపతులకును అపార సేవలొనర్చిన శ్రీ కఱ్ఱి నారయ్యగారును, వారి ధర్మపత్నియగు శ్రీమతి చెల్లాయమ్మగారును, ఇతర శిష్యులును, భక్తులును ప్రశంసనీయులు. ఈ సప్తాహమనకు సర్వవిధముల సహకరించి దిగ్విజయముగా జరిపించిన మహేంద్రవాడపురజనులును, ఇతర గ్రామస్థులును మిగుల పుణ్యాత్ములు. ఈ సప్తాహమునకు సుమారు ఇరువదివేల మందికి అన్ని వర్ణములవారికిని గొప్ప అన్నదానము జరిగెను. ఆ దీక్షా సమయములలో అల్లర్లుగాని, దొంగతనములు మొదలగునవి గాని ఏమియు లేకుండగ కార్యరంగములు ముగిసెను. సప్తాహము సంకల్పింపబడినప్పటి నుండి పూర్ణాహుతి పూర్తియగువఱకును వీరాంజనేయుడు నీ వెంటనేయుండి కార్యరంగములు నడిపించునని శ్రీ మహర్షులవారు కఱ్ఱి నారయ్యగారివెంట హనుమంతుని బంపియుండిరి. శ్రీరామకార్య ధురంధరుడగు హనుమంతుని విజయతాండవమే మహేంద్రవాడ సప్తాహము.

శ్లో ॥ బహికేసమనుప్రాప్తే మాంస్మరేద్రామ సేవకం
సర్వధా జాగరూకో స్మిరామకార్య ధురంధరః॥

(శ్రీరామభక్తుల యైహిక కార్యముల నెఱవేర్చుటకు రామకార్య ధురంధరుడగు హనుమంతుడు సర్వవిధములుగాను సంసిద్ధుడై యుండును.) – రామరాహస్యోపనిషత్తు

# గురుదేవుని దివ్యదృష్టి

గురువర్యులు సమాధినిష్ఠలో ప్రవేశించినపుడు భూత భవిష్యద్వర్తమానములన్నియు వారికి గోచరించుచుండును. ఆరు మాసములలో రాగల తుఫాను భీభత్సము గురువర్యులకు గోచరించెను 15-3-1945 తేదీకి సరియగు పార్థివనామ సం॥ర చైత్ర శుద్ధ పాడ్యమి గురువారమునాడు మొదటియామమున తపస్సులో నుండగా 17-10-45 తేదీకి సరియగు పార్థివ సం॥ర ఆశ్వయుజ శుద్ధ – ఏకాదశీ బుధవారము రోజున రాగల తుఫాను భీభత్సము వారికి గోచరించెను. 14-10-45 తేదీకి సరియగు పార్థివ సం॥ర ఆశ్వయుజ శుద్ధ – అష్టమి ఆదివారము రోజున దేవీ నవరాత్ర మహోత్సవ దర్శనమునకై నేను మహేంద్రవాడ వెళ్ళియుంటిని. అపుడు గురుస్వామి నన్ను జూచి “రాబోవు ఏకాదశి రోజున అఖండ వర్షయోగమున్నది. ఆ వర్షయోగము సంవత్సరాది రోజుననే నాకు గోచరించినది. నిరీక్షించి యుండు” మని నాతో బల్కిరి. శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారును, శ్రీ కంటిపూడి శ్రీరాములుగారును ఆ యేకాదశి రోజుననే గురుసన్నిధిని ఏకాహము జరుపదలచిరి.

# ముగ్గురు రాములు ఒకేసారి ధనుర్ధరులై సాక్షాత్కరించుట

17 అక్టోబరు 1945 తేదీకి సరియగు పార్థివ సం॥ర ఆశ్వయుజ శుద్ధ – ఏకాదశి రోజున శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారును శ్రీ కంటిపూడి శ్రీరాములుగారును మహేంద్రవాడలో గురుసన్నిధిని శ్రీరామభజనలతో ఏకాహ మహోత్సవము జరుపుటకు నిశ్చయించుకొనిరి. ఆశ్వయుజశుద్ధ పాడ్యమి మొదలుకొని దేవీ నవరాత్రములలో శ్రీరాజరాజేశ్వరీ జగన్మాతకు మహావైభవముగా కుంకుమపూజలు జరిగి యుండెను. శిష్యులును, భక్తులును ఆ తొమ్మిది రోజులలోను కుంకుమ పూజలు చేయించు కొనుటయేగాక అపారమైన యన్నదానముగూడ చేసికొనియుండిరి. జగజ్జనని విజయాభిషేకములతో నవరాత్రదీక్ష ముగిసెను.

ఏకాదశిరోజున సూర్యోదయమగుసరికే శ్రీ ముళ్ళపూడి గంగరాజు గారును వారి పరివారము కంటిపూడి శ్రీరాములుగారును వారి ధర్మపత్నియగు వీరమ్మగారును, పూజా ద్రవ్యాదులతో గురుసన్నిధికి చేరియుండిరి. రాజమండ్రి నుండి దెందులూరి సత్యనారాయణమూర్తి గారును, మలకపల్లి నుండి తమిరిశ వెంకటసుబ్బమ్మగారును, వేట్లపాలెం నుండి లింగాల సీతమ్మగారును ఆ రోజు సూర్యోదయమునకే మహేంద్రవాడ వచ్చియుండిరి. గురువర్యులు స్నానముచేసి తమ పీఠముపై గూర్చుండి కాకుభుశుండి కథతో బోధ ప్రారంభించిరి.

కాకుభుశుండి గరుత్మంతునితో నిట్లు చెప్పుచున్నాడు. ఓ పక్షిరాజా! శ్రీరాముని చరిత్ర బహు విచిత్రమైనది. అయోధ్యలోని రాజభవనము మిగుల

సుందరమైనది. కనుక మందిరమున వివిధ రత్నములు నాటబడియుండెను. రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు రాజభవనముయొక్క ముందటి వాకిలిలో బాలలీలలు నెఱపుచుండిరి. శ్రీరాముడు ఆడుకొనుచు ముందటి వాకిలిలోనికి వచ్చెను. రాముని యరచేతులలో వజ్రము, అంకుశము. ధ్వజము, పద్మము అను రేఖలు గలవు. కాళ్ళకు గజ్జెలును; మొలకు బంగారు మొలత్రాడును గలవు. సర్వాంగ సుందరుడగు బాలరాముడు రాజభవనము ముందు ఆడుకొనుచు తన ప్రతిబింబమును జూచి గంతులు వేయు చుండెను. కాకుభుశుండి మహర్షి కాకి రూపముగా నుండుటచే రామునిచెంత వ్రాలెను. బాలరాముడు కాకిని పట్టుకొనబోయెను ; కాని కాకుభుశుండి దూరముగా తొలగ నారంభించెను. రాముడు కాకిని పట్టుకొనుటకు చేతులు చాపుచుండెను. కాకి ఎంత దూరము ఎగురుచుండెనో అంతవఱకును బాల రాముని చేతులు వ్యాపించుచుండెను. కాకుభుశుండి బ్రహ్మలోకము వఱకును వెళ్ళి వెనుకకు చూడగా బాలరాముని రెండు చేతులును కాకుభుశు ండి వెనుకనే రెండంగుళముల దూరము వఱకును వ్యాపించియుండెను. రాముని బాలలీల కాకుభుశుండికి తప్ప నితరులెవరికిని గోచరింపకుండెను. రామలీలగాంచి కాకుభుశుండి భయపడి కండ్లు మూసికొని తెఱచుసరికి అయోధ్యలోగల దశరథ మహారాజు రాజభవనమే యుండెను. తన భక్తుడైన కాకుభుశుండిని తరింపజేయుటకు బాలరాముడు తనలీల నొక్కసారి చూపెను.

ఈ చరిత్రనే శ్రీ మహర్షులవారు శిష్యులకు బోధచేయుచుండిరి. రామ లీలలు అనంతములు సుమా! అని పల్కుచుండగా గురుదేవునియెదుట ముగ్గురు రాములు ధనుర్ధరులై, సర్వాలంకార శోభితులై సాక్షాత్కరించిరి. కాని శిష్యులెవరికిని ఆదృశ్యము కాన్పించలేదు. బోధన సమయమున గురు వర్యులు తన్మయులైయుండి రామదర్శన వృత్తాంతమును శిష్యులకు తెల్పిరి.

ఆ రోజున మేడ పై భాగముననున్న శ్రీ సీతారామ విగ్రహములను మేడ క్రిందిభాగములోనికి తీసికొనివచ్చి ఒక బల్లపై పట్టుతాపితావేసి దానిపై సీతారాముల నలంకరించిరి. కర్రి నారయ్య మొదలుగాగల భక్తులనేకులు పూజాద్రవ్యాదులతో నచటకు వచ్చియుండిరి. శ్రీ గురుదంపతులు ఏకాహ సంకల్పము గావించిరి. వెంటనే భజనలు గూడ ప్రారంభింపబడెను. ఒక్క నిమిషమైనను విరామము లేకుండగ రాయవరం భక్తులును, ఇతరులగు స్త్రీ పురుషులును భజనలలో పాల్గొనిరి. తెల్లవారుజామున దెందులూరి సత్యనారాయణగారు ప్రభాత సేవలు గావించి శ్రోతల నానందింపజేసిరి. మరునాడు ద్వాదశి రోజున సుమారు రెండువందలమందికి అన్నదానము జరిగెను. గృహసు&థలైన భక్తులు సేవించుచున్నపుడు శ్రీరాముడు ధనుర్ధరుడై వారల గాపాడుచుండును.

"రామశ్శస్త్రభృతామహం"

(ధనుర్ధరులలో నేను రాముడనుసుమా)

భగవద్గీత 10 అ 31 శ్లో ॥

మఱియు తలచినంతనే దర్శనమిచ్చి రక్షించువాడు కావుననే రామదాసుగారు "మ్రొక్కిన నీకు మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవయీవలెం, దక్కిన మాటలేమిటికి దాశరధీ! కరుణాపయోనిధీ!'' అని చెప్పుకొనియున్నాడు.

మఱియు 15-3-1945 తేదీ రోజున గురువర్యులకు సమాధిలో గోచరించిన తుపాను భీభత్సము 17-10-45 తేదీ ఏకాదశీ బుధవారమునాడే సంభవించెను. గురుమందిరమున ఏకాహము సూర్యోదయమునకే ప్రారంభమయ్యెను. ఆనాటి యుదయమునుండియే కొంచెము చినుకులు ప్రారంభమై రాత్రి 12 గంటలగుసరికి గాలితుపాను

ప్రళయతాండవముతో విజృంభించెను.

ఆ తుపాను వలన విశాఖపట్టణము, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలకు విపరీత నష్టము సంభవించెను. కాకినాడవద్ద ఉప్పు కొటారులలో నిలువ యుంచిన రెండు లక్షల బస్తాల యుప్పు కొట్టుకొనిపోయెను. చాలమంది జనులు చనిపోయిరి. అరటి – చెఱకు తోటలు పూర్తిగా ధ్వంసమయ్యెను. అమలాపురం, రాజోలు తాలూకాలలోని కొబ్బరితోటలు నాశనమయ్యెను. రాయవరం, మహేంద్రవాడ గ్రామములకు రెండు లక్షల రూపాయల నష్టము కల్గెను. ఆ యేడు బియ్యపుబస్తా రు 34 లు ఖరీదయ్యెను. ఇట్టి త్రికాల విషయములు గురువర్యులకు గోచరించుచునే యుండును.

# శ్రీ గురుదేవుని లీలలు

శ్రీ మునుకుట్ల సీతారామయ్యగారు గురుదేవునికి సపర్యలొనర్చుచుందురు. 20 జనవరి 1945 తేదీ మధ్యాహ్నము 5 గంటలకు జరిగిన విచిత్రమేమనగా సీతారామయ్యగారు మహర్షి యెదమప్రక్క గూర్చుండి బోధ వినుచుండిరి. అప్పుడు శరత్కాల పూర్ణిమనాటి చంద్రకాంతితో సమానమగు తేజస్సుతో గూడిన యొక నూతన శిరస్సు గురుదేవుని శిరస్సు ప్రక్క ప్రత్యక్షమయ్యెను. ఆ రెండవ శిరస్సుపై నవరత్నస్థగితమైన సువర్ణ కిరీటము ప్రకాశించుచుండెను. ఒక శిరస్సు స్వచ్ఛమైన ధవళకాంతిగల కిరీటముతోను, ఒక శిరస్సు కిరీటము లేకుండగను, గన్పించి మాయమయ్యెను. ఆహా! గురుదేవుని లీలల నూహింప నెవరితరము? ఆ సీతారామయ్యగారి పుణ్య విశేషమేమని చెప్పదగును?

# గురుదేవునికి సత్యనారాయణస్వామి ప్రత్యక్షమగుట

6-5-45 తేదీకి సరియగు పార్థివ సం॥ర వైశాఖ బహుళ ఏకాదశి రోజున మహేంద్రవాడలో గురుసాన్నిధ్యమున సత్యనారాయణవ్రతము చేసికొనుటకు శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారు సంకల్పించిరి. గుర్వాజ్ఞాను సారముగా గంగరాజుగారు పూజాద్రవ్యాధికములు తీసికొనివచ్చి సకుటుంబ సపరివారముగా నిర్ణీత కాలమునకు గురుసాన్నిధ్యమున హాజరైయుండిరి. మంటపారాధనమగుసరికి గురుదేవుని యెదుట సత్యనారాయణస్వామి ప్రత్యక్షమయ్యెను. సత్యమే నారాయణ స్వరూపము. సత్యమనగా పర బ్రహ్మత్త్వము. గురువర్యులు గావించునది పరబ్రహ్మోపాసన. ఆ పరిపూర్ణ నిర్గుణతత్త్వము ఒకపుడు రాముడుగాను, ఒకపుడు శంకరుడుగాను, ఒకపుడు దేవిగాను, సగుణబ్రహ్మమై సాక్షాత్కరించుచుండును. సగుణబ్రహ్మ సాక్షాత్కారమే ఆనందకారణము. శ్రీ గురువర్యులు గృహస్థులై రాజయోగపు ఠీవితో సంసారయాత్ర నెఱపుచు గృహస్థులైన శిష్యులకు భక్తిజ్ఞాన వైరాగ్య తత్త్వముల బోధించి తరింపజేయుచుందురు. శ్రీ మహర్షుల వారి తపస్సు సత్యమైనది కనుకనే సత్యనారాయణస్వామి ఆ వ్రతమంటపముపై చతుర్బాహుయుక్తుడై యుండెను. శంఖ, చక్ర, గదా, ఖడ్గములు ధరించియుండెను. శిరస్సుపై నవరత్న స్థగితమగు సువర్ణ కిరీటము ప్రకాశించుచుండెను. బాహువులయందు భుజకీర్తులు మెఱయుచుండెను. దివ్యసుందర విగ్రహుడగు నా దేవదేవుడు వ్రతము సాంతమగువఱకును, మహరియెదుటనే యాసీనుడై యుండెను. గురుస్వామియే పూజలు చేయుచున్నను దేవతలు నిజరూపములతో వచ్చి పూజాదికములు స్వీకరించ వలసినదే. కావుననే శ్రీ మహర్షులవారు నిరంతరము దేవతలతోనే సంభాషణాదులొనర్చుచు బ్రహ్మానందము నొందుచు తన్మయులైయుందురు.

# మహర్షి నరసింహావతారముదాల్చి సాక్షాత్కరించుట

భగవంతుడు భూమియందవతరించినదవుడు లోకులకనేక విధములుగా లీలలు చూపుచు జ్ఞానోపదేశము చేయుచుండును. అవతార మూర్తులయందు భేదబుద్ధి కూడదను విషయము లోకమునకు వెల్లడికావలెను. అట్టి ప్రబల నిదర్శనము చూపినగాని లోకులు విశ్వసించరు. శ్రీ మహావిష్ణువే నరసింహావతారము దాల్చినట్లు పురాణములయందు దెల్పబడియున్నది. శంకరుడు నరసింహావతారము దాల్చెనని చెప్పినచో నందఱును పరిహసింతురు. శంకరునియందును, విష్ణువునందును, ఉపాధిభేదము తప్ప నిర్గుణపరతత్త్వమందు భేదము లేదు. ఈ విషయమునే శ్రీకృష్ణుడు ధర్మరాజుతో నిట్లు చెప్పెను.

శ్లో ॥ శంకరం మాంచసర్వేశం భేదబుద్ధి వివర్జితః
యఃపూజయేత్సదాభక్త్యా కాంక్షితం లోకమేష్యతి ॥

(శంకరునిగాని నన్నుగాని భేదబుద్ధి లేక యెవడు భక్తితో పూజించునో అతడు కోరిన లోకమును పొందును)

శంకరావతారులగు మహర్షి పుంగవులుగూడ దేవతా మూర్తుల యందు భేదబుద్ధిని పారద్రోలుటకై కొన్ని లీలలు గనబరుపదలచియుండిరి.

తూ.గో.జిల్లా, రామచంద్రపురము తాలూకాలో జేరిన మారేడుబాకలో రెడ్డి రామమూర్తియను నొక బ్రాహ్మణుడుండెను. ఆయన తారణ సం॥ర మాఘశుద్ధ – ఏకాదశీ బుధవారమునుండి గురుస్వామికి శిష్యులై యుండిరి. ఆయన అప్పుడప్పుడు మహేంద్రవాడ వెళ్ళి గురుబోధ వినుచు తన స్థితిని వెల్లడికానీయక కాలము గడుపుచుండిరి. ఇట్లుండగా నొకప్పుడు ఆయన

తన పెదతల్లిగారి గ్రామమైన భీమోలు వెళ్ళవలసివచ్చెను. రామమూర్తిగారు భీమోలులో నుండు కాలమున నరసమ్మగారి పొలములోనున్న యొక మఱ్ఱిచెట్టు 4-8-1945 తేదీకి సరియగు పార్థివనామ సం॥ర ఆషాఢ శుద్ధ- ఏకాదశీ శనివారము రోజున రామమూర్తిగారు మధ్యాహ్నము భోజనముచేసి నరసమ్మగారి పొలములోనికి వెళ్ళి మఱ్ఱిచెట్టు క్రింద గూర్చుండి ధ్యాననిష్ఠలో ప్రవేశించిరి. అప్పటికి మధ్యాహ్నము రెండు గంటలయ్యెను. ఆకాశము నిర్మలముగా నుండెను. జనసంచారము లేకపోవుటచే ఆ ప్రదేశమంతయును నిశ్చల గాంభీర్యము వహించియుండెను. రెడ్డి రామమూర్తిగారు ఆ మఱ్ఱి చెట్టుక్రింద తూర్పు ముఖముగా గూర్చుండి గురుమూర్తిని ధ్యానించుచు గురుమంత్రమును జపింపనారంభించిరి.

పరమ దయార్ద్రహృదయులును, భక్తజన రక్షాదక్షులునగు మహర్షి పుంగవులు రామమూర్తిగారి యెదుట నిట్లు సాక్షాత్కరించిరి. గురుదేవుని ముఖము వీరరసముతో భయంకరముగా నుండెను. మెడలో ఎముకలును, ప్రేగులును, మాలలుగా వ్రాలాడుచుండెను. ముఖమునుండి రక్తము కాఱుచు భయంకరముగా నాలుక మోకాళ్ళవఱకును వ్రేలాడు చుండెను. నోటిలో పెద్దపెద్ద కోఱలు భయముగొల్పుచుండెను. నేత్రములు సూర్యతేజస్సునుమించి దేదీప్యమానముగా ప్రకాశించుచుండెను. అపుడు గురుస్వామి పీతాంబరము ధరించియుండిరి.

మెడలో పీతాంబరము వ్రేలాడుచుండెను. శరీరమంతయును రక్తపు చుక్కలతో తడిసియుండెను. పీతవర్ణముగల శిరోజములపై నవరత్న స్థగితమైన కిరీటము ప్రకాశించుచుండెను. ముఖము మామూలు రూపముతోనే యుండెను. కాని గడ్డముతోను, మీసములతోను, మిగుల విశాలముగా నుండెను. రెండు బాహువులతోనే రెండు కాళ్ళతోనే గురుమూర్తి

రూపము ప్రకాశించుచుండెను. అట్లు ఎదుట సాక్షాత్కరించి చూచుచుండగనే తమ రూపమును ఆకాశమార్గమునకు పెంచుచుండిరి. గురువర్యుల రూపము ప్రహ్లాదసంరక్షణార్థమై యావిర్భవించిన నరసింహవతారమును తలపించుచుండెను. ఆ దృశ్యమంతయును రామమూర్తిగారికి మిగుల భయంకరముగా నుండెను. ప్రపంచవాసనయే యెఱుంగక ఆయన గురువర్యుల భీకరాకారమునే చూచుచు నిశ్చేష్టులై మిగుల భయపడుచు గజగజ వణికిపోవుచుండిరి. భక్తుని హృదయము గనిపెట్టి శ్రీ గురుచక్రవర్తి తమ శిష్యునితో ''నాయనా! ఎట్లున్నది'' అని పల్కిరి. అపుడా రామమూర్తిగారు భీతిల్లి "దేవదేవా! మీ స్వరూపము నాకు మిగుల భయము గొల్పుచున్నది. మీ నిజస్వరూపముతో నాకు ప్రసన్నులు గండు" అని దీనులై ప్రార్థించిరి. "సరేసరే" అని రెండుసార్లు పలికి వెంటనే యదృశ్యులైరి. సగుణబ్రహ్మము యొక్క లీలలు అత్యద్భుతముగా నుండును.

మ॥ సకల స్థావరజంగము ప్రతతికిన్ – జర్చింపడా నాధ్యుడై
యకలంకశ్రుతి గర్భుడుంబరుడు స – ర్యాద్యుండు నీశుండు సే
వక యోగీంద్రకుమార సిద్ధ మునిదే – వ శ్రేణియోగ ప్రవ
ర్తకమై తన్ను భజింపజూపు సగుణ – బ్రహ్మంబు లీలాగతిన్ ॥
(భాగవతము 3 స్క. 1019 ప.)

కావున భక్తుని హృదయము పరీక్షింపనెంచి శ్రీ గురుచక్రవర్తి నరసింహావతారము దాల్చి సాక్షాత్కరింపవలసి వచ్చెను! ఆహా ఏమి గురుమహిమా విశేషములు! శంకరుని లీలలు దెలియ బ్రహ్మాదులకే శక్యము గాకపోయెను.

క॥ సదసత్తత్తచరాచర
సదనంబగు నిన్నుఁ బొగడ – జలజభవాదుల్

పెదవులు గదలుప వెఱతురు
వదలక నిను బొగడనెంత - వారము దేవా ॥
భాగవతము 8 స్క. 229 ప.

ఆహా! రెడ్డి రామమూర్తిగారు ఎంతటి పుణ్యాత్ములు! ఏకాంత సమయమున పట్టపగలు జాగ్రదవస్థలో నరసింహావతారమును దర్శించుట ఎన్ని జన్మల పుణ్య విశేషమో కదా!

# మఱియొకసారి నరసింహరూపము దాల్చుట

19 నవంబరు 1945 తేదీకి సరియగు పార్థివనామ సం॥ర కార్తీక శుద్ధ పూర్ణిమా సోమవారము రోజున మహర్షి శిష్యురాలైన లింగాల సీతమ్మగారు మహేంద్రవాడలో గురుస్వామి యాశ్రయమున నుండవలసి వచ్చెను. ఆమె ఆ రోజున గురు ధ్యాననిష్ఠలో నుండగా గురుస్వామి నిజరూపముతో దర్శనమిచ్చి నరసింహావతారము దాల్చిరి. ఉగ్ర నరసింహమూర్తి రూపముతో నున్న మహర్షిపుంగవులు సూర్యచంద్రాదులయందును, పిపీలికాది బ్రహ్మపర్యంతమునుగల సకల చరాచర జీవరాసులయందును బ్రహ్మాండము పిక్కటిల్లునట్లు నరసింహావతార రూపముతో ఆమెకు సాక్షాత్కరించిరి.

క॥ నరమూర్తిగాదు కేవల
హరిమూర్తియుగాదు మానవాకారము గే
సరి యాకారము నున్నది
హరిమాయారచితమగు యథార్థము - సూడన్ ॥
భాగవతము 7 స్కం. 286 ప.

పరతత్వమునకు గురువని మహర్షులు నామమిడిరి. గురువనగా కరచరణాద్య వయవములతో గూడిన మానవ స్వరూపము మాత్రమేకాదు. పరతత్త్వము అవసరమునుబట్టి అనేకావతారము లెత్తును. అందుచేతనే త్యాగరాజు శ్రీరామతారక పరబ్రహ్మమును ఇట్లు స్తుతించెను.

"నిన్నెవరని నిర్ణయించేదిరా । నిన్నెట్టారాధించేదిరా । నరవరా ॥
శివుడవో । మాధవుడవో । కమలభవుడవో । పరబ్రహ్మవవో ॥ " అని

పై లక్షణములనుబట్టి యీ మహర్షి పుంగవుల నేమని యారాధించవలెనో చదువరులే నిర్ణయించుకొందురుగాక, లింగాల సీతమ్మగారు కూడ గురుసేవ చేసి క్రమశిక్షణనంది ఆ గూఢస్థితిలో నుండిరి. అందుచేతనే గురువర్యులిట్టి దివ్యలీల గనబరచియుండిరి.

# దేవీ దివ్యదర్శనము

గురుపుత్రులైన శ్రీ వెంకటసూర్యనారాయణ పరబ్రహ్మంగారికి ప్రధమ కళత్ర వియోగము కల్గుటచే ద్వితీయ వివాహము చేయవలసివచ్చెను. ప.గో.జిల్లా తాడేపల్లిగూడెం తాలూకా కోనాల గ్రామనివాసులైన శ్రీ గోదావరి వెంకటశాస్త్రిగారి కుమార్తె చి॥ సౌ॥యగు సుభద్రనిచ్చి వివాహము గావించుటకు నిశ్చయించిరి. (1946 సం॥రం జూలై నెలలో) వ్యయనామ సం॥ర ఆషాడ శుద్ధ పంచమిరోజున ముహూర్తము నిర్ణయింపబడెను.

పెండ్లివారు చవితిరోజుననే మహేంద్రవాడలో బయలుదేరి కోనాల వెళ్ళిరి. వార్ధక్యముచే గురువర్యులు మహేంద్రవాడలోనే యుండిపోవలసివచ్చెను. గురువర్యుల యుపాసన అనన్య సామాన్యమైనది.

చవితిరోజు సాయంకాలము గురువర్యులు తపస్సులో ప్రవేశించిరి. శివగణమునకును విష్ణుగణమునకు మధ్య వధూవరులు గూర్చుండియున్నట్లు భావించి తపస్సు ప్రారంభించిరి. మహేంద్రవాడలో గురువర్యులు గావించు తపఃప్రభావముచే కోనాల గ్రామములో పెండ్లి దీక్షలోనున్న గోదావరి వెంకటశాస్త్రిగారికి జగన్మాతయగు శ్రీరాజరాజేశ్వరీదేవి సాక్షాత్కరించెను. ఆ దేవి సర్వాలంకార శోభితయై కిరీటము దాల్చియుండెను. మెడలో రత్న హారములును, ముత్యాలహారములును గలవు. ఆ దేవి ప్రసన్న వదనయై సాక్షాత్కరించి అదృశ్యురాలయ్యెను. దేవికి "సర్వమంగళ" అను నామము గలదు. దేవి యనుగ్రహము వలన సకల శుభములు కల్గునని భావము. ఆ దేవీ సందర్శన ముతో వెంకటశాస్త్రిగారికి నూతన చైతన్యము కల్గెను. ఇట్టి దేవతాదర్శనములు అంతకు పూర్వమెన్నడును వెంకటశాస్త్రిగారు ఎఱుగరు. ఇదియంతయును గురువర్యులకుగల సహజ భావనాశక్తి.

# లింగాల సూర్యనారాయణకు దేవి సందర్శనము

గురువర్యుల పౌత్రికయగు బాపాయమ్మను తుని గ్రామ నివాసియగు దేవభొట్ల సత్యనారాయణగారికిచ్చి వివాహము గావించిరి. ఆ దంపతులకొక పుత్రుడు కల్గెను. ఆ పుత్రుని బారసాలకు గురుకుటుంబమువారు తుని వెళ్ళియుండిరి. అవి దేవీ నవరాత్ర పర్వదినములు. ఆ దేవీ తాంత్రికము అవధూతలకును మహర్షులకును సంబంధించినది. దేవీపూజగూడ

సామాన్యమైనదికాదు. ఇతర సంప్రదాయములతో ఆ పూజ చేయకూడదు. ఆ పూజా విధానము అగ్ని పరీక్షగా నుండును. 2 అక్టోబరు 1946 తేదీకి సరియగు వ్యయనామ సం॥ర ఆశ్వయుజ శుద్ధ సప్తమీ బుధవారము మూలానక్షత్రము మొదలుకొని నేనే దేవీపూజ తప్పనిసరిగా చేయవలసివచ్చెను. అప్పుడు గురుపత్నియగు బాపనాంబగారుగాని, గురుపుత్రులైన పరబ్రహ్మంగారుగాని లేకుండిరి. ఆ దేవీ తాంత్రికము నాకు ఎంత మాత్రమును తెలియదు. కాని ఇట్టి మహత్తరమగు పూజ నేనుగదా చేయుచుంటినను నభిమానముతో స్వతంత్రించి చేయనారంభించితిని. సప్తమీ బుధవారము మధ్యాహ్నము నేను రామమందిరములో దేవీపూజ చేయుచుంటిని. గురువర్యులు తమ స్థానములో గూర్చుండి మంత్రపురశ్చరణ చేయుచుండిరి. శిష్యులును భక్తులును గురుసన్నిధిని కొలువుదీర్చి యుండిరి. కొందఱు భక్తులు పంచదార పొట్లములును, కొందఱు ముద్దహారతి కర్పూరపు పొట్లములును దేవిముందు సమర్పించిరి. దేవికి నివేదనము చేయు తీర్థపాత్రలో పంచదార వేయవలసియుండెను. ముద్దహారతి కర్పూరమును పంచదారయును, ఒకే రూపములో నుండుటచే పంచదార వేయుటకు బదులు ముద్దహారతి కర్పూరచూర్ణమును పొరపాటున వేసితిని. ఆ తీర్థమునే దేవిని అభిషేకించి నైవేద్యము చేసి పూజాంతమున ఆ తీర్థమును ముందుగా గురువర్యులకిచ్చితిని. తరువాత క్రమముగా నందఱికి నిచ్చితిని. హారతి కర్పూరపు ఘాటుచే అందఱి కంఠములును ఒక్కసారి భగ్గున మండిపోయెను. అందుచే దేవి నన్ను పరీక్షింపదలచెను.

7 అక్టోబరు 1946 తేదీ సోమవారమురోజున నేను గురువర్యుల చెంత సెలవు పుచ్చుకొని నామకామ గ్రామమైన వేగాయమ్మపేట గ్రామము వెళ్ళిపోతిని. ఆ మరునాటినుండియే నాకు ఊపిరినొప్పి ప్రారంభమై క్రమముగా బాధ ముదిరెను. కూర్చుండుటకుగాని, నిలబడుటకుగాని,

పండుకొనుటకుగాని వీలులేక బాధపడుచుంటిని. ప్రాణము తీయునేమోయనిగూడ భీతిగల్గెను. 9-10-46 తేదీ బుధవారము రాత్రి బాధ భరింపలేక యేడ్చుచు గురుదేవుని, జగజ్జనని శ్రీ రాజ రాజేశ్వరీ దేవిని, స్మరించి నా యపరాధముల మన్నింపుడని యేడ్చుచునే ప్రార్థింప మొదలుపెట్టితిని. భక్త జన రక్షా దీక్షితయగు దేవి నా యెడల కనికరించి వెంటనే నా యెదుట నీ రీతిగా ప్రత్యక్షమయ్యెను. ఆ దేవి పదునాలుగేండ్ల యీడుగలదియై నీలవర్ణ దేహముతో విరాజిల్లుచు గళ్ల పరికిణీ కట్టుకొని భుజముపై నీళ్ళబిందె ధరించియుండెను. వజ్రపు పొడి నాటిన బంగారు ముక్కుపుడక ధరించియుండెను. మెడలో ఆభరణముల గలవు. అట్లు ఒక్క నిమిషము మాత్రమే దేవి సాక్షాత్కరించి మాయమయ్యెను. అప్పటి నుండియే నాకు క్రమముగా ఊపిరి నొప్పి తగ్గి ఆరోగ్యము కలుగజొచ్చెను. 13 అక్టోబరు 46 సం॥ నేను మహేంద్రవాడ వెళ్ళి ఆ విషయములన్నియు గురుదేవునికి విన్నవించి ఒక రూపాయి బత్తాయిపండ్లు కొని దేవికి సమర్పించితిని. అంతటితో నా బాధ నిర్మూలమయ్యెను. నా మనస్సు శాంతించి కుదుటపడెను.

మఱియొకప్పుడు నేను మహేంద్రవాడలో శ్రీరామ చంద్రునికి నైవేద్యము చేయు పుణ్యము లభించెను. శ్రీగురువర్యులు దేవతామందిరము వెలుపల తమ పీఠముపై గూర్చుండి శ్రీ సీతారాములకు మానసికార్చన చేయుచు నైవేద్యము చేయ మొదలిడిరి. నేను దేవతా మందిరములో నైవేద్యము చేయుచుంటిని. నివేదన సమయములో శ్రీ రామపీఠమునకు పై భాగమున శ్రీ గురువర్యులు నిరాలంబములో పద్మాసనముపై గూర్చుండియుండిరి. గురుదేవుని హృదయపీఠమున శ్రీ సీతారాములు కూర్చుండియుండిరి. ఆ దివ్య సందర్శనము నాకు ఒక్క నిమిషము మాత్రమే గోచరించెను. నివేదనము పూర్తియైన తర్వాత శ్రీ గురువర్యులు నన్ను

బిలిచి "అబ్బాయి! ఈరోజున నీకేమైనను నిదర్శనము కాన్పించినదా!" అని యడిగిరి. నిరాలంబములో గురువర్యులు పద్మాసనముపై గూర్చుండియుండుటయును, శ్రీ సీతారాములు గురు హృదయమున గాన్పించిన విధమును నేను దెల్పితిని. నాయనా! నీకు గల్గిన దివ్య సందర్శనము యదార్థమే అని శ్రీరాముడిపుడే నాతో బల్కియున్నాడు అని పల్కిరి. ఇట్టి లీలలు నిరంతరమును గురుసన్నిధిని భక్తులకు గాన్పించుచునే యుండును.

# త్రేతాయుగమందు జరిగిన విచిత్రము గురుదేవునికి గోచరించుట

వేదములు అపౌరుషేయములని భారతీయ సిద్ధాంతము. వేదమునకు శ్రుతి అను పేరుగలదు. శ్రూయతే ఇతి శ్రుతిః. వినబడునది కావున వేదమునకు శ్రుతియను పేరు సార్థకమయ్యెను. మహర్షులు సమాధులలో నున్నపుడు వినిపించిన మంత్రములే శ్రుతులు నేటి నవనాగరకులకిది నచ్చదు. మన మహర్షులవారి యనుభూతి గమనింపుడు.

15 అక్టోబరు 1945 సం॥ తేదీకి సరియగు పార్థివ సం॥ర ఆశ్వయుజ శుద్ధ నవమీ సోమవారము ఉదయము 10 గంటలకు గురుస్వామి జపించుచుండిరి. జపసమయమున "సీతా లక్ష్మణ" అను గంభీరమగు శబ్దము గురుదేవునికి వినిపించెను. "సీతారామా" అను శబ్దము సహజమైనదిగాని, "సీతాలక్ష్మణా" అను శబ్దము బహు విచిత్రమైనది. ఆ రోజున నేను మహర్షి యాశ్రమమందే యుంటిని. అపుడు గురువర్యులు

నన్ను తమ సన్నిధికి రప్పించి ఇట్లు బోధింపదొడగిరి. అబ్బాయి! ఇప్పుడు "సీతాలక్ష్మణా" అను శబ్దము గంభీరముగా పల్కినది. ఆ శబ్దమట్లు వినబడుటకుగూడ నొక విచిత్రగాధ గలదు.

సీతారామలక్ష్మణులు అరణ్యవాసము చేయుచుండగా భరతుడు సేవకబృందముతో గూడి శ్రీరామ దర&శనమునకు వచ్చుచుండెను. జనసంఘముతో గూడి వచ్చుచున్న భరతుని జూచి శ్రీరామునిపైకి భరతుడు యుద&ధమునకు వచ్చుచున్నట్లు లక్ష్మణుడు తలచెను. అందుచే భరతుని జంపనెంచి లక్ష్మణుడు ధనుసునబాణము సంధించెను. సీతగూడ లక్ష్మణుని వలెనే తలంచెన. అపుడు శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణుల హృదయమును గనిపెట్టి వారల సందేహములు బాపనెంచి "సీతా! లక్ష్మణా!" అని సంబోధించెను. శ్రీరామచంద్రుని కంఠమాధుర్యమందలి భావము గనిపెట్టి లక్ష్మణుడు తన బాణము నుపహరించుకొనెను. సీతగూడ తన భావమును మార్చుకొనెను. శ్రీరాముని సంజ&ఞచే భరతుడు పరమ భక్తాగ్రేసరుడై వచ్చుచున్నట్లు సీతాలక్ష్మణులు గ్రహించిరి. వారి సందేహములు పటాపంచలయ్యెను. త్రేతాయుగమునందు జరిగిన యా సంఘటన గురుదేవుని సమాధిలో గోచరించెను. ఆ విషయములనే బోధ సమయమున శిష్యులకుగూడ చెప్పిరి. ఆహా! ఎట్టి విచిత్ర సంఘటనము? యుగయుగములనాటి చరిత్రముగూడ గోచరించు మహరు&షులవారి తపః ప్రభావమేమనవచ్చును?

# లింగాల లక్ష్మీదేవిని కాపాడిన విధము

ప.గో.జిల్లా, తణుకు తాలూకా దువ్వ గ్రామములో లింగాల సత్యనారాయణ సూరమ్మ అను దంపతులకు లక్ష్మీదేవి అను బాలిక జన్మించెను. ఆ బాలికకు పదవయేట 1947 సం॥రములో జబ్బు చేసెను. ముప్పదినాల్గు లంకణములు చేసి ప్రమాద స్థితిలోనికి మారుచుండెను. వైద్యములన్నియు నిష్ప్రయోజనమయ్యెను. 102 డిగ్రీల జ్వరములో నుండగా పండ్రెండవ లంకణము రోజున జుట్టు జడలువేయుట మొదలుపెట్టెను.

డాక్టరు తేతలి సీతారామయ్య.....హోమియోగారు ఆ లక్ష్మీదేవి జడలు అన్నియు విప్పివేసిరి. ఆ బాలిక యనారోగ్యమంతయును దైవ సంబంధమైనదగుటచే సామాన్యులకు జబ్బుగానే గోచరించుచుండెను. డాక్టరుగారు జడలు విప్పిన రోజుననే మధ్యాహ్నము గం॥1-0 గంట సమయమున పట్టుతాపితా ధరించిన యొక వ్యక్తి ఆ బాలికకు దర్శనమిచ్చి హిందీలో మాట్లాడెను. అదే సమయములో ఆ బాలిక మేనత్తయగు రెడ్డి నాగభూషణమ్మగారికి శ్రీ మహర్షి గురుదంపతులిద్దఱును దేవీపూజలు చేయుచు దర్శనమిచ్చిరి. జగన్మాతయగు శ్రీ సీతాపరమేశ్వరి ఎఱ్ఱని చీర కట్టుకొని బాలరూపము దాల్చి దివ్యపీఠము నధిష్ఠించియుండెను. ఆ జగజ్జనని పాదములకు గురుదంపతులు పూజలు చేయుచుండిరి. అట్లు పూజలు చేయుచు "ఇది యంతయును నాది. గుర్తింపజాలకున్నావా? వెంటనే పథ్యము పెట్టుము" అని పల్కి అదృశ్యులైరి. ఇది జరిగిన మరునాడే జ్వరము తగ్గి ఆ బాలికకు నూతన చైతన్యము కల్గెను. దేవీ మహిమ యగుటచే డాక్టరుగారు విప్పిన జడలు అన్నియు కలిసి శివజటాజూటమువలె

తయారయ్యెను.

నాగభూషణమ్మగారు తమకు గల్గిన గురుసందర్శనాది విశేషములన్నియు మహేంద్రవాడ వెళ్ళి గురువర్యులకు విన్నవించుకొనిరి. ఆ విషయములన్నియు విని ఇది యంతయును దేవి మహిమగాని మఱియొకటి కాదని గురువర్యులు నాగభూషణమ్మగారితో పల్కి ఆ బాలికను మహేంద్రవాడ తీసికొనివచ్చి దేవీ పీఠమునకు మ్రొక్కుకొని పూజలు చేయించుకొనుమని ఆజ్ఞాపించిరి. గురువర్యుల యాజ్ఞపొంది నాగభూషణమ్మగారు దువ్వ వచ్చిరి. ఆ మరునాడే వినాయకుని చవితి వచ్చెను. సర్వజిత్తునామ సం॥ర భాద్రపద శుద్ధ వినాయక చతుర్థిరోజున లక్ష్మీదేవి స్నానముచేసి వినాయకుని పూజించుచుండగా రెండు జడలు విడిపోయెను. కాని ఆ బాలిక శిరస్సుపై జటాజూటము యథాప్రకారముగానే యుండెను. పిమ్మట నాగభూషణమ్మగారు సర్వజిత్తునామ సం॥రమందు వచ్చిన దేవీ నవరాత్ర పర్వదినములకు తన మేనకోడలైన లక్ష్మీదేవిని వెంటబెట్టుకొని మహేంద్రవాడ వెళ్ళిరి. శ్రీ సుబ్రహ్మణ్య గురుదంపతులు ప్రతి సం॥రమందును ఆశ్వయుజ మాసములు దేవీపూజలు మహా వైభవోపేతముగా చేయుచుందురు. అట్టి దేవీ నవరాత్రములలో నొక పర్వదినమున శ్రీగురుదంపతుల సమక్షమున ఆ బాలిక జటాజూటము శ్రీరామస్మరణ పూర్వకముగా గురుపుత్రులైన వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు కత్తిరించిరి. గురుదంపతుల యాశీస్సుతోను, సువాసినుల మంగళహారతులతోను ఆ బాలిక మ్రొక్కు చెల్లించబడెను. భక్తులైన స్త్రీ పురుషులను కాపాడుటలో శ్రీ గురుచక్రవర్తి కరుణ అపారమైనది.

# శ్రీరాముడు బాలకృష్ణుడై దర్శనమిచ్చుట

కII సగుణంబెఱిగి భజించిన

నగు నిర్గుణసిద్ధిII

సగుణబ్రహ్మ సాక్షాత్కారము పొందిన తర్వాతనే నిర్గుణబ్రహ్మ సిద్ధి లభించును, ఇది ప్రాచీన మహర్షుల కాలము నుండియు గురుశిష్య పరంపరగా వచ్చుచున్న సనాతన ధర్మము. ఉపాస్య దైవమునకును తనకును అభేద భావనతో నుపాసించుటయే సగుణోపాసనయొక్క పరమావధి. రామోపాసన పద్ధతియందు ఈ క్రింది విధముగా దెల్పబడినది.

శ్లో II అహం రామో నచాన్యో....స్మి బ్రహ్మైవాహం నశోకభాక్I

సచ్చిదానంద రూపో....హం నిత్యముక్త స్వభావవాన్II

(నేను రాముడను. అన్యుడనుకాను. దుఃఖములేని పరబ్రహ్మము నేనే నిత్యముక్త స్వభావుడనైన నేను సచ్చిదానంద రూపుడను.) రామోపాసనపద్ధతి చూడుడు.

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తనకును రామునికిని అభేద భావన గావించి నిరంతర శ్రీరామతారక పరబ్రహ్మోపాస్తి చేయుచుందురు. అట్టి అభేద స్థితినే శ్రీరామచంద్రుడు శ్రీ గురువర్యులకు చూపించియుండెను.

7-9-1948 తేదీ ఉదయము 8 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి తపోనిష్ఠలో నుండిరి. శ్రీరాముడు బాలకృష్ణుడై కిరీటమున నెమలిపింఛము దాల్చి బాలలీలలు చూపుచు గురుదేవుని భుజముపై చేయి వేసి నీవును నేనును ఒకటే సుమాయని హెచ్చరించి అదృశ్యుడయ్యెను. ఇట్టి యనుభూతినే కాళిదాసుగూడ పొందెను. ఒకసారి కాళీమాత కాళిదాసు నెదుట

సాక్షాత్కరించి,

"త్వమేవాహం త్వమేవాహం త్వమేవాహం న సంశయః"

(నీవే నేను, నేనే నీవు, నీవే నేను ) అని అభేదసి&థతిని దెల్పియుండెను.

అభేదస్థితిగా శ్రీరామునుపాసించుటచేతనే శ్రీమహరు&షలవారు విజనప్రదేశములలో సంచరించునపుడు శ్రీరాముడు ధనుర్ధరుడై మహర్షులవారి పాదములు త్రొక్కుచు వెంబడించి కాపాడుచుండును.

# సాధనాంతర విశేషములు

ఒకప్పుడు మహర్షి శిష్యులైన సుసర్ల వెంకటరత్నంగారు మహేంద్రవాడలో నుండిరి. ఆ రోజున గురువర్యులు గదిలో గూర్చుండి యోగముబట్టి నిరాలంబములో తపస్సు ప్రారంభించిరి. చాల రాత్రివఱకును గురువర్యులు భోజనమునకు రాకుండుటచే వెంకటరత్నంగారు నెమ్మదిగా తలుపుతీసి చూచునరికి గురువర్యులు నిరాలంబములో నిల్చియుండుటగాంచి ఆశ్చర్యపడిరి.

ఒకప్పుడు గురువర్యులు కొవ్వూరు తాలూకా చాగల్లులోనున్న కాలమున నిమ్మలపూడి రత్నంగారు నిరాలంబములోనున్న గురువర్యులను దర్శించియుండిరి.

మఱియొకప్పుడు తుల్యభాగానది అతి వర్షములకు పొంగి మహేంద్రవాడ పొలములన్నియు జలమయమైపోయెను. మూడు నిలువుల లోతుగా జలముండెను. అట్టి నీటి ప్రవాహముపై గురువర్యులు

పద్మాసనమున గూర్చుండి రెండుమైళ్ళ దూరము వఱకును ప్రవాహముక్రిందికి వెళ్ళుచుండిరి. చుట్టుపట్లగల జనులందఱును అత్యాశ్చర్య చకితులై గురు దృశ్యమును గాంచియుండిరి.

శ్రీగురువర్యులు పామఱ్ఱులో నుండిన కాలమున నొక నాడు యోగముపట్టి నిరాలంబములో నుండగా గురువర్యుల మాతృదేవియగు శేషాంబగారు చూచి తమ పుత్రుడు ఇంతటివాడుగదాయని అద్భుతానందముల నోలలాడిరి.

మఱియు ఒకనాడు పామఱ్ఱులో నొక గదిలో గూర్చుండి గురువర్యులు జపించుచుండిరి. ఆనాడు శ్రీరాముడు నిరాలంబములో నిల్చి మహరు&షలవారి యెదుట తాండవమాడజొచ్చెను. శ్రీరామచంద్రుని యానంద తాండవము గాంచుచు గురువర్యులు ఱెప్పపాటు లేక తదేక దీక్షగా చూచుచుండిరి. చేతిలోని జపమాల ఆగిపోయెను. శరీరము స్థాణువు వలె చలనము లేకయుండెను. అప్పటికి మధ్యాహ్నము 12 గంటలయ్యెను, మాతృదేవియగు శేషాంబగారు తమ పుత్రుని భోజనమునకు పిల్చుటకై గదిలోనికి వెళ్ళిరి. ఱెప్పపాటు లేక చలనము లేక ఆకాశమువంక చూచుచుండిన తమ పుత్రుని గాంచి “అబ్బాయి! భోజనమునకు లెమ్ము” అని పిలువసాగిరి. శ్రీరామ సందర్శన సంతోషపరవశులై యున్న గురువర్యులకు కొంతసేపటికిగాని తల్లిమాటలు చెవిని సోకనేలేదు. కొంత సేపైన తర్వాత గురువర్యులు “అమ్మా! ఏమనుచుంటి”వని పల్కిరి. “నాయనా! ఇంతసేపు మాట్లాడక ఱెప్పపాటు లేక నిలువుగుడ్లతో ఆకాశమువంక చూచుచున్నావేమి?” అని తల్లిగారు కంగారుగా నడిగిరి. తమ రహస్యము బయటపడకుండుటకై తల్లిగారితో “అమ్మా! అటుకపైనుండి బల్లియో లేక మఱేదియో నాపై మూత్రము విడిచినది. దానిని పరిశీలించుచు నిన్ను గుర్తింపజాలనైతిని” అని తమ స్థితిని మఱుగుపరచిరి. ఆ విషయమునే

కాలాంతరమున గురువర్యులు ఆంతరంగిక శిష్యులతో బల్కియుండిరి.

కూళ్ళ గ్రామ నివాసులైన దేవరపల్లి లచ్చయ్యగారికి కూడ గురువర్యుల యోగవిశేషములు బాగుగా తెలియును. పుల్య దక్షిణామూర్తిగారివలన గూడ వారు కొన్ని యోగ రహస్యములను తత్వరహస్యములను తెలిసికొనిరి.

# గురుశక్తి సర్వవ్యాపకము అనుటకు నిదర్శనము

తూ.గో.జిల్లా రాజమండ్రీ పట్టణములో పెద్దాడ కామేశ్వరమ్మ అనునొక భక్తురాలుండెను. చిరకాలముక్రిందటనే ఆమె భర్త మరణించెను. పిమ్మట ఏకపుత్రుడు గూడ మరణించెను. భర్తృవియోగమును, పుత్రశోకమును ఆమె హృదయమును దహించివేయుచుండెను. కొంచెమైనను మనశ్శాంతి లేకపోయెను. అందుచే నామెకు ప్రపంచ సౌఖ్యములయందు ఒక్కసారిగా విరక్తి కల్గెను. మనశ్శాంతికై కాశీయాత్ర చేసి అచటినుండి హరిద్వారము వెళ్ళెను. హరిద్వారములో వివిధ ఘట్టములు చూచుచు వెళ్ళుచుండగా నొకచోట యోగీశ్వరుల మఠము కాన్పించెను. అచటనున్న వారందఱును యోగులేగాని గృహస్థులెవ్వరును లేరు. ఆ మఠాధిపతి ఆ రోజున ఆ యోగులందఱికిని ఉపదేశమిచ్చు పుణ్యదినము. పర్వదినములలో అవధూతలును, యోగులును ఒకచోట చేరి కూటమి చేసికొనుచుందురు. ఆ సంగతి కామేశ్వరమ్మ ఎట్లో తెలిసికొని యెవరిని అడుగకుండగనే లోనికేగి ఆ మఠాధిపతితో "స్వామీ! నాకుగూడ నుపదేశమిచ్చి ధన్యురాలిని చేయుడు" అని హిందీలో ప్రార్థన పూర్వకముగా

కోరెను. అపుడా యోగీశ్వరుడు "అమ్మా! గృహస్థులకిచట నోరెత్తుటకు వీలులేదు. ఆంధ్రదేశమున జన్మించి జగద్గురువులనదగు శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్య మహర్షి చంద్రులను సేవింపుము. ఆ గురువర్యులు గృహస్థులై యుండియు నిరంతర పరబ్రహ్మ సమాధి నిష్ఠాగరిష్ఠులై యుందురు. వారు గృహస్థులను అనేకమందిని తరింపజేయుచున్నారు. వారు నీ గ్రామమునకు సమీపింపమందే యున్నారు. నీవు వెళ్ళి ప్రార్థించినచో తప్పక తరింపజేయగలరు. సందేహించక వెంటనే వెళ్ళి ఆ మహర్షిని సేవించుటకు ప్రయత్నించుము. నీ విచట నొక నిమిషమైనను నిలబడుటకు వీలులే"దని యావలికి సాగనంపి వేసిరి. అవధూతలు గృహస్థులను జేరనిత్తురా! అందుచే నామె యోగులు చెప్పిన మాటలు జ్ఞాపకముంచుకొని రాజమండ్రీ వెళ్ళి వాకపుచేసి సుబ్రహ్మణ్య మహర్షి పుంగవులు మహేంద్రవాడలో నున్నట్లు తెలిసికొనెను. వెంటనే ఆమె మహేంద్రవాడ వెళ్ళి కాశీ హరిద్వారయాత్రలు చేసిన విధమును, యోగీశ్వరుల కథనమును గురువర్యులకు విన్నవించుకొని దీనురాలై తన్ను తరింపజేయవలసినదిగా ప్రార్థించెను. శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి ఆమె వైరాగ్యస్థితిని గాంచి శిష్యురాలినిగా చేసికొని కృతార్థురాలిని జేసియుండిరి. ఎక్కడ హరిద్వారము ! ఎక్కడ మహేంద్రవాడ ? సుబ్రహ్మణ్య మహర్షి గురుశక్తి హరిద్వారములోనున్న యోగుల హృదయములలోగూడ తాండవించుచుండుటచేతనే వారట్టి సలహాలను ఆమెకు ఇచ్చియుండిరి. పరిపూర్ణత్వము లోపలను వెలుపలను అంతటను వ్యాపించి నిండినిబిడీకృతమైయుండును. ఆ విషయమునే మంత్రపుష్పమిట్లు బోధించుచున్నది, "అంతర్బహిశ్చతృర్వం వ్యాప్యనారాయణఃస్థితః" లోపలను వెలుపలను ఆ పరిపూర్ణతత్త్వము వ్యాపించియున్నది. ఆ పరతత్త్వమునే నారాయణుడందురు. అదియే గురుశక్తి.

తూ.గో.జిల్లా రామచంద్రపురం తాలూకా వేగాయమ్మపేట సంస్థానమునకు రాణిగారైన శ్రీ వాడ్రేవు రంగనాయకమ్మగారు మహర్షి ప్రభావమును విని వారి దర్శనమునకై చాలకాలము నిరీక్షించియుండిరి. క్రీ॥శ॥ 1905 సం॥రమునకు సరియగు విశ్వావసు సం॥రములో రంగనాయకమ్మ రాణిగారు గురుదేవుని తమ సంస్థానమునకు రప్పించి వారము రోజులు మహర్షి బోధలు వినియుండిరి. వేగాయమ్మపేట సంస్థాన విద్వాంసులైన శ్రీ యింద్రగంటి వాసుదేవ దీక్షితులుగారును, మఱికొందఱు విద్వాంసులును గురువర్యుల బోధ విని ముగ్ధులైరి.

# అంత్యదశ - మహాసమాధి

చ॥ అజునకుఁదండ్రివయ్యు సన - కాదులకుం బరతత్త్వమయ్యు స
ద్విజముని కోటికెల్ల!గుల - దేవతయ్యు దినేశవంశభూ
భుజులకు మేటివయ్యు!బరి - పూర్ణుడవై వెలుగొందు పక్షిరా
డ్ధ్వజ మిముఁ బ్రస్తుతించెదను - దాశరధీ। కరుణాపయోనిధీ।

శ్రీరామతారక బ్రహ్మానంద మహా సామ్రాజ్యాభిషిక్తులగు మహాత్ములకు లోకమే కుటుంబము. లోకకల్యాణమే వారి జీవిత లక్ష్యము. జ్ఞాని నిరంతర సమాధి నిమగ్నుడైయున్నచో లోకులకు పరమార్ధతత్త్వముపదేశించు వారెవరుందురు? గృహస్థులై జ్ఞానులైన శిష్యులను శ్రీరామతత్త్వ విజ్ఞాన చంద్రికలో స్వేచ్ఛగా విహరింపజేయుచు, నానంద సాగరమున నోలనాడించు "స్వేచ్ఛానంద" దీక్షానామము నందిన శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి శరీర పాటవము సన్నగిల్లజొచ్చెను. లోకమునకు ఇహపర శ్రేయో మార్గదర్శకమైన స్వేచ్ఛానంద జీవనజ్యోతి తిరోహితమగు కాలము సమీపింపజొచ్చెను. శ్రీ

గురుదేవుని వ్యక్తిత్వము అసాధారణమైనది. శిష్యశిక్షణాదులలో చండశాసన ముపయోగించినను వెనువెంటనే వారి యోగక్షేమములకై పరితపించు చుందురు. స్త్రీ పురుషుల మనస్తత్త్వములు గురువర్యులయందు అత్యద్భుత ముగా సమ్మేళనమొందినవి. స్త్రీలకును పురుషులకును బోధించుటలో సాటిలేని ప్రతిభ కల్గియుండుటచే ఈ మూర్తి అర్ధనారీశ్వరుడా! అనిపించును. శరీరపాటవము సన్నగిల్లుచుండుటగాంచి "గురుదేవా! భౌతిక దేహముతో తమ దివ్యజ్యోతి తిరోధానమగుట శిష్యకోటికి క్షేమముకాదు. కావున తమ రచనలు వ్రాతప్రతులలో పెట్టెలలో దాగియున్నవి. నా బోధ నిమిత్తమై తాము మిగుల శ్రమపడియున్నారు. ఆ పవిత్ర గ్రంథములను ముద్రించి వెల్లడిచేయు సంకల్పించితిని. కన్నతల్లిదండ్రులైనను చూపజాలని యపార ప్రేమతో నన్నాదరించి విజ్ఞాన చంద్రికలలో విహరింపజేయు తమవంటి లోకోత్తర సద్గురుమూర్తికి నేను చేయు శాశ్వతసేవ యిదియే. మఱియు తమ పవిత్ర చరిత్రగూడ లోకమున శాశ్వతముగా నుండునట్లు రచింప బూనితిని. అనుగ్రహింపుడు" అని ప్రార్థించితిని. "నాయనా! ఇట్టి కోరిక నా శిష్యులలో ఎవరును కోరియుండలేదు. నాతో పరంపరాధర్మములు అంతరించగూడదు. నీవు రచించిన నా చరిత్ర ఆ మూలాగ్రముగా నాకు వినిపింపుము. నా వ్రాత ప్రతి గ్రంథములన్నియు నివిగో! నీకును నాకును రహస్యములేదు. మన సంప్రదాయములకు భంగము కలుగకుండగ మన గురుపరంపరను నిల్పుము" అని పరమ దయతో ననుగ్రహించిరి.

మఱియు తాము జపించు పీఠము చెంతనే పెట్టెలో చిరకాలమునుండి దాచి యుంచిన తమ రచనలను నాకు జూపి "మన సంప్రదాయములకు భంగము కలుగని రీతిగాను, లోకులకు ఉపకరించునట్లుగాను నా రచనలను వెలుగులోనికి తీసికొనిరమ్ము. నీవు రచించిన గ్రంతములో యధార్థ విషయములే గాని అతిశయోక్తులుగాని, లేనిపోని విషయములుగాని

చేర్చుకుము. అట్లు చేసితివేని భృగ్వాది మహర్షుల పరంపరను హత్య చేసిన దోషము నొందగలవు. హృదయమాలిన్యము లేక నేను విధించిన నియమములు పాటింపుము. అట్లు రామపీఠము నెదుట నా పాదములు పట్టుకొని ప్రమాణము చేయు" మనిరి. దేవతలతో నిత్యసంబంధము గల్గియున్న మహర్షులవారి జీవిత రంగములను సహజ సిద్ధముగా చిత్రించి లోకులకు అందిచ్చుట కంటె నాకు కావలసినదేమి గలదని యుప్పొంగి గురుపాదములు పట్టుకొని ప్రమాణము చేసి రచనలకుపక్రమించితిని.

తమ రచనలను వెలుగులోనికి దెచ్చుటకు శ్రీ మహర్షులవారు నాకు ప్రసాదించిన గ్రంథముల నిట దెల్పుచున్నాను.

1. అద్వైత రహస్యము (1600 పద్యములు)

2. మహాసబోధ "మనసా" అను మకుటముగల వేయి పద్యములు.

3. గాయత్రీనాటకము.

4. అచల బ్రహ్మానంద ప్రబోదము. (ఇందు త్యాగకృతులవంటి కీర్తనలు గలవు)

5. అచలపర వాసుదేవ శతకము

6. ఆత్మబోధ – (సంస్కృతమునకు తెలుగు)

7. దండకములు.

8. ఎఱుకల పాప చరిత్ర.

9. శ్రీరామనామ మంత్రావళి.

10. సత్యనారాయణ వ్రతము (సంస్కృతమునకు తెనుగు)

11. స్వేచ్ఛానందగీత – సంస్కృతము

12. శ్రీరామశతకము.

13. పాపయార్య శతకము.

14. అష్టకమంజరి.

15. విజ్ఞానామృతము

16. అచలసస్థ జనార్ధనార్థశతకము.

మొత్తము పదునాఱు గ్రంథములు.

శ్రీమహర్షివారు తమ రచనలలో సగుణము, నిర్గుణము. శుద్ధనిర్గుణము అను తత్త్వముల నిమిడ్చి బ్రహ్మాతత్త్వమును లోకులకందించియున్నారు.

సామాన్య మానసికావస్థలో శ్రీ గురువర్యులు ప్రతి విషయమును గూర్చియు అత్యంత జాగరూకులై యుందురు. 2-1-44 తేదీకి సరియగు సుభానునామ సం॥ర కార్తీక శుద్ధ ద్వాదశీ శుక్రవారము రాత్రి తొమ్మిది గంటలకు నేను మేడ పై భాగమున గురువర్యుల పాదసేవ చేయుచు "స్వామీ! మహర్షుల నిర్యాణానంతరము శిష్యుల కర్తవ్యమేమి" అని అడిగితిని. అంత గురువర్యులు "నాయనా! నీ ప్రశ్న నాకర్థమైనది. శ్రీ గురుదంపతులలో ఎవరు ముందు పరమపదించినను మీ శిష్యుల కర్తవ్యమేమనగా - విధివిధానముగా దహన సంస్కారము చేయవలెను. నేను తూర్పు ముఖముగా కూర్చుండి జపము చేసికొనుచుందును. కావున నా విగ్రహమును పశ్చిమాభిముఖముగా ప్రతిష్ఠించుకొనవలెను. వేసవికాలములో చలివేందలపెట్టి ఆ క్షేత్రములో దాహతీర్థము లిచ్చుచుండ వలెను. గురు - ఏకాదశి మొ॥ పర్వదినములయందు పూజాదులు చేసికొనుచుండవలెను. పట్టిన శిష్యులందఱును గురుస్థానమును వీడక సంప్రదాయ సిద్ధముగా సేవించు కొనుచుండవలెను" అని దెల్పిరి.

మఱియు పార్థివసం॥ ఆశ్వయుజ శుద్ధ ఏకాదశీ బుధవారము (17-10-45 వ తేదీ) రోజున గురువర్యులు నన్ను చేరబిల్చి "అబ్బాయీ! నా యిష్టము వచ్చినపుడు నా దేహమును విడిచిపెట్టుటకు నా గురుస్వామి అనుగ్రహించినారు. మరణము నా స్వాధీనము సుమా" అని పల్కిరి. మూడు సంవత్సరముల మూడు మాసముల యైదు రోజులకు భౌతిక దేహముతో సంబంధము వదలిపోవునని శ్రీ మహర్షులవారికి ముందుగానే గోచరించెను. అందుచే కొంతమంది యాంతరంగిక శిష్యులను జేరబిల్చి "నాయనలారా! నా యవసానకాలము సమీపించుచున్నది. నా నిర్యాణ కాలమున మీరందఱును దగ్గఱనుండి భగవన్నామ స్మరణ చేసికొనుడు. ప్రకృతి సంబంధమగు కోలాహలములు నా చెవని బడకూడదు సుమా" అని చెప్పసాగిరి. శిష్యులు గూడ గుర్వాజ్ఞ పాటించుచు గురుదేహము క్షీణించిపోవుచున్నదే, ఈ దివ్యజ్యోతి అంతర్ధానమందినచో మనకు వెలుగు బాటల చూపుచు బోధించువారెవరు? అని తమలో తాము కుమిలిపోజొచ్చిరి. కాని మహర్షి పుంగవులు దివ్యానందస్థితిలో భక్తులపై దమ యవ్యాజాను గ్రహమును వర్షించుచునే యుండిరి. వచ్చుచు బోవుచు నుండువారి సంఖ్య లెక్కలేకుండెను. సర్వధారినామ సం॥రము వచ్చెను. తమ భౌతిక దేహము నిలువజాలదని గురువర్యులకు భవిష్యత్తు గోచరించెను.

ఆ సంవత్సరమున దేవీ నవరాత్ర మహోత్సవములు మహా వైభవముగా జరిగెను. గురువర్యుల భౌతిక దేహము క్షీణించుచుండుటచే తమతమ జీవితములను సార్థకము చేసికొన దలచి శ్రీ ముళ్ళపూడి గంగరాజుగారును, శ్రీ కంటిపూడి శ్రీరాములుగారును వారి భార్య వీరమ్మ గారును సర్వధారి నామ సం॥ర ఆశ్వయజ శుద్ధ విజయదశమి మొదలుకొని ద్వాదశి ఆఖరు వఱకును మూడు రోజులు నిర్విరామమైన శ్రీరామ భజనలతో శ్రీరామత్రిరాత్ర మహోత్సవములు జరిపిరి. వచ్చిన

వారందటికిని అన్ని వర్ణములవారికిని అపారమైన యన్నదానము జరిగెను. అప్పటికే శరీర పాటవము పూర్తిగా తగ్గిపోయెను. వార్ధక్య దశ నందిన రాజయోగి సింహమునకు సపర్యలు చేయుటకు తగిన శిష్యుడు కావలసి వచ్చెను. అందుకు తగిన వ్యక్తి దువ్వ గ్రామ నివాసులైన శ్రీ మునుకుట్ల సీతారామయ్యగారే యని తలచి గురుసేవకై సీతారామయ్యగారిని రప్పించిరి. నిద్రాహారములుగూడ లక్ష్యపెట్టక శ్రీసీతారామయ్యగారు అహర్నిశలు గురుసేవ చేయుచుండిరి.

సర్వధారి సంవత్సర మార్గశిరమాసము వచ్చెను. అన్నిటిలోనికిని మార్గశిరము పుణ్యప్రదమైనది. కావుననే "మానానాం మార్గశీర్షో....హం" అని భగవద్గీతలో దెల్పబడియున్నది. 6-6-1934 తేదీ నుండి మేడ పై భాగమున ఏకాంతముగా జీవించికొనుచున్న శ్రీ గురుపుంగవులు దేహ ధర్మముల ననుసరించి 1949 సం॥ రములో మార్గశిర మాసమున మేడక్రిందికి వచ్చి ఒక గదిలో తపోనిష్ఠాదులు జరుపుకొనసాగిరి. మరణము స్వాధీనమై యుండుటచే గురువర్యులు ఉత్తరాయణ పుణ్యకాలమునకై నిరీక్షించుచుండిరి.

10-1-1944 తేదీకి సరియగు సుభానునామ సం॥ర పుష్య శుద్ధ పూర్ణిమా సోమవారము రోజున మధ్యాహ్నము గం. 12 ల వేళ దేవతా నివేదనమైన పిమ్మట "అబ్బాయీ! బ్రహ్మబోధ నిమిత్తము నేను భూలోకమునకు రావలసివచ్చినదిసుమా" అని నవ్వుతో పల్కియుండిరి. తమ దివ్యాంశ లక్షణములను అప్పుడప్పుడు గురువర్యులు సూచనగా దెల్పుచునేయుండిరి.

నిర్యాణానంతరము తమ దివ్యజ్యోతి అంతర్ధానము కాకుండునట్లు తమ శక్తిని శ్రీ కందర్ప సూర్యనారాయణగారియందు గుప్త మొనర్ప

దలంచియుండిరి. గురువర్యుల సంకల్పము కందర్ప సూర్యనారాయణ గారిలో ప్రవేశించెను. అందుచే శ్రీ సూర్యనారాయణగారు 1949 సం॥ర మందు సర్వధారినామ సం॥ర మాఘ బహుళ త్రయోదశీ మహాశివరాత్రి పర్వదినమున నూట యెనిమిది బంగారు పువ్వులతో శ్రీ గురుదంపతులను పూజింప సంకల్పించిరి. ఆ రోజున ఉదయమునకే పూజా ద్రవ్యాదులతో గురుసన్నిధిని చేరియుండిరి. గురుపుత్రులైన వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు మాత్రమే పూజ సమయములో నుండిరి. శ్రీ సూర్యనారాయణగారు గురుదంపతులకు ఏకాంతపూజ చేసికొనదలచి యుండిరి. గురువర్యులకు స్వచ్ఛమైన క్షీరాబ్ధితాపితాయును, గురుపత్నియగు బాపనాంబగారికి నెమలికంఠము రంగుగల కంచిపట్టు చీరయును సమర్పింపబడెను. నూతన వస్త్రములు ధరించిన యా గురుదంపతులు సాక్షాత్పార్వతీ పరమేశ్వరులై గాన్పించుచుండిరి. అఖిలాండకోటి బ్రహ్మాండమునకు గురుస్వామి చక్రవర్తివలె సూర్యనారాయణగారికి గోచరించిరి. ఉదయము పదిగంటలకు గురుపాదములకు కనకాభిషేకము ప్రారంభమయ్యెను. ఆ శుభసమయునకే దువ్వనుండి మునుకుట్ల శేషయ్యశాస్త్రిగారును, వారి పుత్రులైన వెంకట వాసుదేవదీక్షితులుగారును, గురుదంపతుల సన్నిధికి వచ్చిరి. ఆహా! వారెంతటి పుణ్యాత్ములోగదా! శ్రీ గురుపుంగవులు గూడ వారి రాకకు మిగుల సంతోషించిరి. గురువర్యులకు పురుష సూక్త విధానముగాను, గురుపత్నికి శ్రీసూక్త విధానముగాను కనకాభిషేకము జరిగెను. శ్రీ రామాష్టోత్తర నామములు చెప్పుచు నొక్కొక్క నామమునకు ఒక్కొక్క స్వర్ణపుష్పము చొప్పున పూజ జరిగెను. పూజా కలాపమంతయును మునుకుట్ల శేషయ్యశాస్త్రిగారు (సుబ్బయ్యగారి కుమారులు) చేయించిరి. ఆ పూజా సమయములో శ్రీగురుమూర్తి అఖిలాండకోటి బ్రహ్మాండ సామ్రాజ్యమునకు రత్నస్థగిత స్వర్ణ సింహాసనా

రూఢుడైన చక్రవర్తివలెను, గురుమూర్తి యెడను పార్శ్వముననున్న బాపనాంబగారు స్వర్ణ సింహాసనారూఢయైన శ్రీ రాజరాజేశ్వరిగారు కందర్ప సూర్యనారాయణగారికి గోచరించిరి. జీవత్వము వదలి బ్రహ్మపదవినంది అనుపమా ఖండానిర్వచనీయానంద సాంద్ర నిమగ్నులై సూర్యనారాయణ గారు బాహ్య ప్రపంచము మఱచిరి. క్షీరాన్నము వండించి గురుదంపతులకు నివేదించి శేషపదార్థమును సూర్య నారాయణగారును ఇతరులును స్వీకరించిరి.

ఆ పూజా సమయములో గురువర్యులు సూర్యనారాయణగారి నుద్దేశించి "అబ్బాయీ! నీ పూజకు చాల సంతసించితిని నీకిక జన్మలేదు. నీవే నేను, నేనే నీవు" అను పరమాద్వైత బోధ గావించిరి. ఆ గురుశక్తియే శ్రీ కందర్ప సూర్యనారాయణగారి మూలమున మరల పరంజ్యోతియై లోకమును ప్రకాశింపజేయవలసియుండెను.

భగవంతునికి ఏ పూజ చేసినను పూజాంతరమున సువర్ణ మంత్రపుష్ప ముంచవలెను. కావుననే శ్రీ సూర్యనారాయణగారుకూడ గురువర్యులకు చిరకాలమునుండి పూజలొనరించియున్నారు. గురుదేవుని భౌతికదేహము అంతర్ధానము కానున్నది. భగవంతుని తేజోరాజ్యము "విద్యుల్లే ఖేవభాస్వరా" (మెఱపుతీగవలె ప్రకాశించునది) అని మంత్రపుష్పమందు దెల్పబడి యున్నది. శిష్యుడైన సూర్యనారాయణగారి జీవత్వమును, స్వేచ్ఛానంద గురుపరతత్త్వమును ఐక్యము గావలసియుండెను. జీవబ్రహ్మైక్యాన సంధానమే 108 సువర్ణ పుష్పములతో జరిగిన పూజావిధానము.

108 సంఖ్య పరిపూర్ణతత్త్వమును దెల్పుచున్నది. ఒకటి అనగా "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అను శ్రుతిచే బ్రహ్మతత్త్వమును దెల్పును. 0 సున్న మాయను దెల్పును. "యామాసామాయా" ఏది లేనిదో అదియే

మాయ. సద్గురు కటాక్షమునందినచో మాయా వికారములంటవని యర్థము. 8 సంఖ్య జీవతత్త్వమును బోధించును.

శ్లో ॥ భూమిరాపోనలో వాయుః ఖం మనో బుద్ధి రేవచ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥ గీత.

భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము ఈ యెనిమిది కలసి జీవతత్త్వమగుచున్నది. ఎనిమిది సంఖ్యచే సూచితమగు జీవుడు ఒకటిలో కలిసిన (1+8= 9) పరిపూర్ణుడగుచున్నాడు. తొమ్మిదికంటె పెద్ద సంఖ్యలేదు. కావుననే పరిపూర్ణావతారుడైన శ్రీరామచంద్రుడు నవమి తిథినాడవతరించెను. 9 సంఖ్యను దేనిచే గుణించినను తొమ్మిదియే అగును. 9×2=18, 1+8=9, 4×9=36,3+6=9, ఇట్లే ఏ సంఖ్యచేనైనను చూచుకొనవచ్చును.

ఈ పూజా సమయమున గురుశక్తి శిష్యుడైన సూర్యనారాయణగారిలో స్రవించినది. అదియే పరిపూర్ణ శ్రీరామతత్త్వము అక్షర సాంఖ్యముచే చూచినచో సీతారామ తత్త్వము 108 అగుచున్నది.

సీతా+రామ్ = స్+ఈ+త్+ఆ+= సీతా ।

| | |
|---|---|
| సం 32 | ర్+ఆ+మ్=రామం |
| ఈ=4 | ర్=27 |
| తం=16 | ఆ=2 |
| ఆ=2 | మం=25 |
| ........... | ................. |
| 54 | 54 |

ప్రకృతి (సీతాతత్త్వము) 54+ పురుష (రామతత్త్వము) 54 = కలసి 108 అయినది.

శ్రీ కందర్ప సూర్యనారాయణగారి మూలమున గురుపరంపర చైతన్య విలసితమైవిరాజిల్లవలసి యుండెను. ఇంత గంభీర భావమునే పూజా సమయమున గురుచక్రవర్తి సూర్యనారాయణగారికి అనుభవ పూర్వకముగా బోధించియుండిరి. "నీవే నేను, నేనే నీవు" అని గురువర్యులు పరమాద్వైతస్థితిని బోధించుటలోగల రహస్యము ఇదియే.

మఱియు శ్రీ గురుచక్రవర్తి 26 ఫిబ్రవరి 1949 తేదీ ఉదయము గం. 9-0 లకు కందర్ప సూర్యనారాయణగారిని దగ్గఱకు బిలిచి చేయి పట్టుకొని "నాయనా! నీవు ఇంతటి నుండి మన పరంపరలో గురుత్వము నంది శుద్ధాత్మా రామబ్రహ్మానంద నాథుడవై మెలంగుము" అని తన దివ్య గురుశక్తిని శ్రీ కందర్ప సూర్యనారాయణగారిలో ప్రవేశపెట్టుచు తమ దివ్యావతార తత్త్వ రహస్యమును గూడ బోధించియుండిరి. ఈ మహాశివ రాత్రి పూజతో శ్రీసూర్యనారాయణగారి జీవత్వము పూర్తిగా వదలిపోయెను.

పూజాంతరమున శ్రీ మునుకుట్ల శేషయ్యశాస్త్రిగారును, వారి పుత్రులైన వెంకటవాసుదేవ దీక్షితులుగారును, ఆనందభైరవి రాగముతోను, అటతాళముతోను ఈ విధముగా గురుచక్రవర్తికి మంగళహారతులొసంగిరి.

పల్లవి ॥ మంగళం - జయ మంగళం - మా గురునకు ॥ మంగళం ॥

1. పొంగుచును హృదయాబ్జమందున
రంగుమీరగ మెఱసి కరుణా
సంగుడై యల హంసతోడ
నభంగగతి క్రీడించు గురునకు ॥ మంగళం॥

2. ఆరుపూవులయందు మేలగు
నజపమంత్రార్థము వచించుచు
తీరముల మూడింట మిక్కిలి
తేజమందిన దేశికునకిదే ।        ॥ మంగళం ॥

3. ప్రాణమును వెండియునపానము
మానితంబుగ నొకటి సేసియు
ధ్యానగమ్యంబైన వస్తు
నిదానమై వెలుగొందు స్వామికి ।        ॥మంగళం॥

4. వాదభేదము లేక యెప్పుడు
నాదబిందు కళాత్మకంబై
సాదు సేవితమైన యాత్మన
మ్మోదమున బోధించు స్వామికి ॥        ॥మంగళం॥

5. పంచ పంచవికారమగు నీ
భవన గర్భాంతరమునందును
బొంచి వర్గ సమూహమును త్రే
త్రుంచి తానై యున్న జ్యోతికి ।        ॥మంగళం॥

6. చాలగా వెలుగొందు నిర్మల
నీలతో యద మధ్యమందున
నోలలాడుచునున్న పరమను
బాలగూడి సుఖించువారికి ।        ॥మంగళం॥

7. రాజయోగముచేత మోక్ష
శ్రీ జయోన్నతి బొంది సతతము
నీ జగత్రయమంత ఇండుచు
నింపుగా వెలుగొందు నాత్మకు । ॥మంగళం॥

8. నాల్గు హద్దులుగల్గి యెప్పుడు
నాడెమౌ రతనములు చెక్కిన
జిల్గు బంగరుమేడలోపల
వెల్గు మాదేశిక స్వామికి ।

9. పదియునాలుగు లోకజాలము
ప్రాభవంబున గలుగజేయుచు
విదితముగ ద్విదళాబ్జమందున
వేగుచుక్కై యున్న నృహరికి । ॥మంగళం॥

10. ఆదిమధ్యాంతరముల నంతట
నచల రూపముతోడ విండియు
వేదవేదాంతములు సాక్షిక
వెలుగుచుండెడి నిర్గుణునకిదె । ॥మంగళం॥

11. అవనిలో శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్య
హృత్పర్మమున వెలయుచు
వివిధమగు లీలల మెలం
గెడు విశ్వనాధాక్యావధూతకు । ॥మంగళం॥

శ్రీ గురుపూజ ఉదయము గం. 11 లు మొదలు గం. 12ల వఱకును ఏకాంతముగాను, మహావైభవముగాను జరిగెను. ఆనాడు మహాశివరాత్రి ఆ శిష్య వర్గమునకు సార్థకమై యెప్పెను. మహారాజాధి రాజులకు గూడ లభింపని మర్యాదలతో గృహస్థాశ్రమము నెఱపుచు మోక్షార్థులైన వారికి విజ్ఞానభిక్ష నొసంగు శ్రీ స్వేచ్ఛానంద రాజయోగికి కనకాభిషేకము గావించుకొనిన శ్రీ కందర్ప సూర్యనారాయణగారి జీవితము కడంగడు ధన్యమైనది.

22 మార్చి 1949 తేదీ సర్వధారినామ సం॥ర ఫాల్గుణ బహుళ అష్టమీ మంగళవారము నాటికి మహేంద్రవాడ వచ్చి సంసిద్ధుడవై యుండుమని కందర్ప సూర్యనారాయణగారికి 24 రోజులు ముందుగానే గురువర్యులు ఆజ్ఞాపించియుండిరి. అందుచే కందర్ప సూర్యనారాయణగారు 21 – 3 గీ 49 సోమవారము రాత్రికే మండపేట నుండి మహేంద్రవాడ వచ్చి యుండిరి. మఱియు రెడ్డి రామమూర్తిగారున, ...రిటైర్డు క్లర్కు లింగాల సూర్యనారాయణగారును, కర్రి నారయ్యగారును, ముళ&ళపూడి గంగరాజుగారును, గొలుగూరి మహాలక్ష్మమ్మగారును, దేవరభొట్ల సుబ్బారాయుడుగారును వారి ధర్మపత్నియగు పూర్ణమ్మగారును, ముంజలూరి నారాయణమూర్తిగారును, తటవర్తి బుచ్చిరాజుగారును, ఇంకను మఱికొందఱు భక్తులును మంగళవారము ఉదయమునకే గురుసన్నిధిని చేరియుండిరి.

ఆ రోజున నుదయముననే లేచి కాలకృత్యములు తీర్చుకొనుటకు శ్రీ కందర్ప సూర్యనారాయణగారు తుల్యభాగానదికి స్నానమునకై వెళ్ళియుండిరి. గురువర్యుల యాశ్రమమునకు తుల్యభాగానది ఇంచుమించు నరమైలు దూరములో గలదు. సూర్యనారాయణగారు స్నానము చేసి నదిలో జపించుకొనుచుండగా శ్రీ మహర్షులవారు

తుల్యభాగానదీ తీరమున గల యొక మామిడిగున్న క్రింద దక్షిణాభి ముఖముగా వీసాసనాసీనులై కూర్చుండి చిన్ముద్ర ధరించి బంగారు విగ్రహమువలె కన్నుల మిరుమిట్లు గొల్పునట్లు ప్రకాశించుచు “ఓరీ! నాకు జననమరణములు లేవురా” అని పల్కి అదృశ్యులైరి.

అదే సమయమున మహేంద్రవాడలో గురువర్యులు నిర్యాణమందు సమయ మాసన్నమయ్యెను. అందుచే గురుపుత్రులగు వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు గురువర్యులను మేడక్రింద గదిలో దక్షిణాభిముఖముగా కృష్ణాజిన చిత్రాసనములపై కూర్చుండబెట్టి పట్టుపీతాంబరములు ధరింపజేసి, శరీరమంతయును భస్మమలంకరించిరి. గురుపత్నియగు బాపనాంబగారు ప్రక్కనే గూర్చుండియుండిరి. గురుపుత్రులైన వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు తమ రెండు చేతులతోను గురుచక్రవర్తిని పట్టుకొనియుండిరి. గుర్యులకు అభిముఖముగా రెండు గజముల దూరములో శిష్య శిఖామణియగు కర్రి నారయ్యగారు కూర్చుండి తదేక నిష్ఠతో గురుమూర్తిని చూచుచుండిరి. శిష్యకోటికేగాక లోకమునకంతకును అతి దుఃఖకరమైన దినము పరుగెత్తుకొని వచ్చెను. దుఃఖపరవశులై భక్తులు విలపింపసాగిరి. నాడీ క్రమగతి తప్పెను. తుల్యభాగానదిలో జపయోగనిష్ఠయందున్న కందర్ప సూర్యనారాయణగారు పరుగెత్తుకొని వచ్చిరి. ఉదయము సరిగా పదిగంటలయ్యెను. యుగ సంప్రదాయ ప్రవర్తకుడు, సర్వధర్మ సమన్వయమూర్తి, లోకాదర్శ స్వరూపుడు, గృహస్థ కల్పతరువునగు శ్రీ గురుచక్రవర్తి శరీరమందలి రోమములు నిక్కపొడుచుకొన, మూలాధారంబు బిగియించి, హంసను షట్చక్రములు దాటించి, భ్రూమధ్య బృందానాంతరమున జేర్చి, నాసాగ్రమున దృష్టి నిలువ, ముఖమండలమున దివ్య మందహాసము దీపింప, శరీరము విడనాడి శ్రీ షట్చక్ర సీతారామతారక పరబ్రహ్మమందైక్యము చెందిరి. ఆ

సమయమున శ్రీ గురుచక్రవర్తి దివ్య శరీరమునుండి కోటి విద్యుల్లతలు ఏకమై యేకరాశిగా బయలుదేరినట్లు తేజోరాశి బయల్వెడలెను. ఆ తేజస్సును శ్రీ కర్రి నారయ్యగారును, మఱికొందఱు పుణ్యాత్ములును బాగుగా దర్శింపగల్గిరి. మహా యోగీశ్వరేశ్వరులు నిర్యాణమందు లక్షణమదియే గదా!

సీ॥ అంఘ్రి మూలమున మూలాధార చక్రంబుఁ
బీడించి ప్రాణంబు బిగియఁబట్టి
నాభితలముఁ జేర్చి నయముతో మెల్లన
హృత్సరోజము మీది కెగయబట్టి
యటమీద సురమందు హత్తించి, క్రమ్మఱఁ
దాలు మూలమునకుఁ దఱిమి, నిలిపి
మతముతో భ్రూయుగమధ్యంబు సేర్చి దృ
క్కర్ణ నాసాస్య మార్గములు మూసి,
ఆ॥ యిచ్చలేని యోగి యెలమి ముహూర్తార్థ
మింద్రియానుషంగ మింతలేక
ప్రాణములను వంచి, బ్రహ్మరంధ్రము చించి
బ్రహ్మమందుఁ గలయుఁ – బౌరవేంద్ర ॥

భాగవతము 2 స్కం. 29 ప.

లోకమునకంతకును తీరని లోపము సంభవించిన యానాడు చాంద్రమాన సర్వధారినామ సం॥ర ఫాల్గుణ బహుళ అష్టమీ మంగళవారము (22 మార్చి 1949) తేదీ) ఉదయము పదిగంటలు.

శ్రీ మహర్షులవారి జీవితకాలము.

| సం. | మా. | రో. | గం. | ని. |
|---|---|---|---|---|
| 88 | 9 | 25 | 6 | 15 |

శ్రీరామ తారక మంత్రముచే ప్రతి రక్త కణమును పవిత్రమై సముజ్వలమై యుండెను. అందుచే నిర్యాణమైన వెంటనే శ్రీవారి దివ్యదేహము సువర్ణఛ్ఛాయతో ప్రకాశింపజొచ్చెను. ఇంకను జీవాత్మ మిగిలియున్నదేమోనని మధ్యాహ్నము రెండు గంటలవఱకును గురుదేహమును అట్లే యుంచిరి. శిష్యుల హృదయసీమలలో విజ్ఞానచంద్రికల ప్రకాశింపచేసిన శ్రీ స్వేచ్ఛానంద జీవనజ్యోతి అస్తమించినంతనే అందఱికిని సర్వమును అంధకారమయమై తోచెను. గురు చక్రవర్తివలె తమ్మిక ప్రేమించువారెవరు? శ్రీరామతత్త్వమును అరటిపండొలిచినట్లు విస్పష్టముగా బోధించువారెవరు? ఇక మాకు దిక్కెవ్వరని స్త్రీ పురుషులైన భక్తులు గోలుగోలున నేడ్వసాగిరి. గురుదేవుడు అస్తమించిన వార్త వినినంతనే పురజనులును, బంధువులును ఆతురులై వచ్చి గురుమూర్తి కడసారి దర్శనము గావించుకొని “శ్రీరామా! మాకు దిక్కెవ్వరు” అని పరిపరివిధములుగా విలపింపసాగిరి. మధ్యాహ్నము రెండు గంటలకు గురుదేవుని భౌతిక దేహమును వేదమంత్రములతోను, భజనలతోను, మంగళవాద్యములతోను బయలుదేరదీసిరి. గురువర్యుల గృహమునకు రెండు ఫర్లాంగుల దూరములో వారి సొంతభూమి గలదు. అచట దహన సంస్కారము జరిగెను. మంచిగంధపు చెక్కలతోను, రామనామపూతమైన యా దేహము ఒక్క యరగంట కాలములోనే దివ్యజ్యోతియై వెలిగిపోయెను. శ్రీ వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు భక్తిశ్రద్ధలతో కర్మకాండలను నిర్వర్తించుచు పితౄణమును

దీర్చుకొనుచుండిరి. గురుదేవుని భౌతికదేహమును దహనము గావించి శిష్యులును భక్తులును తమతమ యిండ్లకు వెళ్ళిపోయిరి. అద్భుత విశేషమేమనగా దహనము జరిగిననాటి రాత్రి కందర్ప సూర్యనారాయణ గారు మహేంద్రవాడలో గురుగృహమున నున్నపుడు అఖండ తేజోరాశిలో మునింగిపోయినట్లు అనుభూతిని పొందియున్నారు. చరాచర ప్రపంచ మంతయును వెలుగు సముద్రమై ఆయనకు చూపెట్టెను. ఆహా! గురుచక్రవర్తి నిర్యాణము ఎంత యద్భుతమైనది. గురువనగా దేహము కాదుగదా!

# శ్రీసుబ్రహ్మణ్యమహర్షి రాజయోగాశ్రమ సేవా సంఘము

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి నిర్యాణము నందిన పదునొండవరోజున 2 ఏప్రిల్ 1949 తేదీ శుక్రవారము రోజున సాయంకాలము 5 గంటలకు గురుదేవుని శిష్యులును, భక్తులును, బందువులును, స్త్రీ పురుషులందఱును నొకచోట చేరి సభగావించిరి. గురు నిర్యాణానంతరము జరుగవలసిన కర్తవ్యమును లింగాల సూర్యనారాయణ సభలో వివరించెను.

(2-1-1944 తేదీ) సుభానునామ సం॥ర కార్తీక శుద్ధ ద్వాదశీ శుక్రవారం రాత్రి 9 గంటలకు శ్రీ గురువర్యులు తమ నిర్యాణానంతరము శిష్యులు జరుపవలసిన ధర్మములు లింగాల సూర్యనారాయణకు దెల్పియుండిరి. ఆ విషయము సభలో వివరించెను. శ్రీవారి స్మృతి చిహ్నముగా ఆశ్రమ నిర్మాణమును, విగ్రహ ప్రతిష్ఠయును జరుపుటకు అప్పటికి సమావేశమైన భక్తకోటి తత్కాలమున సుమారు రు 1600 లు విరాళములనొసంగిరి.

ఆ సమయముననే శ్రీ మహర్షి శిష్యులైన అనిపెద్ది జగన్నాథశాస్త్రిగారు భక్తులనుద్దేశించి ఆశువుగా నీ క్రింద నుదహరింపబడిన పద్యములు చెప్పిరి.

మ॥ పరమంబై దగు భక్తి భావమున సుబ్రహ్మణ్య సద్దేశికే
శ్వరుడాత్మైకము జెంది తత్ప్రతిమ శశ్వద్భక్తి స్థాపింప మం
దిర నిర్మాణ మొనర్ప భక్తవరులర్షింజేయునా యత్నమి
ద్ధరశర్ధిల్లుత సార్ధకంబగుచు సద్యః కార్య నిర్వాహమై ॥

తే॥ దేశికోత్తమ కరుణా విధేయులగుచుఁ
దగు విరాళంబులొసగిన ధన్యమతుల
కాత్మ విజ్ఞాన భాగ్యంబు నందజేసి
సద్గురూత్తము డనయంబు – సాకుగాక ॥

మ ॥ సతతంబున్ వినయాతిరేకమున శశ్వద్భక్తి యొప్పారగా
సుతుడన్ నామము సార్థకంబగు క్రియన్– శుద్ధాంత రంగంబుతో
పితకున్ సేవ లొనర్చి ధన్యుడయి యుర్విన్ దాఁబరబ్రహ్మమీ
పిత్రుమేధంబొనరించి మించె నతడుర్విన్ వృద్ధిఁజెందున్ గడున్ ॥

ఇట్టి ప్రబోధముతో గురుశక్తి భక్తులయందావహించెను. గురునిర్యాణానంతరము గురుశక్తిని లోకమునకందీయవలసిన భారమును వహింపవలసియుండుటచే శ్రీ కందర్ప సూర్యనారాయణగారు శ్రీ గురు విగ్రహమును చేయించుటకు నిశ్చయించుకొనిరి. పండ్రెండవరోజున దానధర్మాదికములు మహావైభవముగా జరిపించి పితృయజ్ఞమును పూర్తి చేసి గురుపుత్రులు తమ పితృభక్తిని శాశ్వతముగా నిలుపుకొనిరి. గురుదేవుని భౌతిక దేహమునకు దహన సంస్కారము జరిగినచోట నూరు రూపాయలు ఖర్చుపెట్టి గురుస్మృతి చిహ్నముగా నొక తులసి కోటను గురుపుత్రులే

గట్టించుకొని గురుభక్తిని గూడ ప్రకటించుకొనిరి. గురువర్యులు పరమపదించిన తర్వాత శ్రీరామ పీఠమునకు పూజాదులు జరుపుచు భక్తుల మన్ననలకు పాత్రులై అతిధి - అభ్యాగతులను ఆదరించుచు శ్రీ వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారు గురుపరంపరా ధర్మములను నిల్పి కాపాడుచున్నారు. దహన సంస్కారాదులు జరిగినచోటనే జలభద్రపురం గ్రామనివాసులగు సబ్బిళ్ల సత్తిరాజుగారు నూయి త్రవ్వించిరి. ఆయన కుమారులు వెంకటరెడ్డిగారు. శ్రీ వెంకటరెడ్డిగారును, వారి ధర్మపత్ని సత్యవతిగారును, దమ సంతానము నిలుచుటకై అశ్వత్థ వృక్షమును నింబవృక్షమును ప్రతిష్ఠించి కల్యాణముచేసి నాగ ప్రతిష్ఠగూడ చేసికొనిరి. గురుభక్తిచేతను, గురుప్రభావముచేతను, వారిప్పుడు పుత్రపుత్రికా సంతానమునంది నిర్విచారముగా సుఖ సంపదలతో తులతూగుచున్నారు.

గురువర్యులు పరమపదించిన పదనొకండవరోజుననే రు 1600 లు వసూలై యుండుటచేత తక్కిన సొమ్మును పూర్తిచేయుటకు శ్రీ కర్రి నారయ్యగారును, శ్రీ కందర్ప సూర్యనారాయణగారును బయలుదేరి రు. 4314-2-6 వసూలు చేసి కొంత మూలధనము నేర్పాటు చేసిరి. శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమ నిర్మాణమునకు తగిన పవిత్ర ప్రదేశమునకై ఆలోచనలు చేయసాగిరి. తూర్పుదిశగా గల గురుస్థలములోనే ఆశ్రమ నిర్మాణము గావించుటకు నిశ్చయించిరి.

# ఆశ్రమ నిర్మాణము

ప్రస్తుతము ఆశ్రమ నిర్మాణము జరిగిన ప్రదేశము కాకినాడ నివాసులగు మల్లాది నరసింహశాస్త్రిగారి కుమారులైన వెంకట్రామయ్యగారివలన 29 మార్చి 1935 సం॥రం తేదీని శ్రీసుబ్రహ్మణ్య గురువర్యులు క్రియమును పొందియున్నారు. ఆ పవిత్ర ప్రదేశము గురువర్యుల మేడకు తూర్పు దిశను గలదు. ఆ ప్రదేశముననే ఆశ్రమ నిర్మాణాదులు జరుపుటకు శిష్యులు నిశ్చయించుకొనిరి.

శ్రీ వారోధినామ సం॥ర వైశాఖ బహుళ సప్తమీ గురువారము (19 – మే – 1949 తేదీ ) రోజున పడిసిలేరు గ్రామ నివాసులైన శ్రీరాగిమిల్లి కామేశ్వర సిద్ధాంతిగారిచే ఆశ్రమ నిర్మాణమునకు ప్లానులును, ముహూర్తమును నిశ్చయింపబడెను.

శ్రీ విరోధినామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ నవమీ ఆదివారము (5 జూన్ 1949 తేదీ) రోజున ఉదయము ఉత్తరా నక్షత్ర యుక్త కర్కాటక లగ్నమందు గం. 8–51 లకు శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమమునకు గురుపుత్రులైన శ్రీ వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారును వారి ధర్మపత్నియగు సుభద్రమ్మగారును శంకుస్థాపనము గావించిరి. ఆశ్రమము గోడ వెలుపలకు ఏడు గజముల వెడల్పును పది గజముల పదునైదంగుళముల పొడవును నిర్ణయించి నిర్మాణము చేయదలచిరి. వాస్తు గణిత ప్రకారముగా ఆశ్రమ నిర్మాణము ఇట్లుండెను.

పదము –73

ధనము –8

ఋణము - 3

ఆయము - 1

తిథి - 18

వారము - 7

నక్షత్రము -18

యోగము - 22

కరణము - 1

దిక్కృతి - 1

జాతి - 1

తత్త్వము - 4

అంశము - 6

రాశి - 9

శుక్రమహాదశలో శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమ సేవా సంఘోదయము ప్రారంభమయ్యెను. ఈ యాశ్రమమునకు వయస్సు 104 సంవత్సరములు. "ఒక సూర్యుండు సమస్త జీవులకుఁ దానొక్కొక్కడై తోచు పోలిక" అనునటుల గురుశక్తి కందర్ప సూర్యనారాయణగారిలో ప్రవేశించి వివిధ రంగాలలో వివిధ రూపములు దాల్చుచుండెను. శ్రీసూర్యనారాయణగారు మద్రాసులోగల యస్.నాగప్ప అను శిల్పిచే గురు విగ్రమమును తయారు చేయించి మండపేట తెప్పించి తమ గృహమందుంచిరి. ఆశ్రమ నిర్మాణము గూడ త్వరలోనే పూర్తి అయ్యెను.

శ్రీ నందననామ సంవత్సర చైత్రశుద్ధ విదియా గురువారము (27 మార్చి 1952 సం॥రం తేదీ) రోజున మధ్యాహ్నము గం. 1-30 లకు అశ్వనీ నక్షత్రయుక్త కర్కటకలగ్నమందు శ్రీ గురుదేవుని విగ్రహమును మండపేటనుండి మహేంద్రవాడ తీసికొనివచ్చిరి.

# శ్రీశ్రీశ్రీ సుబ్రహ్మణ్య మహర్షి ప్రతిష్ఠ

ఓం నమో భగవతే సుబ్రహ్మణ్య మహాదేవాయ

స్వస్తిశ్రీ చాంద్రమాన నందననామ సం॥ర చైత్ర బహుళ షష్ఠీ సోమవారము (31 మార్చి 1952 తేదీ) ఉదయము గం. 9–28 లకు శ్రీ గురు ప్రతిష్ఠ జరుపుటకు దైవజ్ఞులచే నిశ్చయింపబడెను.

శ్రీశ్రీశ్రీ జగద్గురు సదానంద భారతీ స్వాములవారు సర్వోపద్రష్టలై కార్యక్రమమునలు యధాశాస్త్రముగా నడిపించిరి.

30 మార్చి 1953 తేదీ ఆదివారము సూర్యోదయము నుండి దీక్ష ప్రారంబమయ్యెను. బ్రహ్మశ్రీ తుట్టగుంట వెంకటరత్నావధానులుగారు ఆధ్వర్యము వహించిరి. శ్రీ మునుకుట్ల శేషయ్య శాస్త్రిగారును, శ్రీ రెడ్డి రామమూర్తిగారును, శ్రీ ముంజులూరి రామమూర్తిగారును, లింగాల సూర్యనారాయణయును శ్రీ రామతారక మంత్రమును జపించిరి. శ్రీ దేవరభొట్ల సుబ్రహ్మణ్యావధానులుగారును, శ్రీ వరఘుల రామస్వామిగారును, శ్రీ మునుకుట్ల వీరయ్యగారి కుమారులు వెంకట రామకృష్ణయ్యగారును, శ్రీ మునుకుట్ల సుబ్బయ్యగారి కుమారులు వెంకటరామకృష్ణయ్యగారును నవగ్రహ జపహెూమాదులు గావించిరి.

31 మార్చి 1952 తేదీ ఉదయము గం. 9–28 లకు శ్రీ చెరుకుపల్లి దక్షిణామూర్తిశాస్త్రిగారు యంత్రమును గురు విగ్రహమును స్థాపించిరి. శ్రీశ్రీశ్రీ సదానంద భారతీ స్వాములవారు సుముహూర్త సమయమునకు తమ మెడలోనున్న రుద్రాక్షమాల గురుదేవుని మెడలో నుంచుచు, శ్రీగురు

విగ్రహమునకు కళాన్యాసము గావించుచు, నేనుంచిన రుద్రాక్షమాల ఎవరును తీయరాదనియు, అట్లు తీసినచో ప్రమాదము సంభవించుననియు హెచ్చరించిరి. పిమ్మట భక్త బృందము వారిచే భజనలు భగవన్నామ స్మరణలు గావింపబడెను. ప్రతిష్ఠా సమయమునకు శ్రీ గొలుగూరి మహలక్ష్మమ్మగారు ఆశ్రమమునకు కంచుగంటను, వింజామరయును సమర్పించిరి. ప్రతిష్ఠానంతరము అన్ని తరగతులవారికిని అపారమైన యన్నదానము గావింపబడెను.

31 మార్చి 1952 తేదీ మధ్యాహ్నము గం. 3-30లకు బహిరంగ సభ జరుపబడెను. శ్రీశ్రీశ్రీ జగద్గురు సదానంద భారతీ స్వాములవారు అధ్యక్ష పీఠమలంకరించిరి. శ్రీ దేవరభొట్ల సుబ్రహ్మణ్యావధానులు శ్రీ వఝుల రామస్వామిగార్ల వేదపఠనముతో సభ ప్రారంభమయ్యెను. శ్రీ మునుకుట్ల శేషయ్యశాస్త్రిగారు శ్రీ గురు ప్రార్ధన గావించిరి. పిమ్మట అధ్యక్షులవారి యాధ్మాత్మిక ప్రసంగముతో సభ ప్రారంభమయ్యెను.

బ్రహ్మశ్రీ కందర్ప వెంకటేశ్వర్లుగారు శ్రీ గురుప్రతిష్ఠావశ్యకతను గూర్చి ముచ్చటించిరి.

పిమ్మట ఆశ్రమ కార్యదర్శియైన లింగాల సూర్యనారాయణ శ్రీ గురుచక్రవర్తి జీవితరంగ విశేషములు తెల్పెను.

శ్రీ లింగాల బంగారయ్య సిద్ధాంతిగారు శ్రీ గురుదేవునికి నిత్యమును ధూపదీప నైవేద్యాదికములు జరుగు పద్ధతులు విశదీకరించిరి. మఱియు ప్రతిసంవత్సరమునందును ఇరువదివేల పంచాంగములలో "సుబ్రహ్మణ్యగురుజయంతి" అని ప్రకటింతుమని వాగ్దానము చేసి అట్లే ప్రకటించుచున్నారు.

శ్రీ ధర్మాల సుబ్బరాయశాస్త్రిగారు వేదాంత తత్త్వమును గూర్చి

యుపన్యసించిరి. గురుప్రతిష్ఠయనగా మహర్షి సంప్రదాయ సిద్ధమైన మహాకార్యమనియు, ఈ యాశ్రమము సర్వతో ముఖముగా నభివృద్ధి నొందుటకై శిష్యులు మాత్రమేగాక భక్తులెల్లరును దీక్షవహింపవలెనని హెచ్చరించెను.

పిమ్మట గురుసంప్రదాయ ప్రవర్తకులైన శ్రీ కందర్ప సూర్యనారాయణగారు లేచి ఈ గురుప్రతిష్ఠ శ్రీ గురుపుంగవుల యాజ్ఞయనియు, ఆ యాజ్ఞను తప్పక శిరసావహించి నెరవేర్చవలెననియు, జమాఖర్చులు ఎప్పటికప్పుడు వివరములతో భక్తులందఱికిని పంపబడుననియు, మోక్షార్థులకు ఇంతకంటె ఆదర్శమైన పవిత్రకార్యము మఱియొకటి లేదనియు, అందఱును ఈ యాశ్రమ నిర్వహణమునకై దీక్ష వహింపవలెననియు హెచ్చరించిరి.

పిమ్మట కార్యదర్శి – లింగాల సూర్యనారాయణ యభివందనములతోను, శ్రీ మునుకుట్ల శేషయ్యశాస్త్రిగారి మంగళముతోను ఆనాటి కార్యక్రమములు మహా వైభవముగా సమాప్తమైనవి.

అప్పటినుండి శ్రీ కందర్ప సూర్యనారాయణగారు కోశాధిపతిగాను, లింగాల సూర్యనారాయణ కార్యదర్శిగాను నుండి ప్రతి సం॥రమందును జ్యేష్ఠ శుద్ధ – చవితిరోజున శ్రీ గురుజయంతి జరుపుచున్నారు. గురుమహిమలు వెల్లడియైన పిమ్మట శిష్యులు మాత్రమేగాక యితర భక్తులుగూడ ధన, వస్తు, సేవా రూపములుగా సహకారమొనర్చి జయంతి మహోత్సవములు జరుపుచున్నారు. ఆశ్రమ నిర్మాణము శుక్ర మహాదశలో ప్రారంభమగుటచేతను, గురుశక్తి కందర్ప సూర్యనారాయణగారిలో ప్రవేశించి యుండుటచేతను క్రమక్రమాభివృద్ధిగా ప్రతి సం॥రమునందును జయంతి మహోత్సవములు జరుపబడుచుండును. ఆశ్రమ

నిర్మాణమునకును, ప్రతిష్ఠా కార్యరంగములకును ఆరువేల రూపాయలు ఖర్చుయ్యెను. శ్రీ గురుచక్రవర్తి విజయదుందుభి దశదిశలు మారుమ్రోగసాగెను. 1952 సం॥రము నుండి 1959 సం॥రము వరకును క్రమక్రమాభివృద్ధిగా జయంతి మహోత్సవములు జరుపబడుచునేయుండెను.

# శ్రీసుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమమునకు స్థిరాస్తి సంక్రమణము

మహర్షి ప్రియశిష్యురాలైన శ్రీ తమిరిశ వెంకట సుబ్బమ్మగారు శ్రీ గురుదేవుని పూజారాధనలకు సమర్పించిన భూమి.

రు 1000 లకు స్థిరాస్థికి వ్రాయించి యిచ్చిన క్రియ దస్తావేజు :-

ది 30 మే 1959 సం॥రం తేదీని రామచంద్రపురం తాలూకా మహేంద్రవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ సుబ్రహ్మణ్య సద్గురు రాజయోగాశ్రమ ధర్మకర్తలు 1. రెడ్డి వెంకట సుబ్రహ్మణ్యంగారి కుమారుడు వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మం. 2. మండపేట కాపురస్తులు కందర్ప వెంకటేశ్వర్లుగారి కుమారుళ్ళు సూర్యనారాయణగార్లకు -

మహేంద్రవాడ కాపురస్తులు మల్లిడి గంగిరెడ్డిగారి కుమారుడు చినవీర్రెడ్డి యీతని కుమారుడు రామిరెడ్డి మైనరు సంరక్షకుడు తండ్రి వీర్రెడ్డిగార్లు వ్రాయించి యిచ్చినది.

ఈ దిగువ షెడ్యూలు దాఖలూ భూమి శ్రీ సుబ్రహ్మణ్య సద్గురు రాజయోగాశ్రమమునకు శ్రీ స్వామివారికి యిందుమూలంగా విక్రయించి ఆస్తి ఈ రోజుననే స్వాధీనం చెయ్యడమైనది. క్రియ ఫలితం సదరాశ్రమంలో వేంచేసియున్న శ్రీ స్వాములవారికి జరుపబడే పూజారాధనకు క్రియాస్తివల్ల వచ్చే ఆదాయం వినియోగపడవలెనని కోరికవల్ల కొవ్వూరు తాలూకా మలకపల్లి కాపురస్తులు తమిరిశ వెంకటరమణయ్యగారి భార్య వెంకటసుబ్బమ్మగారి స్థానే క్రియ ప్రతిఫలం రు 1000 లు 1వ ట్రస్టీగారి ద్వారా మహేంద్రవాడ కాపురస్తులు తమలంపూడి వెంకటరెడ్డిగారి పేరిట ది 30-7-1957 సంIIరం తేదీని వ్రాయించి యిచ్చిన ప్రాంశరీనోటు బాకీ యీ తేదీకి యివ్వతేలిన అసలీఫాయిదాల మొత్తం పూరా పరిష్కారమునకు రు. 800 లున్నూ ది 26-9-1957 సంII రం తేదీని సదరు తమలంపూడి వెంకటరెడ్డిగారి పేర నేను వ్రాయించి యిచ్చిన ప్రాంశరీనోటు బాకీ యీ తేదీకి ఇవ్వవలసిన అసలీ ఫాయిదాలు రు 200 లు, సదరు రెండునోట్లు తాలూకు వెరసి రు 1000 లు మాస్తానే తీర్చి సదరు ప్రోనోట్లు యిందుకు వోచరుగా వుంచుకునే యేర్పాటు మూలంగా ప్రతిఫలం పూర్తిగా ముట్టినది. గనుక ఇంతటి మంచి సదరు ధర్మకర్తలు శ్రీ స్వామివారి స్తానే సర్కారు పన్నులు వగైరాలు చెల్లించుకుంటూ ప్రతినిత్యము ధూపదీప నైవేద్యములు జరుపుతూ ఆచంద్రార్కం అమలు జరిపే నిర్ణయం. సదరు భూమి యింత వరకు ఎట్టి అన్యాక్రాంతములు చేసి వుండలేదనిన్నీ నిర్వివాద ఆస్తి అనిన్నీ సర్వే నెంబరు హద్దులు పర్మితం వగైరాలు సరియైన వనిన్నీ మీతో చెప్పి మిమ్ములను నమ్మించి యీ క్రియ దస్తావేజు వ్రాయించి యివ్వడమైనది. యిందును గుటించి జా&ఇతి సామంతాద్యవరోధముల ఏమి వచ్చిన అవి అన్నియు మా స్వంత ఖర్చులతో పరిహరించి సదరాస్తి స్వామివారికి, వారి స్థానీయులకు మేము మా

స్తానీయులు నిరాటంకముగా జరుపుదుము. సదరాస్తి శ్రీ స్వామివారిపేర సర్కారు లెక్కలలో నమోజు నిమిత్తం యిందుతో వడంబడికలు దాఖలు చేయడమైనది.

షెడ్యూలు తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రపురం తాలూకా, రామచంద్రపురం సబుడివిజనులో చేరిన మహేంద్రవాడ గ్రామం తాలూకు జిరాయితీ రివిజను సర్వే నెం 182/9 ను పూరా యం -19 ట్లు. భుక్తప్రకారం యం-20ట్లు. ఇందలి సమస్తమయిన యూజుమెంటు హక్కులు సహా యిది మా సమ్మతిని వ్రాయించి యిచ్చిన క్రియ దస్తావేజు.

మల్లిడి చినవీరెడ్డివ్రాలు.

యీ రామిరెడ్డి మైనరు సం॥ తండ్రి యీ చిన వీరెడ్డివ్రాలు.

ఇందుకు సాక్షులు

1. మల్లిడి వీర్రాజు సాక్షివ్రాలు,

2. ముంజులూరి అచ్యుతరామయ్య సాక్షివ్రాలు,

దస్తూరీ :- తటవర్తి రామలింగస్వామిగారి కుమారుడు అప్పారావు. సాకీనస రామచంద్రపురం, స్టాంపు రు 80లు.

1పు 874 వా 222 పు నె 142-406-1959

(ఇది దస్తావేజుకు సరియైన నకలు)

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి శతవార్షికోత్సవములు

శ్రీగురువర్యులు 26 మే 1860 తేదీని జన్మించియుండుటచే 1960 సం॥ మే నెల 28 తేదీ నుండి మూడు రోజులు శతవార్షికోత్సవములు జరుపబడెను. శ్రీ శార్వరినామ సం॥ర జ్యేష్ఠ శుద్ధ – తదియ శనివారము (28– మే 1960 తేదీ) నుండి పంచమీ సోమవారము (30 మే 1960 తేదీ) ఆఖరువఱకును ఉత్సవములు జరుపబడెను.

గాయత్రీ పీఠాధిపతులగు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీ స్వాములవారు (గొడుగు పేట – బందరు) అధ్యక్షులుగా నుండి కార్యక్రమములు జరిపించిరి. 28–మే 60 సం॥రం తేదీ శనివారము రోజున అనపర్తి గ్రామ నివాసులైన శ్రీ నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డిగారును వారి ధర్మపత్ని అప్పాయమ్మగారును శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి రాజయోగాశ్రమమున శ్రీ సీతారాముల సమక్షమున పుత్రకామేష్టి జరుపుకొనిరి. లింగాల వెంకటశాస్త్రి పుత్రకామేష్టి జరిగించెను. జ్యేష్ఠ శుద్ధ చవితి ఆదివారము రోజున ఉదయము 8 గంటలకు స్త్రీ పురుషులెల్లరును గో పూజలు గావించుకొనిరి. గోపూజా సమయమున "శ్రీరామశరణ్" శ్రీ కుందుర్తి వెంకట నరసయ్యగారు గో మహిమను గూర్చియు, గో పూజా విశేషముల గూర్చియు భక్తుల హృదయములు ద్రవించునట్లు ఉపన్యసించిరి. ఆ రోజుననే శ్రీ గురు జయంతి అగుటచేతను, పునర్వసు నక్షత్రయుక్త పర్వదిన మగుటచేతను ముప్పదియైదుమంది పుణ్యదంపతులు 35 సీతాకల్యాణములు వరుసలు దీర్చి కన్నుల పండువుగా జరుపుకొనిరి. ఆ మనోహరదృశ్యము జన్మ సార్థకమై యొప్పెను.

30 మే 1960 తేదీ సోమవారము రోజున పుష్యమీ నక్షత్రమున ఉదయము శ్రీ గురుమూర్తికి అభిషేకాదులును పూజలును జరుపబడెను. గురుపూజ జరుగుచున్నపుడు జరిగిన విశేషమేమనగా గురు విగ్రహమునకు ఎడమప్రక్క శ్రీరామ లక్ష్మణులు ధనుర్ధరరులై సర్వాలంకార శోభితులై తుట్టగుంట వీరవెంకట సత్య సూర్యనారాయణ అను పేరుగల యేడేండ్ల బాలినికి సాక్షాత్కరించిరి. అది ఉదయము ఎనిమిది గంటలకు పూజా సమయములో జరిగిన యత్యద్భుత సన్నివేశము. ఆ దివ్య సందర్శనము గాంచినంతనే ఆ బాలుడు తన్మయుడై కేకలు మొదలుపెట్టెను. ఆ సమయముననే నేను గురు విగ్రహము శిరస్సుపై చేయివేసి అలంకరించుచుండగా బాహ్య ప్రపంచము తెలియని తన్మయత్వమునంది నిశ్చేష్టుడనైతిని

కన్నుల పండువుగా నలంకరింపబడిన మందిరములో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకము జరిగెను. శ్రీ గురు చక్రవర్తి పౌత్రుడును, శ్రీ వెంకట సూర్యనారాయణ పరబ్రహ్మంగారి పుత్రుడును నగు చిరంజీవి రెడ్డి కృష్ణమూర్తియును అతని భార్య చిరంజీవి సౌభాగ్యవతియగు పార్వతీ భద్రకాళీ దేవియును సామ్రాజ్య పట్టాభిషేకము జరుపుకొనిరి. ఆ శుభ సమయమున శ్రీ మహర్షి శిష్యురాలును, కంటిపూడి శ్రీరాములుగారి భార్యయగు వీరమ్మగారు పంచదార తెప్పించి చీమలకు భూతబలి యొసంగిరి.

ఆ పట్టాభిషేకముగూడ లింగాల వెంకటశాస్త్రియే చేయించెను. ఆ మూడు రోజులలోను మధ్యాహ్నము నాల్గు గంటల నుండి శ్రీ విద్యాశంకర భారతీ స్వాములవారు భక్తి, జ్ఞాన, వైరాగ్య తత్త్వములగూర్చి సర్వజనరంజకముగా నుపన్యసించిరి. ఆ రాత్రి "యక్షగాన ప్రబంధకవి" శ్రీ రావి పద్మనాభదాసుగారు తాము రచించిన శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి

చరిత్ర" ను హరికథా రూపమున గానముచేసి భక్తిని ప్రవహింపజేసిరి. శతవార్షికోత్సవములకు రెండువేల రూపాయలు ఖర్చు అయ్యెను. మూడు వేల మందికి అన్నదానము జరిగెను. ప.గో.జిల్లా, అనంతపల్లి గ్రామమునుండి "శ్రీవేణుగోపాల బాలభక్త సమాజము"' వారు మూడురోజులును పవళింపు సేవలును, ప్రభాత సేవలును జరిపిరి.

రెండవ రోజున రాత్రి చైతన్య దళము వారిచే

"శ్రీరామకృష్ణ పరమహంస చరిత్ర" బుర్రకథ చెప్పబడెను.

కథకులు :- శ్రీ పురిఘళ్ళ రంగారావుగారు, (అనంతపల్లి)

రాజకీయము :- కైలాసకోట వీరభద్రసామిగారు (అనంతవల్లి)

హాస్యము :- శ్రీ పురిఘళ్ళ శ్రీ రామకృష్ణమూర్తిగారు (దేవరపల్లి)

ఇట్లు మూడు రోజులును మహా వైభవముగా శతవార్షికోత్సవములు జరుపబడెను. శ్రీ సీతారాముల విజయాభిషేకములతో జరిగిన యా వినోదరంగములుగాంచి భక్తులు తన్మయులై తమ తమ జన్మములు సార్థకము చేసికొనిరి.

# నిర్యాణానంతరము మహర్షి దివ్య దర్శనము౹

ప్లవనామ సం॥ర నిజజ్యేష్ఠ శుద్ధ - చవితి శనివారము (17 జూన్ 1961 తేదీ) రోజున మహేంద్రవాడలో గురుజయంతి జరుపవలసియుండెను. నా యుద్యోగ విరమణ సమయమగుటచే నేను

ఆ సం॥రము జయంతికి మహేంద్రవాడ వెళ్ళజాలకపోతిని. నేను ఆ రోజున ఏలూరులో జిల్లా పరిషత్ ఆఫీసులో నుండవలసి వచ్చెను. ఏ డెనిమిది సం॥రములు శ్రమించి రంచించిన శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి చరిత్ర అచ్చులోనికి తీసికొని రాజాలకపోతినేయని పరితపించుచుంటిని. నా యుద్యోగము అయిపోవుటయును, చరిత్ర ముద్రణమునకై పరితపించుటయును శ్రీ గురువర్యులు గ్రహించి ప్రత్యక్ష మహిమను చూపినగాని శిష్యులు గ్రంథముద్రణకై తొందరపడరని తలంచి యుండిరి.

శ్రీ ప్లవనామ సం॥ర నిజజ్యేష్ఠ శుద్ధ సప్తమీ మంగళవారము (20 జూన్ 1961 తేదీ) రోజున మహర్షి ముఖ్యశిష్యురాలైన శ్రీతమిరిశ వెంకటసుబ్బమ్మగారు రాజమండ్రిలో తమ సోదరులైన శ్రీకేసిరాజు సత్యనారాయణగారి యింటిలో నుండిరి. అప్పటికి ఆమె యారోగ్యము కొంచెము చెడియుండెను. ఆ రోజు మధ్యాహ్నము గం. 1-0 వేళ శ్రీ వెంకట సుబ్బమ్మగారు గురుధ్యాననిష్ఠలో నుండగా శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి సాక్షాత్కరించి "అమ్మా! చరిత్ర ముద్రణము నిమిత్తము లింగాల సూర్యనారాయణ పరితపించుచున్నాడు. అతని యుద్యోగముకూడ అయిపోయినది. నీవిట్లు నిశ్చింతగా నుంటివా!" అని హెచ్చరించి అదృశ్యులైరి. ఇది పట్టపగలు జాగ్రదవస్థలో కల్గిన దివ్య సందర్శనము, గురుదేవుని ఈ పల్కులు విని శ్రీ సుబ్బమ్మగారు వెంటనే రు 100 లు మహర్షి చరిత్ర ముద్రణమునకు సమర్పితమని మూటకట్టి యుంచి వెంటనే రావలసినదిగా నాకు దువ్వ కబురు చేసిరి. 22 జూనం 1961 తేదీ గురువారము రోజున నేను రాజమండ్రీలోగల శ్రీకేసిరాజు సత్యనారాయణగారి యింటికి వెళ్ళినపుడు శ్రీ వెంకటసుబ్బమ్మగారి వలన పై విషయములు నాకు తెలిసెను. ఆ భక్తురాలు శ్రీ మహర్షి చరిత్ర ముద్రణమునకై నూరు రూపాయలు నాకిచ్చియుండిరి. శ్రీ గురు చక్రవర్తి మానవమాత్రుడే యైనచే

మరణించిన పిమ్మట కూడ పట్టపగలు దర్శనమిచ్చి మాట్లాడుట యెట్లు పొసగును?

తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకాలో చేరిన మండపేట ప్రాచీన కాలమునుండియు ప్రసిద్ధికెక్కిన గ్రామము. మాండవ్య మహర్షి అఖండ తపంబొనర్చి ఈ గ్రామము నిర్మించినట్లు స్థల పురాణముగలదు. ఈ గ్రామ నివాసులై యుండుటచేతను, మహర్షి నిర్యాణానంతరము గురుపరంపరయొుక్క బాధ్యతను వహింపవలసియుండుటచేతను, ప్రధానశిష్యులై యుండుటచేతను, శ్రీ కందర్ప సూర్యనారాయణగారు తమ జన్మస్థలమైన మండపేటలో గూడ శ్రీసుబ్రహ్మణ్యమహర్షి రాజయోగాశ్రమము నెలకొల్పి శ్రీ గురువర్యుల బోధామృతములు ప్రచారము చేయుచున్నారు. మహేంద్రవాడ ప్రధాన కేంద్రముగాను, మండపేట అనుబంధసంస్థగాను పనిచేయుచున్నవి.

మహేంద్రవాడలో నిత్యమును ధూపదీప నైవేద్యాదికములు జరుపబడుటయేగాక ప్రతి సంవత్సరమును జ్యేష్ఠ శుద్ధ చవితిరోజున శ్రీ సుబ్రహ్మణ్యమహర్షి జయంతి మహోత్సవములు శిష్యులయొక్కయు, భక్తులయొక్కయు సంపూర్ణ సహకారములతో మహా వైభవముగా జరుపబడుచుండును.

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి మొదలుకొని ఈ ఏకాదశి వఱకును దేవీ నవరాత్రములును, ఫాల్గుణ బహుళాష్టమి రోజున (నిర్యాణ దినమున) సమాధి స్థలమునందు పూజలును, ఆశ్రమ ప్రాంగణమున సమారాధనములును జరుగుచుండును.

మండపేటలో నిత్యారాధనలు మాత్రమేగాక పర్వదినములందు విశేషోత్సవములను జరుపుచు శ్రీగురువర్యుల వాఙ్మయ విశేషములను,

బోధామృతములను శ్రీ కందర్ప సూర్యనారాయణగారు ప్రచారము చేయుచున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా తణుకు తాలూకాలో చేరిన వేలివెన్ను గ్రామనివాసులును, "యక్షగాన ప్రబంధకవి" బిరుదాంకితులును అగు శ్రీ రావి పద్మనాభదాసుగారు మహర్షి జీవితరంగములను హరికథా రూపమున చిత్రించి ప్రచారము చేయుచున్నారు.

విశ్వమానవ కళ్యాణార్థమై "శ్రీ సుబ్రహ్మణ్య మహరి&ష రాజయోగాశ్రమము" 31 మార్చి 1952 సం॥రము తేదీని స్థాపించబడెను. శ్రీ గురుదేవుని శిష్యులమగు మనకు మన మతధర్మముల నుద్ధరించుటయే ముఖ్యధర్మము. మన జాతి భావిభాగ్యోదయమునకు శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి దివ్యబోధామృతములు అత్యంతావశ్యకములు. జనసామాన్యము నుద్ధరించుటకై జీవితములను దారపోయుట మన ముఖ్య కర్తవ్యము.

ఈ చరిత్రాధిష్ఠాన దేవతలగు శ్రీ సీతారాములు విశ్వమానవ కళ్యాణము చేకూర్చి సర్వులకును సకల సంపదలనొసంగి రక్షించుచుండుగాక.

శ్లో॥ స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయేనమార్గేణ మహీంమహీశాః
గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు॥

కాలే వర్షతుపర్జన్యః పృధివీసస్య శాలినీ
దేశో....యం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయా ॥
అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః
అధనాస్సధనాస్సంతు జీవంతు శరదాంశతమ్ ॥

శ్లో ॥ మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాబ్ధయే ।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥
వేదవేదాంత వేద్యాయ మేఘశ్యామల మూర్తయే ।
పుంసాం మోహన రూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్ ॥

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతి

సమాప్తం.

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

శ్రీరాచంద్ర గ్రంథమాల - ఏకవింశతి పుష్పమ్

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి సుప్రభాతమ్

రచయిత :

శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి ప్రియశిష్యుడు,

ఉభయభాషాప్రవీణ

శ్రీలింగాల సూర్యనారాయణ.

ద్రవ్యదాత :
శ్రీ ఘడియారం భాస్కరమూర్తి ...
......భీమవరం,
1973
మూల్యము : భక్తి,

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

# శ్రీ సుబ్రహ్మణ్య మహర్షి సుప్రభాతమ్.

శ్లో ॥ శ్రీరామచంద్ర పదసేవక తత్త్వమూర్తే ।
యోగీంద్రమానస విరాజిత దివ్యమౌళే ।
సంసారసాగర భయాపహ పుణ్యమూర్తే ।
మహేంద్రవాడ పురదేశిక ! సుప్రభాతమ్ ॥

శ్లో ॥ శ్రీపాపయార్య గురుదర్శిత రామమూర్తే
శ్రీ విశ్వనాథ మునిబోధిత యోగశక్తే
ఆత్మావలోకన సుధారస యోగసింధో
భక్తార్తినాశకగురో, తవ సుప్రభాతమ్ ॥

శ్లో ॥ ద్వంద్వాదిర్జిత జనాస్తవ పాదపద్మే
శ్రీరామ దర్శన కుతూహల ముక్తసంగాః
యోగీశ్వరా ప్రణిపతంతి నితతాంత ప్రేమ్ణా
శ్రీరామ దర్శక గురో తవ సుప్రభాతమ్ ॥

శ్లో ॥ ఏకాంతవాస జపతత్పర దివ్యమౌనే
కోదండరామ పదలాలిత పుణ్యమూర్తే
ధర్మ ప్రబోధక దయాగుణ దుగ్ధసింధో
భక్తాబ్జ సూర్య, నిజదేశిక సుప్రభాతమ్ ॥

శ్లో ॥ శ్రీ విశ్వనాథ గురుబోధిత తత్త్వమూర్తే
శ్రీరామదర్శన కుతూహల యోగమౌనే
దేవాదిదేవ మకుటాంకిత పుణ్యమూర్తే
అద్వైతత్త్వ పరిపాలక, సుప్రభాతమ్ ॥

# మంగళం

1. ఉత్తిష్ఠమునిశార్దూల, ఉత్తిష్ఠ, గురుపుంగవ ।
ఉత్తిష్ఠ, యోగ నిద్రాయాః, గురుదేవాయ ॥ మంగళం ॥

2. ఉత్తిష్ఠోత్తిష్ఠ యోగీంద్ర, ఉత్తిష్ఠ, మునిసత్తమ ।
సేవార్ధమాగతాస్సర్వే, శిష్యాస్తవ, గురుప్రభో ॥

3. ఆంజనేయం సమానీయం, రామచంద్రప్రభు, ర్ముదా ।
అస్మిన్ క్షేత్రే సుఖాసీనః, ఉత్తిష్ఠ గురుపుంగవ ॥

4. కణ్వాశ్రమ నివాసాయ, ఖండితాఖిలశత్రవే ॥
గిరికందరవాసాయ, సుబ్రహ్మణ్యాయ మంగళం ॥

5. మంగళం గురుదేవాయ మంగళం పుణ్యమూర్తయే
మంగళం రామరూపాయ దేశికేంద్రాయ మంగళం ॥

6. శేషాంబా బ్రహ్మపుత్రాయ శ్రీ కళ్యాణగుణాన్విత ।
శ్రీవిశ్వనాథశిష్యా, గురుదేవాయ మంగళం ॥

7. స్వేచ్ఛానందాయ, పూజ్యాయ శంకరస్వామిరూపిణే ।
శ్రీరామమంత్ర దీక్షాయ గురుదేవాయ మంగళం ॥

8. కామక్రోధాది దూరాయ స్థితప్రజ్ఞ స్వరూపిణే ।
ముక్తికాంతా విహారాయ, గురుదేవాయ మంగళం ॥

9. మహేంద్రవాడ వాసాయ సర్వమంగళ కారిణే ।
శ్రీరామక్షేత్ర వాసాయ గురుదేవాయ మంగళం ॥

10. త్వత్పాదపూజనరతాస్సర్వే శిష్యాస్సమాగతాః।
ప్రాతః పూజాం కరిష్యంతి గురుదేవాయ మంగళం ॥

11. మంగళం తవ వేదాంతం, మంగళం తవ దర్శనం
మంగళం తవ విజ్ఞానం, గురుదేవాయ మంగళం ॥

12. సుప్రభాతమిదం దివ్యం మంగళం మహిమాన్వితం ।
నిత్యం యః పఠమానస్తు సర్వాన్కామాన వాప్నుయాత్ ॥

వలయువారు :

విద్వాన్, మునుకుట్ల వెంకటవాసుదేవ దీక్షితులు

కార్యదర్శి – శ్రీరామక్షేత్రం (మహేంద్రవాడ)

మకాం : దువ్వ పోస్టు వయా తాడేపల్లిగూడెం

ప॥గో॥జి॥

కళానిధి – భీమరం